సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 174

శనివారం 14-9-2024



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



సక్సెస్ టేస్ట్ తెలిసింది!

-IIలో



4 ఖండాలు... 21 దేశాలు... ఓ సైకిల్!

-IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

కప్పు కాఫీ... రెండు మాటలు

సక్సెస్ టేస్ట్ తెలిసింది!


● సునాలినీ మీనన్

కమ్మని సువాసనతో, రుచితో అలరించే కాఫీని తమకు నచ్చిన పదాలతో కీర్తిస్తుంటారు కాఫీ ప్రేమికులు. సునాలినీ మీనన్ మాత్రం ఒకే ఒక్క సిప్‌తో ఆ కాఫీ గింజ ఎక్కడ పుట్టింది, దానిలో ఉన్న శక్తి ఏంటి, సువాసనల స్థాయి ఎంత...
ఇలా దాని పుట్టు పూర్వోత్తరాలన్నింటినీ పూసగుచ్చినట్టు చెప్పేస్తారు. కాఫీ రుచుల గురించి సిప్పుకొక స్టోరీ చెబుతుంటే మనమూ ఆ సువాసనను ఆస్వాదించకుండా ఉండలేం. కాఫీ క్వాలిటీ కంట్రోల్ ఎక్స్‌పర్ట్‌గానూ ఆసియాలోనే ఫస్ట్ ఉమన్ ప్రొఫెషనల్ కాఫీ టేస్టర్‌గానూ గుర్తింపు తెచ్చుకున్న సునాలినీ మీనన్ హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ కాఫీ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా 'సాక్షి ఫ్యామిలీ'తో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

''న్యూట్రిషన్ అండ్ డైటటిక్స్‌లో డిగ్రీ చేస్తున్న సమయంలోనే ... అంటే దాదాపు 50 ఏళ్ల క్రితం కాఫీ బోర్డు అసిస్టెంట్ కప్ టేస్టర్ పోస్టుకు ఎంపికై, 20 ఏళ్ల వయసులో కాఫీ టేస్టర్‌గా ఉద్యోగంలో చేరాను. అయితే, అక్కడ ప్రతి ఒక్కరూ నాకన్నా పెద్దవాళ్లు, అందరూ మగవాళ్లే. రోజూ ఇంటికి వచ్చి ఏడ్చేదానిని. ఎందుకంటే అక్కడ సిబ్బంది ఎవ్వరూ నా మాట వినేవారు కాదు. కానీ, ఉద్యోగం వదులుకోవాలనుకోలేదు. ఎందుకంటే, ఇంటర్వ్యూ సమయంలోనే కాఫీ బోర్డు నాకు ఉద్యోగం ఇవ్వడానికి సందేహించింది. 'ఒక మహిళ, త్వరలో పెళ్లి అవుతుంది.. ఎంతోకాలం పనిచేయలేదు' అని వారి సందేహం. అందుకే 'ఉద్యోగం వదులుకోవద్దు' అని బలంగా నిర్ణయించుకున్నాను. పీహెచ్‌డి చేసిన కాఫీ నిపుణులతో పోటీపడేదాన్ని. పాతికేళ్ల వయసులో కాఫీని సిప్ చేయడం, ఫ్లేవర్ నోట్‌లను గుర్తించడం, నాణ్యతను నిర్ణయించడం వంటివన్నీ చేసేదాన్ని.

విదేశాల్లో శిక్షణ

కాఫీ బోర్డ్ 1976లో కాఫీ టేస్టింగ్ కోసం స్విట్జర్లాండ్‌లోని జూరిచ్‌లో ఏడాది పాటు శిక్షణ ఇప్పించింది. అక్కడ ఆతిథ్యం ఇచ్చినవాళ్లు పెరూ, కోస్టారికా నుండి అంతర్జాతీయ కాఫీ బోర్డులకు నన్ను పరిచయం చేశారు. ఆ తర్వాత జర్మనీకి కూడా పంపారు. ఆ సమయంలో విదేశీ కాఫీ రుచులు మన దగ్గర లేవు. దీంతో విదేశీ కాఫీ రుచులనూ అర్థం చేసుకోవడానికి నేను నా టేస్ట్ బడ్స్‌ను ఉపయోగించడం నేర్చుకున్నాను. తిరిగి వచ్చినప్పుడు పై పదవిలో ఉన్నవారు రిటైర్ అవడంతో కాఫీ టేస్టర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. ఈ రంగంలో ఫస్ట్ ఉమన్‌గా గుర్తింపు వచ్చింది. ఈ ప్రక్రియలో కాఫీ సువాసన, రుచి, తీపి, సమతుల్యత, నాణ్యత, కప్పు శుభ్రత... వంటి వాటన్నింటిపై కూడా దృష్టి సారించాలి.

అనుకరిస్తూ చేసిన ప్రయత్నాలు...

చిన్నప్పుడు వేసవిలో కోయంబత్తూర్‌లోని మా మామయ్య తేయాకు తోటకు వెళ్లేవాళ్లం. అక్కడ తేయాకును గ్రేడ్ చేయడం, టీ తయారు చేయడంతోపాటు, సిప్ చేసి ఏ విధంగా చెక్ చేస్తారో చూసేదాన్ని. వారిని అనుకరిస్తూ మేమూ రకరకాల ప్రయత్నాలు చేసేవాళ్లం. ఆ ఆలోచనలు నా భవిష్యత్తుకు పునాదులు వేస్తాయని అప్పుడు అనుకోలేదు.

ఫ్యాషన్‌గా.. ఫిల్టర్ కాఫీ

1995 వరకు కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియాకు క్వాలిటీ కంట్రోల్ డైరెక్టర్‌గా ఉన్నాను. ఆ తర్వాత బెంగళూరులో కాఫీ ల్యాబ్‌ను ప్రారంభించాను. ఆ పదేళ్లలో కాఫీ మార్కెట్‌లో చాలా మార్పులు వచ్చాయి. సొంతంగా ఫిల్టర్ కాఫీని తయారు చేసుకొని, డాబాపై తిరుగుతూ తాగడం అప్పట్లో ఒక ఫ్యాషన్.

మహిళా టేస్టర్లు

అంతర్జాతీయ కంపెనీలు భారతీయ కాఫీని ఎంపిక చేసుకోవడం వల్ల బోర్డు ఇక్కడ కాఫీ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంది. ఇండియన్ కాఫీని విదేశాల్లో ప్రత్యేకంగా నిలబెట్టడానికి ఇదొక మైలురాయిగా చెప్పవచ్చు. దీని వల్ల మన దేశంలో మహిళా టేస్టర్ లకు మార్గం సులభం అయ్యింది. అసాధ్యమనుకున్న ప్రతిపనినీ మహిళలు చేయగలరు. జ్ఞానమే మన శక్తి. స్త్రీలు ఈ రంగంలోకి రావాలంటే మరింత ఎక్కువ సమాచారం తెలుసుకోవాలి'' అని వివరిస్తారు ఈ కాఫీ క్వాలిటీ ఎక్స్‌పర్ట్.



జీవనోపాధి కోసం యాభై ఏళ్ల క్రితం కాఫీ రంగంలోకి అడుగు పెట్టి, తన సమర్థతతో భారత రాష్ట్రపతి నుంచి ఉమెన్ అచీవర్ అవార్డ్, ఆల్ఫ్రెడ్ పీట్ ప్యాసొనేట్ కప్ అవార్డ్‌లు పొందారు. అమెరికాలో భారతీయ కాఫీ నాణ్యమైన ఉత్పత్తిదారుగా స్థిరపడటంలో కీలకపాత్ర పోషించారు. ఇటలీలోని యూనివర్సిటీ డెల్‌కాఫే డి ట్రియెస్ట్‌లో స్పెషల్ లెక్చరర్‌గా, అలయన్స్ ఫర్ కాఫీ ఎక్సలెన్స్ అడ్వైజరీ కమిటీ డైరెక్టర్‌గా, స్పెషాలిటీ కాఫీ అసోసియేషన్ అమెరికా ట్రస్టీ బోర్డు మెంబర్‌గా, కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియాలో బాధ్యతలు నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ డైరెక్టర్‌గా అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. 2005లో యునైటెడ్ స్టేట్స్‌లో సీటెల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఉమెన్స్ కాఫీ అలయన్స్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు.

- నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



వరల్డ్ రికార్డ్

4 ఖండాలు 21 దేశాలు ...ఓ సైకిల్!

● విల్కాక్స్

విల్కాక్స్ 'సైకిల్ సెటప్'పై ఒక లుక్కు వేస్తే... 'ఈ సైకిల్‌పై కొన్ని ఊళ్లు చుట్టి రావచ్చు' అనిపిస్తుంది. ఇంకాస్త ఉత్సాహ పడితే... 'జిల్లాలు చుట్టి రావచ్చు' అనిపించవచ్చు. 'ఈ సైకిల్‌తో ఎన్నో దేశాలకు వెళ్లవచ్చు' అని మాత్రం అనిపించదు. మనం అనుకోవడం, అనుకోక పోవడం మాట ఎలా ఉన్నా ఈ సైకిల్ పైనే విల్కాక్స్ ఎన్నో దేశాలు చుట్టి వచ్చి ప్రపంచ రికార్డును సృష్టించింది.

మే 26న షికాగోలోని గ్రాంట్ పార్క్ నుండి బయలుదేరిన లాయెల్ విల్కాక్స్ నాలుగు ఖండాలు, 21 దేశాల మీదుగా 29,169 కిలోమీటర్ల సైకిల్ యాత్రను పూర్తి చేసింది. యాత్ర పూర్తి చేయడానికి పట్టిన కాలం... 108 రోజులు, 12 గంటల 12 నిమిషాలు.

ఎన్నో దేశాలు చుట్టి వచ్చి తిరిగి షికాగోకు వచ్చిన విల్కాక్స్‌కు కుటుంబసభ్యులు, స్నేహితులు, షికాగో సైకిల్ సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు.

తన లేటెస్ట్ రికార్డ్‌తో స్కాట్‌లాండ్‌కు చెందిన జెన్నీ గ్రాహం గత రికార్డ్ (124 రోజుల 10 గంటల 50 నిమిషాలు)ను విల్కాక్స్ బ్రేక్ చేసింది.

'ఇదొక అద్భుత రికార్డ్' అనడంతోపాటు 'ఇప్పుడు నేను విల్కాక్స్‌కు అభిమానిగా మారిపోయాను' అంటుంది జెన్నీ గ్రాహం.

విల్కాక్స్ 'ప్రపంచ సైకిల్ యాత్ర' విషయానికి వస్తే...రోజుకు 14 గంటల పాటు రైడ్ చేసేది. ప్రయాణానికి ముందు రకరకాల జాగ్రత్తలు తీసుకుంది. అందులో బరువు తగ్గడం కూడా ఒకటి.

'ఈ యాత్రలో ఆహ్లాదమే తప్ప కష్టమని ఎప్పుడూ అనిపించలేదు' అంటుంది విల్కాక్స్.

'ఆహ్లాదంగా అనిపించింది' అనేది ఆమె మనసు మాట అయినప్పటికీ భౌతిక పరిస్థితులు వేరు. ఎన్నోసార్లు ప్రతికూల వాతావరణం వల్ల విల్కాక్స్ ఇబ్బంది పడింది. ప్రయాణం మొదలు పెట్టిన 4వ రోజే వర్షంలో చిక్కుకుపోయింది. సైకిల్ టైర్ ఎన్నోసార్లు పంక్చర్ అయింది. కొన్నిసార్లు అనారోగ్యానికి గురైనప్పటికీ అంతలోనే కోలుకొని సైకిల్ చేతిలోకి తీసుకునేది. తాను ఏ రోజు ఎక్కడ ప్రయాణిస్తున్నాను అనేది సోషల్ మీడియా ద్వారా ప్రకటించేది. దీనివల్ల వందలాది మంది ఆమెను అనుసరిస్తూ ఉత్సాహపరిచేవారు. ఇది తనని ఒంటరితనం నుంచి దూరం చేసేది.

'అద్భుతమైన శారీరక, మానసిక దృఢత్వం ఆమె సొంతం' అంటూ సైక్లింగ్ వీక్లి మ్యాగజైన్ ఎడిటర్ మారిజ్ రూక్ విల్కాక్స్‌ను ప్రశంసించారు.

ఒక లక్ష్యం నెరవేర్చుకునే ప్రయత్నంలో ఉన్నప్పుడే మరో కల కనడం విల్కాక్స్ అలవాటు. మరి నెక్స్ ఏమిటి? అనే విషయానికి వస్తే... ఆమె ట్రాక్ రికార్డ్‌ను బట్టి చూస్తే అది పెద్ద లక్ష్యమే అనడంలో సందేహం లేదు.

అయిదు గంటలే నిద్ర...

అలస్కా(యూఎస్)లో పుట్టి పెరిగిన విల్కాక్స్ నేచరల్ సైన్స్, ఫ్రెంచ్ లిటరేచర్‌లో డిగ్రీ చేసింది. 20 ఏళ్ల వయసులో సైక్లింగ్ మొదలుపెట్టింది. తన స్నేహితుడు నికోలస్‌తో కలిసి ప్రపంచ యాత్ర చేయాలని నిర్ణయించుకుంది. వీరు 30కి పైగా దేశాల్లో సైకిల్ యాత్ర చేశారు. స్కూల్ పిల్లలకు బైకింగ్ స్కిల్స్‌తో పాటు వాటికి అవసరపడే చిన్న చిన్న మరమ్మతుల గురించి కూడా చెబుతుంటుంది విల్కాక్స్. ఆమె స్ఫూర్తితో ఎంతో మంది పిల్లలు బైకింగ్‌ను హాబీగా ఎంచుకున్నారు. 2016లో 7,100 కిలోమీటర్ల ట్రాన్స్ ఆమ్ బైక్ రేసులో విల్కాక్స్ పాల్గొంది. రాత్రికి అయిదుగంటల కంటే తక్కువ నిద్ర పోయేది. 18 రోజుల 10 నిమిషాల్లో రేస్ గెలిచిన తొలి అమెరికన్ మహిళగా రికార్డ్ సృష్టించింది.

ఎవరీ వేదంగి కులకర్ణి?


● వేదంగి కులకర్ణి

విల్కాక్స్ తాజా రికార్డ్ సందర్భంగా బాగా వినిపిస్తున్న పేరు వేదంగి కులకర్ణి. మన దేశానికి చెందిన అల్ట్రా సైకిలిస్ట్ వేదంగి కులకర్ణి ఇరవై ఏళ్ల వయసులో ప్రపంచాన్ని చుట్టి వచ్చిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది. పుణెకు చెందిన కులకర్ణీ యూకేలో స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ చదువుకుంది. దాదాపు ఆరేళ్ల తరువాత కులకర్ణీ మళ్లీ తెరపైకి వచ్చింది. దీనికి కారణం...ఆమె ప్రపంచ సైకిల్ యాత్ర. కులకర్ణీ కూడా తన రైడ్‌ను 108 రోజులలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆమె గత రికార్డ్ చూస్తే అదేమీ అసాధ్యం కాదు అనిపిస్తుంది. అందుకే విల్కాక్స్ తాజా రికార్డ్‌కు వేదంగి కులకర్ణీ నుంచి గట్టి పోటీ ఉందని విశ్లేషకులు అంటున్నారు.

ఉమెన్ ఎంపవర్‌మెంట్

వంట గది నుంచి పంట పొలాల్లోకి...


● సుధా దేవదాస్

'అయిదు వేళ్లు కలిస్తేనే ఐకమత్యం' అనేది ఎంత పాత మాట అయినా ఎప్పటికప్పుడు కొత్తగా గుర్తు తెచ్చుకోదగ్గ మాట. కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లాలో ఎంతోమంది మహిళలు 'ప్రకృతి' పేరుతో స్వయం సహాయక బృందాలుగా ఏర్పడుతున్నారు. 'ప్రకృతి' చేసిన మహత్యం ఏమిటంటే... వంటగదికి మాత్రమే పరిమితమైన వారిని పంట పొలాల్లోకి తీసుకువచ్చింది. డ్రోన్ పైలట్‌గా మార్చి కొత్త గుర్తింపు ఇచ్చింది. జెండర్ ఈక్వాలిటీ నుంచి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వరకు రకరకాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చేసింది. పిల్లలు పెద్ద చదువులు చదివేలా చేసేలా చేసింది. సినిమాల్లో చూడడం తప్ప ఎప్పుడూ చూడని విమానంలో ప్రయాణం చేయించింది....

'మీ గురించి చెప్పండి' అని సుధా దేవదాస్‌ను అడిగారు ప్రధాని నరేంద్ర మోదీ. తన వ్యక్తిగత వివరాలతో పాటు తమ స్వయం సహాయక బృందం 'ప్రకృతి' గురించి ప్రధానికి వివరంగా చెప్పింది సుధ.

మహారాష్ట్రలోని జల్గావ్‌లో జరిగిన 'లఖ్‌పతి దీదీస్' కార్యక్రమంలో పాల్గొనడానికి కేరళ నుంచి వచ్చింది సుధ. 'లఖ్‌పత్ దీదీస్' డ్రోన్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌కు కేరళ నుంచి ఎంపికైన ఇద్దరు మహిళల్లో సుధ ఒకరు. సుధ త్రిసూర్‌లోని కుర్ఝూర్ గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్. కేరళ నుంచి 'డ్రోన్ పైలట్' అయిన తొలి మహిళా పంచాయతీ మెంబర్‌గా సుధ ప్రత్యేక గుర్తింపు సాధించింది.

'ఈ శిక్షణా కార్యక్రమాల పుణ్యమా అని డ్రోన్‌లను ఎగరవేయడం మాత్రమే కాదు ఆండ్రాయిడ్ ఫోన్‌లు అంటే ఏమిటి, వాటిని ఎలా ఉపయోగించాలి, పంట పొలాల్లో ఉపయోగించే ఎరువులు, మందులు... ఇలా ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాం' అంటుంది సుధ.



'ఇప్పుడు నన్ను అందరూ డ్రోన్ పైలట్ అని పిలుస్తున్నారు' ఒకింత గర్వంగా అంటుంది సుధ. సుధలాంటి ఎంతో మంది మహిళల జీవితాలను మార్చిన స్వయం సహాయక బృందం 'ప్రకృతి' విషయానికి వస్తే... 'ప్రకృతి'లో 30 సంవత్సరాల వయసు మహిళల నుంచి 63 సంవత్సరాల వయసు మహిళల వరకు ఉన్నారు. 'ప్రకృతి'లోని పన్నెండు మంది సభ్యులు 'గ్రామిక' 'భూమిక' పేరుతో విధులు నిర్వహిస్తారు. ఒక్కో గ్రూప్‌లో ఆరుగురు సభ్యులు ఉంటారు. ఈ సభ్యులు గృహ నిర్మాణం, పిల్లల చదువు, పెళ్లిలాంటి ఎన్నో విషయాలలో ప్రజలకు సహాయపడతారు.

'ప్రకృతి వల్ల మా జీవన విధానం పూర్తిగా మారిపోయింది' అంటుంది 51 సంవత్సరాల సుధ. ఆమె పెద్ద కుమారుడు ఎం.టెక్., చిన్న కుమారుడు బీటెక్. చేశారు. 'పై చదువుల కోసం పెద్ద అబ్బాయి కెనడా, చిన్న అబ్బాయి పోలాండ్ వెళుతున్నాడు' సంతోషం నిండిన స్వరంతో అంటుంది సుధ.

కొన్ని నెలల క్రితం 'ప్రకృతి' బృందం కేరళ నుంచి ఇండిగో విమానంలో బెంగళూరుకి వెళ్లింది. ఆ బృందంలోని ప్రతి ఒక్కరికి ఇది తొలి విమాన ప్రయాణం. అది వారికి ఆకాశమంత ఆనందాన్ని ఇచ్చింది.

సాధారణ గృహిణి నుంచి గ్రామ వార్డ్ మెంబర్‌గా, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ 'కుటుంబశ్రీ'లో రకరకాల విధులు నిర్వహిస్తున్న కార్యకర్తగా, జెండర్ ఈక్వాలిటీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లకు సంబంధించి మహిళలకు శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్‌గా, ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీవో) డైరెక్టర్‌గా, డ్రోన్ పైలట్‌గా రకరకాల విధులు నిర్వహిస్తున్న సుధ ఎంతోమంది గృహిణులకు రోల్‌మోడల్‌గా మారింది.

'మహిళలు ఆర్థికంగా సొంత కాళ్లమీద నిలబడినప్పుడు ఎంతో ఆత్మస్థైర్యం వస్తుంది. అది ఎన్నో విజయాలను అందిస్తుంది. ఎవరు ఏమనుకుంటారో అనే భయాలు మనసులో పెట్టుకోకుండా మనకు సంతోషం కలిగించే పని చేయాలి' అంటుంది సుధా దేవదాస్.

సమ్‌థింగ్ స్పెషల్

లాస్ కాదు డోస్ బనానా వైన్!


● ఎమిలీ

'అవసరం' నుంచి మాత్రమే కాదు 'నష్టం' నుంచి కూడా 'ఐడియా' పుడుతుంది. విషయంలోకి వస్తే... ఈస్ట్ ఆఫ్రికా దేశమైన మలావీలో కరోంగ జిల్లాకు చెందిన శ్రీమతి ఎమిలీ చిన్నపాటి రైతు. అరటి సాగు చేసే ఎమిలీ లాంటి ఎంతోమంది రైతులకు ఒక సమస్య ఏర్పడింది.

విపరీతమైన వేడి వల్ల అరటి పండ్లు చాలా త్వరగా పండుతున్నాయి. పాడవుతున్నాయి. దీనివల్ల రైతులకు భారీగా నష్టం వాటిల్లుతోంది. 'వెరీ ఫాస్ట్ అండ్ గో టు వేస్ట్' అనుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే 'బనానా వైన్' ఐడియా పుట్టింది.

ఇక ఆట్టే ఆలస్యంలోకి చేయకుండా ఎమిలీ బృందం రంగంలోకి దిగింది. 'అరటి వైన్ తయారు చేయడం ఎలా?' అనే దానికి సంబంధించి వారు చిన్నపాటి శాస్త్రవేత్తలు అయ్యారు. ఎంతోమంది నిపుణులతో మాట్లాడారు.

మెచెంజర్ అనే గ్రామంలో నాలుగు గదుల ఇంట్లో వైన్ తయారీ ప్రక్రియ మొదలు పెట్టారు. బాగా మగ్గిన అరటిపండ్లు, చక్కెర, ఎండుద్రాక్ష, నిమ్మకాయలు, నీళ్లు... మొదలైనవి ముడిసరుకుగా బనానా వైన్ తయారీ మొదలైంది. అయితే ఇదేమీ ఆషామాషీ ప్రక్రియ కాదు.

ఎమిలి మాటల్లో చెప్పాంటే 'టైమింగ్ అనేది చాలా ముఖ్యం' ఎలాంటి అరటిపండ్లను ఉపయోగించాలి, ఎప్పుడు ఉపయోగించాలి, టైమ్ ఎంత తీసుకోవాలి....ప్రతి దశలోనూ ఆచితూచి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇది 'గుడ్ క్వాలిటీ వైన్'గా పేరు తెచ్చుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. 'స్మూత్ అండ్ లైట్ వైన్'గా పేరు తెచ్చుకున్న ఈ అరటి మద్యానికి ఎంతోమంది ఫ్యాన్స్ ఉన్నారు.

'మలావీ నలుమూలలా అరటి మద్యానికి మంచి డిమాండ్ ఉంది' అంటున్నాడు కమ్యూనిటీ సేవింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టెన్నిసన్ గోండ్వే. 'బనానా వైన్ ఐడియా మా జీవితాలను మార్చేసింది. మాలో కొందరు ఇళ్లు కట్టుకున్నారు. కొందరు పశువులు కొన్నారు. ఇప్పుడు మేము మంచి భోజనం తినగలుగుతున్నాం' అంటుంది ఎలీన.

హెల్దీ డైట్

కాజు కదలీ మోదక్



కావలసినవి: జీడిపప్పు – కప్పు; చక్కెర పొడి– అర కప్పు; కుంకుమ పువ్వు – చిటికెడు; వెచ్చటి పాలు – 2 టేబుల్ స్పూన్‌లు; నెయ్యి – టీ స్పూన్.

తయారీ: ● పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన పెట్టాలి ● జీడిపప్పును మిక్సీలో వేసి పొడి చేయాలి. ఈ పొడిని ఒక పాత్రలో వేసి అందులో చక్కెర, కుంకుమ పువ్వు కలిపిన పాలు పోసి ముద్దగా కలపాలి. చేతికి నెయ్యి రాసుకుని జీడిపప్పు ముద్దను పది భాగాలుగా చేయాలి. ఒక్కో భాగాన్ని మోదక్ ఆకారంలో చేయాలి. సాధ్యమైతే చేత్తోనే చేయవచ్చు లేదా మౌల్డ్‌లో పెట్టి చేయవచ్చు. ఆరిన తర్వాత వడ్డించాలి.

పోషకాలు (ఒక మోదక్‌లో):
కేలరీలు : 80–90
ఫ్యాట్ – 5 గ్రాములు
కార్బోహైడ్రేట్‌లు– 8 గ్రాములు
ప్రొటీన్– గ్రాము


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

వివక్ష - వ్యాఖ్య

మాట వరుస మారదా?

ఇటీవల ఒక నాయకుడు మరో నాయకుడిని దూషించాడు. ఆ దూషణ మహిళలను కించపరిచే అర్థంలో సాగింది. అసమర్థతకు సమానార్థకంగా చీర, గాజులను ప్రస్తావించాడు. దూషణలో ఒక కులాన్ని ప్రస్తావిస్తే కేసు పెట్టడానికి చట్టాలున్నాయి. స్త్రీల గౌరవానికి భంగం కలిగే ఇలాంటి వ్యాఖ్యలకు గట్టి చట్టాలెక్కడ? సమాజంలో నెలకొని ఉన్న వివక్షపూరిత భావజాలానికి అడ్డుకట్ట ఎప్పుడు?

ఈక్వాలిటీ అంటే ఇదేనా?



రాజ్యాంగం స్త్రీపురుషులిద్దరికీ సమానమైన గౌరవాలనే చెప్పింది. వివక్షకు తావులేని నిబంధనలున్నా వివక్ష తప్పలేదు. ఐక్యరాజ్య సమితి 1975 ఉమెన్స్ ఇయర్‌గా ప్రకటించి, అధ్యయనానికి కమిటీని వేసింది. ఆ కమిటీ 1977లో 'టువార్డ్స్ ఈక్వాలిటీ' నివేదిక సమర్పించింది. మహిళల సంక్షేమం కోసం ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేశాం కదా, ఇంకా ఏం కావాలి అనే అభిప్రాయంలో ఉన్న మన పాలకుల కళ్లు తెరిపించింది ఆ నివేదిక. దీనికి కొనసాగింపుగా 1985 వరకు మహిళాభివృద్ధి కోసం పని చేయాలని కూడా సూచించింది ఐక్యరాజ్య సమితి. మహిళ సాధికారత సాధనలో ముందడుగు వేస్తున్న క్రమంలో 2001 సంవత్సరాన్ని 'ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ ఇయర్'గా ప్రకటించింది మన భారత ప్రభుత్వం. ఇన్ని జరుగుతున్నా సమాజం మాత్రం పితృస్వామ్య భావజాలం నుంచి బయటపడడం లేదు. ఒక మగవాడు సాటి మగవాడిని మాటలతో దాడి చేయాల్సి వచ్చినప్పుడు 'చీర కట్టుకో, గాజులు వేసుకో'అంటున్నారు. ఎదుటి వ్యక్తి మీద అసమర్థత, అనైతికత ఆరోపణలు చేయడానికి స్త్రీత్వాన్ని ఆపాదించడం, స్త్రీల వస్త్రధారణతో గేలి చేయడం వంటి ప్రాక్టీస్ ఏ మాత్రం సరికాదు. ప్రజాజీవితంలోకి వచ్చే వాళ్లు ముందు దయచేసి రాజ్యాంగాన్ని చదవాలి.

- ప్రొ॥ తోట జ్యోతి రాణి (రిటైర్డ్), వరంగల్

మౌనంగా ఉంటే మరింత దిగజారుతుంది!



'ఇక్కడెవరూ గాజులు తొడుక్కుని కూర్చోలేదు' అనే మాట సమాజంలో వినిపిస్తూనే ఉంది. మగవాళ్ల నుంచే కాదు మహిళల నుంచి కూడా. 'తాము అసమర్థులం కాదు, సమర్థులమే' అని చెప్పుకోవడానికి మగవాళ్లు గాజులు, చీరలను మాట్లాడుతుంటారు. నిరక్షరాస్యుల్లో తరచూ వినిపిస్తుంటే చదువుకున్న వాళ్లలో అరుదుగా వినిపిస్తుంటుంది. అంతే తేడా. మరికొందరు ఎదుటి వారి మీద దుమ్మెత్తి పోయడానికి, అసమర్థుడివని దెప్పి పొడవడానికి, 'నీకు చీర, గాజులు పంపిస్తా' అనడాన్ని కూడా చూస్తున్నాం. మగవాళ్లు ఇలా అన్నప్పుడు ఆడవాళ్లు మౌనంగా ఉంటే ఆ మాటలను, వారి భావాన్ని, అభిప్రాయాన్ని సమ్మతించినట్లవుతుంది. అందుకే మహిళలు ప్రతిస్పందించాలి. మహిళ మౌనం వహిస్తే పరిస్థితి ఇంకా దిగజారే ప్రమాదం ఉంది. తప్పు చేసిన వాళ్లను ఒకప్పుడు గుండు గీయించి, సున్నం బొట్లు పెట్టి ఊరంతా తిప్పేవాళ్లు. ఇలా నోటి దురుసుగా మాట్లాడిన వాళ్ల వ్యాఖ్యలను ఖండించి, తగిన విధంగా తిప్పికొడుతూ ఉండాలి. అప్పుడే సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన ఇలాంటి మాటలకు అడ్డుకట్ట పడుతుంది.

- ఎం. అమ్మాజీ, సీనియర్ జర్నలిస్ట్, విజయవాడ

మాట వెనక్కి తీసుకోవాలి!



ఇలాంటి మాటలు ఏ మాత్రం సమ్మతించదగినవి కావు. మగవాళ్లు ఒకరినొకరు తిట్టుకోవడానికి '... కొడకా' అంటూ ఆడవాళ్లనే నిందిస్తారు. వాటి మీద మా తరమంతా పోరాడాం, పోరాడుతూనే ఉన్నాం. స్త్రీల కట్టు, బొట్టుతో గేలి చేయడమూ ఎక్కువైంది. ఒక మగవాడు మరో మగవాడిని అవహేళన చేయాలంటే స్త్రీలతో పోల్చడం, స్త్రీల లాగ వస్త్రధారణ చేసుకోమని గేలిచేయడం అంటే వాళ్ల దృష్టిలో చేతకానివాళ్లకు ప్రతీక స్త్రీలే అనే అభిప్రాయం స్థిరంగా ఉందని అర్థం. ఆ మాటలను వెనక్కి తీసుకోమని డిమాండ్ చేయాలి. మాట వెనక్కి తీసుకునే వరకు పోరాడాలి.

- ప్రొ॥ గూడూరు మనోజ (రిటైర్డ్), హైదరాబాద్


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 174

శనివారం 14-9-2024



భారత జట్ల 'హ్యాట్రిక్'


చెస్ ఒలింపియాడ్‌లో వరుసగా మూడో విజయం - 15లో



'డిపాజిట్' వార్!

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై 8% పైగా వడ్డీ రేటు - 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పోర్ట్‌బ్లెయిర్ ఇక శ్రీవిజయపురం

అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్‌బ్లెయిర్‌ను శ్రీ విజయపురంగా మార్చినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు.

- వివరాలు 6లో ▶



నార్కో టెస్ట్‌కు నో

కోల్‌కతా జూనియర్ వైద్యురాలి రేప్, హత్య కేసులో ప్రధాన నిందితుడి నార్కో అనాలసిస్ పరీక్షకు కోర్టు అనుమతి నిరాకరించింది.

- వివరాలు 6లో ▶



'హెజ్‌బొల్లా'పై ఇజ్రాయెల్ దాడి

సిరియాలోని హెజ్‌బొల్లా క్షిపణి తయారీ కేంద్రంపై ఇజ్రాయెల్ ప్రత్యేక దళాలు జరిపిన దాడిలో 18 మంది మృతి చెందారు.

- వివరాలు 6లో ▶



అంతరిక్షం నుంచి ఐక్యతా గీతం

స్టార్‌వార్స్‌లోని ప్రఖ్యాత 'రేస్ థీమ్'ను అంతరిక్షం నుంచే ప్రదర్శించి స్పేస్ ఎక్స్ ఇంజనీర్ సారా అందరినీ ఆకట్టుకున్నారు.

- వివరాలు 6లో ▶

నష్టం రూ.10,320 కోట్లు

వర్షాలు, వరదలపై కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక

- దెబ్బతిన్న వేలాది ఇళ్లు.. లక్షలాది ఎకరాల్లో పంట మునక..
- చెరువులు పొంగడం.. రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోవటంతో అంచనాలకు మించి నష్టం
- ఎస్డీఆర్ఎఫ్ నిధులు రూ.1,350 కోట్లలో రూపాయి కూడా వాడుకోలేని పరిస్థితి
- ప్రజలను ఆదుకునేందుకు షరతులు లేకుండా తక్షణమే నిధులు విడుదల చేయాలని కేంద్ర సర్కారుకు వినతి
- విపత్తు నిధుల వినియోగంలో కఠిన నిబంధనలు సడలించాలని విజ్ఞప్తి



శుక్రవారం సచివాలయంలో జరిగిన భేటీలో వరద నష్టంపై కేంద్ర బృందానికి నివేదిక అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తద్వారా వెల్లువెత్తిన వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసిన దానికంటే రెట్టింపు నష్టం జరిగినట్లు తేలింది. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల్లో రెండురోజుల పాటు పర్యటించి వచ్చిన కేంద్ర ఉన్నతాధికారుల బృందం.. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి ఈ సమావేశంలో పాల్గొన్నారు. రూ.5,438 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేయగా.. శుక్రవారం కేంద్ర బృందానికి ఇచ్చిన నివేదికలో రూ.10,320 కోట్ల నష్టం వాటిల్లినట్లు సీఎం తెలిపారు. ఈ మేరకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. విపత్తు నిధుల వినియోగం విషయంలో అమలు చేస్తున్న కఠినమైన నిబంధనలు సడలించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్డీఆర్ఎఫ్ నిధులు వాడలేని పరిస్థితి..

తెలంగాణ రాష్ట్రం మొత్తం మునిగిపోయిన పరిస్థితుల్లో సైతం ప్రస్తుత నిబంధనల ప్రకారం ఎస్డీఆర్ఎఫ్ కింద అందుబాటులో ఉన్న రూ.1,350 కోట్లలో ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకునే పరిస్థితి లేదని సీఎం రేవంత్.. కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఒక కిలోమీటర్ రోడ్డు దెబ్బతింటే కేవలం లక్ష రూపాయలు ఖర్చు చేయాలనే నిబంధన పెట్టారని, దీనితో తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టే పరిస్థితి లేదని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన నష్టంతో పాటు ఇక్కడ అమల్లో ఉన్న ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ రేట్) వివరాలను కూడా కేంద్రానికి నివేదిస్తామని, వాటిని పరిశీలించి విపత్తు సాయం అందించాలని కోరారు. వివిధ శాఖల నుంచి అందిన సమగ్ర అంచనాల ప్రకారం రూ.10,320 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇంకా పూర్తి వివరాలు రావాల్సి ఉందని తెలిపారు. తనతో పాటు మంత్రులు, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించటంతో ప్రాణనష్టం భారీగా తగ్గిందని చెప్పారు. వేలాది ఇళ్లు దెబ్బతిన్నాయని,

మిగతా 2వ పేజీలో ▶



శుక్రవారం ఢిల్లీ వీధుల్లో రోడ్ షోలో అభిమానులతో కరచాలనం చేస్తున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

కేజ్రీవాల్ విడుదల

సీబీఐ కేసులో బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

- విచారణ పేరిట నిందితులను సుదీర్ఘకాలం జైల్లో ఉంచడం వారి వ్యక్తిగత స్వేచ్ఛను కాలరాయడమేనని వ్యాఖ్య
- కేసుపై మాట్లాడొద్దంటూ కేజ్రీవాల్‌కు షరతు
- సీఎం కార్యాలయానికి, సచివాలయానికి వెళ్లొద్దని నిర్దేశం
- దర్యాప్తు సంస్థకు ధర్మాసనం చీవాట్లు
- ఈడీ కేసులో బెయిల్ లభించగానే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అత్యుత్సాహమని అభివర్ణన
- పంజరంలో చిలుక కావొద్దని సీబీఐకి జస్టిస్ భూయాన్ హితవు
- న్యాయమే గెలిచిందన్న ఢిల్లీ సీఎం
- అభిమానుల హర్షధ్వానాల మధ్య జోరు వానలోనే తిహార్ జైలు నుంచి తన నివాసం దాకా భారీ రోడ్ షో
- సుప్రీం వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు ఆప్ డిమాండ్
- ఇప్పటికే ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్

6లో

> ఈ కేసులో 22 నెలలుగా ఊరికే ఉన్న సీబీఐకి... ఈడీ కేసులో బెయిల్ రాగానే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? బెయిల్‌ను అడ్డుకోవడమే దీని వెనక ఉద్దేశంగా కన్పిస్తోంది. ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు గనుక నిర్బంధంలో ఉంచాల్సిందేనన్న వాదన సరికాదు.
>
> - జస్టిస్ ఉజ్జల్ భూయాన్

న్యూస్‌రీల్

కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోనే విమోచనం



ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన తెలంగాణ విమోచన వేడుకలు నిర్వహించనున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది.

- వివరాలు 2లో ▶

హైడ్రా ఏర్పాటుపై స్టే ఇవ్వలేం



హైడ్రా ఏర్పాటును నిలిపివేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 99 పై స్టే ఇవ్వడానికి నిరాకరించింది.

- వివరాలు 12లో ▶

హృద్రోగ చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు



గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ప్రభుత్వ సహకారంతో ఉచిత వైద్య సేవలు అందించేందుకు మరోసారి యూకే బృందం రానుందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు.

- వివరాలు 12లో ▶

సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందేభారత్‌కు 20 కోచ్‌లు?



రైల్వే శాఖ తొలిసారిగా 20 కోచ్‌లతో కూడిన వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తోంది. ఒకేసారి అలాంటి నాలుగు రైళ్లను ప్రారంభిస్తుండగా అందులో ఒకటి తెలంగాణ నుంచి నడవనుండటం విశేషం.

- వివరాలు 2లో ▶



శుక్రవారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును అడ్డుకుంటున్న పోలీసులు

ఎమర్జెన్సీకన్నా దారుణం

- ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా నేతల అరెస్టులు అన్యాయం: హరీశ్
- అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి మరీ కౌశిక్‌రెడ్డిపై దాడి చేయించారు
- సీఎం బజారు భాష వల్లే రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం
- మీడియా లీకులు, చిట్‌చాట్‌లతో శాంతిభద్రతలు సాధ్యం కావు
- ఫిర్యాదు చేయడానికి వెళ్తే అరెస్టు చేసి అటవీ ప్రాంతాల్లో తిప్పారని ఫైర్

12లో

బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధం

- ఎమ్మెల్యే అరికెపూడి ఇంటికి వెళ్తామన్న బీఆర్ఎస్ ప్రకటనతో అలర్ట్
- హరీశ్ సహా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు

12లో

సీఎం కనుసన్నల్లోనే దాడులు!: కేటీఆర్

12లో



అరికెపూడి గాంధీ నివాసం వద్ద భారీగా పోలీసుల బందోబస్తు

ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే కుట్రలు

శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండండి

డీజీపీని ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అధికారం కోల్పోయామనే అక్కసుతో కొందరు శాంతిభద్రతలకు విఘాతం కల్పించే ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టేందుకు రకరకాల కుట్రలకు తెరలేపుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీజీపీ జితేందర్‌ని ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లు

'గ్రేటర్'లో వలంటీర్లుగా నియమించాలని సీఎం ఆదేశం

వారికి ఆర్థిక భరోసాతోపాటు సమాజంలో గౌరవం లభిస్తుందని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో కొత్త ప్రయోగానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రించేందుకు ట్రాన్స్‌జెండర్లను వలంటీర్లుగా నియమించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ పోలీస్ విభాగంతో పాటు హోంగార్డ్స్ ప్రస్తుతం ఈ విధులు నిర్వహిస్తున్నారు. హోంగార్డ్స్ తరహాలోనే ట్రాన్స్‌జెండర్లకు

మిగతా 13వ పేజీలో ▶



ట్రాన్స్‌జెండర్‌ల డ్రెస్ నమూనా




ఏచూరి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ నడ్డా తదితరులు

కామ్రేడ్.. రెడ్ సెల్యూట్

- ఏచూరికి జేఎన్‌యూ విద్యార్థుల నివాళి... భావోద్వేగం
- నేడు సీపీఎం కేంద్ర కార్యాలయానికి పార్థివదేహం

5లో



రూ.10 వేల కోట్ల రుణంపై

తర్జనభర్జన

అవసరాల కోసం రుణం తీసుకోవాలని భావించిన సర్కారు

- హైదరాబాద్‌లో 400 ఎకరాల భూముల తాకట్టుకు నిర్ణయం
- అనుభవం కలిగిన మర్చంట్ బ్యాంకర్లకు బాధ్యత అప్పగింత
- రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తేనే రుణం ఇస్తామంటూ ఆర్థిక సంస్థల మెలిక
- ఆర్‌బీఐ అభ్యంతరాలు, ఎఫ్ఆర్‌బీఎం లింకుతో సందిగ్ధం



సాక్షి, హైదరాబాద్: పరిశ్రమల భూములను తాకట్టు పెట్టడం ద్వారా మూలధనం, ఇతర అవసరాల కోసం రుణ సేకరణ చేయాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. రుణ మార్కెట్ నుంచి రూ.10 వేల కోట్లు అప్పులు తెచ్చేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు, ఎఫ్ఆర్‌బీఎం పరిమితులు అడ్డుపడుతుండటంతో, అవాంతరాలను అధిగమించడంపై సర్కారు తర్జనభర్జన పడుతోంది. రుణ సేకరణ కోసం హైదరాబాద్‌లోని అత్యంత విలువైన సుమారు 400 ఎకరాల భూములను ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలకు తాకట్టు పెట్టాలని గతంలో నిర్ణయించారు. కోకాపేట, రాయదుర్గంలో ఉన్న ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్లో రూ.20 వేల కోట్లుగా అంచనా వేశారు. అయితే గతంలో ప్రభుత్వ భూములను తనఖా పెట్టి రుణం తీసుకున్న అనుభవం లేకపోవడంతో 'మర్చంట్ బ్యాంకర్ల'కు రుణ సేకరణ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు.

మర్చంట్ బ్యాంకర్ల వివరాలపై మౌనం

మర్చంట్ బ్యాంకర్ల ఎంపికకు ఈ ఏడాది జూలైలో శ్రీకారం చుట్టారు. రుణ మార్కెట్ నుంచి అప్పులు తేవడంలో అనుభవం కలిగిన బ్యాంకర్ల నుంచి జూలై 5 నుంచి 12వ తేదీ వరకు బిడ్లను స్వీకరించారు. అదే నెల 15న సాంకేతిక బిడ్లను తెరిచి అర్హత కలిగిన మర్చంట్ బ్యాంకర్లను ఎంపిక చేశారు. అయితే ఎంపికైన బిడ్డర్ల వివరాలను వెల్లడించేందుకు ఆర్థిక, పరిశ్రమల శాఖ అధికారులు సుముఖత చూపడం లేదు. 2019 నుంచి 2023 మధ్యకాలంలో కనీసం రూ.1,500 కోట్ల నుంచి రూ.20 వేల కోట్లకు పైగా రుణాలు సేకరించిన అనుభవం కలిగిన సంస్థలను మర్చంట్ బ్యాంకర్లుగా ఎంపిక చేసినట్లు తెలిసింది. వీరు ఈఎండీ రూపంలో రూ.కోటి, పర్ఫార్మెన్స్ సెక్యూరిటీ కింద మరో రూ.4 కోట్లు కూడా ప్రభుత్వానికి చెల్లించినట్లు సమాచారం. కాగా మర్చంట్ బ్యాంకర్లు ఎలాంటి న్యాయపరమైన

మిగతా 3వ పేజీలో ▶

వైద్య విద్య సీట్లపై 'ప్రైవేటు' కన్ను!

- సీట్లన్నీ మేనేజ్‌మెంట్ కోటాగా మార్చుకునేందుకు కాలేజీల వ్యూహాలు.. ఇందుకోసం డీమ్డ్ వర్సిటీలుగా మారేందుకు యత్నాలు
- ఇలాగైతే పేదలకు అందే 50% కన్వీనర్ సీట్లకు మంగళం



12లో

క్లుప్తంగా...

దక్షిణ మధ్య రైల్వేకు సీఐఐ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న దక్షిణమధ్య రైల్వే అధికారులు

సాక్షి, హైదరాబాద్: అత్యుత్తమ ఇంధన విధానాన్ని అమలు చేసిన దక్షిణమధ్య రైల్వేకు ప్రతిష్టాత్మక కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నుంచి ఐదు ఇంధన పరిరక్షణ అవార్డులు లభించాయి. ఈ నెల 12వ తేదీన నగరంలో జరిగిన ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డుల కార్యక్రమంలో హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్ విష్ణోయ్, లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్ అధికారులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. భవనాల విభాగంలో సికింద్రాబాద్ రైల్ నిలయం, హైదరాబాద్ భవన్, లేఖాభవన్‌లకు అవార్డులు లభించాయి. మౌలాలిలోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, లాలాగూడ క్యారేజ్ వర్క్స్ షాపులకు ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్లుగా అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్.. ఇంధన పరిరక్షణ అవార్డుల సాధనలో తమ వంతు సహకారం అందించిన హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్, క్యారేజ్ వర్క్‌షాప్ మేనేజర్ జి.సుమనను అభినందించారు.

ఓనమ్ ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ఓనమ్ పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. కాచిగూడ-కొల్లాం (07044/07045) రైలు ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు బయల్దేరి మర్నాడు.. రాత్రి 11.20 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 16వ తేదీ తెల్లవారుజామున 2.30 గంటలకు కొల్లాం నుంచి బయల్దేరి మర్నాడు ఉదయం 9.45 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.

పెండింగ్ బిల్లుల బాధ్యత మీరే తీసుకోవాలి

సర్పంచ్‌ల సంఘం జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ అధికారుల ఆదేశాలు, సర్క్యులర్లతోనే సర్పంచ్‌లుగా విధులు నిర్వహించామని, ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లుల చెల్లింపు బాధ్యతను సంబంధిత అధికారులే తీసుకోవాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర జేఏసీ స్పష్టంచేసింది. తమ సొంత నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు కూడా ఇంతదాకా బిల్లులు రాలేదని, వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్‌చేసి అప్పుల భారాన్ని తీర్చాలని కోరింది. ఈ విషయంలో వెంటనే చర్యలు చేపట్టని పక్షంలో జిల్లా కలెక్టర్, డీపీవో, ఎంపీడీవో, ఇతర అధికారుల ఇళ్ల ముట్టడికి కూడా వెనకాడబోమని స్పష్టంచేసింది. శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహించాక జేఏసీ అధ్యక్షుడు సుర్వియాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో పీఆర్ కమిషనర్ అనితా రామచంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు.

'డాక్టర్లకు రోజుకు 6 గంటలే పని ఉండాలి'

సాక్షి, హైదరాబాద్: డాక్టర్లకు రోజుకు ఆరు గంటలే పని ఉండాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏఐఎఫ్‌జీడీఏ) కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ మాదల కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'రీవ్యాంపింగ్ వర్కింగ్ కండిషన్స్ ఆఫ్ హెల్త్‌కేర్ పర్సనల్'సబ్ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్న కిరణ్ మాదల మాట్లాడుతూ మహిళా వైద్య సిబ్బందికి భద్రతాపరమైన చర్యలు చేపట్టాలన్నారు. డ్యూటీ ఆఫ్‌తో 24 గంటలకు బదులుగా 12 గంటల డ్యూటీ ఉండాలని కోరారు. వారానికి గరిష్టంగా 48 గంటలు మాత్రమే వైద్యులకు పని ఉండాలన్నారు.

సికింద్రాబాద్–నాగ్‌పూర్ వందేభారత్‌కు 20 కోచ్‌లు?

అదనంగా అందుబాటులోకి 312 సీట్లు | ఇప్పటివరకు 16, 8 కోచ్‌ల రైళ్లే పరుగులు



సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వేలో విప్లవాత్మక మార్పునకు కారణమైన వందేభారత్ రైళ్ల సిరీస్‌లో మరో నూతన అంకానికి కేంద్ర ప్రభుత్వం తెరదీస్తోంది. అత్యంత వేగంగా ప్రయాణించే సెమీ హైస్పీడ్ కేటగిరీ రైళ్లలో మొదలైన వందేభారత్ తదుపరి వర్షన్‌గా వందేభారత్ స్లీపర్ సరీస్‌లు ప్రారంభిస్తున్న రైల్వే, తాజాగా 20 కోచ్‌లతో కూడిన వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తోంది. ఇప్పటివరకు 16 కోచ్‌ల వందేభారత్, 8 కోచ్‌ల మినీ వందేభారత్ రైళ్లే తిరుగుతున్నాయి. మొదటిసారి 20 కోచ్‌ల రేక్‌ను ప్రారంభిస్తున్నారు. ఒకేసారి అలాంటి నాలుగు రైళ్లను ప్రారంభిస్తుండగా, అందులో ఒకటి తెలంగాణ నుంచి నడవనుండటం విశేషం. ఈనెల 16న ప్రారంభం కానున్న సికింద్రాబాద్–నాగ్‌పూర్ ఆరెంజ్ వందే భారత్‌ను కూడా 20 కోచ్‌లతో ప్రారంభించాలని భావిస్తున్నట్టు తెలిసింది. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మరింతమంది ప్రయాణికులను సర్దుబాటు చేసే క్రమంలో 20 కోచ్‌ల సెట్‌ను ప్రారంభించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. దాదాపు నాలుగు నెలల క్రితమే ఈ ఆలోచనకు రాగా, ప్రతినెలా అలాంటి ఒక సెట్‌ను తయారు చేయాలని చెన్నైలోని ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీని ఆదేశించింది. దీంతో మే, జూన్, జూలై, ఆగస్టులకు సంబంధించి నాలుగు రేక్‌లు సిద్ధమయ్యాయి. వాటిల్లో రెండింటిని ఉత్తర రైల్వేకు, తూర్పు రైల్వేకు, సెంట్రల్ రైల్వే జోన్‌కు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు. హైదరాబాద్–నాగ్‌పూర్ మధ్య వందేభారత్ రైలు గతంలోనే మంజూరైంది. రేక్ కొరత వల్ల దాని ప్రారంభం ఆలస్యమవుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ రైల్వేకు కేటాయించిన 20 కోచ్‌ల రైలును సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య తిప్పనున్నట్టు తెలిసింది. 20 కోచ్‌ల వందేభారత్‌లో 3 ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ కోచ్‌లు, 16 ఎకానమీ (ఏసీ చైర్‌కార్) కోచ్‌లు ఉంటాయని సమాచారం. సాధారణ 16 కోచ్‌ల రేక్‌లో ఎగ్జిక్యూటివ్ కోచ్‌లు 2, ఎకానమీ కోచ్‌లు 14 ఉంటున్నాయి.

ప్రస్తుతానికి నాలుగు రైళ్లే..

యమ గిరాకీ

ఎనిమిది కోచ్‌ల వందేభారత్‌లో 530 సీట్లుంటున్నాయి. అదే 16 కోచ్‌ల వందేభారత్‌లో 1,128 సీట్లు ఉంటున్నాయి. ఇప్పుడు కొత్తగా ప్రవేశపెట్టబోతున్న 20 కోచ్‌ల రేక్‌లో 312 సీట్లు పెంచుతూ వాటి సంఖ్యను 1,440కి విస్తరించారు. ఆ మేరకు ప్రయాణికులకు అదనంగా వెసులుబాటు కలుగనుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్లకు విపరీతమైన గిరాకీ ఉంది. తెలంగాణ మీదుగా నడుస్తున్న నాలుగు వందేభారత్ రైళ్ల సగటు ఆక్యుపెన్సీ రేషియో 110 శాతంగా ఉంది. మరి ముఖ్యంగా విశాఖపట్నం వందేభారత్‌లో అది 130 శాతాన్ని మించింది. దీంతో కోచ్‌ల సంఖ్య పెంచాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం హైదరాబాద్–నాగ్‌పూర్ మధ్య మూడు డెయిలీ ఎక్స్‌ప్రెస్‌లు తిరుగుతున్నాయి. హైదరాబాద్–న్యూఢిల్లీ తెలంగాణ ఎక్స్‌ప్రెస్, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–దానాపూర్ మధ్య నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు నాగ్‌పూర్ మీదుగా నడుస్తున్నాయి. ఇవి కాకుండా వారానికి ఓసారి నడిచే హైదరాబాద్–ఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, వారానికి నాలుగు రోజులు తిరిగే బెంగళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్‌లు సహా మొత్తం 8 రైళ్లు తిరుగుతున్నాయి. ఇప్పుడు కొత్తగా వందేభారత్ రైలు రానుంది.

కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోనే విమోచన ఉత్సవాలు

17న పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలకు రానున్న కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

- హాజరుకానున్న కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్
- రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడాన్ని తప్పుబడుతున్న బీజేపీ
- విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా హైదరాబాద్ విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నారు. రెండేళ్లక్రితం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో తొలిసారిగా ఈ ఉత్సవాలను కేంద్రం అధికారికంగా నిర్వహించినపుడు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ముఖ్యఅతిథిగా పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా ఈ వేడుకలకు అమిత్‌షా హాజరవుతారని రాష్ట్ర పార్టీ నేతలు గట్టిగా విశ్వసించారు. అయితే ఈ నెల 17న పరేడ్‌గ్రౌండ్స్‌లో కేంద్ర సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన విమోచన వేడుకలు నిర్వహించనున్నట్టు అధికారిక ప్రకటన వెలువడింది. గతేడాది కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా చారిత్రక గోల్కొండ కోటలో సైనికదళాల పరేడ్‌తో పాటు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన విషయం విదితమే. ఈ ఏడాది కూడా కేంద్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఆయనతో పాటు కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొననున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం... పారా మిలటరీ దళాలు, సైనిక దళాలు పరేడ్‌ను నిర్వహించనున్నాయి. హైదరాబాద్ సంస్థానం విముక్తి కోసం జరిగిన పోరాటానికి సంబంధించిన చారిత్రక అంశాలతో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను కళాకారులు ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే...17న హైదరాబాద్ విమోచన సందర్భాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడాన్ని కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో 17న ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడాన్ని కేంద్రమంత్రి సంజయ్, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. 17న రాష్ట్ర ప్రభుత్వమే విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలన్న డిమాండ్‌తో సీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు బీజేపీ శాసనసభాపక్షం సిద్ధమవుతోంది.

సభ్యత్వ నమోదును సీరియస్‌గా తీసుకోవాలి

లేకపోతే పార్టీ పదవులకు ప్రమాదం: బీజేపీ రాష్ట్ర సభ్యత్వ ఇన్‌చార్జి అభయ్ పాటిల్

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదును సీరియస్‌గా తీసుకోకపోతే తిప్పలు తప్పవని బీజేపీ అధిష్టానం నాయకులకు హెచ్చరికలు జారీచేసింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యనేతలు మొదలు కిందిస్థాయి కార్యకర్తల దాకా అందరూ.. పూర్తిస్థాయిలో నిమగ్నం కావాల్సిందేనని జాతీయ నాయకత్వం స్పష్టంచేసింది. సభ్యత్వ నమోదులో నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించింది. పార్లమెంట్ ఎన్నికల్లో.. రాష్ట్రంలో పోటీచేసిన బీజేపీ అభ్యర్థులకు 77 లక్షల ఓట్లు పోలైనందున, వాటిలో 60 నుంచి 65 లక్షల దాకానైనా ఓటర్లను పార్టీ సభ్యులుగా చేర్చుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సరిగ్గా నిర్వహించని నాయకులను పార్టీ పదవుల్లో నుంచి తొలగిస్తామని తెలంగాణ సభ్యత్వ ఇన్‌చార్జి అభయ్ పాటిల్ స్పష్టంచేశారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో సభ్యత్వ నమోదు సాగుతున్న తీరును పర్యవేక్షించారు. శని, ఆదివారాల్లోనూ ఆయన రాష్ట్రంలోని వివిధచోట్ల పర్యటించి సభ్యత్వ నమోదును పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలా పాల్గొంటున్నారనే అంశంపై సమాచారాన్ని సేకరించి, నివేదికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో పార్టీనేతలు అప్రమత్తం అయ్యారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలంతా కూడా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు.

ప్రజాపాలనా దినోత్సవానికి రండి

అమిత్ షా, గజేంద్రసింగ్, కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు రేవంత్ ఆహ్వానం

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నలుగురు కేంద్ర మంత్రులను ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు శుక్రవారం లేఖలు పంపారు. 1948, సెప్టెంబర్ 17న తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆ లేఖలో వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులను కోరారు.

రెడ్డీస్ ల్యాబ్ రూ.5 కోట్ల విరాళం



సీఎం రేవంత్‌కు చెక్కును అందిస్తున్న డాక్టర్ రెడ్డీస్ వైస్ ప్రెసిడెంట్ వి.నారాయణరెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, పొన్నం



చెక్కును అందిస్తున్న వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్స్ అధినేతలు ఆర్.సుదర్శన్‌రెడ్డి, ఏపీ సంజయ్‌రెడ్డి



ఏఎంఆర్ ఇండియా కంపెనీ తరఫున చెక్కును అందిస్తున్న ఎండీ మహేశ్‌కుమార్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి పలువురు పారిశ్రామికవేత్తలు, సినీ నటులు ముందుకు వస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు అందిస్తున్నారు. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ తరఫున ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5 కోట్ల విరాళాన్ని సంస్థ వైస్ ప్రెసిడెంట్ వి.నారాయణరెడ్డి సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్కును అందజేశారు. అలాగే వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్స్ తరఫున ఆ సంస్థ అధినేతలు ఆర్.సుదర్శన్‌రెడ్డి, ఏపీ సంజయ్‌రెడ్డి రూ.కోటి విరాళాన్ని సీఎంకు అందించారు. అలాగే ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సీఎం సహాయనిధికి రూ.కోటి విరాళాన్ని ప్రకటించింది. ఈమేరకు కంపెనీ ఎండీ మహేశ్‌కుమార్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లో సీఎంను కలిసి అందించారు.



సీఎం రేవంత్‌కు చెక్కును అందిస్తున్న బాలకృష్ణ కూతురు తేజస్వి



చెక్కును అందిస్తున్న ఓక్సెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు ప్రవీణ్ కె.పూల

సినీ నటుడు నందమూరి బాలకృష్ణ తరఫున ఆయన కూతురు తేజస్విని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రూ.50 లక్షల విరాళాన్ని అందజేశారు. అలాగే ఓక్సెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు ప్రవీణ్ కె.పూల సీఎం రేవంత్ రెడ్డికి రూ.50 లక్షల విరాళాన్ని అందించారు.

70 ఏళ్లు దాటిన వారికి పీఎంజేఏవైతో మేలు

పథకంలో మార్పులతో రాష్ట్రంలో అదనంగా 10 లక్షల మందికి లబ్ధి

- తెలంగాణలో 17.2 లక్షల 'పీఎంజేఏవై' చికిత్సలు
- రూ.3,626 కోట్ల విలువైన వైద్యసేవలు పొందిన లబ్ధిదారులు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: వయోవృద్ధుల ఆరోగ్యానికి సంబంధించి ఇటీవల కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం 70 ఏళ్లు దాటిన వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం ప్రధానమంత్రి జన ఆరోగ్య పథకం (పీఎంజేఏవై) పరిధిలో తెలంగాణలోని దాదాపు 30 లక్షల కుటుంబాలు ఉండగా.. ఇందులో సుమారు 1.15 కోట్ల మంది లబ్ధిదారులుగా ఉన్నారని చెప్పారు. అంతేగాక ఈ ఏడాది జూలై వరకున్న లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో జరిగిన 17.2 లక్షల చికిత్సలకు రూ.3,626 కోట్ల విలువైన వైద్యసేవలను లబ్ధిదారులు పొందారని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో వివరించారు. పీఎంజేఏవై పథకాన్ని అప్‌గ్రేడ్ చేసి 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులందరికీ రూ.5 లక్షల వరకు వైద్య బీమా అందించేందుకు కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం.. దేశ సమగ్రాభివృద్ధిలో వయోవృద్ధుల సంక్షేమానికి సరైన ప్రాధాన్యం కల్పించే దిశగా తీసుకున్న చర్య అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా తెలంగాణలో అదనంగా 10 లక్షల మంది 70 ఏళ్లు దాటిన వృద్ధు లు లబ్ధి పొందనున్నారని ఆయన తెలిపారు. అయితే.. ఇన్నా ళ్లుగా పీఎంజేఏవై పథకం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి మాత్రమే వర్తిస్తోందని, ఈ నేపథ్యంలో పథకానికి పలు మార్పులు చేసి.. పేద, ధనిక అనే తేడాల్లేకుండా 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులందరికీ వర్తింపజేయాలని భావించి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

లబ్ధిదారులకు ప్రత్యేక గుర్తింపు కార్డు

పీఎంజేఏవైకి అర్హులైన లబ్ధిదారులకు ప్రత్యేకమైన గుర్తింపు కార్డును అందిస్తారని, ఇందుకోసం వచ్చే రెండేళ్లలో రూ.3,437 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఖర్చుచేయనుందని కిషన్‌రెడ్డి తెలిపారు. సీనియర్ సిటిజన్లందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేసినందుకు ఆయన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

సెప్టెంబర్ 16న వందేభారత్ షురూ

ప్రారంభించనున్న ప్రధాని.. తెలుగు రాష్ట్రాలకు 2 రైళ్లు కేటాయించడంపై మోదీకి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వినాయక నవరాత్రుల కానుక అందించనున్నారు. నాగ్‌పూర్ -సికింద్రాబాద్, విశాఖపట్నం-దుర్గ్‌ల మధ్య రెండు వందేభారత్ రైళ్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలంగాణకు సంబంధించి ఇప్పటికే నాలుగు వందే భారత్ రైళ్లు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి సేవలందిస్తుండగా.. తాజాగా 5వ వందేభారత్ రైలును ప్రధానమంత్రి కేటాయించారు. ఈ రైలు సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య పరుగులు పెట్టనుంది. విశాఖపట్నం- దుర్గ్ (ఛత్తీస్‌గఢ్) మధ్య కూడా మరో వందేభారత్ రైలు సేవలందించనుండగా, ఈ రెండు రైళ్లను ఈ నెల 16న ప్రధానమంత్రి అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. వీటితో పాటు దేశవ్యాప్తంగా మొత్తం 10 కొత్త వందేభారత్ రైళ్లను వచ్చే సోమవారం ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ నుంచి ప్రారంభమయ్యే రైలు సికింద్రాబాద్ చేరుకునే సందర్భంలో స్వాగతం పలకాలంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆహ్వాన పత్రం పంపించారు. వందేభారత్ రైళ్లు కేటాయించిన ప్రధానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

'గత అధ్యయనాల ఆధారంగా ముందుకు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటివరకు ఏర్పాటైన అన్ని బీసీ కమిషన్ల అధ్యయనాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగుతామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ గత చైర్మన్లు, సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుత బీసీ కమిషన్‌కు అన్నివిధాలా సహకరిస్తామని పూర్వ బీసీ కమిషన్ చైర్మన్లు బీఎస్ రాములు, వకుళాభరణం కృష్ణమోహన్ స్పష్టం చేశారు. పూర్వ బీసీ కమిషన్‌తో తరచూ సమావేశమై పరస్పర చర్చలు జరిగేలా చర్యలు తీసుకుంటానని నిరంజన్ వెల్లడించారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, పూర్వ కమిషన్ల సభ్యులు ఆంజనేయ గౌడ్, జూలూరి గౌరీశంకర్, సీహెచ్ ఉపేంద్ర పాల్గొన్నారు.

నష్టం రూ.10,320 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

లక్షలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వెల్లడించారు. పంట పొలాల్లో బండరాళ్లు, కంకర, మట్టి మేటలు వేయటంతో రైతులు కోలుకోలేనంతగా నష్టపోయారని చెప్పారు. చాలాచోట్ల రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెరువులు కొట్టుకు పోవటంతో నష్టం ప్రాథమిక అంచనాలను మించిపోయిందని వివరించారు.

మున్నేరు సమస్యకు రిటైనింగ్ వాలే పరిష్కారం

ఖమ్మానికి మున్నేరు వాగుతో ఉన్న వరద ముప్పును నివారించాలంటే రిటైనింగ్ వాల్ నిర్మాణం ఒక్కటే శాశ్వత పరిష్కారమని సీఎం స్పష్టం చేశారు. దీని నిర్మాణానికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించేలా చూడాలన్నారు. ప్రభుత్వం తన వాటాను భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతో పాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజలకు సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. ఈ మేరకు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సాయం అందించాలని కోరారు.

నివారణపై ఎక్కువగా దృష్టి పెట్టాలి

వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించిన తర్వాత ఆదుకోవటం కంటే, నివారించే చర్యలపై ఎక్కువగా దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వర్షపాతం, వడగాడ్పుల వంటి వాతావరణ, పర్యావరణానికి సంబంధించిన విపత్తులపై వీలైనంత ముందుగా హెచ్చరికలు జారీ చేసేలా ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. విపత్తు పరిస్థితుల్లో తక్షణం స్పందించేలా వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసే పోలీసు బెటాలియన్లను ఉపయోగించుకుంటామంటూ ముఖ్యమంత్రి తన ఆలోచనలను కేంద్ర బృందంతో పంచుకున్నారు. ప్రతి బెటాలియన్‌లో ఎంపిక చేసిన వంద మందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. వారికి అవసరమైన పరికరాలు, శిక్షణ, నైపుణ్యం విషయంలో ఎన్డీఆర్ఎఫ్ సాయం కోరుతున్నామని తెలిపారు.

50 వేల చెట్లు నేలమట్టం

మేడారం అటవీ ప్రాంతంలో ఇటీవల 50 వేల ఎకరాల్లో చెట్లు నేలమట్టమైన ఉదంతం చర్చకు వచ్చింది. ఇది అటవీ ప్రాంతంలో సంభవించడంతో ముప్పు వాటిల్లలేదని, మైదాన ప్రాంతంలో జరిగితే భారీ నష్టం జరిగేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పటివరకు ఇలాంటి సంఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని కేంద్ర బృందం వ్యాఖ్యానించింది. అందుకే కేంద్రం నుంచి నిపుణుల బృందాన్ని పంపించి శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని సీఎం కోరారు. అలాంటివి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా పరిశీలించాలని సూచించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్డీఎంఏ) సలహాదారు కల్నల్ కేపీ సింగ్ సారథ్యంలోని కేంద్ర బృందంలో అధికారులు శాంతినాథ్‌శివప్ప, మహేష్‌కుమార్, నాయల్‌కాన్సన్, రాకేష్‌మీనా, శశివర్ధన్‌రెడ్డి ఉన్నారు.

నష్టం అంచనాలు ఇలా..

విభాగం	అంచనా నష్టం (రూ.కోట్లలో)
రహదారులు (ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్)	7693.53
సాగునీటి పారుదల	483.00
పురపాలక శాఖ	1216.57
తాగునీటి సరఫరా	331.37
విద్యుత్ శాఖ	179.88
వ్యవసాయం	231.13
ఆసుపత్రులు, అంగన్‌వాడీలు (కమ్యూనిటీ అసెట్స్)	70.47
మత్స్య శాఖ	56.41
గృహ నిర్మాణం	25.30
పశుసంవర్థక శాఖ	4.35
పాఠశాల భవనాలు	27.31
వరదల్లో మరణించిన వారికి నష్టపరిహారం	1.40
మొత్తం	10,320.72

పునరావాస కేంద్రాల నుంచి ఇంటికి..

పూర్వస్థితికి చేరిన మున్నేరు ముంపు ప్రాంతాలు

- ఇళ్లు కోల్పోయిన వారు అద్దె ఇళ్లలోకి
- బాధితులకు కొనసాగుతున్న దాతల సాయం



ఖాళీగా ఉన్న స్వర్ణభారతి కల్యాణ మండపం

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం రూరల్ మండలంలో మున్నేరు వరద ముంపు బాధితులకోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు ఖాళీ అయ్యాయి. ఆయా ప్రాంతాల్లో వరద నీరు తగ్గడంతో ముంపు బాధితులంతా పునరావాస కేంద్రాలను వీడి ఇళ్లకు చేరుకున్నారు. ఈనెల 1న మున్నేరుకు వచ్చిన భారీ వరదలతో ఖమ్మం నగరంలోని 13 డివిజన్లతో పాటు ఖమ్మం రూరల్ మండలంలోని 20 కాలనీలు నీట మునిగాయి. వందలాది ఇళ్లను వరద ముంచెత్తగా.. అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. దీంతో ప్రభావిత ప్రాంతాల ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో ఖమ్మంలోని రామన్నపేట ప్రభుత్వ పాఠశాల, జూబ్లీ క్లబ్, స్వర్ణభారతి కల్యాణ మండపం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ధంసలాపురం పాఠశాలల్లో 8,200 మందికి, ఖమ్మం రూరల్ మండలంలో టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్, రామ్‌లీలా ఫంక్షన్‌హాల్, పోలేపల్లి స్ప్రింగ్ లీఫ్ పాఠశాల, సాయిబాబా ఆశ్రమంలో 2,300 మందికి ఆశ్రయం కల్పించి ఇన్నాళ్లూ భోజనం సమకూర్చారు.

బాధితులు వెళ్లిపోవడంతో కేంద్రాల మూసివేత

వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పూర్తి కావడం, ప్రజలు తమ ఇళ్లను శుభ్రం చేసుకోవడంతో పునరావాస కేంద్రాలను వీడి ఇళ్లకు చేరుకున్నారు. ఈనెల 10 వరకు ప్రభుత్వ యంత్రాంగం పునరావాస కేంద్రాలను నిర్వహించగా.. బాధితులు ఇళ్లకు వెళ్లిపోతుండడంతో శుక్రవారం పూర్తిగా మూసివేసింది. అయితే, ఇళ్లు పూర్తిగా నేలమట్టమైన వారు మాత్రం ఎక్కడకు వెళ్లాలో దిక్కుతోచక.. మిగిలిన ఒకటి, అరా సామగ్రితో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు.

కొనసాగుతున్న దాతల చేయూత

వరద బాధితులకు పలువురు నిత్యావసరాలతో పాటు భోజనం అందిస్తున్నారు. అనేక మంది ఇళ్లను కోల్పోయి వండుకునేందుకు సామగ్రి లేక భోజనం కోసం ఇబ్బంది పడుతుండగా.. వారికి స్వచ్ఛంద సేవా సంస్థలు భోజనం సమకూరుస్తున్నాయి. శుక్రవారం కూడా ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప, ఖమ్మంలోని వెంకటేశ్వరనగర్‌లో బాధితులకు పలు సంస్థల ద్వారా భోజనం సమకూర్చారు.

‘ట్రిలియన్ డాలర్ల’ లక్ష్యానికి తోడ్పాటు ఇవ్వండి

- కేంద్రాన్ని కోరిన మంత్రి శ్రీధర్‌బాబు
- ముంబైలో రాష్ట్రాల వాణిజ్య మంత్రుల సమావేశం

సాక్షి, హైదరాబాద్: వచ్చే పదేళ్లలో తెలంగాణ వార్షిక ఆర్థిక వ్యవస్థ మూడు ట్రిలియన్ డాలర్లకు (రూ.84 లక్షల కోట్లు) చేరేలా కేంద్రం తోడ్పాటును అందించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. ముంబైలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన జాతీయ వాణిజ్య మండలి సమావేశంలో శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల వాణిజ్య శాఖల మంత్రులు పాల్గొన్న ఈ సమావేశంలో వాణిజ్య విధానాలు, వ్యాపారాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ వ్యూహాత్మక ప్రణాళికలు, లక్ష్యాలను శ్రీధర్‌బాబు వివరించారు. ‘రాష్ట్రాలకు నిధులు సమకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎగుమతి సంబంధిత వాణిజ్య మౌలిక వసతుల అభివృద్ధి పథకం (టైస్) సాంప్రదాయ పరిశ్రమల (ట్రెడిషనల్ ఇండస్ట్రీస్) పునరుజ్జీవన పథకాలను ప్రవేశపెట్టింది. అయితే నిధుల కొరత మూలంగా ఈ పథకాలు ఆశించిన రీతిలో రాష్ట్రాల వృద్ధిని మెరుగు పరచడంలో విఫలమయ్యాయి. తెలంగాణ అవసరాలను ప్రత్యేక దృష్టితో పరిశీలించి తోడ్పాటు అందించాలి. నిజామాబాద్ జిల్లాలో పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తే పసుపుతో పాటు సహజ రంగుల ఉత్పత్తి, ఎగుమతులకు వీలవుతుంది. ఖమ్మం లేదా మహబూబాబాద్‌లో మిర్చిని త్వరితగతిన ఎండబెట్టే ప్లాంటు ఏర్పాటుతో నాణ్యత, ఎగుమతులు పెరుగుతాయి. నిజామాబాద్ లేదా వరంగల్‌లో సుగంధ ద్రవ్యాల ప్రయోగశాలను ఏర్పాటు చేసి నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు జారీ చేయాలి. తద్వారా కస్టమ్స్ క్లియరెన్సు సులభతరమవుతుంది. సోనామసూరి బియ్యానికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగింగును సమకూర్చాలి. పారిశ్రామిక వాడల సమీపంలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు, కరీంనగర్ లేదా వరంగల్‌లో గ్రానైట్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యాక్సిన్ టెస్టింగ్ లేబొరేటరీ, చిన్న, సూక్ష్మ పరిశ్రమల అవసరాలకు ముడి సరుకు సేకరణ హబ్‌ను ఏర్పాటు చేయాలి. తెలంగాణ ఎగుమతుల్లో ఔషధాలు, వ్యాక్సిన్లు, రసాయనాలు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ ముఖ్య పాత్రను పోషిస్తున్నాయి. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్రం సహకారం అవసరం’ అని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు.



ముంబైలో జరిగిన వాణిజ్య మండలి సమావేశంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

రూ.10 వేల కోట్ల రుణంపై తర్జనభర్జన

▶ మొదటి పేజీ తరువాయి

చిక్కులు లేకుండా రుణ సేకరణకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. రుణం ఇప్పించే మర్చంట్ బ్యాంకర్‌కు కనీసం ఒక శాతం చొప్పున లెక్క వేసినా రూ.100 కోట్లు కమీషన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

ఫైనాన్స్ సంస్థల షరతులు: రూ.10 వేల కోట్ల రుణం కోసం రూ.20 వేల కోట్లు విలువ చేసే విలువైన భూములను తాకట్టు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైనా, భూముల తాకట్టుతో పాటు రుణానికి గ్యారంటీ ఇస్తేనే మంజూరు చేస్తామని ఫైనాన్స్ సంస్థలు మెలిక పెడుతున్నాయి. ఇక్కడే ప్రభుత్వానికి చిక్కొచ్చి పడింది. రుణ మొత్తానికి గ్యారంటీ ఇస్తే ‘ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ’ (ఎఫ్‌ఆర్‌బీఎం) నిబంధనలను కేంద్రం వర్తింపజేస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ఏ తరహా రుణాలైనా ఎఫ్‌ఆర్‌బీఎం గరిష్ట రుణ పరిమితికి లోబడే ఉండాలని ఆర్‌బీఐ ఇదివరకే స్పష్టం చేసింది. రుణ మార్కెట్ నుంచి తెచ్చే అప్పులకు సంబంధించిన సమాచారం ఆర్‌బీఐకి కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రుణ సమీకరణపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ప్రభుత్వం గ్యారంటీ ఇస్తేనే అప్పులు తేవడం సాధ్యమవుతుందని మర్చంట్ బ్యాంకర్లు సైతం తేల్చి చెబుతున్న నేపథ్యంలో దీని సాధ్యాసాధ్యాల పరిశీలనలో అధికారులు నిమగ్నమయ్యారు.

> ఈ ప్రపంచము నందు ఏయే వస్తువులున్నవో ఆ వస్తువులన్నియు పరమాత్మచే ఆవరింపబడియున్నవి. అనగా ఒక్కో దానియందును అతడున్నాడు. అతడు లేనిది యేదియు లేదు.
> – ఈశావాస్యోపనిషత్తు (హిందూ ధర్మం)

సాక్షి

శనివారం, 14 సెప్టెంబర్ 2024

ఇలా చేయటం సబబేనా!


లేవనెత్తిన సమస్యల తీవ్రతను చాటడం, వాటిని పరిష్కరించుకోవటానికి పట్టువిడుపులు ప్రదర్శించటం, గరిష్ఠంగా సాధించుకోవటం ఏ ఉద్యమానికైనా ఉండాల్సిన మౌలిక లక్షణాలు. పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు నెల రోజులకుపైగా సాగిస్తున్న ఉద్యమం ఈ ప్రాథమిక సత్యాన్ని గుర్తించాల్సి వుంది. ఆర్‌జీ కర్ వైద్య కళాశాల అనుబంధ ఆసుపత్రిలో తమ సహచర వైద్యురాలు 36 గంటలు నిర్విరామంగా రోగులకు సేవలందించి సేదతీరిన నిశిరాత్రిలో దుండగులు ఆమెపై అత్యాచారం జరిపి పొట్టనబెట్టుకున్న వైనం వెల్లడయ్యాక జూనియర్ డాక్టర్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ ఉద్యమాన్ని తుంచేయడానికి, సాక్ష్యాధారాలు మాయం చేయడానికి గూండాలను ఉసిగొల్పి విధ్వంసం సృష్టించిన తీరు వారిని మరింత రెచ్చగొట్టింది. ఉన్నతాదర్శాలతో ఈ రంగంలో అడుగుపెట్టిన యువ వైద్యులను పాలనా నిర్వాహకులు వేధించుకు తినటం, మాఫియాలుగా మారటం, పాలకులు పట్టనట్టు వ్యవహరించటం వాస్తవం. తూట్లు పూడుస్తున్నట్టు కనబడుతూనే తూములు తెరిచిన చందంగా పాలకులు వ్యవహరించిన తీరు దాచేస్తే దాగని సత్యం. జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలు ఎటువంటివో, అవి ఎంత ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయో ఇవాళ దేశమంతా తెలిసింది. కొంత హెచ్చుతగ్గులతో ఇంచుమించు ప్రతి రాష్ట్రంలోనూ ఇలాంటి దయనీయ స్థితిలోనే జూనియర్ డాక్టర్లు తమ వృత్తిని కొనసాగించాల్సి వస్తున్నదని కూడా అందరూ గ్రహించారు. ప్రజావైద్యరంగంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన అవ్యవస్థ దళారీలనూ పెత్తందార్లనూ సృష్టించిందని, ఆ రంగాన్ని రోగగ్రస్తం చేసిందని జనం గుర్తించారు. దేన్నయినా రాజకీయ కోణంలోనే చూడటం అలవాటైన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దీన్నుంచి కూడా అవలీలగా బయటపడగలమని తొలుత భావించారు. పైపై చర్యలతో ఉద్యమాన్ని సద్దుమణగనీయొచ్చని ఆశించారు. పరిస్థితి చేయి దాటుతున్నదని ఆలస్యంగా గ్రహించారు. గురువారం ఉద్యమకారులతో చర్చించడానికి రాష్ట్ర సెక్రటేరియట్‌లో రెండు గంటలకు పైగా వేచిచూసి, వారు వచ్చే అవకాశం లేదని గ్రహించాక రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ప్రజలకోసం రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని కూడా ప్రకటించారు. మొదట్లో సమస్య పరిష్కారానికి సిద్ధపడని ఆమె వైఖరివల్లనే సమస్య జటిలంగా మారిందన్నది వాస్తవం. వైద్య సాయం అందక, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకోలేక పలువురు మరణించారు. ఈ పాపం నుంచి ఆమె తప్పించుకోలేరు. తన స్వభావానికి భిన్నంగా ఉద్యమం విరమించుకోవాలని ముకుళిత హస్తాలతో ఉద్యమకారులను వేడుకోవటం, వారితో చర్చించటానికి సుదీర్ఘ సమయం వేచిచూడటం ఇది గ్రహించబట్టే. చేతులు కాలాక ఆకులు పట్టుకోవటం లాంటిదే ఇది.

అయితే ఉద్యమకారులుగా పట్టువిడుపులు ప్రదర్శించాలని జూనియర్ డాక్టర్లు కూడా గుర్తించాలి. ఉద్యమం విరమించి విధులకు హాజరు కావాలని ఇప్పటికి మూడుసార్లు సర్వోన్నత న్యాయస్థానం కోరింది. అలా చేరితే ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు ఉండబోవని మొన్న పదో తేదీన వారికి చెప్పింది కూడా. జరిగిన దుస్సంఘటనపై దర్యాప్తు జరపాలని, పని పరిస్థితులు మెరుగుపర్చాలని, జూనియర్ డాక్టర్లకు భద్రత కల్పించాలని, పని గంటల భారాన్ని తగ్గించాలని మొదట్లో కోరారు. ఇప్పుడు సీబీఐ దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపాల్‌ను, మరికొందరిని తొలగించారు. పలువురిని అరెస్టు చేశారు. జూనియర్ డాక్టర్లు లేవనెత్తిన మౌలిక సదుపాయాల కల్పనకు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కానీ ఉద్యమకారుల డిమాండ్లు పెరుగుతూ పోతున్నాయి. వైద్యరంగ ప్రక్షాళన కోసం వైద్య విద్యా డైరెక్టర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి, నగర పోలీస్ కమిషనర్ రాజీనామా చేయాలని తాజాగా వారు కోరుతున్నారు. అంతే కాదు... తమతో మమత జరపదల్చుకున్న చర్చలను చానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు ఒప్పలేదన్న కారణంతో గురువారం చర్చలను బహిష్కరించారు. సాక్షాత్తూ సుప్రీంకోర్టే తన కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నప్పుడు చర్చలు ప్రజలందరూ చూసేలా జరగటంలో తప్పేముందన్నది వారి ప్రశ్న. వినటానికి సబబే అనిపించవచ్చు. కానీ మమత అంటున్నట్టు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు సాగుతోంది. దానిపై బహిరంగ చర్చ మంచిదేనా? దుండగుల దాడిలో బలైపోయిన యువ వైద్యురాలి కుటుంబసభ్యుల గోప్యత ఏం కావాలి? ఉద్యమకారులు రాష్ట్రపతికి, ఉపరాష్ట్రపతికి, ప్రధానికి లేఖలు రాశారు. కానీ ఇప్పటికే తీసుకున్న చర్యలకు మించి వారేం ఆశిస్తున్నారనుకోవాలి?

నిరుపేద వర్గాలకు చెందిన వృద్ధులు, గర్భిణులు, దీర్ఘవ్యాధులతో బాధపడేవారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు లభించక తల్లడిల్లుతున్నారు. దాదాపు 25 మంది రోగులు ప్రాణాలు కోల్పోయారని మీడియా కథనాలు చెబుతున్నాయి. 8,000 మంది జూనియర్ డాక్టర్ల సమ్మె కారణంగా వైద్య సేవలు అందించలేమని సర్కారీ ఆస్పత్రులు చేతులెత్తేయటం వల్ల అంతంతమాత్రంగా బతుకీడుస్తున్నవారు సైతం రోగాలబారిన పడిన తమ ఆప్తుల్ని రక్షించుకోవటానికి అప్పులుచేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అందుకే జూనియర్ డాక్టర్లు తమ బాధ్యత గుర్తెరగాలి. పాలకులపై తమకున్న ఆగ్రహం దారితప్పి సామాన్యులను కాటేస్తున్న వైనాన్ని గమనించాలి. తమ డిమాండ్లకు సమాజం నుంచి సానుకూలత, సానుభూతి వ్యక్తమవుతున్న తరుణంలోనే విధుల్లో చేరాలి. తెగేదాకా లాగటం మంచిది కాదని తెలుసుకోవాలి.

మేధా వికాసంలో శ్రమశక్తి సంకేతం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

హైదరాబాద్‌లో 'కోఠి ఉమెన్స్ కాలేజీ'గా ఉన్న సంస్థకు 'చాకలి ఐలమ్మ ఉమెన్స్ యూనివర్సిటీ' అనే పేరును పెట్టడం గొప్ప సాంస్కృతిక మార్పునకు దారి తీస్తుంది. యుగాల బానిసత్వానికి వ్యతిరేకంగా తిరగబడ్డ వీరనారి ఐలమ్మ. ఈ దేశంలో స్కూళ్లలో, యూనివర్సిటీల్లో శ్రమ జీవన పాఠాలు చెప్పాలంటే తోలుపని, బట్టలుతికే పని, క్షవరం చేసే పని నుండే ప్రారంభించాలి. ఐలమ్మ విగ్రహాన్ని ఉమెన్స్ యూనివర్సిటీలో దర్బార్ హాల్ ముందు పెడితే, ఆమె ముఖం చూసి తరగతి గదుల్లోకి వెళ్లిన ప్రతి విద్యార్థిని మానవత్వంతో బతికే మేధావి అవుతుంది. ఏదేమైనా భారతదేశ చరిత్రలో ఒక చాకలి యోధురాలి పేరుతో మొట్టమొదటి ఉమెన్స్ యూనివర్సిటీ ప్రారంభం కావడమే ఒక సాంస్కృతిక విప్లవ ప్రారంభ ఘట్టం.

10 సెప్టెంబర్ 2024 రోజున తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగింది. ఆ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక శాఖ డా॥ అలేఖ్య పుంజాల టీమ్ ఒక అద్భుతమైన బ్యాలేను వేసింది. ఆ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, శాసన సభ్యులు హాజరయ్యారు.

ఈ చారిత్రక సమావేశంలో వేదిక మీది నుండి నేను తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యంగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులకు కొత్తగా తెలంగాణలో ఏర్పడే ఉమెన్స్ యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెడితే అది గొప్ప సాంస్కృతిక మార్పునకు దారి తీస్తుందని సూచించాను. అక్కడికక్కడే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మిగతా మంత్రులు మాట్లాడుకొని, ఇంతకుముందు 'కోఠి ఉమన్స్ కాలేజీ'గా ఉన్న సంస్థకు 'చాకలి ఐలమ్మ ఉమన్స్ యూనివర్సిటీ' అనే పేరును ఇక్కడే ప్రకటిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇది చాలా చరిత్ర ప్రాధాన్యం కలిగిన నిర్ణయం.

గతంలో యూనివర్సిటీలకు దేవతలు, రాజులు, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న జాతీయ నాయకుల పేర్లు పెట్టేవారు. అందులో ద్విజ బ్రాహ్మణ, బనియా, కాయస్థ, ఖత్రి, క్షత్రి, క్షత్రియ వారి పేర్లే ఎక్కువ. అంబేడ్కర్, పూలే, పెరియార్లు ఆ స్థితిని కాస్తా మార్చు తెచ్చారు. కానీ వారంతా చదువుకున్నవారు. కానీ దేవతల పేర్లతో యూనివర్సిటీ పేర్లు పెట్టినప్పుడు చదువుతో సంబంధం చూడలేదు. ఉదాహరణకు తిరుపతిలోని వెంకటేశ్వర యూనివర్సిటీ.

చాకలి ఐలమ్మ సమాజం బట్టలుతికి మొత్తం సమాజాన్ని రోగాల నుండి, మురికి జీవితం నుండి కాపాడిన కులం నుండి వచ్చింది. గ్రామాల్లోని అన్ని కులాల వారి బట్టలుతికి సాయంకాలం బుట్ట పట్టుకొని 'చాకలి దాన్ని అవ్వా!' అని అడుక్కొని తిని బతికిన కులం ఆమెది. పెండ్లి పనుల్లో ఎంతగా భాగమైనప్పటికీ, బంతిలో కూర్చొని అందరితో కలిసి బుక్కెడు బువ్వ తినలేని స్థితి వారిది. అదే పెండ్లిలో మిగిలిన కూడు తిని సేవ చేశారు.

సమాజానికి సబ్బు అనే వస్తువు తెలవని రోజుల్లో మన దేశంలోని చాకలి స్త్రీలే 'చవుడు మట్టి' అనే సబ్బును కనిపెట్టారు. చవుడు మట్టి బట్టను శుభ్రం చేసినప్పటికీ రోగ క్రిములు బట్టలకంటుకునే ఉండేవి. వాటిని కూడా చంపి సమాజాన్ని అంటు వ్యాధుల నుండి కాపాడటానికి చాకిరేవులో చవుడు బట్టలను ఉడుకబెట్టి, వాళ్లే ఈ సమాజాన్ని బతికించారు. కానీ ఈ దేశపు కుల విలువలు శుభ్రతకు మూలమైన స్త్రీలను అశుభ్రులుగా ప్రకటించి ఇంటి అరుగు కూడా తొక్కనివ్వలేదు. ప్రసవించే ప్రతి స్త్రీని చాకలి స్త్రీలే మంత్రసానులుగా మారి ప్రసవింపజేశారు. కానీ చాకలి – మంగలి స్త్రీలు కాపాడిన బాలింతలు కూడా వారిని మనుషులుగా చూడలేదు. ఇటువంటి వేల సంవత్సరాల అమానుష విలువలపై చాకలి ఐలమ్మ ఒక తిరుగుబాటు.



చాకలి ఐలమ్మ

యుగాల బానిసత్వానికి వ్యతిరేకంగా తిరగబడ్డ వీరనారి ఆమె. ఈమె రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీల కంటే వేయిరెట్లు ధైర్యశాలి. అందుకే నిజాం రాజరికంలో విసునూరి రామచంద్రారెడ్డి దొరతనంలో బట్టలుతుకుతూ 'అడుక్క తినను, నాకున్న కొద్దిపాటి భూమిలో పండించుకొని తింటాను' అని తన కొడవలిని చేత పట్టుకొని భూస్వామ్య కత్తుల మీద, రజాకార్ తుపాకుల మీద తిరుగుబాటు చేసింది. అలేఖ్య బ్యాలేలో కొడవలి, కర్రతో ఆమె, ఆమెతో పాటు ఆ చాకలి స్త్రీ – పురుషులు రజాకార్–భూస్వామ్య శక్తుల మీద చేసిన పోరాటం చూపరులను ఉత్తేజపర్చింది.

రెండు దశల్లో స్త్రీల సాయుధ తిరుగుబాటు తెలంగాణకు ఎనలేని వన్నె తెచ్చింది. మొదటిది సమ్మక్క–సారక్క పోరాటం. వాళ్ళు ఇప్పుడు దేవతలయ్యారు. వాళ్ళ పేర్లు యూనివర్సిటీ గేటు బోర్డుల మీద ఎక్కాలనే నా కోరికను కేంద్ర ప్రభుత్వం తీర్చింది. ములుగు సమీపంలో 300 ఎకరాల్లోని ట్రైబల్ యూనివర్సిటీకి సమ్మక్క–సారక్క పేరు పెట్టింది. రెండవ స్త్రీ తిరుగుబాటు... గ్రామ స్థాయిలో అన్ని శూద్ర కులాల అట్టడుగున బతికి, బట్టలుతికి, మంత్రసానిగా పని చేసిన చాకలి ఐలమ్మ వీర వనితగా భూస్వామ్య వ్యతిరేక పోరాటం చేసింది. ఆమె పేరుతో వందల సంవత్సరాలు అన్ని కులాల అమ్మాయిలు ఉన్నత విద్య నేర్చుకునే ఒక ఉమెన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ నడిబొడ్డులో ఉండబోతున్నది.

కోఠి ఉమెన్స్ కాలేజీలో నేను పదకొండేళ్లు పాఠాలు చెప్పాను. ఐలమ్మ వేషం కట్టి ఆడిన అలేఖ్య ఆ కాలేజీలో చదువుకుంది. నా ఉపాధ్యాయ జీవితంలో ఒక క్లాసు ఎగ్గొట్టకుండా విద్యార్థులు ప్రతి రోజూ పాఠాలు విన్న కాలేజీ అదే. చాకలి ఐలమ్మ యూనివర్సిటీగా వెలగబోతున్న ఆ యూనివర్సిటీ తరతరాలు అమ్మాయిల, అబ్బాయిలకు తల్లులుగా జీవించే స్త్రీల జీవితాలను మారుస్తుంది. 'ఎవరు ఈ చాకలి ఐలమ్మ?' అని పిల్లలు అడిగితే ఆమె శ్రమశక్తి గురించి, ఆమె పోరాట పటిమ గురించి ఎన్నో పాఠాలు చెప్పడానికి ఆమె జీవితం ఆధారంగా ఉంటుంది. అన్ని కులాలు, అన్ని మతాల పిల్లలు కుల మత వ్యత్యాసం లేకుండా జీవించడానికి ఆమె జీవిత చరిత్ర ఎంతో ఉపయోగపడుతుంది.

ఈ దేశంలో స్కూళ్లలో, యూనివర్సిటీల్లో శ్రమ జీవన పాఠాలు చెప్పాలంటే తోలుపని, బట్టలుతికే పని, క్షవరం చేసే పని నుండే ప్రారంభించాలి. చాకలితనం హీనమైంది కాదు, అగౌరవప్రదమైనదేం కాదు. అది సమాజ శుభ్రతకు గొప్ప జ్ఞానంతో పనిచేసింది. మానవ జాతిని బతికించింది. చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఉమెన్స్ యూనివర్సిటీలో దర్బార్ హాల్ ముందు పెడితే, ఆమె ముఖం చూసి క్లాసురూముల్లోకి వెళ్లిన ప్రతి విద్యార్థిని మానవత్వంతో బతికే మేధావి అవుతుంది.

బ్రిటిష్ వలస కాలంలో, నిజాం ప్రభుత్వ రెసిడెంట్ అధికారి, ఒక తెల్లదొర జీవించిన బంగ్లా అది. అది ఇప్పుడు మంచి హెరిటేజ్ బిల్డింగ్. అది ఒకవైపు దోపిడీ చిహ్నం అయితే, మరోవైపు సరిగా వంద సంవత్సరాల కింద, 1924లో మొట్టమొదటి ఉమెన్స్ కాలేజీగా ప్రారంభమైన స్త్రీ విద్యా వికాస కేంద్ర కూడా. అది కాలేజీగా ప్రారంభమైన వంద సంవత్సరాలకు చాకలి ఐలమ్మ యూనివర్సిటీగా రూపుదిద్దుకోవడం ఒక్క తెలంగాణకే కాదు, మొత్తం దేశానికి ఒక సాంస్కృతిక విప్లవ చిహ్నం, ఒక మార్పునకు సూచిక.

పాత తెలంగాణ తల్లి విగ్రహం ఒక దొరసాని రూపంలో ఉందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త విగ్రహాన్ని డిసెంబర్ 9న అంటే సోనియా గాంధీ జన్మదినాన ఆవిష్కరిస్తామని ప్రకటించింది. ఆ కొత్త తెలంగాణ తల్లికి చాకలి ఐలమ్మ పోలికలుంటే రాష్ట్ర సాంస్కృతిక తత్వమే మారుతుంది. ఏదేమైనా భారతదేశ చరిత్రలో ఒక చాకలి పోరాట యోధురాలి పేరుతో మొట్టమొదటి ఉమెన్స్ యూనివర్సిటీ ప్రారంభం కావడమే ఒక కల్చరల్ రెవల్యూషన్ ప్రారంభ ఘట్టం.

అయితే ఈ యూనివర్సిటీని బాగా అభివృద్ధి చెయ్యాల్సి ఉంది. ఈ యూనివర్సిటీలోనే ఒక ఉమెన్స్ మెడికల్ కాలేజీ, ఒక ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీని కూడా ప్రారంభించాల్సి ఉంది. అందులోని అన్ని కోర్సుల్లో చదువుకునే స్త్రీ విద్యార్థులు దేశవిదేశాల్లో ఆ యూనివర్సిటీకి పేరు తేవలసి ఉంది. ఈ దేశాన్ని బీదరికం నుండి బయట పడవేసే మేధావులు ఇక్కడి నుండి ఎక్కువమంది వచ్చినప్పుడే చాకలి ఐలమ్మ పోరాటానికి ఫలితం దక్కుతుంది.

నా దృష్టిలో ఈ పేరుతో వచ్చిన యూనివర్సిటీ ఈ దేశ తాత్విక, ఆధ్యాత్మిక, సామాజిక మార్పునకు పునాది రాయి అవుతుందనీ, ఆ మార్పు వస్తుందనీ ఆశిద్దాం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తప్పుడు దృక్పథం



కొంతమంది ఇండియా, బంగ్లాదేశ్ సమానం కాదని వాదిస్తున్నారు. ఇండియా, అమెరికా సంబంధాలను ఎలా చూస్తారు? ఇండియా, చైనా సంగతేమిటి? ఇండియా, బంగ్లా సమానం కాకపోతే, ఇండియా కూడా ఆ రెండు దేశాలకు కాదు.

– జాఫర్ శోభన్, సంపాదకుడు

ప్రతికూల సంకేతం?



శ్రీలంక ఎన్నికల్లో అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. సైనో–వహాబీ– లెఫ్ట్ లాబీకి కొంచెం అనుకూలంగా ఉంది. ఇది ఇండి యాకూ, హిందూ మహాసముద్ర ప్రాంతానికీ మంచిది కాదు. ఇప్పటికే ఇస్లామిక్ రాడికల్స్ చేతుల్లోకి బంగ్లాదేశ్ వెళ్లిపోయింది.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

సహజత్వం కోసం...



'తంగలాన్' సినిమా దుస్తుల కోసం కాటన్ వాడుతూ, ఆ సహజత్వం తేవడానికి కొన్ని పద్ధతులను అనుసరించాను. వాటి రంగుల కేమో చెట్ల బెరడులు, పండ్లు, మొక్కల వేళ్ల లాంటి వాటితో చేసిన సహజ రంగులు ఉపయోగించాను. అవి ఎకో ఫ్రెండ్లీ.

– ఏగన్ ఏకాంబరం, కాస్ట్యూమ్ డిజైనర్

ఇది విషయం కాదా?



నెలల క్రితం గాజా మహిళలు శానిటరీ ప్యాడ్ల కోసం ప్రపంచాన్ని అర్థించారు. లాభం లేకపోవడంతో డైపర్లు వాడటం మొదలుపెట్టారు. డైపర్లకు డిమాండ్ పెరగ్గానే, ఇజ్రాయిల్ శానిటరీ ప్యాడ్లను అనుమతించింది. కానీ అప్పటికే డైపర్లు లేకుండా పోయాయి. ఈ విషయాన్ని అంతర్జాతీయ ట్రెండ్ చేయాలనిలేదుగానీ అవసరంలో స్త్రీవాదులు గొంతెత్తలేదన్నదే నా ఫిర్యాదు.

– ఎమన్ బషీర్, వ్యాఖ్యాత

సొంత ఆలోచన లేక...



సినిమాలు, సంగీతం, ఇంకా వాళ్లు చూపే అలాంటి కళలను తప్పించి... ఈ సెలబ్రిటీలు, వాళ్ల అభిప్రాయాలను నేను పట్టించుకోను. కానీ ఎవరికి ఓటు వెయ్యాలో ఈ సెలబ్రి టీలు చెప్పాల్సిన అవసరం అమెరికన్లకు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

– అర్నేసా బులిజిస్మిక్ కుస్తూరా, పరిశోధకురాలు

ఇన్ బాక్స్

కష్టజీవికి ఇరువైపులా...

ఉమ్మడి కరీంనగర్ జిల్లా దక్షిణ సరిహద్దులో మానేరు, మూల, మోయ తుమ్మెద వాగులు; ఉత్తరం వైపు గోదావరి నది ప్రవాహాల మధ్య ఉన్న నేల మీద నివసిస్తున్న కష్టజీవుల జీవన స్రవంతి కేంద్రకంగా కథకులు సారవంతమైన కథలను పండించినవే 'కరీంనగర్ కథలు.' బ్రిటిష్ ఆంధ్రలో ఆంగ్ల కథ సాహిత్య ప్రభావంతో తెలుగు కథ పురుడు పోసుకున్నది. అనంతరం కళింగాంధ్ర ప్రాంతంలోని గురజాడ, చాసో, రావిశాస్త్రి, కారా, భూషణం లాటి కథకుల చేతులలో సామాన్య జీవన పోరాట, వ్యాపార వ్యవహారాలే మూలకంగా తెలుగు కథ పాదుగొలుపుకున్నది.

పిదప కళింగాంధ్ర కథ తుఫానులా విస్తరించి కరీంనగర్ జిల్లా వరకు తెలుగు కథ తీగ సాగింది.



ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో కరీంనగర్ జిల్లా కథకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. ప్రాకృత భాషలో రాసిన గుణాఢ్యుడి 'బృహద్ కథా సరిత్సాగరం', అనంతరం శాతవాహనుల కాలం నాటి ఒకటవ శతాబ్దానికి చెందిన హాలుడి 'గాథా సప్తశతి' కథలు ఈ నేల మీద మొదటివి. అయినప్పటికీ ఆవునూరు వేణుగోపాలరావు 'కుముదిని' కథ ముద్రణ 1945లో జరిగింది. దీన్ని కరీంనగర్ జిల్లా ఆధునిక ప్రథమ కథగా పరిశోధకులు నిర్ధారించారు.

ప్రథమ తెలంగాణ సాయుధ పోరాట ప్రభావంతో కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన దేశ తొమ్మిదవ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 'గొల్ల రామవ్వ' కథ నుంచి భూక్యా నర్సింగ్ వరకు మొత్తం 63 కథలతో ఈ పుస్తకాన్ని తీసుకురావడం జరిగింది. ఇది సమగ్రం అని మేము చెప్పలేము కానీ మా ఎరుకలో, అవగాహన మేరకు అనేక చర్చల పిదప ఈ కథల ఎన్నిక జరిగిందని మాత్రం సవినయంగా చెప్పగలం. ఈ పుస్తక ముద్రణ, తదితర బాధ్యతలు సిరిసిల్ల కేంద్రంగా పనిచేస్తున్న 'రంగినేని సుజాత మోహన్ రావు ట్రస్ట్' నిర్వహించింది.

– జూకంటి జగన్నాథం । సంపాదకవర్గం తరఫున
(నేడు సిరిసిల్లలో 'కరీంనగర్ కథలు' ఆవిష్కరణ)

పీసీసీ పీఠం... పరీక్షై వచ్చిన ఓ అవకాశం!

సందర్భం



దిలీప్ రెడ్డి

నెలల నిరీక్షణ తర్వాత తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ)కి కొత్త అధ్యక్షుడొచ్చారు. పీసీసీ పీఠమెక్కనున్న మహేశ్‌కుమార్ గౌడ్ పాత నాయకుడే! కాకపోతే, పాత కొత్త నాయకుల నడుమ సమన్వయ సాధన అవసరంతో పాటు పలు సవాళ్లు ఎదురవుతున్న కాలంలో ఆయనకు పీసీసీ పీఠం దక్కింది. స్థానిక సంస్థలకు ఎన్నికలు ముంచుకురానున్నాయి. కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టి ఆధిపత్యం సాధించాలని అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ పొంచి చూస్తున్నాయి. ఈ ఎన్నికలు పార్టీగా కాంగ్రెస్‌కు, పీసీసీ అధినేతగా మహేశ్ గౌడ్‌కు ప్రతిష్ఠాత్మకమే!

తెలుగుదేశం నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిభ, వ్యూహం, శ్రమలను మేళవించి స్వయంగా ఎదిగారు. అతి తక్కువ కాలంలో ఆశించిన లక్ష్యం చేరుకున్న సాహసి! ఆయన ఆశీస్సులుండటం పీసీసీ కొత్త నేత మహేశ్‌కు కలిసివచ్చే అంశం. అదే సమయంలో, ఆయన నేతృత్వంలోని ప్రభుత్వంతో కాంగ్రెస్ పార్టీని సమన్వయపరచి విజయవంతంగా నడపటమన్నది పరీక్షే! ఏ కోణంలో చూసినా, మహాశక్తిమంతుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సయోధ్య నెరపుతూ, పార్టీ సీనియర్లు నొచ్చుకోకుండా శ్రేణుల్ని పీసీసీ నేత నడపాలి. ఉభయుల సహాయ సహకారాలు పొందాలి. అందులోనూ, సమయం, సందర్భం బట్టి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొత్త నాయకులకు, సుదీర్ఘ కాలంగా పార్టీనే నమ్ముకొని సేవలందిస్తున్న పాతతరం నాయకులకు మధ్య సమన్వయం కుదర్చాలి. పంతాలు, తప్పుడు అహా (ఇగో)ల వల్ల వచ్చే నష్టాల్ని ముందే పసిగట్టి, సయోధ్యతో నివారించాలి. కీలక ప్రభుత్వ నిర్ణయాలప్పుడు, మేనిఫెస్టో అమలులో... ఎంత వరకు పార్టీ నాయకత్వానికి ప్రాతినిధ్యం కల్పిస్తారన్నది ప్రశ్నార్థకమే! డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు, కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలు పర్యవేక్షణకు ప్రభుత్వం–పార్టీ ముఖ్యులతో ఒక కమిటీ ఉండేది. అందులో ఏఐసీసీ నాయకుడొకరు సభ్యులుగా ఉండేది. అటువంటి ఏర్పాటు ఇప్పుడేమైనా ఉంటుందా అనే విషయంలో స్పష్టత లేదు.

ఇప్పటివరకైతే... ముఖ్యమంత్రే జోడు పదవుల్లో ఉండటం వల్ల ప్రభుత్వమైనా, పార్టీ అయినా ఆయనే అన్నట్టు సాగింది. సమన్వయంలో ఏ ఇబ్బందీ రాలేదు. ఢిల్లీ అధిష్టానం ఆదేశాలయితేనేం, సీఎం స్వయంగా ఏర్పరచుకున్న వైఖరి అయితేనేం.... కీలక నిర్ణయాల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మల్లు, పీసీసీ మాజీ నేత ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మరో సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు వంటి సీనియర్లతో విధిగా ఆయన సంప్రదిస్తున్నారు. మీడియాలో వచ్చే ప్రకటనల్లో ఫోటోల నుంచి ముఖ్య నిర్ణయాల్లో సమాలోచనల వరకు వారికి తప్పనిసరిగా స్థానం లభిస్తోంది. పార్టీకి, పీసీసీ నేతకు, ఇతర ముఖ్య కార్యవర్గ ప్రతినిధులకు ఇటువంటి చర్చలు, సంప్రదింపుల్లో రేపు ఏ మేరకు స్థానం లభిస్తుంది? అన్నది వేచి చూడాలి! పదేళ్ల విపక్ష స్థానంలో ఉండి పోరాటాలు చేసిన తర్వాత లభించిన అధికారం కావడంతో పదవులు, హోదాలు, సేవా అవకాశాలంటూ పార్టీ ఆశావహులు నిరీక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా వారి పట్ల ఉదారంగా ఉండి, సానుకూలంగానే స్పందిస్తున్నారు. ఇప్పటికే కొంత మందికి నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్లు, రాజకీయ అవకాశాలు లభించినా, ఇంకా ఎదురుచూస్తున్న వివిధ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. వారిలో అత్యధికులకు న్యాయం చేయడం ఎలా? ఈ విషయంలో పార్టీ నాయకత్వం ఏ మేర చొరవ తీసుకుంటుంది? అన్నది కూడా కీలకాంశమే!



టీపీసీసీ కొత్త అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

ఇప్పటిదాకా పార్టీ విధేయత మహేశ్‌కు పనికొచ్చింది. ఇక ముందు, విధేయతకు తోడు సమయస్ఫూర్తి, సామర్థ్యం కూడా అవసరమే! ఓపికతో అందరినీ కలుపుకుపోయే తత్వం కావాలి. నాయకత్వం విషయంలో మహేశ్ గౌడ్‌కు ఇది, తనను తాను నిరూపించుకోవాల్సిన అవకాశం! ఓ పరీక్షా కాలం కూడా! సుదీర్ఘ కాలంగా పార్టీని నమ్ముకొని ఎదిగిన నాయకుడాయన. దాదాపు పదేళ్లు పార్టీ విద్యార్థి విభాగం (ఎన్ఎస్‌యూఐ) అధినేతగా ఉన్నారు. ఆ తర్వాత యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా పని చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌తో సహా పార్టీ పలు పదవుల్లో ఉన్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆర్థికంగా, రాజకీయంగా బలమైన గౌడ సామాజిక వర్గానికి ప్రతినిధి. 1994 (డిచ్‌పల్లి), 2014 (నిజామాబాద్ అర్బన్) నియోజక వర్గాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి, ఓడిపోయారు. 2018, 2023లో అవకాశాలు వచ్చినా, ఏ కారణంచేతో పోటీ చేయలేదు. మిగతా సందర్భాల్లో రాజకీయ కారణాల వల్ల ఆయనకు అవకాశాలు లభించలేదు. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, పీసీసీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్‌తో స్పర్థల వల్ల పలు అవకాశాలు తనకు రాకుండా పోయాయనే భావన ఆయనకుంది. పార్టీలో ఎదగనీయకుండా అడ్డుపడుతున్నారనే కోపంతో, ఓ ఆరు మాసాలు పార్టీని వీడి తెలుగుదేశంలోకి వెళ్లినా, వెంటనే తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారు. 'తానొవ్వక నొప్పించక...' అన్నట్టు, అందరితో సఖ్యతగా ఉండే మంచివాడని పేరున్నా... ప్రభావవంతమైన నాయకుడిగా ముద్ర స్థిరపడలేదు. ఇప్పుడిదొక అవకాశం. సరిగ్గా ఎన్నికలప్పుడు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరి, కనీసం గాంధీ భవన్ మెట్లు ఎక్కకుండానే ఎమ్మెల్యేలు అయిన వారూ ఉన్నారు. ఏ పదవీ రాకపోయినా, ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకొని సేవలు అందిస్తున్న వారూ ఉన్నారు. ఈ రెండు రకాలవారి మధ్య సమన్వయం, సయోధ్య కాంగ్రెస్‌కు ఒక పెద్ద కార్యభారమే!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్
పీపుల్స్ పల్స్ సర్వే సంస్థ

సైన్సే ఊపిరిగా...

స్వతంత్ర భారతాన్ని పట్టి పీడించిన నిరక్షరాస్యతపై ప్రభుత్వం సంధించిన బాణం 'సాక్షరతా' ఉద్యమం. దానిలో నేను సైతం అంటూ పాలుపంచుకున్నది తెలుగునేలపై అప్పుడప్పుడే పురుడుపోసుకున్న వైజ్ఞానిక సంస్థ 'జనవిజ్ఞాన వేదిక' (జేవీవీ). 'భారత జ్ఞాన విజ్ఞాన జాతా' స్ఫూర్తితో 1988 ఫిబ్రవరి 28న ఆవిర్భవించిన ఈ సంస్థ అక్షరాస్యతా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించింది. ఎర్నాకులంలో మొదలైన అక్షర యాత్రను నెల్లూరు, ఖమ్మం జిల్లాల వరకు తీసుకువచ్చి ప్రజల్లో అక్షర చైతన్యం రగిలించింది. 1990 నాటికి 11 శాతం ఉన్న మహిళల అక్షరాస్యత 86 శాతానికి పెరిగింది. తెలంగాణలో ఇది 73 శాతానికి చేరటంలో ఈ ఉద్యమ పాత్ర, జన విజ్ఞాన వేదిక కృషి మాటల్లో చెప్పలేనిది.

సెప్టెంబర్ నెలంతా పోషకాహార మాసంగా ప్రపంచం జరుపుకొంటున్న సందర్భంలో జంక్ ఫుడ్స్ ప్రమాదంపై గొంతెత్తి ప్రచారం చేసిన సైన్సు సంస్థ జేవీవీ. 'లడ్డు కంటే గుడ్డు మిన్న', 'బోర్న్‌విటా, బూస్టు ఏదైనా వేస్టు' అని ప్రజల్లోకి వెళ్లింది. కూల్‌డ్రింక్స్ దుష్ప్రభావాలను విడమర్చి చెప్పి, మానవ హక్కుల కమిషన్ నుండి వీటిని విద్యాలయాలలో నిషేధించే ఉత్తర్వులు తెచ్చిన ఘనత కూడా దానిదే.

అక్షర చైతన్య సమాజంలో, ముఖ్యంగా మహిళాలోకంలో తెచ్చిన చైతన్య ఫలితమే 'సారా వ్యతిరేక ఉద్యమం'. దీన్ని ముందుండి నడపటంలో జేవీవీ పాత్ర ఎనలేనిది. మద్య నిషేధాన్ని రాజకీయ ఎజెండాపైకి తేవటంలో సఫలమైంది. రాజ్యాంగం నిర్దేశించిన సైంటిఫిక్ టెంపర్‌ను జనంలోకి తీసుకుపోవటానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోంది. అయినా శాస్త్రీయ ఆలోచన నేడు వెనక తట్టు పట్టింది. రుజువులతో కూడిన సైన్సు స్థానంలో సూడో సైన్సును ప్రభుత్వం ప్రోత్సహించడం శోచనీయం. పర్యావరణ పరిరక్షణ రాజకీయ యవనిక పైకి రావాల్సిన అవసరం ఎంతో ఉంది. వాతావరణ మార్పు నేపథ్యంలో సైన్సును మరింత ప్రోత్సహించవసిన అవసరం, జన విజ్ఞాన వేదిక వంటి సంస్థలకు దన్నుగా నిలబడవలసిన స్థితి మున్నెన్నటికన్నా నేడెక్కువగా ఉంది. సమాజ పురోగతికి శాస్త్రీయంగా ముందుకు పోవటం, హేతుబద్ధమైన సైన్సు ఉద్యమాలను బలపరచటం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు.

– ప్రొ॥ కట్టా సత్యప్రసాద్, జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షులు (నేడు, రేపు హైద్రాబాద్ కాప్రాలో 'జనవిజ్ఞాన వేదిక'– తెలంగాణ 5వ రాష్ట్ర మహాసభలు)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.ఏకాదశి సా.4.28 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.43 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.9.36 నుండి 11.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.41 నుండి 7.27 వరకు, **అమృతఘడియలు:** ప.11.22 నుండి 12.56 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.03.

45 రోజుల్లో కొత్త టాయిలెట్లు

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- మద్దూరు కళాశాల విద్యార్థినులకు క్షమాపణ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

సాక్షి ఎఫెక్ట్

మద్దూరు (హుస్నాబాద్)/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మద్దూరు జూనియర్ కళాశాలలో 45 రోజుల్లో కొత్త టాయిలెట్లు నిర్మిస్తామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి హామీ ఇచ్చారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్షమాపణ చెబుతున్నానన్నారు. బుధవారం 'సాక్షి' మెయిన్ మొదటి పేజీలో 'చెప్పుకోలేని బాధ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి మురళి స్పందించారు. శుక్రవారం మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాల సౌకర్యాలు అందిస్తామని, చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. 45 రోజుల్లో కళాశాలలో మూత్రశాలల నిర్మాణం పూర్తవుతుందని స్పష్టం చేశారు. టాయిలెట్ల నిర్మాణంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలకు ఒకే రకమైన డిజైన్ ఉండేలా కృషి చేస్తామన్నారు గత ప్రభుత్వంలోనే ఈ కళాశాలకు టాయిలెట్ల నిర్మాణానికి రూ.13.8 లక్షలు కేటాయించినా పనులు చేపట్టలేదన్నారు.

సొంత డబ్బుతో టాయిలెట్లు నిర్మిస్తా..

సిద్దిపేట జిల్లా మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సొంత డబ్బుతో టాయిలెట్లు నిర్మించేందుకు సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ముందుకొచ్చారు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందిస్తూ.. కళాశాలలో టాయిలెట్లు నిర్మిస్తానని తెలిపారు.





పాల్వంచ రాంనగర్‌లో..

ఉండ్రాళ్లయ్య.. 'కోటి' దండాలయ్యా

వరంగల్ శివనగర్‌లో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రాంనగర్‌లో కాపు సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని శుక్రవారం రూ.1.1 కోట్ల విలువైన కరెన్సీ నోట్ల మాలలతో అలంకరించారు. వరంగల్ శివనగర్‌లోని వాసవి కాలనీలో వినాయక ట్రస్టు భవనం అధ్యక్షుడు సాదుల దామోదర్ ఆధ్వర్యంలో మట్టి విఘ్నేశ్వరుడికి రూ.1,61,00,000 కరెన్సీతో శుక్రవారం రాత్రి అలంకరించారు. – పాల్వంచ/ఖిలా వరంగల్

కామ్రేడ్.. రెడ్ సెల్యూట్

- ఏచూరికి జేఎన్‌యూ విద్యార్థుల ఘన నివాళి
- నినాదాలు చేస్తూ భావోద్వేగం
- నేటి ఉదయం సీపీఎం కేంద్ర కార్యాలయానికి పార్థివ దేహం

సాక్షి, న్యూఢిల్లీ: 'జోహార్ కామ్రేడ్ ఏచూరి, వుయ్ సెల్యూట్, ఉద్యమాల రహదారి ఏచూరి, మీ మరణంతో మా గుండెలు ఆగాయి, రెడ్ సెల్యూట్ కామ్రేడ్, కామ్రేడ్ ఏచూరి మమ్మల్ని విడిచి వెళ్లావా, తూర్పున ఎర్రని సూర్యుడా.. మా సీతారాం ఏచూరి..' అంటూ విద్యార్థులు చేసిన నినాదాలతో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) దద్దరిల్లింది. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పార్థివ దేహాన్ని శుక్రవారం సాయంత్రం విద్యార్థుల సందర్శనార్థం జేఎన్‌యూకి తరలించారు. ఏచూరి భౌతిక కాయాన్ని చూసిన విద్యార్థులు తీవ్ర భావోద్వేగంతో నినాదాలు చేస్తూ ఘన నివాళులర్పించారు. అనంతరం 6 గంటల సమయంలో జోరువానలో జేఎన్‌యూ నుంచి వసంత్‌కుంజ్‌లోని ఆయన నివాసానికి భౌతిక కాయాన్ని తరలించారు. ఇక్కడ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తదితర ప్రముఖులు నివాళులర్పించారు. భార్య సీమ చిస్తీ, కుమార్తె అఖిల, కుమారుడు డానిష్‌లను ఓదార్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఏపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి (ఎన్‌ఎస్‌యూఐ) కన్హయ్య కుమార్ తదితరులు ఘన నివాళులర్పించారు.



ఏచూరికి నివాళులర్పిస్తున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి తదితరులు

నేటి మధ్యాహ్నం ఎయిమ్స్‌కు పార్థివ దేహం

శనివారం ఉదయం 8 గంటలకు వసంత్‌కుంజ్‌లోని ఇంటి నుంచి సీపీఎం కేంద్ర కార్యాలయానికి ఏచూరి భౌతిక కాయాన్ని తరలించనున్నారు. 10 గంటల వరకు పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం, అనంతరం ఓ గంట పాటు విదేశాల నుంచి వచ్చిన కమ్యూనిస్టు నేతలు, దేశంలోని ప్రముఖులు నివాళులర్పించేందుకు వీలుగా అక్కడ ఉంచనున్నారు. అనంతరం మధ్యాహ్న సమయంలో ఏచూరి భౌతిక కాయాన్ని ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించనున్నారు. ముందే ప్రకటించిన విధంగా విద్యార్థుల వైద్య పరిశోధనల నిమిత్తం అప్పగించనున్నారు.

గ్రీన్ పవర్ పెంపు ప్రణాళికలను సిద్ధం చేయండి

- రెడ్ కో, టీజీ ఎస్పీడీసీఎల్ అధికారులకు భట్టి విక్రమార్క ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ (పునరుత్పాదక విద్యుత్,)ని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసేందుకు వెంటనే ప్రణాళికలను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంపుదల, వివిధ వర్గాలకు ఆదాయం సమకూర్చడంపై శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం వరకు అధికారులతో ఆయన సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కొన్ని ప్రత్యేక గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని ఆయా గ్రామాల్లో ఉన్న రైతుల వ్యవసాయ పంపుసెట్లకు సంపూర్ణంగా ప్రభుత్వ ఖర్చులతో సోలార్ పవర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా వచ్చే విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. కొన్ని ఎంపిక చేసిన గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద గృహాలకు సంతృప్త స్థాయిలో (సాచ్యురేషన్) ప్రభుత్వ ఖర్చులతో సోలార్ పవర్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లితో పాటు మధిర నియోజకవర్గంలోని సిరిపురం ఈ తరహాలో మరో 20 గ్రామాలను రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు 5 నుంచి 10 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పెట్టుకోవడానికి ప్రోత్సహించాలన్నారు. సోలార్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించాలని భట్టి ఆదేశించారు. ఈ సంఘాలు ఏర్పాటు చేసుకున్న సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే విద్యుత్‌ను ప్రభుత్వమే బైబ్యాక్ పద్ధతిలో కొనుగోలు చేస్తుందని చెప్పారు. సమావేశంలో టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ, తెలంగాణ రెడ్ కో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీల తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి

కాజీపేటలో ఆరేళ్ల బాలికకు గాయలు



ఆత్మకూరు/కాజీపేట: వీధికుక్కల దాడిలో 15 గొర్రె లు మృతిచెందా యి. హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం అక్కంపేట గ్రామంలో గోనె వంశీకి చెందిన గొర్రెలమందపై గురువారం రాత్రి వీధికుక్కలు మూకుమ్మడిగా దాడిచేశాయి. శుక్రవారం ఉదయం కాపరి చూడగా 15 గొర్రె లు మృత్యువాత పడ్డాయి. అలాగే గేదె దూడ ను కూడా గాయపర్చి చంపేశాయి. ఈ ఘటనతో తనకు సుమారు రూ.2 లక్షల నష్టం వాటి ల్లిందని గొర్రెల కాపరి వంశీ రోదిస్తూ తెలిపా డు. మరోవైపు హనుమకొండ జిల్లా కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్‌లో శుక్రవారం ఆరుబయట ఆడుకుంటున్న భాను అనే ఆరేళ్ల బాలికపై వీధి కుక్కలు దాడి చేశాయి. సకాలంలో బాలిక తల్లి స్పందించి కుక్కలను తరిమింది. గాయపడిన బాలికను వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

కాంబోడియా సైబర్ కేసులో కీలక అరెస్టు

- ఉద్యోగాల పేరిట ఎరవేసి.. ఉచ్చులోకి దింపుతున్న కిలేడీ
- సైబర్ నేరాలు చేసేలా బాధితులకు చిత్రహింసలు
- నిందితురాలిని ముంబైలో అరెస్టు చేసిన సీఎస్‌బీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: కాంబోడియాలో అత్యధిక వేతనాలతో కొలువులు ఆశగాచూపి.. అక్కడకు వచ్చిన యువకులను సైబర్ నేర ముఠాలకు అప్పగిస్తున్న ఓ కీలక వ్యక్తిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ముంబైలోని చెంబూర్ ప్రాంతానికి చెందిన నిందితురాలు ప్రియాంక శివకుమార్ సిద్దును అరెస్టు చేసినట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అత్యధిక వేతనాలు వచ్చే ఉద్యోగాలు ఇప్పిస్తామని హైదరాబాద్‌కు చెందిన వంశీకృష్ణ, సాయి ప్రసాద్‌ల నుంచి ముంబైకి చెందిన ప్రియాంక ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల చొప్పున కమీషన్ తీసుకుని కాంబోడియా పంపింది. అక్కడ చైనా సైబర్ ముఠాలు తమతో బలవంతంగా సైబర్ నేరాలు చేయించారని, మానసికంగా, శారీరకంగానూ హింసించినట్టు భారత్‌కు తిరిగి వచ్చిన ఇద్దరు బాధితులు టీజీసీఎస్‌బీకి ఫిర్యాదు చేశారు. దీనిపై టీజీసీఎస్‌బీ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కాంబోడియాకు అమాయకులను తరలించడంలో కీలకంగా వ్యవహరిస్తున్న 30 ఏళ్ల ప్రియాంకను అరెస్టు చేశారు.

సైబర్ ముఠాల నుంచి కమీషన్..

ప్రియాంక తొలుత మాక్స్‌వెల్ అనే ఓవర్‌సీస్ జాబ్ ప్రాసెసింగ్ ఏజెన్సీలో కొన్నాళ్లు ఉద్యోగం చేసింది. తర్వాత ఆ ఏజెన్సీ మూతపడడంతో ఎలాంటి అనుమతులు లేకుండా తానే స్వయంగా ఓ ఏజెన్సీని ప్రారంభించింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు తెరతీసింది. ముంబైలో ఇదే విధంగా ఏజెన్సీ నడుపుతున్న నారాయణ అనే వ్యక్తి ఇచ్చిన సమాచారంతో ప్రియాంక కాంబోడియాకు వెళ్లి అక్కడ చైనా కంపెనీ ఝూన్‌జీ ఎండీ జితేందర్‌సింగ్‌ను కలిసింది. సైబర్ నేరాలు చేసేందుకు మనుషులను తనకు అప్పగిస్తే ఒక్కొక్కరికి 500 యూఎస్ డాలర్లు కమీషన్ ఇచ్చేలా వారితో ఒప్పందం చేసుకుంది. తొలుత ఇద్దరిని కాంబోడియాకు పంపింది. అది విజయవంతం కావడంతో సోషల్ మీడియా, న్యూస్ పేపర్లలో కాంబోడియాలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని పెద్దఎత్తున ప్రకటనలు ఇచ్చింది. అవి నమ్మిన అమాయకులను కాంబోడియా చైనా సైబర్ క్రైం ముఠాల వద్దకు ప్రియాంక పంపినట్టు టీజీసీఎస్‌బీ అధికారులు గుర్తించారు. ఇలా కాంబోడియాకు వెళ్లిన అమాయకులను అక్కడి చైనా సైబర్ క్రైం ముఠాలకు అప్పగిస్తున్నారు. సైబర్ నేరాలు చేసేలా బాధితులను సదరు ముఠాలు మానసికంగా, శారీరకంగా చిత్రహింసలు పెడుతున్నాయి. ఈ ముఠా నుంచి అతికష్టం మీద తప్పించుకుని తిరిగి వచ్చిన ఇద్దరు బాధితుల ఫిర్యాదుతో టీజీసీఎస్‌బీ దర్యాప్తు ముమ్మరం చేసింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట ఇచ్చే ప్రకటనలు నమ్మి మోసపోవద్దని టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ సూచించారు.

పోలీసు ఫిర్యాదుల అథారిటీల ఏర్పాటెప్పుడు?

- 3 వారాల్లో చెప్పాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర, జిల్లా స్థాయి పోలీసు ఫిర్యాదుల అథారిటీలను ఎప్పట్లోగా ఏర్పాటు చేస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ(ఎస్‌పీసీఏ), జిల్లా పోలీస్ ఫిర్యాదుల అథారిటీ (డీపీసీఏ)లను ఏర్పాటు చేయడం లేదంటూ పిల్‌తో పాటు మరో రిట్ పిటిషన్ దాఖలైంది. అథారిటీల ఏర్పాటు కాగితాలకే పరిమితమైందని అందులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం, త్వరగా సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వింత శబ్దాల మిస్టరీ వీడింది

గ్రీన్‌లాండ్‌లో మంచు విరిగిపడ్డ సంకేతాలవి



సరిగ్గా ఏడాది క్రితం ఆర్కిటిక్ నుంచి అంటార్కిటికా దాకా ప్రపంచమంతటా 9 రోజులపాటు తరచుగా వినిపించిన వింత శబ్దాల రహస్యం వీడిపోయింది. ఈ శబ్దాలకు భూప్రకంపనలు కారణం కాదని పరిశోధకులు తేల్చారు. గ్రీన్‌లాండ్‌లోని మారుమూల ప్రాంతం డిక్సన్ ఫోర్డ్‌లో భారీగా మంచు చరియలు విరిగిపడడం వల్ల భూమి స్వల్పంగా కంపించడంతో ఉత్పత్తి అయిన శబ్దాలుగా గుర్తించారు. ఈ అధ్యయనం వివరాలను సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. భూకంపాలను అధ్యయనం చేసే పరిశోధకులు 2023 సెప్టెంబర్‌లో రహస్య శబ్ద సంకేతాలను గుర్తించారు. గతంలో ఇలాంటి సంకేతాలు ఎన్నడూ కనిపెట్టలేదు. ఇవి సాధారణ భూప్రకంపనల్లాంటివి కాకపోవడంతో వారిలో ఆసక్తి పెరిగింది. ఒకే వైబ్రేషన్ ఫ్రీక్వెన్సీతో శబ్దాలు వినిపించాయి. దీనిపై అధ్యయనం కొనసాగించి, గుట్టు విప్పారు. డిక్సన్ ఫోర్డ్‌లో మంచు కొండల నుంచి విరిగిపడిన మంచు, రాళ్లతో 10 వేల ఒలింపిక్ ఈత కొలనులు నింపవచ్చని తెలిపారు. మంచు చరియల వల్ల మెగా సునామీ సంభవించి, సముద్రంలో 200 మీటర్ల ఎత్తుకు అలలు ఎగిసిపడ్డాయని చెప్పారు. లండన్‌లోని బిగ్ బెన్ గడియారం కంటే రెండు రెట్ల ఎత్తుకు అలలు ఎగిశాయని వెల్లడించారు. భారీ అలల ప్రభావం ఏకంగా 9 రోజులపాటు కొనసాగిందని అన్నారు. దీనికారణంగానే వింత శబ్దాలు వినిపించినట్లు స్పష్టంచేశారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయి గ్రీన్‌లాండ్‌లో మంచు కరుగుతోంది. సముద్రంలో దశాబ్దాలపాటు స్థిరంగా నిలిచి ఉన్న భారీ మంచు పర్వతాలు సైతం చిక్కిపోతున్నాయి. అవి బలహీనపడి, మంచు ముక్కలు జారిపడుతున్నాయి. వాతావరణ మార్పులు, భూతాపం వల్ల హిమానీనదాలు గత కొన్ని దశాబ్దాల్లో పదుల మీటర్ల పరిమాణంలో చిక్కిపోయాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ధ్రువ ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడడం, సునామీలు ఇక సాధారణ అంశంగా మారిపోతాయని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. భూగోళం వేడెక్కడం ఇంకా కొనసాగితే అవాంఛనీయ పరిణామాలు సంభవించడం తథ్యమని పేర్కొన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేజ్రీవాల్ విడుదల

సీబీఐ కేసులో సుప్రీం బెయిల్



నా పోరు ఆగదు

జైలు నా స్థైర్యాన్ని పెంచింది: కేజ్రీవాల్

''జైల్లో పెట్టి నన్ను కుంగదీయాలని, నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీయాలని చూశారు. కానీ జైలు గోడలు, ఊచలు నన్నేమీ చేయలేకపోగా నా మనోబలాన్ని వెయ్యి రెట్లు పెంచాయి. నా జీవితంలో ప్రతి క్షణం, ఒంట్లోని ప్రతి రక్తపు చుక్కా దేశసేవకే అంకితం. జాతి వ్యతిరేక శక్తులపై నా పోరు ఆగబోదు'' అని కేజ్రీవాల్ అన్నారు. శుక్రవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన అనంతరం ఆయన తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గుమిగూడిన ఆప్ కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం భారీ వర్షంలోనే చండీగ్రాం అఖాడా నుంచి తన అధికారిక నివాసం దాకా కేజ్రీవాల్ రోడ్‌షో నిర్వహించారు. 'జైలు తాళాలు విరిగి పడ్డాయి. కేజ్రీవాల్ విడుదలయ్యారు' అంటూ నినాదాలతో హోరెత్తించారు. వారికి ఆయన అభివాదం చేశారు. వర్షంలో తడుస్తూనే వాహనం పై నుంచి వారినుద్దేశించి మాట్లాడారు. ''జాతి వ్యతిరేక శక్తులతో తలపడ్డందుకే నన్ను జైల్లో పెట్టారు తప్ప తప్పు చేశానని కాదు. దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. దేశాన్ని బలహీనపరిచేందుకు, విడదీసేందుకు జాతి వ్యతిరేక శక్తులు కుట్రలు చేస్తున్నాయి. ఈసీని బలహీనపరిచేందుకు, ఈడీ, సీబీఐలను పూర్తిగా చెప్పుచేతల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వీటిని పూర్తిస్థాయిలో ఎదుర్కొందాం. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా. అయినా ప్రతి దశలోనూ దైవం నాకు దన్నుగా నిలిచింది. నేను సత్యమార్గంలో నడవడమే అందుకు కారణం'' అన్నారు. అంతకుముందు కేజ్రీవాల్‌కు బెయిల్ లభించగానే ఆప్ ప్రధాన కార్యాలయం వద్ద, ఆయన నివాసం వద్ద పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. కేజ్రీ భార్య సునీత తదితరులు వాటిలో పాల్గొన్నారు.

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. విచారణ పేరిట నిందితులను సుదీర్ఘ కాలం పాటు జైల్లో ఉంచడం వారి వ్యక్తిగత స్వేచ్ఛను కాలరాయడమేనని ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కేసుపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయొద్దని కేజ్రీవాల్‌కు షరతు విధించింది. సీబీఐ తీరును ఈ సందర్భంగా తప్పుబట్టింది. ఈ ఉదంతానికి సంబంధించి ఈడీ కేసులో బెయిల్ లభించగానే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని ప్రశ్నించింది. పంజరంలో చిలుకలా ప్రవర్తించొద్దంటూ చీవాట్లు పెట్టింది. కోర్టు తీర్పుతో ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు సంబరాలు చేసుకున్నాయి. దాదాపు ఆరు నెలల కారాగార వాసం అనంతరం కేజ్రీవాల్ తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. మద్యం విధానం కుంభకోణం కేసులో గత మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచార నిమిత్తం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో మే 10న విడుదలైన ఆయన జూన్ 2 తిరిగి జైలుకు వెళ్లారు. అనంతరం ఈడీ కేసులో బెయిల్ మంజూరైనా సీబీఐ తిరిగి అరెస్టు చేయడాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేశారు. బెయిల్ కోసం ముందుగా ట్రయల్ కోర్టుకు వెళ్లాలన్న సీబీఐ వాదనను తోసిపుచ్చింది. అన్ని కేసులకూ ఒకే నియమాన్ని వర్తింపజేయలేమని స్పష్టం చేసింది.

కేజ్రీవాల్‌కు షరతులివే...

మద్యం కుంభకోణం ఉదంతంలో సీబీఐ కేసుపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలూ చేయరాదు.	సీఎం కార్యాలయానికి, సచివాలయానికి వెళ్లడానికి వీల్లేదు (ఈ షరతులను తాజా తీర్పులో ధర్మాసనం సడలించింది. కానీ మే 10, జూలై 12 నాటి తీర్పుల్లో సుప్రీంధర్మాసనం ఈ రెండు షరతులనూ విధించింది. వాటిని విస్తృత ధర్మాసనం మాత్రమే రద్దు చేయగలదని ఆ సందర్భంగా పేర్కొంది. దాంతో అవి అమల్లోనే ఉండనున్నాయి)
లెఫ్టినెంట్ గవర్నర్ సంతకం అవసరమైన ఫైళ్లు మినహా మిగతా వాటిపై సంతకాలు చేయరాదు.	ట్రయల్ కోర్టు విచారణ అన్నింటికీ హాజరు కావాలి. / విచారణ త్వరగా పూర్తయేందుకు సహకరించాలి.

పంజరంలో చిలుక కావొద్దు

- సీబీఐకి జస్టిస్ భూయాన్ హితవు
- ఈడీ కేసులో బెయిల్ షరతులను తప్పుబట్టిన న్యాయమూర్తి
- విడిగా 33 పేజీల తీర్పు

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరుపై న్యాయమూర్తులిద్దరూ ఏకాభిప్రాయం వెలిబుచ్చినా పలు ఇతర అంశాలపై జస్టిస్ భూయాన్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయడంలో తనకెలాంటి అసంబద్ధతా కన్పించడం లేదని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొనగా జస్టిస్ భూయాన్ మాత్రం ఆ అభిప్రాయంతో తీవ్రంగా విభేదిస్తూ విడిగా 33 పేజీల తీర్పు రాశారు. కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసిన సమయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇంకా ఏమన్నారంటే...

- ఈ కేసులో 22 నెలలుగా ఊరికే ఉన్న సీబీఐకి, ఈడీ కేసులో బెయిల్ వచ్చిన వెంటనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?
- బెయిల్‌ను అడ్డుకోవడమే దీని వెనక ఉద్దేశంగా కన్పిస్తోంది.
- ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు గనుక నిర్బంధంలో ఉంచాల్సిందేనన్న వాదన సరికాదు.
- సహాయనిరాకరణ చేసినంత మాత్రాన నిర్బంధం కూడదు. నిందితునికి మౌనంగా ఉండే హక్కుంటుంది.
- బలవంతంగా నేరాంగీకారం రాబట్టే ప్రయత్నాలు కచ్చితంగా చట్టవిరుద్ధమే.
- ఇవే అభియోగాలపై ఈడీ కేసులో బెయిల్ మంజూరయ్యాక కూడా జైల్లోనే ఉంచజూడటం అక్రమం.
- సీజర్ భార్య నిందలకు అతీతంగా ఉండాలన్న సామెత సీబీఐకి పూర్తిగా వర్తిస్తుంది. అత్యున్నత దర్యాప్తు సంస్థగా నిజాయితీగా వ్యవహరించడమే కాదు, అలా కన్పించడం కూడా చాలా ముఖ్యం. ఏకపక్ష పోకడలు పోతోందన్న అభిప్రాయం కలగకుండా జాగ్రత్త పడాలి.
- సీబీఐని పంజరంలో చిలుకగా ఇదే న్యాయస్థానం ఇటీవలే ఆక్షేపించింది. అది తప్పని, తాను స్వేచ్ఛాయుత చిలుకనని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత దర్యాప్తు సంస్థదే
- సీఎం కార్యాలయంలోకి వెళ్లొద్దని, ఫైళ్లపై సంతకాలు చేయొద్దని ఈడీ కేసులో బెయిల్ సందర్భంగా కేజ్రీవాల్‌కు కోర్టు విధించిన షరతులపై నాకు తీవ్ర అభ్యంతరాలున్నాయి. కాకపోతే న్యాయపరమైన క్రమశిక్షణను గౌరవిస్తూ వాటిపై నేను ఎలాంటి వ్యాఖ్యలూ చేయదలచుకోలేదు!

మళ్లీ చర్చా.. ఆ చాన్సే లేదు: ట్రంప్



వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌తో మరో డిబేట్‌లో పాల్గొనబోనని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. మంగళవారం జరిగిన బిగ్ డిబేట్‌లో డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్‌పై తాను గెలిచానని, ఆమె ఓడిపోయినందునే మరో చర్చ అంటున్నారని తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో గురువారం ప్రకటించారు. జూన్‌లో అధ్యక్షుడు జో బైడెన్‌తో జరిగిన మొదటి డిబేట్, ఆ తర్వాత హ్యారిస్‌తో మంగళవారం జరిగిన డిబేట్‌ను ప్రస్తావిస్తూ ఇక మూడోది ఉండబోదని స్పష్టం చేశారు. గెలుపు తనదేనని, సర్వేలు కూడా అదే చెబుతున్నాయని ట్రంప్ చెప్పారు. కాగా, ప్రధాన మీడియా సంస్థల సర్వేల ఫలితాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. బిగ్ డిబేట్‌ను చూసిన వారిలో 63 శాతం మంది కమలా హారిస్ గెలుస్తారని విశ్వాసం వ్యక్తం చేయగా, 37 శాతం మంది మాత్రమే ట్రంప్ వైపు మొగ్గు చూపారని సీఎన్ఎన్ సర్వే వెల్లడించిన సంగతి తెలిసిందే.

కమల గెలిస్తే శ్వేతసౌధంలో కర్రీ వాసనలే

ట్రంప్ సన్నిహితురాలు లారా వివాదాస్పద వ్యాఖ్య



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ పడుతున్న భారత సంతతి మహిళ కమలా హారిస్ పట్ల జాతి వివక్ష వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ సన్నిహితురాలు లారా లూమర్ తాజాగా కమల హారిస్‌పై నోరుపారేసుకున్నారు. కమల అమెరికా అధ్యక్షురాలైతే శ్వేతసౌధం కర్రీ (కూర) వాసనలతో నిండిపోతుందని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కమల తల్లి శ్యామల గోపాలన్ భారతీయురాలన్న సంగతి తెలిసిందే. కమల భారతీయ మూలాలను, అలవాట్లు, సంస్కృతిని లారా లూమర్ పరోక్షంగా ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఇటీవల 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో కమలా హారిస్ గెలిస్తే వైట్‌హౌస్‌లో కూర వాసనలే ఉంటాయి. వైట్‌హౌస్‌లో ప్రసంగాలు కాల్ సెంటర్ ద్వారా వినిపిస్తాయి. అమెరికా ప్రజలు ప్రభుత్వానికి తమ సలహాలు, సూచనలు కేవలం కస్టమర్ శాటిస్ఫాక్షన్ సర్వే ద్వారా పంపించాల్సి ఉంటుంది'' అని లూమర్ పేర్కొన్నారు. నేషనల్ గ్రాండ్‌పేరెంట్స్ డే సందర్భంగా కమలా హారిస్ సోషల్ మీడియా పోస్టు చేసిన చేసిన ఫోటోపై ఆమె పై విధంగా స్పందించారు. కమలా హారిస్‌పై లూమర్ చేసిన వ్యాఖ్యల పట్ల వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కెరీన్ జీన్–పియర్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎంపాక్స్ తొలి టీకాకు అనుమతి



జెనీవా: పెద్దల్లో మంకీపాక్స్ వ్యాప్తిని అడ్డుకునే మొట్టమొదటి టీకాకు అనుమతిచ్చినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) శుక్రవారం ప్రకటించింది. డెన్మార్క్‌కు చెందిన ప్రముఖ బవేరియన్ నార్డిక్ అనే టీకా కంపెనీ దీనిని రూపొందించిందని చెప్పింది. ప్రస్తుతం ఎంపాక్స్ వ్యాప్తి ఉధృతంగా ఉన్న ఆఫ్రికాతోపాటు, భవిష్యత్తులో వినియోగానికి ఇది ఎంతో సహాయకారిగా ఉంటుందని పేర్కొంది. ఈ టీకాను యునిసెఫ్, గవి ది వ్యాక్సిన్ అలయెన్స్ వంటి దాతలు కొనుగోలు చేయవచ్చని స్పష్టం చేసింది. అయితే, ఉత్పత్తిదారు కేవలం ఒకే సంస్థ కావడంతో టీకా పరిమితంగా మాత్రమే అందుబాటులో ఉంటుందని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయెసుస్ తెలిపారు.ఆఫ్రికాలో నమోదవుతున్న కేసుల్లో 70 శాతం వరకు కాంగోలోనివేనని అధికారులు తెలిపారు.

చైనాలో రిటైర్మెంట్ వయసు పెంపు !

63 ఏళ్లుగా మారుస్తూ నిర్ణయం ● జనవరి నుంచి అమల్లోకి !



బీజింగ్: తగ్గిపోతున్న జనాభా, పెరిగిపోతున్న వృద్ధులతో పలు సమస్యలు ఎదుర్కొంటున్న చైనా వచ్చే సంవత్సరం నుంచి అక్కడి కార్మికుల రిటైర్మెంట్ వయసును 63 ఏళ్లకు పెంచనుంది. ప్రస్తుతం అక్కడి మగవాళ్లు 60 సంవత్సరాలకు రిటైర్ అవుతుండగా దానిని మరో మూడేళ్లు పెంచారు. ఇక కార్మికులుగా పనిచేసే మహిళల రిటైర్మెంట్ వయసు ఇన్నాళ్లూ 50 ఏళ్లుకాగా దానిని 55 ఏళ్లు పెంచారు. వృత్తి నిపుణుల వంటి వైట్‌కాలర్ ఉద్యోగాలు చేసే మహిళల రిటైర్మెంట్ వయసును 55 నుంచి 58 సంవత్సరాలకు పొడిగించారు. రిటైర్మెంట్ వయసును మారుస్తూ తీసుకున్న నిర్ణయం 15 ఏళ్లకుపైగా అమల్లో ఉండనుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుందని చైనా అధికార టీవీఛానల్ సీసీటీవీ ఒక కథనం ప్రసారం చేసింది.

● ఇంకొన్ని రోజులు పని చేయండి ప్రత్యేక కథనం ఈ- పేపరులో...

జగదీశ్ టైట్లర్‌పై హత్యాభియోగం



న్యూఢిల్లీ: 1984నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్‌పై ఢిల్లీ కోర్టు హత్య తదితర అభియోగాలు మోపింది. ఢిల్లీలోని పాల్ బంగాశ్ ప్రాంతంలో ముగ్గురువ్యక్తుల హత్యకు సంబంధించిన కేసుపై స్పెషల్ కోర్టు ఆగస్టు 30న విచారణ జరిపింది. ఆయనపై అభియోగాలు మోపేందుకు తగు ఆధారాలున్నట్లు స్పష్టం చేసింది. శుక్రవారం టైట్లర్‌పై హత్యతోపాటు దొంగతనం, చట్ట విరుద్ధంగా గుమికూడటం, కొట్లాట, వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచడం వంటి అభియోగాలు మోపుతూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో సీబీఐ గతేడాది మే 20వ తేదీన టైట్లర్‌పై చార్జిషీటు నమోదు చేసింది. 1984 నవంబర్ ఒకటో తేదీన ఢిల్లీలోని పాల్ బంగాశ్ గురుద్వారా వద్దకు తెల్ల అంబాసిడర్‌లో వచ్చిన టైట్లర్..సిక్కులను చంపండి..వాళ్లు మా అమ్మ(అప్పటి ప్రధాని ఇందిర)ను చంపారు'అంటూ అనుచరులను రెచ్చగొట్టారని చార్జిషీటులో పేర్కొంది. దీంతో, టైట్లర్ అనుచరుల దాడిలో ముగ్గురు సిక్కులు ప్రాణాలు కోల్పోయారంది. 1984లో అప్పటి ప్రధాని ఇందిర హత్యానంతరం ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లో సిక్కులపై దాడులు జరగడం తెలిసిందే.

కేంద్రానికి చెంపపెట్టు

అమిత్ షా రాజీనామాకు ఆప్ డిమాండ్

కేజ్రీవాలే సీఎంగా తప్పుకోవాలి: బీజేపీ

న్యూఢిల్లీ: కేజ్రీవాల్ విడుదలను సీబీఐకి, అమిత్ షాకు, కేంద్రానికి చెంపపెట్టుగా ఆప్ అభివర్ణించింది. ''సీబీఐ పంజరంలో చిలుకేనని సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు మరోసారి రుజువు చేశాయి. అవి నేరుగా కేంద్రంపై చేసిన వ్యాఖ్యలు. కనుక కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలి'' అని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ డిమాండ్ చేశారు. మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థలు ఇప్పటిదాకా ఏ సాక్ష్యాన్నీ సంపాదించలేకపోయాయని ఢిల్లీ మంత్రి ఆతిషి ఎద్దేవా చేశారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తారని ఆ రాష్ట్ర పార్టీ చీఫ్ సుశీల్ గుప్తా అన్నారు. కేజ్రీవాల్ విడుదలను ప్రజాస్వామ్య విజయంగా సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అభివర్ణించారు. ఆప్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. ''కేజ్రీవాల్‌కు షరతులతో కూడిన బెయిల్ మాత్రమే వచ్చిందని మర్చిపోవద్దు. మద్యం కేసులో ప్రధాన నిందితుడైన ఆయన తక్షణం రాజీనామా చేయాలి'' అని డిమాండ్ చేసింది. లేదంటే ఢిల్లీ ప్రజలే ఆయన రాజీనామాకు పట్టుబట్టే రోజు ఎంతో దూరం లేదంది.

పోర్ట్‌బ్లెయిర్ ఇక శ్రీ విజయపురం

న్యూఢిల్లీ: వలసపాలన నాటి ఆనవాళ్లను చెరిపేసేందుకు ప్రాంతాలకు కొత్త పేర్లు పెడుతున్న కేంద్రం ప్రభుత్వం తాజాగా పోర్ట్‌బ్లెయిర్‌కు పేరు మార్చింది. అండమాన్ నికోబార్ దీవుల రాజధాని నగరం 'పోర్ట్‌బ్లెయిర్'ను ఇకపై 'శ్రీ విజయపురం' అని పిలవాలని శుక్రవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం, దేశ చరిత్రలో అసాధారణ స్థానం సంపాదించుకున్న ఈ ప్రాంతానికి వలసపాలన నాటి ఆనవాళ్లు ఉండకూడదని అమిత్ షా వ్యాఖ్యానించారు. కేంద్రపాలిత ప్రాంతంగా ఇది ప్రస్తుతం కేంద్ర హోం శాఖ పరిధిలో ఉంది. 836 దీవులు, అంతకన్నా చిన్న భూభాగాలతో అండమాన్ నికోబార్ ప్రాంతం ప్రకృతి సోయగాలతో ఎంతో రమణీయంగా ఉంటుంది. 550 దీవులు అండమాన్ వైపు, 22 ప్రధాన దీవులు నికోబార్ వైపు ఉంటాయి. వీటిని 150 కి.మీ.ల వెడల్పయిన '10 డిగ్రీల ఛానల్' జలభాగం విడదీస్తుంది. మధ్య ప్రాచీన శిలాయుగం నుంచి ఇక్కడ ప్రజలు నివసిస్తున్నారు. స్థానిక తెగల ఆవాస విశేషాలు 1850ల్లో తొలిసారిగా బయటి ప్రపంచానికి తెలిశాయి.

అంతర్జాతీయ మధ్యవర్తిత్వంలో సారథ్యానికి సమయమిదే

సీజేఐ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్కృతిని పెంపొందించడంలో భారతదేశం ముందుండాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. 'చట్టాల పట్ల గౌరవం నిజాయతీని, స్థిరతను ప్రోత్సహిస్తుంది, ఆర్థిక వృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. హక్కులకు రక్షణ చేకూరి, ఒప్పందాలు అమలయి, వివాదాలు సమర్థవంతంగా పరిష్కారమయ్యే ఇటువంటి వ్యవస్థలో పెట్టుబడి దారులు ముందుకొచ్చి వృద్ధికి అనుకూలమైన వాతా వరణం నెలకొంటుంది'అని ఆయన తెలిపారు. అంతర్జాతీయ మధ్యవర్తిత్వం, చట్టపాలనపై శుక్రవారం జరిగిన సదస్సులో జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడారు. చట్టబద్ధ పాలనతో విదేశీ పెట్టుబడులు, వాణిజ్యం పెరగడంతోపాటు అంతర్జాతీయంగా పోటీపడే వాతా వరణం దేశంలో నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్ ఖన్నా, అటార్నీ జనరల్ వెంకటరమణి, సుప్రీం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్ తదితరులు మాట్లాడారు.

హెజ్‌బొల్లా క్షిపణి కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి

18 మంది మృతి

మస్యాఫ్: సిరియాలోని హెజ్‌బొల్లా క్షిపణి తయారీ కేంద్రంపై ఇజ్రాయెల్ ప్రత్యేక దళాలు దాడి చేశాయి. లెబనాన్ సరిహద్దుకు 25 మైళ్ల దూరంలో ఉన్న మస్యాఫ్ నగర సమీపంలో సోమవారం చేపట్టిన ఈ దాడిలో 18 మంది మృతి చెందారు. దాడి చిత్రాలను అమెరికా మీడియా బయట పెట్టడంతో వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. భూగర్భంలోని ఈ కేంద్రాన్ని ధ్వంసం చేయడానికి ఇజ్రాయెల్ సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టింది. వైమానిక దళానికి చెందిన ఎలైట్ షాల్డాగ్ యూనిట్ బలగాలు హెలికాప్టర్ల నుంచి దిగి, ఇరాన్ నిర్మించిన కేంద్రంలో పేలుడు పదార్థాలను అమర్చాయి. ఘటనలో 18 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. హెజ్‌బొల్లాకు క్షిపణుల సరఫరాను దెబ్బతీయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ దాడికి పూనుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ అపరేషన్‌పై ముందుగానే అమెరికాకు ఇజ్రాయెల్ సమాచారం ఇచ్చిందని సమాచారం. ఇజ్రాయెల్ ప్రభుత్వం దీనిపై స్పందించలేదు.

అంతరిక్షం నుంచి ఐక్యతా గీతం


సారా గిలిస్

అంతరిక్షంలో తొలి ప్రైవేట్ స్పేస్ వాక్ చేసిన వ్యోమగాముల్లో ఒకరిగా చరిత్ర సృష్టించిన స్పేస్ ఎక్స్ ఇంజనీర్ సారా గిలిస్ మరో ఘనతను సొంతం చేసుకున్నారు. సూపర్‌హిట్ హాలీవుడ్ సినిమా 'స్టార్‌వార్స్: ద ఫోర్సెస్ అవేకెన్స్'లోని ప్రఖ్యాత 'రేస్ థీమ్'ను అంతరిక్షం నుంచే పర్‌ఫామ్ చేసి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. పొలారిస్ డాన్ ప్రైవేట్ ప్రాజెక్టులో భాగంగా ఐఎస్ఎస్‌కు ప్రయాణించిన స్పేస్ ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌక నుంచే ఆమె ఈ మ్యూజికల్ ట్రిబ్యూట్‌లో పాల్గొన్నారు. సోలో వయొలిన్‌ను సారా వాయించగా పూర్తిస్థాయి ఆర్కెస్ట్రా బృందం భూమి నుంచి ఆమెకు వాద్య సహకారం అందించింది. ఇందుకు సంబంధించిన వీడియోను 'హార్మనీ ఆఫ్ రెసీలియన్స్' పేరిట పొలారిస్ ప్రోగ్రాం బృందం శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ''విశ్వభాష అయిన సంగీతమే ఈ వీడియోకు స్ఫూర్తి. అలాగే బాలల్లో క్యాన్సర్ తదితర మహమ్మారులపై పోరాటం కూడా. చుక్కలనంటే ఉన్నత ఆశయాలను నిర్దేశించుకునేలా తర్వాతి తరాన్ని ప్రేరేపించడమే దీని ఉద్దేశం'' అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది. 'అందమైన మన పుడమి చుట్టూ చక్కర్లు కొడుతున్న ఈ ఆనంద క్షణాలను సంగీతమయంగా మార్చి మీ అందరితో పంచుకునేందుకు చేసిన ఓ చిన్న ప్రయత్నమిది' అంటూ సారా గొంతుతో వీడియో ముగుస్తుంది. ''మానవాళి ఐక్యతకు, మెరుగైన ప్రపంచపు ఆకాంక్షలకు ఈ ప్రయత్నం ఓ ప్రతీక. బాలల్లో నిబిడీకృతమై ఉండే అనంతమైన ప్రతిభా పాటవాలకు ఇది అంకితం'' అని సారా పేర్కొన్నారు. పొలారిస్ డాన్ మిషన్ కమాండర్ జరేద్ ఐజాక్‌మ్యాన్‌తో పాటు సారా గురువారం స్పేస్ వాక్ చేయడం తెలిసిందే. ఈ ఘనత సాధించిన తొలి నాన్ ప్రొఫెషనల్ వ్యోమగాములుగా వారు నిలిచారు. ఈ వీడియో తయారీలో సెయింట్ జూడ్ చిల్డ్రన్స్ రీసెర్చ్ హాస్పిటల్ కూడా పాలుపంచుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



మరిన్ని అణ్వాయుధాలపై దృష్టి: కిమ్

సియోల్: ఉత్తరకొరియా మొట్టమొదటి సారిగా రహస్య యురేనియం శుద్ధి కేంద్రాన్ని బయటి ప్రపంచానికి చూపింది. ఆదేశాధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ ఇటీవల అణ్వాయుధాల తయారీలో వినియోగించే యురేనియం శుద్ధి కేంద్రాన్ని సందర్శించినట్లు అధికార కేసీఎన్ఏ తెలిపింది. 'నిపుణుల కృషిని కిమ్ కొనియాడారు. పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా, మిత్ర దేశాల నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు మరిన్ని అణ్వాయుధాల అవసరం ఉంది. వీటి తయారీకి ప్రయత్నాలు సాగించాలంటూ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు'అని వెల్లడించింది. యురేనియం శుద్ధి కేంద్రంలోని పొడవైన బూడిదరంగు పైపుల వరుసల మధ్య కిమ్ తిరుగుతున్న ఫొటోలను కేసీఎన్ఏ బయటపెట్టింది. ఈ కేంద్రం ఎక్కడుంది? కిమ్ ఎప్పుడు పర్యటించారు? అనే వివరాలను మాత్రం పేర్కొనలేదు. అయితే, యోంగ్‌బియోన్‌లోని ప్రధాన అణుశుద్ధి కేంద్రమా కాదా అనే విషయాన్ని నిపుణులు పరిశీలిస్తున్నారు. ఫొటోల్లోని వివరాలను బట్టి ఉత్తరకొరియా సిద్ధం చేసిన అణు బాంబులు, శుద్ధి చేసిన ఇంధనం పరిమాణం వంటి అంశాలపై ఒక అంచనాకు రావచ్చని చెబుతున్నారు. ఉత్తరకొరియా మొదటిసారిగా 2010లో యోంగ్‌బియోన్ యురేనియం శుద్ధి కేంద్రాన్ని గురించిన వివరాలను వెల్లడించింది.

'సంజయ్ రాయ్‌పై నార్కో టెస్ట్ వద్దు'

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలో ఆర్‌జీ కర్ వైద్యకళాశాల జూనియర్ వైద్యురాలి హత్యోదంతంలో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు నార్కో అనాలసిస్ పరీక్ష చేసేందుకు కోల్‌కతా కోర్టును సీబీఐ అనుమతి కోరగా న్యాయస్థానం అందుకు నిరాకరించింది. ఈ విషయాన్ని సీబీఐ ఉన్నతాధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు.

ఆ కుటుంబాలకు ఆర్థికసాయం

జూనియర్ వైద్యుల సమ్మె కారణంగా ఆస్పత్రుల్లో వైద్యం అందక మరణించిన వారి కుటుంబాలకు ఆర్థికసాయం చేసేందుకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ముందుకొచ్చింది. 29 మంది మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షలు ఇస్తామని సీఎం మమతా బెనర్జీ శుక్రవారం ప్రకటించారు.

రాష్ట్రపతి, ప్రధానికి జూడాల లేఖ

ఈ ఉదంతంలో స్వయంగా కలగజేసుకోవాలంటూ రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీకి జూనియర్ డాక్టర్లు గురువారం రాత్రి లేఖలు రాశారు. ఈ లేఖల ప్రతులను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాలకూ పంపించారు. '' అత్యంత జుగుప్సాకరమైన నేరానికి మా తోటి సహాధ్యాయి బలైంది. న్యాయం జరిగేలా మీరు జోక్యం చేసుకోండి. అప్పుడే ఎలాంటి భయాలు లేకుండా మళ్లీ మా విధుల్లో చేరతాం'' అని ఆ లేఖలో జూనియర్ వైద్యులు పేర్కొన్నారు.

ఆ మహిళల కోసం అలర్ట్ వ్యవస్థ: సుప్రీం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆచూకీ లేకుండా పోయిన మహిళల కోసం కేంద్రీకృత విధానంలో పని చేసే అలర్ట్ వ్యవస్థను తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. మైనర్ బాలికల అపహరణ ఉదంతంలో గతంలోనే సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలను సూచించడం తెలిసిందే. వాటిలో పలు లోపాలున్నాయని పిటిషనర్ తరఫున న్యాయవాది నిత్యా రామకృష్ణన్ కోర్టుకు నివేదించారు. ''బాలిక/మహిళ కనిపించకుండా పోవడంపై ఫిర్యాదులో ఆలస్యం వల్ల న్యాయం దక్కడమూ ఆలస్యమవుతోంది. ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్ అనే కుగ్రామంలో జరిగిన ఉదంతమే ఇందుకు నిదర్శనం. నర్సుగా చేస్తున్న ఓ 11 ఏళ్ల పాప తల్లి ఆస్పత్రికి వెళ్లి తిరిగి రాలేదు. పాప ఉదయం పక్కింటివాళ్లకు చెప్పింది. వాళ్లు పొరుగింటి వాళ్లకు చెప్పారు. కానీ ఒక్కరూ ఫిర్యాదు చేయలేదు. ఎనిమిది రోజుల తర్వాత ఇంటి సమీపంలోనే మృతదేహం దొరికింది. విషయం అందరికీ తెల్సి ఆందోళనలు మొదలయ్యాక గానీ ఎఫ్ఐఆర్ దాఖలు కాలేదు. దేశవ్యాప్తంగా నెలకొన్న దుస్థితి కూడా ఇదే'' అని ఆమె ఆవేదన వెలిబుచ్చారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం స్పందించింది. ఈ అంశంలో నోటీసులు ఇచ్చేందుకు అంగీకరించింది.



కుటుంబ విలువలను కాపాడాలి

ప్రస్తుత సమాజంలో కుటుంబ విలువలను కాపాడుతూ.. ఉమ్మడి కుటుంబ విలువల గురించి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. -8లో



లోకల్ హిట్టర్స్..

నగరంలోని అకాడమీల్లో గంటకు కొంత డబ్బులు చెల్లించి క్రికెట్ ఆడుతూ.. లోకల్ మ్యాచ్‌ల నుంచి జాతీయ స్థాయికి చేరుతున్నారు కొందరు క్రీడాకారులు. -సిటీ ప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/23.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఇండోర్ తరహాలో హైదరాబాద్ ఉండాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

అద్భుతమైన క్లీన్ సిటీగా తీర్చిదిద్దాలి

- పనులు చేయని కాంట్రాక్టర్లపై.. తప్పుడు నివేదికలిచ్చే అధికారులపై చర్యలు తప్పవు
- చెత్త సేకరణ సవ్యంగా జరగాలి
- లొసుగులను సవరించుకోవాలి
- ఆదాయం పెంచుకోవాలి
- జీహెచ్‌ఎంసీ పనులపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: క్లీన్‌సిటీగా పేరుపొందిన ఇండోర్ తరహాలో గ్రేటర్ హైదరాబాద్‌ను అద్భుతమైన క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ విభాగం అధికారులు ఇండోర్‌కు వెళ్లి అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. అక్కడ అనుసరిస్తున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ఏయే ఏజెన్సీలు, స్వచ్ఛంద సంస్థలు అక్కడ పనుల్లో పాలుపంచుకున్నాయో తెలుసుకొని చర్చలు జరపాలని, వీలైతే వారిని హైదరాబాద్‌లో భాగస్వాములను చేయాలని సూచించారు. క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఇండోర్ కార్పొరేషన్ ఆదాయ వనరులెలా సమీకరిస్తుందనే వివరాలు కూడా తెలుసుకోవాలని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధితో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, క్లీనింగ్, ఇతర పనుల్లో పురోగతిపై శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు.

పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు

నగరంలో అయిదేళ్ల క్రితం కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం(సీఆర్‌ఎంపీ) కింద చేపట్టిన 811 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం చేపట్టారని, వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌తో ఆ పనుల కాంట్రాక్టు గడువు ముగిసిపోతుందని, అందుకే రోడ్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీలను ఉపేక్షించవద్దన్నారు. గడువులోగా అన్ని రోడ్ల పనులను పర్యవేక్షించి, వెంటనే బాగు చేయించాలని చెప్పారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు సంబంధించి 15 రోజుల్లోగా తనకు పూర్తి నివేదికను అందించాలని సీఎం ఆదేశించారు. తప్పుడు నివేదికలు ఇస్తే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూసీ బాధితులకు భరోసా ఇవ్వాలి

మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో సేకరించే స్థలాల్లో ఉన్న నివాసితులకు పునరావాసంతో భరోసా కల్పించాలని చెప్పారు. పునరావాస కాలనీలు ఎక్కడెక్కడ ఉన్నాయి, అక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా.. లేదా అని అధికారులు పరిశీలించాలన్నారు.

చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నందున, పరిసర ప్రాంతాల నుంచి స్టేషన్‌కు చేరుకునే అప్రోచ్ రోడ్లను అభివృద్ధి చేయాలని సూచించారు. పరిశ్రమల విభాగం భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. అక్కడి పరిశ్రమలను మరో చోటికి తరలించాలని చెప్పారు. స్టేషన్ ముందు పార్కింగ్, కమర్షియల్ జంక్షన్‌కు వీలుగా అప్రోచ్ రోడ్లు డిజైన్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి..

రోడ్లతో పాటు చెత్త సేకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం సూచించారు. ప్రతి ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరించేలా పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అవసరమైతే జీఐఎస్, క్యూ ఆర్ స్కాన్ లాంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. జీహెచ్‌ఎంసీలో నిరంతరం జరిగే పనులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా నిధుల సమీకరణకు కూడా స్పష్టమైన ప్రణాళికలు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పుడున్న బకాయిల చెల్లింపులకు అవసరమైన నిధులను తాత్కాలికంగా సర్దుబాటు చేసుకోవాలని చెప్పారు. ఆదాయం పెంచుకునే మార్గాలతో పాటు, ఇప్పుడున్న లొసుగులను సవరించుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఆస్తుల నుంచి వచ్చే అద్దెలు, అడ్వర్టయిజ్మెంట్లు, హోర్డింగ్‌ల ద్వారా వచ్చే ఆదాయం వస్తుందా.. లేదా అన్నది కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు.

గణేష్ నిమజ్జన వేడుకలను విజయవంతం చేద్దాం: పొన్నం



సాక్షి, సిటీబ్యూరో: జంట నగరాల్లో ఈ నెల 17న రాజకీయాలకు అతీతంగా గణేష్ నిమజ్జనం నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ ఆనంద్‌లతో కలిసి మంత్రి మాట్లాడారు. గణేష్ నిమజ్జన వేడుకలు శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేపట్టిందన్నారు. శాంతి భద్రతల విషయంలో పటిష్ట చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. ఈ నెల 16న నిర్వహించే మిలాద్ ఉన్ నబీ పండగను 19న జరుపుకొనేలా ముస్లిం మత పెద్దలు అంగీకరించినట్లు మంత్రి చెప్పారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే, అపోహలు సృష్టించే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, పోలీస్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బందోబస్తులో 25 వేల మంది

ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి అనుమతి లేదు

- ఎన్టీఆర్ మార్గ్, పీవీ మార్గ్‌ల్లో ఏర్పాట్లు పూర్తి
- హైదరాబాద్ కొత్వాల్ సీవీ ఆనంద్ వెల్లడి




సాక్షి, సిటీబ్యూరో: గణేష్ ఉత్సవాల్లో అత్యంత కీలకఘట్టమైన సామూహిక నిమజ్జనం మంగళవారం జరగనుంది. ఈ నేపథ్యంలో నగర పోలీసులు, అదనపు బలగాలతో కలిపి దాదాపు 25 వేల మంది బందోబస్తు, భద్రత విధులు నిర్వర్తిస్తారని కొత్వాల్ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు. నిమజ్జనంతో పాటు 19న జరగనున్న మిలాద్ ఉన్ నబీ ఊరేగింపును దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ ఏడాది కూడా ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు నిషేధించామని చెప్పిన ఆయన ఎన్టీఆర్ మార్గ్‌తో పాటు పీవీ నరసింహారావు మార్గ్‌ల్లో అవసరమైన అదనపు ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు జరిగే మార్గాలతో పాటు సున్నిత, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మరోపక్క కమిషనరేట్‌లోని జోన్ల వారీగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆనంద్ శుక్రవారం వెస్ట్ జోన్‌పై సమీక్షించారు. మాసబ్‌ట్యాంక్‌లో డీసీపీ కార్యాలయానికి వెళ్లిన ఆయన శాంతిభద్రతల విభాగంతో పాటు ట్రాఫిక్, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశమయ్యారు. కమ్యూనల్ రౌడీలను కట్టడి చేయాలని, సోషల్ మీడియా ద్వారా వదంతులు, సున్నిత అంశాలు సంబంధించిన వీడియోలు ప్రచారం చేసే వారిపైనా నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీసీపీ ఎస్‌ఎం విజయ్‌కుమార్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యం

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. స్వచ్ఛత కోసం నిర్వహించే ఈ కార్యక్రమం ఈ నెల 17న ప్రారంభమై గాంధీ జయంతి అక్టోబర్ 2న ముగుస్తుందని తెలిపారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతలో భాగంగా స్వచ్ఛత భాగీదారి, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయీ మిత్ర సురక్ష శిబిర్ అనే మూడు కార్యక్రమాలను నిర్దేశించిందన్నారు. వీటిని అందరి భాగస్వామ్యంతో చేపట్టాలని జోనల్, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. అందులో భాగంగా యువజన సంఘాలు, విద్యాసంస్థలు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను భాగస్వాములను చేయాలన్నారు. ప్రజలందరూ పరిశుభ్రతపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సఫాయి మిత్ర సంక్షేమం కోసం ఈ పక్షం రోజులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. కార్పొరేటర్ల సహకారంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పౌరులు, అభివృద్ధి సంస్థలు, పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు ఈ ప్రచారంలో పాల్గొనే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. స్థానికప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పరిశుభ్రతపై ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఆరని చిచ్చు.. ఆగని రచ్చ



కౌశిక్, గాంధీల వైరంపై రెండో రోజూ గందరగోళం

గ్రేటర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల గృహ నిర్బంధం



గాంధీ ఇంటి ఎదుట ఆయన అనుచరులు..

సాక్షి, సిటీబ్యూరో: పార్టీ ఫిరాయింపులకు సంబంధించి ఇద్దరు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ఆరెకపూడి గాంధీల మధ్య గురువారం చెలరేగిన రాజకీయ చిచ్చు శుక్రవారం కూడా చల్లారలేదు. గ్రేటర్ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేషన్ల చైర్మన్లు తదితర నేతలను ఇళ్లు దాటి బయటకు రాకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసం నుంచి బయల్దేరి బీఆర్‌ఎస్ శ్రేణులు గాంధీ నివాసానికి వెళ్లి అక్కడ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు గురువారం రాత్రి బీఆర్‌ఎస్ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచే పోలీసులు శంభీపూర్ నివాసం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన నివాసానికి వచ్చిన కౌశిక్‌రెడ్డిని, ఆయన అనుచరులు, పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు వారితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పోలీసులు, పార్టీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజులను ఇంట్లోకి పంపించి హౌస్ అరెస్ట్ చేశారు. భారీగా తరలి వస్తున్న పార్టీ శ్రేణుల్ని అక్కడి నుంచి వివిధ ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లకు తరలించారు. తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఇద్దరు నేతలు ఆరోపించారు. ఎమ్మెల్యే గాంధీకి రాజకీయ విలువలు ఉంటే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలవాలని శంభీపూర్ రాజు అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు తన ఇంటికి వస్తే టిఫిన్లు పెట్టి పంపుతానని, అవసరమైతే భోజనాలు కూడా ఏర్పాటు చేస్తానని గాంధీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గాంధీ ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు.

ఎమ్మెల్యేలను ఇళ్లు కదలనీయకుండా..

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌లను ఇళ్ల నుంచి బయటకు వెళ్లకుండా ఉదయం నుంచే పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. గృహ నిర్బంధంలోని నేతలు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకావడం లేదని మల్లారెడ్డి పేర్కొన్నారు. ఓ ఎమ్మెల్యేపై దాడులకు ఉసిగొలుపుతూ సిటీని అల్లకల్లోలంగా మారుస్తున్నారని విమర్శించారు. పోలీసుల చర్య అప్రజాస్వామికమని రాజశేఖరరెడ్డి అన్నారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లకుండా ఎమ్మెల్యేలను నిర్బంధించడం ద్వారా ప్రభుత్వం తన అభద్రతను చాటుకుంటోందని ఎద్దేవా చేశారు.

ఆస్పత్రికీ వెళ్లనీయరా?

మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డిలను సైతం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. చేతికి గాయమైన హరీశ్‌రావు ఆస్పత్రికి కూడా వెళ్లనీయరా అని మండిపడటంతో పోలీసులు వెంట ఉండి ఆయనను గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ తన ఆరోగ్యం బాగులేదని, డాక్టర్ అపాయింట్‌మెంట్ ఉందని చెప్పినా పోలీసులు ఆయనను బయటకు వెళ్లనీయలేదు. ప్రజాస్వామ్యంలో దాడులు, ప్రతిదాడులు సరైనవి కావని తలసాని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయొద్దన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే నగర ప్రతిష్ట దెబ్బతింటుందన్నారు. సాయంత్రం వరకు నేతలు గృహ నిర్బంధంలోనే ఉన్నారు.

హైడ్రా @ పైగా



హెడ్ క్వార్టర్స్‌గా మారనున్న వారసత్వ కట్టడం

- కాన్సులేట్ తరలింపు తర్వాత ఖాళీగానే భవనం
- సైబరాబాద్, రాచకొండల్లో జోనల్ కార్యాలయాలు
- సూత్రప్రాయంగా నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, సిటీబ్యూరో: జల వనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో సత్వర స్పందన కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పైగా ప్యాలెస్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించనుంది. బేగంపేటలోని వారసత్వ కట్టడం పైగా ప్యాలెస్‌ను హైడ్రా హెడ్–క్వార్టర్స్‌గా మార్చాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనికి సంబంధించిన దస్త్రం ఒకట్రెండు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు చేరనున్నట్లు తెలిసింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) లోపల ఉన్న 2053.44 చదరపు కిలోమీటర్ల ప్రాంతం హైడ్రా పరిధిలోని రానుండటంతో అందుకు తగ్గట్టు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్యాలెస్‌కు సుదీర్ఘ చరిత్ర..

దాదాపు 119 ఏళ్ల క్రితం అయిదెకరాల స్థలంలో సువిశాలంగా, రెండు అంతస్తుల్లో యూరోపియన్ శైలిలో పైగా ప్యాలెస్ నిర్మితమైంది. మీర్ మహబూబ్ అలీఖాన్ వద్ద ప్రధానమంత్రిగా పైగా వంశానికి చెందిన నవాబ్ వికారుల్ ఉమ్రా పని చేశారు. ఆయనే 1900లో ఈ ప్యాలెస్‌ను నిర్మించారు. వారి వంశం పేరుతోనే ఇది పైగా ప్యాలెస్‌గా మారింది. ఈ భవనం నిజాంకు నచ్చడంతో ఉమ్రా ఆయనకు బహుమతిగా ఇచ్చారు. మీర్ మహబూబ్ అలీఖాన్ తన కుటుంబ సమేతంగా అప్పుడప్పుడు ఈ ప్యాలెస్‌కు వచ్చి గడిపేవారు. 2008 అక్టోబరు 24 నుంచి ఈ ప్యాలెస్ అమెరికన్ కాన్సులేట్‌గా మారింది. అమెరికన్ కాన్సులేట్ కోసం నానక్‌రామ్‌గూడలో అత్యాధునిక భవనం నిర్మించడంతో 2023 మార్చి 20 అక్కడకు వెళ్లింది. హెచ్‌ఎండీఏ అధీనంలోని ఈ భవనం అప్పటి నుంచి ఖాళీగానే ఉంది.

ఆ రెండు చోట్లా జోనల్ కార్యాలయాలు..

ముఖ్యమంత్రి ఆమోద ముద్ర పడిన తర్వాత కొన్ని మరమ్మతులు చేయించి పైగా ప్యాలెస్‌ను హైడ్రాకు అప్పగించనున్నారు. నగరం మధ్యలో ఉండటమే కాకుండా సౌలభ్యం, భద్రత ఇతర కోణాల్లోనూ ఈ భవనం ఉత్తమమని ప్రభుత్వం గుర్తించింది. పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం హైడ్రాను మూడు జోన్లుగా విభజించనున్నారు. నార్త్ జోన్‌లోకి సైబరాబాద్, సౌత్ జోన్‌లోకి రాచకొండ, సెంట్రల్ జోన్‌లోకి హైదరాబాద్ పోలీసు కమిషనరేట్లలోని ప్రాంతాలు రానున్నాయి. సెంట్రల్ జోన్ కార్యాలయం ప్రస్తుతం హైడ్రా కమిషనర్ కూర్చుంటున్న బుద్ధ భవన్ కేంద్రంగా పని చేయనుంది. సౌత్ జోన్ ఆఫీస్ మేడిపల్లి వైపు, నార్త్ జోన్ ఆఫీస్ కోసం శేరిలింగంపల్లి, మాదాపూర్ వైపు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల వివరాలను ప్రభుత్వం ఆరా తీస్తోంది.

ఒక ఐపీఎస్, ముగ్గురు నాన్–క్యాడర్స్..

హైడ్రా హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ హోదాలో ఉన్న ఓ ఐపీఎస్ అధికారి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉండనున్నారు. ఆపై ఒక్కో జోన్‌కు నాన్ కేడర్ ఎస్పీ స్థాయి అధికారులు నేతృత్వం వహించనున్నారు. ప్రతి ఎస్పీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు అసెట్ ప్రొటెక్షన్‌ను పర్యవేక్షిస్తారు. మొదటి అంశంలో ట్రాఫిక్ పోలీసులు, రెండో అంశంలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పని చేస్తారు. హైడ్రా పరిధిలోకి జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్‌ఆర్ లోపల ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, ప్రత్యేక పరిపాలన బాడీలు, ఇండస్ట్రియల్ ఏరియాలు వస్తున్నాయి. వాటికి సంబంధించిన చట్టాల ప్రకారం ఈ అధికారులు పని చేస్తారు. హైడ్రాలో ఏర్పడే మూడు జోన్లలో కలిపి 72 ప్రత్యేక బృందాలు పని చేయనున్నాయి. ఇవన్నీ తమ పరిధిలో విపత్తు స్పందన, ఆక్రమణల నిరోధంతో పాటు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాయి.

హెడ్ క్వార్టర్స్‌లోనే పోలీసు స్టేషన్..

ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. హైడ్రా పరిధి మొత్తానికి కలిపి ఆ విభాగం పరిధిలో ఓ ఠాణా ఏర్పాటు కానుంది. ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వంలో పని చేసే ఈ పోలీసు స్టేషన్‌ను పైగా ప్యాలెస్‌లోనే ఏర్పాటు చేయనున్నారు. జల వనరులతో పాటు ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తు జరుగుతుంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్)లతో పాటు హైడ్రా ఆర్డినెన్స్/చట్టం ఆధారంగానే ఈ ఠాణా పని చేయనుంది. పోలీసు, జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారుల ఫిర్యాదు మేరకే కాకుండా కీలకాంశాలపైనా ఈ ఠాణా దృష్టి పెట్టనుంది.

ఓయూలో సందడిగా గణేశ్ ఫెస్ట్



ఓయూ క్యాంపస్‌లో శుక్రవారం రాత్రి గణేశ్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులు భక్తి శ్రద్ధలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. దండియా, కోలాటం ఆటలతో సందడి చేశారు. ఓయూలో తొలిసారి నిర్వహించిన గణేశ్ ఫెస్ట్‌కు అనూహ్య స్పందన లభించిందని ఏబీవీపీ నాయకులు బాబూరావు, లవణ్, జీవన్, రావుల కృష్ణ, తోట శ్రీనివాస్, పృథ్వీ, రాజు పేర్కొన్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ



నడిరోడ్డుపై భారీ గొయ్యి

ఒక్కసారిగా కుంగడంతో వాహనదారులు బెంబేలు

మియాపూర్: చందానగర్ సర్కిల్ –21 పరిధిలోని మదీనాగూడ శాంతి నగర్ కాలనీ నుంచి ఎంఏనగర్ వెళ్లే ప్రధాన రహదారి శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఒక్కసారిగా కుంగిపోవడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. దాదాపు 3 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతున గొయ్యి ఏర్పడింది. అప్రమత్తమైన అధికారులకు వాహనాల రాకపోకలను నిలిపివేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ దారిలోంచే చందానగర్, దీప్తిశ్రీనగర్ నుంచి ఎంఏనగర్, ప్రశాంత్‌నగర్, జేపీఎన్‌ఆర్, బొల్లారం వైపు వాహనాలు వెళ్తుంటాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పాఠశాలలున్నాయి. స్కూల్ వ్యాన్‌లు తిరుగుతుంటాయి. పాఠశాలలు వదిలిపెట్టే సమయానికి ముందే సమస్యను స్థానికులు గుర్తించడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. రోడ్డును ఆనుకుని ఉన్న నాలా పైపులైన్ పగిలి నీటి లీకేజీతో భారీ గుంత ఏర్పడి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.



కుటుంబ విలువలను కాపాడాలి

- శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- చంద్రబోస్, కొమురవ్వలకు సత్తయ్యగౌడ్ జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు జూపల్లి, పొన్నం, శ్రీధర్‌బాబు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో కుటుంబ విలువలను కాపాడుతూ..ఉమ్మడి కుటుంబ విలువల గురించి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పొన్నం సత్తయ్య గౌడ్ 14వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ రచయిత చంద్రబోస్, బలగం మూవీ ఫేమ్ కొమురవ్వలకు సత్తయ్యగౌడ్ జీవన సాఫల్య పురస్కారాలను అందజేశారు. అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ పొన్నం సత్తయ్య గౌడ్ చదువు విలువ తెలిసిన వ్యక్తి అని, తనకు చదువు రాకున్నా కుమారులను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించారని గుర్తుచేశారు. ఏ నాడు ప్రచారాన్ని కోరుకోని భూమి పుత్రుడు సత్తయ్య అని కొనియాడారు. వారి పేరు మీద కవులు, కళాకారులను సన్మానించుకోవడం అభినందనీయమన్నారు. బలగం సినిమాలో పాటలు పాడిన కొమురవ్వ కుటుంబ నేపథ్యం తనకు ఎంతో బాధ కలిగించిందని, వారికి తక్షణమే తన జీతం నుండి రూ.లక్ష రూపాయలు అందిస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..తమ ప్రభుత్వం కవులు, కళాకారులకు అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో జీవన విధానం ధ్వంసమైందని, అందుకే ఇన్ని అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఉమ్మడి కుటుంబం ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలని సూచించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొన్నం సత్తయ్యగౌడ్ కుటుంబం మొత్తం కరీంనగర్ జిల్లాలోనే గొప్ప ఉమ్మడి కుటుంబమని గుర్తుచేశారు. ఈ కుటుంబం రాబోయే తరానికి ఒక గొప్ప సందేశాన్ని అందించిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబాల మీద కొమురవ్వ పాడిన పాట ఎందరో హృదయాలను కదిలించిందని కొనియాడారు. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్న సందర్భంలో కొమురవ్వ ఉమ్మడి కుటుంబంపై పాడిన పాటకు ధన్యవాదాలు తెలిపారు. కొమురవ్వ భర్తకు తక్షణమే మెరుగైన వైద్యాన్ని అందిస్తామని, వారికి వరంగల్‌లో ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కొమురవ్వకు కళాకారుల పెన్షన్ ఇవ్వాలని సహచర మంత్రిని కోరారు. సినీ రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ ఇంతమంది కళాకారుల మధ్య సత్తయ్య గౌడ్ పురస్కారాన్ని తీసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అంతకు ముందు జానపద కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, సత్యనారాయణ, ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాడభూషి శ్రీధర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల విలువ చేసే గంజాయి పట్టివేత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్, జూబ్లీహిల్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు యువకులు బైక్‌పై పెద్ద ఎత్తున గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ రూట్‌వాచ్ చేస్తుండగా టీఎస్ 09 యూబీ 3159 నెంబర్ బైక్‌పై ఎనిమిది కిలోల డ్రై గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. బీహార్‌కు చెందిన చమన్‌కుమార్ సాహ్, హఫీజ్‌పేటకు చెందిన సాయినాథ్ ఈజీ మనీ కోసం అలవాటు పడి అవసరమైన వారికి గంజాయి విక్రయించేందుకు పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుందని, నిందితులిద్దరినీ అరెస్టు చేశామని, గంజాయితో పాటు బైక్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

పల్లవి ప్రశాంత్ పాస్‌పోర్టు రిలీజ్

సిటీ కోర్టులు: అమెరికాలోని అట్లాంటాలో జరగనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు వెళ్లేందుకు బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్‌కు అనుమతిస్తూ..కోర్టులో ఉన్న పాస్‌పోర్టును రిలీజ్ చేస్తున్నట్లు నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2023లో పల్లవి ప్రశాంత్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేయగా..అతన్ని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. రిమాండ్ నుంచి బెయిల్ మంజూరు అయినప్పుడు ప్రశాంత్‌కు సంబంధించిన పాస్‌పోర్ట్‌ను కోర్టులో ఉంచాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి పాస్‌పోర్ట్ నాంపల్లి కోర్టులోనే ఉన్నది. ఇటీవల అట్లాంటా తెలుగు అసోసియేషన్ నుంచి ఆహ్వానం రావడంతో తన పాస్‌పోర్టు ఇవ్వా లని పల్లవి ప్రశాంత్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం నాంపల్లి 17 అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదనలు విన్న న్యాయమూర్తి పల్లవి ప్రశాంత్ అట్లాంటా ఉత్సవాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ పాస్‌పోర్ట్‌ను 3 నెలల వరకు రిలీజ్ చేసింది. తిరిగి డిసెంబర్ 13వ తేదీ లోపు పాస్‌పోర్ట్‌ను కోర్టులో అందజేయాలని ఆదేశించారు.

చలో టూర్

వరుస సెలవులతో ఊళ్లు..టూర్లకు నగరవాసులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 14వ తేదీ నుంచి వరుసగా నాలుగురోజుల పాటు సెలవులు రావడంతో సిటీజనులు సొంత ఊళ్లకు, పర్యాటకప్రాంతాలకు పయనమయ్యారు. దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు, రైళ్లతో పాటు విమాన ప్రయాణాలకు సైతం అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. 14న రెండో శనివారం, 15వ తేదీ ఆదివారం కావడం ఆ తరువాత రెండు రోజుల పాటు మిలాదున్నబి, వినాయక నిమజ్జన వేడుకలు కలిసి రావడంతో ప్రయాణాలు పెరిగాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కుటుంబాలతో సహా ప్రయాణాలకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. వర్షాల కారణంగా యాదాద్రి, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు అవకాశం లేని వాళ్లు ఇప్పుడు బయలుదేరుతున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్య పలు మార్గాల్లో అదనపు రైళ్లను అందుబాటులోకి తెచ్చింది. అలాగే హైదరాబాద్ నుంచి కేరళకు వెళ్లే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్‌ల నుంచి కొల్లాం వరకు రెండు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.

గోవాకు చలో....

వరుస సెలవుల దృష్ట్యా వివిధ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు తమ సహోద్యోగులతో, స్నేహితులతో కలిసి గోవా టూర్‌లకు ఎక్కువగా బయలుదేరి వెళ్తున్నట్లు పలు ట్రావెల్స్ సంస్థలకు చెందిన ప్రతినిధులు తెలిపారు. సాధారణంగానే గోవాకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం సెలవులు రావడంతో ఆ సంఖ్య మరింత పెరిగిందని కూకట్‌పల్లికి చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ నిర్వాహకులు చెప్పారు. దీంతో హైదరాబాద్ నుంచి గోవాకు వెళ్లే ఫ్లైట్ చార్జీలు కూడా పెరిగాయి. సాధారణ రోజుల్లో కంటే చార్జీలు 20 శాతం అదనంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు చాలామంది పర్యాటకులు మినీబస్సులు, ఇన్నోవా వంటి కార్లను ఎక్కువగా బుక్ చేసుకొని బయలుదేరుతున్నారు.' గోవాలో సరదాగా గడిపేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు.ఈ సారి గోవాతో పాటు కాశ్మీర్‌ను సైతం సిటీ టూరిస్టులు ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నట్లు ఐఆర్‌సీటీసీ ప్రతినిధి ఒకరు చెప్పారు.

బ్యాంకాక్‌కు బారులు...

నాలుగు రోజులు సెలవులొస్తే చాలు ఏ విదేశీ పర్యటనకో వెళ్లాలని భావించే టూరిస్టు బ్యాచ్‌లు బ్యాంకాక్‌కు బారులు తీరాయి. సమీపంలో ఉన్న దేశం కావడం, పైగా సరదాగా గడిపేందుకు అవకాశాలు ఎక్కువగా ఉండడంతో బ్యాంకాక్‌ను ఎక్కువ మంది ఎంపిక చేసుకుంటున్నారు. 'వరుస సెలవులు వచ్చిన ప్రతిసారీ బ్యాంకాక్‌కు డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. దీంతో చార్జీలు కూడా కొంతవరకు పెరుగుతాయి. ఈసారి అలాగే బ్యాంకాక్ చార్జీలు కొంత మేరకు పెరిగాయి.'' అని కుషాయిగూడకు చెందిన రాఘవ తెలిపారు. తాము ఒక బృందంగా కలిసి ఈ నెల 14వ తేదీన బయలుదేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సోలోగా అయితేనే సో బెటర్....

మరోవైపు హైదరాబాద్ నుంచి వివిధ దేశాలకు వెళ్లే ఒంటరి పర్యాటకుల సంఖ్య కూడా ఈ ఏడాది బాగా పెరిగింది. సుమారు 28 శాతం ఇలా ఒంటరిగా విదేశీ టూర్‌లకు వెళ్తున్నట్లు అంచనా. తమకు నచ్చిన పర్యాటక స్థలాల్లో ఏకాంతంగా గడపాలనే కోరిక, ఎలాంటి బాదరబందీల్లేకుండా ఎక్కడి నుంచి ఎక్కడికైనా తేలిగ్గా ప్రయాణించేందుకు అవకాశం ఉండడం వల్ల చాలా మంది సోలో జర్నీయే సో బెటర్ అనుకుంటున్నారు.

ప్రజావాణిలో మహిళా అధ్యాపకురాలికి అస్వస్థత

లక్డీకాపూల్ : సమస్య పరిష్కారం కోసం వచ్చిన మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ సొమ్మసిల్లి పడిపోయారు. స్పృహ తప్పిపడిపోయిన డాక్టర్ రజనిని జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌కు తరలించారు. శుక్రవారం ఈ సంఘటన ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో చోటు చేసుకుంది. తమను రెగ్యులరైజ్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో తెలంగాణ ఆల్ యూనివర్సిటీల కాంట్రాక్ట్ ప్రొఫెసర్ల జేఏసీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు పెద్దసంఖ్యలో ప్రజాభవన్‌కు తరలివచ్చారు. ఈ క్రమంలో ప్రజావాణి వద్ద బైఠాయించారు. అదే సమయంలో డాక్టర్ రజని అనే అసిస్టెంట్ ప్రొఫెసర్ అస్వస్థతకు గురయ్యారు. కాగా వీరి రాత్రి 9 గంటల వరకు నిరసన కొనసాగింది. దీంతో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి స్పందించి జేఏసీ కన్వీనర్, ఓయూ కాంట్రాక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ధర్మతేజ ఆధ్వర్యంలో కలిసి సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి..అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి సమస్య వివరించాల్సిందిగా సూచించారు.

భారతీయ విద్యాభవన్‌కు 'బెస్ట్ ఆఫ్ కన్వెన్షన్' అవార్డు



సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, అలాగే జాయ్ ఆఫ్ లెర్నింగ్ అంశాల్లో భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ బీహెచ్ఇఎల్ విద్యార్థులు చూపిన ప్రతిభకు వారికి 'బెస్ట్ ఆఫ్ కన్వెన్షన్ అవార్డు' లభించింది. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ నిర్వహించిన పోటీల్లో మొత్తం 233 విద్యార్థుల బృందాలు పాల్గొన్న ఈ పోటీలో ఉత్తమ కన్వెన్షన్ అవార్డు లభించింది. గురువారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో వారికి అవార్డును అందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే అంశంలో క్రిస్టల్ టీమ్‌లోని విద్యార్థులు తన్విశ్రీ పద్మ, ఆదర్శ్, సుప్రతిక్ దాస్, చాతుర్య, 'ప్రిస్మ్' టీమ్‌లో అభిజ్ఞ, హరిణి, వసంత్, అన్విత్ లిఖిత, అంకితలను పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి, వైస్-ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఫెసిలిటేట్ సుధారాణి, ఎగ్జిక్యూటివ్ గైడ్ వనిత అభినందించారు. నిరంతర శిక్షణతోనే ఇది సాధ్యమైందని తెలిపారు.

విద్యార్థుల హాజరు శాతం మరింత పెరగాలి

- హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉండేలా చూడండి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


హుమాయున్‌నగర్ పాఠశాలలో చిన్నారితో కలెక్టర్ అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగి హైదరాబాద్ జిల్లా రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం హుమాయున్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. రూ.8 లక్షలతో చేపట్టిన డ్రింకింగ్ వాటర్, ప్లాట్‌ఫామ్, ఎలక్ట్రిసిటీ, షెడ్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఎర్రటి మట్టితో గ్రీనరీ పెంచాలని సూచించారు. ప్రతి పాఠశాల తరగతిగది ఎదురుగా క్లాస్ రూమ్‌కు సంబంధించిన నేమ్ ప్లేట్ అమర్చాలని సూచించారు. పాఠశాల హాజరు రిజిస్టర్ ను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుల కృషి వల్ల విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు(ఎఫ్ఆర్ఎస్)లో 67.65 శాతానికి చేరుకుందన్నారు. హాజరులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ కోరారు. పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిల్లలు వచ్చేలా చూడాలని అన్నారు. ఆధార్ కార్డు లేని విద్యార్థులకు వెంటనే ఆధార్ నమోదు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చలపతిరావు, డిప్యూటీ ఈవో రమణా రాజు, డిప్యూటీ ఐఓఎస్ ముస్తఫా, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ ముజ్తబా అలీ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- డీకేజెడ్ బాధితుల వేడుకోలు
- డీజీపీ ఆఫీసు ఎదుట నిరసన

పంజగుట్ట: అధిక వడ్డీ ఆశచూపి వినియోగదారులను నిండా ముంచిన డీకేజెడ్ సంస్థపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో న్యాయవాది అశీర్‌ఖాన్, నారీ నికేతన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సఫియా మహీతో పాటు వందల సంఖ్యలో బాధితులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదాపూర్‌లో డీకేజెడ్ టెక్నాలజీస్ అనే సంస్థను నగరానికి చెందిన మహ్మద్ ఇక్బాల్, రాహిల్, సయ్యద్ ఉమర్ అనే వ్యక్తులు ఏర్పాటు చేశారు. ఇందులో బిలాల్, భాగ్యశ్రీతో పాటు మరికొంతమంది విధులు నిర్వహించేవారని తెలిపారు. తమవద్ద పెట్టుబడి పెట్టిన వారి మొత్తాన్ని వివిధ సంస్థల్లో పెట్టుబడులుగా పెట్టి వచ్చే లాభంతో ప్రతీ నెల 10 నుండి 15 శాతం వరకు వడ్డీ ఇస్తామని నమ్మబలికారు. యూట్యూబ్ చానల్స్‌లో ప్రచారం చేసుకున్నారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్, యాప్స్‌ను రూపొందించారు. దాదాపు 18 వేల మంది వరకు పెట్టుబడులు పెట్టినట్లు, యూట్యూబ్‌లో విపరీతంగా ప్రచారం చేశారు. దీంతో చాలా మంది నమ్మి పెట్టుబడులు పెట్టారు. ఇలా రూ.500 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. గత రెండు నెలలుగా వడ్డీ చెల్లించడంలేదని, ప్రస్తుతం గూగుల్ నుండి పూర్తిగా వెబ్‌సైట్ తీసేశారని బాధితులు తెలిపారు. తాము సీసీఎస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో నిందితులు దర్జాగా తిరుగుతున్నారని బాధితులు ఆరోపించారు. దొంగ సంస్థను నమ్మి తాను రూ.2.72 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు వైద్యుడు అబుల్‌జేశ్ తెలిపారు. తాము ఈ నెల 4వ తేదీన సీసీఎస్‌లో ఫిర్యాదు చేశామని, ఎఫ్ఐఆర్ చేశారే కాని ఇప్పటివరకు నిందితులను అరెస్టు చెయ్యలేదని బాధితులు శుక్రవారం బషీర్‌బాగ్‌లోని డీజీపీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు.

బాలుడికి రూ.90 వేల సాయం

'చిన్ని గుండెకు పెద్ద కష్టం' కథనానికి స్పందన



జీడిమెట్ల: 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పలువురు స్పందించారు. దూలపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన నూకల లక్ష్మీనారాయణ(15) ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లి 14 సంవత్సరాల క్రితమే మృతి చెందింది. తండ్రి ఇంకో పెళ్లి చేసుకుని వెళ్లిపోయాడు. బాలుడిని సుబ్బలక్ష్మి(అమ్మమ్మ) కిరాయి గదిలో ఉంటూ అట్టల పరిశ్రమలో పనిచేస్తూ సాకుతోంది. బాలుడికి వారం రోజుల క్రితం ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా..గుండెకు సంబంధించిన సమస్యతో ఆపరేషన్ చేయాలని, దానికి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని వారు తిండికే సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో లక్షల రూపాయలు ఎక్కడ నుంచి తేవాలంటూ అమ్మమ్మ కన్నీరు పెట్టుకుంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న 'సాక్షి' గురువారం వారికి ఇంటికి వెళ్లి వివరాలతో కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన కొంత మంది స్థానిక పెద్దలతో పాటు ఇతరులు రూ.90 వేల వరకు అకౌంట్‌లో వేశారు. అదేవిధంగా విషయం తెలుసుకున్న ఆరోగ్యశ్రీ టీం లీడర్ వేణు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సీఎంఓ లెటర్ ద్వారా బాలుడికి వైద్యం, ఆపరేషన్ అందేలా చొరవ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టిజన్‌పై వేటు!

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్‌శాఖలో అవినీతి నిర్మూలన, పనుల్లో పారదర్శకత కోసం సీఎండీ ముషారఫ్ అలీ ఇటీవల 040-23454884, 7680901912 ఫోన్ నంబర్లతో ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా తొలి రోజు 40పైగా ఫిర్యాదులు వచ్చాయి. ఆ తర్వాత రోజుకు కనీసం పది చొప్పున ఫిర్యాదులు అందుతున్నాయి. వర్క్‌ఆర్డర్, ఎస్టిమేషన్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన మెదక్ సర్కిల్ శివంపేట్ సెక్షన్ ఏఈ బి.దుర్గాప్రసాద్‌పై రెండు రోజుల క్రితం వేటు వేసిన డిస్కం..తాజాగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో పాటు వినియోగదారుని నుంచి డబ్బులు డిమాండ్ చేసిన అభియోగంపై మేడ్చల్ సర్కిల్ అలియాబాద్ సెక్షన్ గాజులరామారం ఏరియాకు చెందిన ఆర్టిజన్ గడ్డం శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు విధించింది.

బాలికను బలిగొన్న బడి బస్సు

మల్లంపేటలోని ఓ పాఠశాలగ్రౌండ్‌లో దుర్ఘటన


మాన్విత (ఫైల్)

దుండిగల్: స్కూల్ బస్సు ఢీకొని మూడేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లంపేటలోని డ్రీమ్‌వ్యాలీ కాలనీకి చెందిన కుంట రాజు, స్వప్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరి చిన్న కుమార్తె మాన్విత (3) స్థానికంగా ఉన్న ఓక్ లీఫ్ స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతోంది. శుక్రవారం ఉదయం స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లింది. గ్రౌండ్‌లో బస్సు దిగి వెళ్తుండగా అదే బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. చిన్నారిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. బస్సు డ్రైవర్‌ను స్కూల్ యాజమాన్యం అక్కడి నుంచి పంపించివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. చిన్నారి బస్సులోంచి దిగే క్రమంలో జారి కింద పడి చనిపోయిందని యాజమాన్యం తమకు సమాచారం అందించిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్‌తో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. డ్రైవర్ నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను సందర్శించిన ఆమ్రపాలి

'సాక్షి' కథనానికి స్పందన

కుషాయిగూడ: ఆధునాతన హంగులతో ప్రారంభానికి సిద్ధమైన చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు రవాణా సదుపాయాలు కొరవడ్డాయని, అధికారులు ప్రతిపాదించిన అప్రోచ్ రోడ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందంటూ గత నెలలో 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్ఈ అశోక్ రెడ్డిలు చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను సందర్శించారు. ప్రతిపాదించిన అప్రోచ్ రోడ్ల వివరాలను పరిశీలించారు. టర్మినల్‌కు వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల అధికారులను ఆమె ఆదేశించారు. ప్రతిపాదించిన రోడ్ల విస్తరణకు భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. అలాగే అటవీశాఖకు చెందిన భూముల్లోంచి వేసే రోడ్డుకు కావాల్సిన అనుమతులు పొందాలన్నారు. చర్లపల్లి పారిశ్రామిక వాడ ఐలా చైర్మన్ రోషిరెడ్డితో ఆమె చర్చించి వివరాలు తెలుసుకున్నారు. టర్మినల్ చుట్టు టీజీఐఐసీకి చెందిన స్థలాలే ఉన్నాయని, వారి సహకారం తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు.

డప్పు దరువుల మధ్య నిమజ్జనోత్సాహం

భారతి సిమెంట్స్‌లో అంబరాన్నంటిన గణేష్‌ నిమజ్జనం



భారతి సిమెంట్స్‌ కార్పొరేట్‌ కార్యాలయంలో నిమజ్జనోత్సవంలో ఉద్యోగుల నృత్యాలు

బంజారాహిల్స్‌: పాటల హోరు, డప్పుల జోరు, ఉద్యోగుల నృత్యాలతో వినాయక నిమజ్జన ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 10లోని భారతి సిమెంట్స్‌ కార్పొరేట్‌ కార్యాలయంలో వినాయక నిమజ్జన ఉత్సవాన్ని ఉద్యోగులు వైభవంగా నిర్వహించారు. ఉద్యోగులంతా సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ గణనాథుడిని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో లడ్డూను సంస్థకు చెందిన ఉద్యోగులు మురళీధర్‌రెడ్డి, కౌశిక్‌ ఆనంద్‌, శ్రీనివాస్‌గౌడ్‌లు రూ. 2.52 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో అనూప్‌కుమార్‌ సక్సేనా, భారతి సిమెంట్స్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ మల్లారెడ్డి, డైరెక్టర్‌ ఆఫ్‌ మార్కెటింగ్‌ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌

విగ్రహ తరలింపు రూట్లను మరోసారి తనిఖీ చేయండి

- డార్క్‌స్పాట్స్‌లో తప్పనిసరిగా వీధిదీపాలు ఏర్పాటు చేయాలి
- సమీక్ష సమావేశంలో జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌

బంజారాహిల్స్‌: గణేష్‌ నిమజ్జన ఏర్పాట్లపై జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ జోనల్‌ కార్యాలయంలో శుక్రవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌, యూబీడీ అదనపు కమిషనర్‌ పంకజ, జాయింట్‌ కమిషనర్‌ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఈ రత్నాకర్‌, సర్కిల్‌–17 డీసీ రజనీకాంత్‌రెడ్డి, సర్కిల్‌–18 డీసీ ప్రశాంతి, గోషామహల్‌ డీసీ విద్యాధర్‌, కార్వాన్‌ డీసీ శశికళ, ఎంటమాలజీ అధికారిణి రజనీ, ఈఈలు, డీఈలు, ఏఈలు, ఏఎంహెచ్‌ఓలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికిరణ్‌ మాట్లాడుతూ గణేష్‌ నిమజ్జనోత్సవాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, శనివారం నుంచి పెద్దఎత్తున జరుగుతాయని, రోడ్లపై గుంతలు లేకుండా చూసుకోవాలని ఇంజినీర్లకు సూచించారు. విగ్రహాలకు చెట్ల కొమ్మలు అడ్డురాకుండా అన్ని రూట్లలో మరోసారి తనిఖీలు చేయాలని యూబీడీ అధికారులకు సూచించారు. డార్క్‌స్పాట్స్‌ను గుర్తించి అక్కడ వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రీన్‌వేస్ట్‌ను తొలగించాలని, రోడ్లపై ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



వెంకటేశ్వరనగర్‌ కాలనీ: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంతో పాటు ఎదుగుదలకు దోహదపడే పోషకాహారంపై అంగన్‌వాడీ కేంద్రాలు దృష్టిసారించాయి. ఇందులో భాగంగానే ఈ నెల 1వ తేదీ నుంచి పోషణమాసం పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేవిధంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో నిపుణులైన వైద్యులను రప్పిస్తూ ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తూ తగిన సూచనలు ఇస్తున్నారు. దీనిలో భాగంగానే వెంకటేశ్వరకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్‌ జాగృతిరావు హాజరై గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి తగిన సూచనలు చేశారు. స్త్రీ సంబంధిత వ్యాధుల గురించి వారికి అవగాహన కల్పించారు. ఖైరతాబాద్‌ ఐసీడీఎస్‌ పరిధిలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ తగిన జాగ్రత్తలు, సూచనలు కూడా తెలియజేస్తున్నారు. గర్భిణులు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఎలాంటి పనులు చేయకూడదో సవివరంగా తెలియజేస్తున్నారు.

గణేష్‌ లడ్డూ రూ.73 వేలు



లడ్డూతో రామచందర్‌నాయక్‌

ఫిలింనగర్‌: ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్‌కాలనీలో బీజేవైఎం నాయకుడు గందె అరుణ్‌కుమార్‌ ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య లడ్డూను శుక్రవారం వేలం వేశారు. స్థానిక నేనావత్‌ రామచందర్‌నాయక్‌ రూ.73 వేలకు గణపయ్య లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా లడ్డూతో స్థానికంగా భారీ ఊరేగింపు నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో లడ్డూ వేలంపాట జరిగింది.

రేపు మెగా వైద్య శిబిరం

హాజరుకానున్న భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రహమత్‌నగర్‌ (బోరబండ): స్వర్ణభారత్‌ ట్రస్ట్‌, ఏఐజీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బోరబండ డివిజన్‌ నాట్కో ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఏఐజీ ఆసుపత్రి చైర్మన్‌ డా.డి నాగేశ్వర్‌ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, జీర్ణకోశ, స్త్రీ సంబంధిత వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులకు చికిత్స అందిస్తారని చెప్పారు. ఈ శిబిరం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ప్రకటించారు.

వెల్దండ వెంకటేష్‌ గృహ నిర్బంధం

బాధితులనే బంధిస్తారా? : వెంకటేష్‌



ఫిలింనగర్‌: చలో శేరిలింగంపల్లికి వెళ్లకుండా జూబ్లీహిల్స్‌ కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేష్‌ను ఫిలింనగర్‌లోని ఆయన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన ఇంటికి పోలీసులు చేరుకుని బయటకు వెళ్లకుండా కట్టడి చేశారు. దీంతో దాడికి గురైన బాధితులనే నిర్బంధిస్తారా? అని వెంకటేష్‌ ప్రశ్నించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దౌర్జన్యంగా దాడులకు పాల్పడిన వారిని గుర్తించి శిక్షించాలని పోలీసులను ఆశ్రయిస్తే గంటల తరబడి స్టేషన్‌లో కూర్చోబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన అందిస్తామని చెబుతున్న కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజాప్రతినిధుల విషయంలోనే ఈ రకంగా వ్యవహరిస్తే సాధారణ ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. పార్టీని వీడలేదని చెబుతున్న గాంధీ స్టేషన్‌లో ఉంటే కాంగ్రెస్‌ పార్టీకి చెందిన దానం నాగేందర్‌, రంజిత్‌ రెడ్డిలు ఎందుకు కలిశారని ప్రశ్నించారు.

వెంగళరావునగర్‌లో..



వెంగళరావునగర్‌ : బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ దంపతులను శుక్రవారం మధురానగర్‌ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. బీఆర్‌ఎస్‌ నాయకులు అనుమతులు లేకుండా ఆందోళన చేపడతారనే సమాచారం రావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు వీరిని హౌస్‌ అరెస్ట్‌ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ మాట్లాడుతూ ప్రజాపాలన ముసుగులో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌ నియంత పాలన చేస్తున్నట్లు విమర్శించారు. అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు తమ పార్టీకి కొత్తేమి కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేతలు విజయ్‌కుమార్‌, కిట్టు, పూజారి బాల్‌రాజ్‌, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక బలం



లబ్ధిదారులకు రూ. 4 లక్షల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి

మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి

బంజారాహిల్స్‌: ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలకు మరింత ఆర్థిక బలం చేకూరుతుందని ఈ పథకం కింద మహిళలను ఆర్థికంగా బలంగా తయారు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 12లోని భోలానగర్‌ బస్తీలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 4 లక్షల సహాయాన్ని సహారా గ్రూప్‌ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ గ్రేటర్‌లో సుమారు 47, 960 స్వయం సహాయక సంఘాలలో 4,47,631 మహిళలు సభ్యులుగా ఉన్నారని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్రింద 7000 ఎంటర్‌ ప్రైజేస్‌లను గ్రూప్‌లకు, గ్రూపుల వారీగా మహిళలకు మొత్తం 410 కోట్ల రూపాయలను ఈ ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మైక్రో క్రెడిట్‌ ద్వారా ఇప్పటికే 1718 గ్రూప్‌లకు రూ. 186.25 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు మేయర్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసీడీ విభాగం అడిషనల్‌ కమిషనర్‌ చంద్రకాంత్‌, జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌, డీఎంసి ప్రశాంతి, డీపీవో ఆశా విరానిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్‌ వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

బంజారాహిల్స్‌: హిందీ భాష గొప్ప సాంస్కృతిక సంపద అని జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి కొనియాడారు. జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో హిందీ దివస్‌ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారిక భాష హిందీపై వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు సృజనాత్మకత, ఉట్టిపడేటట్లు చేసిన నాటికలు, పాడిన పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి సంవత్సరానికి 100 గంటలు కేటాయిస్తామని 'స్వచ్ఛతా ప్రతిజ్ఞ' చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి మాట్లాడుతూ భాషా వైవిధ్యాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం మనందరి బాధ్యత అన్నారు.

తెలంగాణ జిల్లాల క్రికెట్‌ అసోసియేషన్‌ ఆవిర్భావం

కాచిగూడ: తెలంగాణ జిల్లాల క్రికెట్‌ అసోసియేషన్‌ ఆవిర్భావ వేడుక శుక్రవారం బషీర్‌బాగ్‌ ప్రెస్‌ క్లబ్‌లో జరిగింది. రిటైర్డ్‌ ఐఏఎస్‌ కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని అసోసియేషన్‌ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌ రెడ్డి, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వెంగళరావునగర్‌: అతివేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఫుడ్‌ డెలివరీ బాయ్‌ను ఢీకొట్టిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లికి చెందిన షేక్‌ ఉమర్‌ జొమెటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12న బంజారాహిల్స్‌ నుంచి ఎస్‌ఆర్‌నగర్‌కు తన వాహనంపై వస్తున్న క్రమంలో ఎస్‌ఆర్‌నగర్‌ హర్షమెస్‌ లైన్‌కు రాగానే రాంగ్‌రూట్‌లో వేగంగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు ఉమర్‌ను ఢీకొట్టాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. ఉమర్‌ కజిన్‌ సోదరుడు సయ్యద్‌ ముక్బుల్‌ మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలుగు, పార చేతపట్టుకొని..!

మురుగును దారిమళ్లించిన వ్యాపారులు



ఫిలించాంబర్‌ వద్ద మురుగు సమస్యను పరిష్కరించుకుంటున్న స్థానికులు

ఫిలింనగర్‌: ఫిలించాంబర్‌ వద్ద గడిచిన వారం రోజులుగా మురుగు సమస్య వేధిస్తోంది. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత సిబ్బంది రాకపోవడంతో మురుగు మొత్తం స్థానిక వ్యాపారుల దుకాణాలతో పాటు ఫిలించాంబర్‌ ఆవరణలో ఉన్న విగ్రహాలను చుట్టుముడుతుంది. ఈ దుర్గంధం, దుర్వాసనలను భరించలేకపోయిన స్థానిక వ్యాపారులు శుక్రవారం ఉదయం పలుగు, పార పట్టుకొని మురుగును దారి మళ్లించారు. అదే విధంగా చాంబర్‌ ఇన్‌ గేట్‌ వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ కింది వైపు నుంచి పెద్ద ఎత్తున మురుగునీరు పొంగుతుంది. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ ట్రస్ట్‌ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న ట్రస్ట్‌ బోర్డు సభ్యులు

రహమత్‌నగర్‌ (బోరబండ): బోరబండ డివిజన్‌ వినాయకరావునగర్‌ శ్రీ హనుమాన్‌ ఆలయ ట్రస్ట్‌ బోర్డు సభ్యులను దేవాదాయ శాఖ అధికారులు ప్రకటించారు. పీ. ఆనంద్‌ కుమార్‌, ఎన్‌.సుధాకర్‌, వి.శకుంతల, ఎస్‌, శ్రీనివాస్‌, కె. సతీష్‌కుమార్‌, కె.మాలతీలు ట్రస్టీ బోర్డు సభ్యులుగా, ఎక్స్‌ అఫిసీయో సభ్యులుగా పీరంధర్‌ హేమ కేశవయ్యలు నియామకమయ్యారు. శుక్రవారం స్థానిక ఆలయంలో వీరంతా ప్రమాణ స్వీకారం చేశారు. వీరు ఒక సంవత్సరం పాటు ట్రస్టీ బోర్డు సభ్యులుగా కొనసాగుతారని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ మధు, ఆలయ ఈవో కృష్ణలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్‌ ఫరీఫ్‌, మహేందర్‌ యాదవ్‌, జగదీష్‌గౌడ్‌ తదితరులు నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



బంజారాహిల్స్‌: గణేష్‌ చతుర్థి వేడుకల్లో భాగంగా సైఫాబాద్‌ సైన్స్‌ కాలేజ్‌ బాయిస్‌ అండ్‌ గర్ల్స్‌ హాస్టల్స్‌ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నదాన వితరణ కార్యక్రమం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు ఐకమత్యంగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. అంతకముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.

మృత శిశువు జననాల సంఖ్య తగ్గించడమే లక్ష్యం

పంజగుట్ట: దేశంలో మృత శిశు జననాల సంఖ్య ప్రస్తుతం వెయ్యికి 13.9 గా ఉందని, దాన్ని 2030 నాటికి వెయ్యికి 10కి తగ్గించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు స్టిల్‌బర్త్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా అధ్యక్షులు డాక్టర్‌ నీలమ్‌ అగర్వాల్‌ అన్నారు. ఫెర్నాండెజ్‌ హాస్పిటల్‌ ఎడ్యుకేషన్‌, రీసెర్చ్‌ ఫౌండేషన్‌, స్టిల్‌బర్త్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పార్క్‌ హోటల్‌లో రెండో వార్షిక స్టిల్‌బర్త్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా సదస్సు శుక్రవారం సోమాజిగూడ పార్క్‌ హోటల్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సు ఈ నెల 15 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్‌ నీలమ్‌ అగర్వాల్‌, డాక్టర్‌ పల్లవి, డాక్టర్‌ తమ్‌కిన్‌ ఖాన్‌లు మాట్లాడుతూ ఈ సదస్సులో 260 మంది వరకు వైద్యులు, నర్సులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విధానరూపకర్తలు, పరిశోధకులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రసవం సమయంలో శిశువు ఎందుకు మృతి చెందాడు, చనిపోకుండా ఏమి చెయ్యగలం, రాబోయే గర్భంలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఏం చెయ్యగలం అనే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి ఒక నివేదిక తయారు చేసి దాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అందచెయ్యనున్నట్లు తెలిపారు.

పిల్లలు, వృద్ధులు, గర్భిణులు రాకుంటే మంచిది

మహాగణపతి దర్శనానికి వచ్చే భక్తులకు ఏసీపీ సంజయ్‌కుమార్‌ సూచన



సైఫాబాద్‌ ఏసీపీ ఆర్‌.సంజయ్‌కుమార్‌

ఖైరతాబాద్‌: ఖైరతాబాద్‌ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. శని, ఆదివారాలు వీకెండ్‌ కావడంతో ఈ రెండు రోజుల్లో 10 లక్షలకుపైగా భక్తులు వచ్చే అవకాశముండటంతో తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలని సైఫాబాద్‌ ఏసీపీ ఆర్‌.సంజయ్‌కుమార్‌ శుక్రవారం తెలిపారు. వినాయక చవితి మొదటి రోజు 2.5 లక్షల మంది, రెండో రోజు నుంచి ప్రతి రోజు లక్షకు పైగా భక్తులు దర్శించుకునేందుకు వస్తున్నారన్నారు. ఈ శని, ఆదివారాల్లో 5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులలో చిన్నపిల్లలతోపాటు గర్భిణులు, వృద్ధులు రాకుంటే మంచిదని సూచించారు. అదే విధంగా సోమవారం నుంచి భక్తుల దర్శనాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 17వ తేదీ ఉదయం 6.30 గంటల కల్లా మహాగణపతి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు.



కాంతి శిఖర అపార్ట్‌మెంట్స్‌లో....



బంజారాహిల్స్‌ రోడ్‌ నెం-12 శ్రీరాంనగర్‌ కాలనీలో..



డ్రై ఫ్రూట్స్‌ అలంకరణలో విజయగణపతి

విఘ్నేషా.. విఘ్నాలు తొలగించు..!

గణపతి నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం భక్తులు విఘ్నేశ్వరుడిని దర్శించుకొని విఘ్నాలు తొలగిపోవాలని వేడుకున్నాడు. అదే విధంగా నిర్వాహకులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు.

- బంజారాహిల్స్‌



అన్నప్రసాద వితరణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్‌



చిన్నారులకు బహుమతులు ఇస్తున్న నిర్వాహకులు



పూజలు చేస్తున్న కార్పొరేటర్‌ వనం సంగీతయాదవ్‌

గంజాయి సిగరెట్లు తాగుతున్న యువకుడి అరెస్టు

పరారీలో మరొకరు..

ఫిలింనగర్‌: గంజాయి సిగరెట్లను తాగడమే కాకుండా ఈజీ మనీ కోసం అలవాటుపడ్డ ఓ యువకుడు అవసరమైన వారికి విక్రయించేందుకు పెద్ద ఎత్తున గంజాయిని నిల్వ చేయగా ఫిలింనగర్‌ పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని లోటస్‌పాండ్‌ సమీపంలో ఉన్న పావనిప్లాజా అపార్ట్‌మెంట్‌ వద్ద గచ్చిబౌలికి చెందిన రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి కంద్రా లోకేష్‌ (35) గంజాయి సిగరెట్‌ తాగుతున్నాడు అదే సమయంలో పోలీసులు రావడంతో తప్పించుకునేందుకు యత్నించాడు. అనుమానం వచ్చిన పోలీసులు లోకేష్‌ను విచారించగా తాను గంజాయి సిగరెట్‌ను తాగుతున్నట్లుగా ఒప్పుకున్నాడు. తన స్నేహితుడు విష్ణురెడ్డితో కలిసి శుక్రవారం ఉదయం లోటస్‌పాండ్‌కు వచ్చానని, ఇద్దరం కలిసి గంజాయి సిగరెట్లను తాగామని, విష్ణు అక్కడి నుంచి వెళ్లిపోయాడని లోకేష్‌ తెలిపాడు. దీంతో పోలీసులు లోకేష్‌కు మూత్ర పరీక్షలు నిర్వహించారు. అలాగే గంజాయి మెటీరియల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. లోకేష్‌పై ఎన్‌డీపీఎస్‌ యాక్ట్‌ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. విష్ణురెడ్డి పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఫిలింనగర్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలాను ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు

ఫిలింనగర్‌: నాలాను ఆక్రమించిన వ్యక్తిపై ఫిలింనగర్‌ పోలీసులు క్రిమినల్‌ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..షేక్‌పేట మండల తహశీల్దార్‌ వై. అనితారెడ్డి ఈ నెల 12న ఓయూ కాలనీ బుల్కాపూర్‌ నాలా వెంబడి తనిఖీలు చేస్తుండగా జహంగీర్‌ అలీ నాలాను ఆక్రమించి మట్టితో చదును చేస్తున్నట్లు గుర్తించారు. టిప్పర్‌ ద్వారా మట్టిని తరలిస్తుండంతో టిప్పర్‌ను సీజ్‌ చేశారు. అదే విధంగా నాలా స్థలాన్ని జహంగీర్‌ అలీ దర్జాగా మట్టి పోస్తూ ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఐటీతో బ్లూమిన్ ఒప్పందం


ఒప్పందాలను మార్చుకున్న ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలతో సాఫ్ట్‌వేర్, ట్రెనింగ్ కన్సల్టెన్సీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఐటీ సేవలు, ప్రొఫెషనర్ ట్రెనింగ్ సొల్యూషన్స్‌లో ప్రత్యేకత కలిగిన బ్లూమిన్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నర్సింహులు, బ్లూమిన్ సంస్థ ప్రతినిధి ఎం.వెంకటరావు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లలో విలువైన అవకాశాలను అందిస్తుందన్నారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో అనుభవాన్ని పొందేందుకు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, పరిశ్రమ పద్ధతులతో నవీకరించేందుకు వీలు కల్పిస్తుందన్నారు. ప్రొఫెసర్ ఉమాకాంత్‌చౌదరి, ఐటీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.వేణుగోపాలచారి, అధ్యాపకులు డాక్టర్ టి.సత్యనారాయణ మూర్తి, కె.గంగాధర్‌రావు, డాక్టర్ కె.సుగమ్య, కె.స్వాతి, డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

కూన వెంకటేష్‌గౌడ్ మృతి



సనత్‌నగర్: సుదీర్ఘకాలం పాటు రాజకీయాల్లో ఉన్న కూన వెంకటేష్‌గౌడ్(67) మృతి చెందారు. కొంత కాలంగా నోటి కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ సనత్‌నగర్, సికింద్రాబాద్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజల్లో తనకంటూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ నుంచి మొట్టమొదటిసారిగా 2009లో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన ఆయన 2014లో సనత్‌నగర్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఆయనకు ఆ పార్టీ అధిష్టానం సికింద్రాబాద్ నుంచి టికెట్ కేటాయించింది. ఆ ఎన్నికల్లోనూ ఓటమి పాలైన ఆయన అలుపెరగని విక్రమార్కుడిలా సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతూ తనదైన శైలిలో రాజకీయాల్లో కొనసాగారు. తనకంటూ ప్రత్యేక క్యాడర్‌ను తయారు చేసుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున సనత్‌నగర్ నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. అయితే ఓటమి చవిచూసినప్పటికీ ప్రజల కోసమే ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. తన వద్దకు వచ్చే కార్యకర్తలు గానీ, పేద ప్రజానీకానికి గానీ వారి అవసరాలను తెలుసుకోవడంతో పాటు వాటిని సమకూరుస్తూ ప్రజానాయకుడిగా పేరొందారు. 2018 ఎన్నికల అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన ఆయన అందులో ఇమడలేక మళ్లీ టీడీపీలో చేరారు. ఆ పార్టీ శేరిలింగంపల్లి నుంచి పోటీ చేస్తారన్న వార్తలు వెలువడ్డాయి. అయితే ఆయన ఆరోగ్య రీత్యా పోటీ చేయాలనే నిర్ణయాన్ని విరమించుకున్నారు. గత కొన్నేళ్లుగా నోటి కేన్సర్‌తో ఆయన బాధపడుతున్నారు. పలుమార్లు సర్జరీలు కూడా జరిగాయి. ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. శనివారం తన స్వస్థలమైన గాజులరామారంలో అంత్యక్రియలు జరుగుతాయని ఆయన కుమారుడు శ్రావణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

నిత్యం ప్రజల్లో ఉంటే నాయకులుగా ఎదుగుతారు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, ప్రజల్లో పార్టీ పట్ల సానుకూలత ఉందని, వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టడం ఖాయమని బీజేపీ రాష్ట్ర సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రకృతి రిసార్ట్స్‌లో శుక్రవారం నిర్వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ పరిధి సంస్థాగత పర్వం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. పార్లమెంట్ పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని ప్రజలు ఆదరించారని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నేటినుంచే సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉండే వారే నాయకులుగా ఎదుగుతారని, ప్రజలు వారినే ఆదరించి పదవులు కట్టబెడతారని అన్నారు. మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, మల్లిఖార్జున్ ముదిరాజ్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్ ▸ తెలుగులో తొలి తీర్పు

రంగారెడ్డి జిల్లాలో ఇదే తొలిసారి

- మాతృభాషలో తీర్పు ఇవ్వడం చాలా సంతోషం
- కమిషన్ అధ్యక్షురాలు లతాకుమారి, మెంబర్లు జవహర్‌బాబు, శ్యామల

సిటీ కోర్టులు: రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఓ కేసుకు సంబంధించి మొట్టమొదటిసారిగా తెలుగులో తీర్పును ఇచ్చింది. ప్రతీ వినియోగదారుడికి అర్థమయ్యే విధంగా మొదటిసారి మాతృభాష(తెలుగు)లో తీర్పు ఇస్తూ రంగారెడ్డి జిల్లా కమిషన్ మెంబర్ పి.వి.టి.ఆర్. జవహర్ బాబు ఫిబ్రవరి 2024లో 5 పేజీల తీర్పు ఇచ్చారు.



కేసు వివరాల్లోకి వెళ్తే..

సరూర్‌నగర్, బడంగ్‌పేటకి చెందిన కొంతం ప్రవళిక గర్భం దాల్చడంతో మార్చి 2018లో చికిత్స నిమిత్తం దిల్‌షుక్‌నగర్‌లోని శశి దవాఖానకు వెళ్లింది. తర్వాత 9 నవంబర్ 2018లో సాయంత్రం భరించలేనంత నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెకు నొప్పులు ఎక్కువగా ఉండటంతో ఆస్పత్రి సిబ్బంది సూదిమందు ఇచ్చి స్కానింగ్ పరీక్ష కోసం డీబీఆర్ పరీక్షా కేంద్రానికి పంపించారు. స్కానింగ్ చేసిన డీబీఆర్ పరీక్షా కేంద్రం సిబ్బంది ఆమె గర్భంలో ఉన్న శిశువుకి ప్రాణం లేదని తేల్చారు. దీంతో ఒక్కసారిగా షాక్ గురైన పిటిషనర్, కుటుంబ సభ్యులు దీనికి కారణం శశి ఆస్పత్రి సిబ్బందేనని, వారు సూది మందు ఇవ్వడం వల్లే శిశువు మరణించిందని ఆరోపించారు. ఇందుకు కారణమైన ఆస్పత్రి సిబ్బంది, యాజమాన్యంపై చర్యలు తీసుకొని, తమకు పరిహారం ఇప్పించాలని రంగారెడ్డి జిల్లా కమిషన్‌లో కేసు దాఖలు (సీసీ 327 ఆఫ్ 2021) చేశారు.

ప్రతివాది కౌంటర్..

ఆస్పత్రి సిబ్బంది కౌంటర్ దాఖలు చేస్తూ.. ఆస్పత్రిపై పిటిషనర్ చేస్తున్న ఆరోపణలు అవస్తవం.. వారు 9 నవంబర్ 2018న నొప్పులతో ఆస్పత్రికి రాగానే పరీక్షించగా గర్భంలో శిశువు కదలికలు లేవు. ఆమె భరించలేని నొప్పితో బాధపడుతోంది. అస్సలు విషయం తెలుసుకునేందుకు ఆమెకు నొప్పులు దగ్గడం కోసం సూదిమందు ఇచ్చి స్కానింగ్‌కు పంపాం. స్కానింగ్ చేసిన వెంటనే గర్భంలోనే శిశువు మరణించిందని రిపోర్టు రాగానే వారికి తెలియజేశాం. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ప్రసవం చేసి శిశువుని బయటకు తీసి తల్లి ప్రాణాలు కాపాడాలని కోరడంతో, వారి అభ్యర్థన మేరకు తాము చాలా ప్రయత్నించి, ఎలాంటి శస్త్రచికిత్స చేయకుండా సాధారణ పద్ధతిలో ప్రసవం చేసి తల్లి ప్రాణాలను కాపాడాం. అనంతరం వారు తమకు ఎలాంటి ఫీజు చెల్లించకుండా తమ అనుమతి లేకుండానే ఆస్పత్రి నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స కొనసాగించామని, ఈ పిటిషన్ కొట్టివేయాలని కౌంటర్‌లో కోరారు. ఇరువురి వాదనలు విన్న రంగారెడ్డి జిల్లా కమిషన్ అధ్యక్షురాలు లతాకుమారి, మెంబర్లు జవహర్‌బాబు, శ్యామలతో కూడిన బెంచ్ కేసుపై విచారణ చేపట్టింది. రెండో ప్రతివాది అయిన వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం ఒకటో ప్రతివాది అయిన ఆస్పత్రి సిబ్బంది కేవలం పిటిషనర్‌కు వచ్చిన నొప్పులు తగ్గించేందుకే సూదిమందు వాడారని నిర్ధారణ అయ్యింది. అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిపోర్ట్ ఆధారంగా మందు ఇవ్వకముందే గర్భంలో శిశువు కదలికలు లేవని తేలింది. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం ఎక్కడా రుజువు కాలేకపోయినందున పిటిషన్ కొట్టివేస్తున్నట్లు కమిషన్ తేల్చింది.

“ మాతృభాషను గౌరవించాలి..

మాతృభాషను గౌరవించుకోవాలనే తెలుగులో తీర్పు ఇచ్చేందుకు కృషిచేశాం. తెలుగులో తీర్పులు రావడం ద్వారా వినియోగదారుడికి సులువుగా అర్థం అవుతుంది. చాలా మంది వినియోగదారులు చదువులేని వారు కూడా వస్తుంటారు.. మేము తెలుగులో మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంటాం. దీంతో వినియోగదాడికి కోర్టులపై నమ్మకం పెరుగుతుంది.

– చిట్నేని లతాకుమారి, రంగారెడ్డి జిల్లా కమిషన్, అధ్యక్షురాలు

“ తెలుగులో తీర్పు ఇవ్వడం సంతోషం



తెలుగులో తీర్పు ఇవ్వడం నిజంగా నాకు చాలా సంతోషంగా ఉంది. ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టిన నేను ఇక్కడి వరకు వచ్చాను. కానీ చాలామంది గ్రామాల్లో పైచదువులు లేక అక్కడే ఉండిపోతున్నారు. అలాంటి వారికి ఆంగ్లంలో తీర్పులు చదవడం కష్టం. కానీ మాతృభాష (తెలుగు)లో తీర్పులను చాలా స్పష్టంగా చదివి అర్థం చేసుకోగలరు.

– పీవీటీఆర్. జవహర్‌బాబు, రంగారెడ్డి జిల్లా కమిషన్ మెంబర్

“ లీగల్ ప్రొసీడింగ్స్ కూడా తెలుగులో తేవాలి..



మాతృభాషతో వినియోగదారుల కమిషన్ తెలుగులో తీర్పును ఇచ్చినందుకు ఓ న్యాయవాదిగా చాలా గర్వపడుతున్నా. లీగల్ ప్రొసీడింగ్‌తో పాటు వాదనలు, ట్రయల్, ప్రతివాదనలు అన్నీ తెలుగులో ఉంటే బాగుంటుంది. ముమ్ముందు వీటిని కూడా తెలుగులోకి తెచ్చే విధంగా కృషి చేస్తే చాలా బాగుంటుంది. దీని ద్వారా ప్రతి వినియోగదారుడికి తమ కేసులు ఏ విధంగా ముందుకు వెళ్తున్నాయని తెలుసుకోవడంతో పాటు కేసు ప్రక్రియ వారికి పూర్తిగా అర్థం అవుతుంది.

– పి.మల్లేశ్, రంగారెడ్డి కోర్టు న్యాయవాది

నగరంలో నేడు

- ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు, ఎల్లా త్రిమూర్తులమ్మ సహస్ర చంద్రదర్శన మహోత్సవం సందర్భంగా ఎల్లా వెంకటేశ్వరరావుకి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో సాయంత్రం 6 గంటలకు సన్మాన కార్యక్రమం జరుగుతుంది. సభా కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.
- 54 ప్రపంచ రికార్డులను సాధించిన క్లాసికల్ డ్యాన్సర్, పెయింటర్, సింగర్ సొనాలి అచార్జీకి సోమాజీగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుంది.
- ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ కాన్వొకేషన్ వేడుకలు గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో ఉదయం 11 గంటలకు జరుగుతాయి.
- చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌లో స్వచ్ఛత హై సేవ – స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత ర్యాలీ ఉదయం 11.30గంటలకు జరుగుతుంది.
- దీపాంజలి స్కూల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కూచిపూడి విద్యార్థి మహిక పొట్లూరి కూచిపూడి అరంగేట్రం కార్యక్రమం రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అనుమతి లేకపోయినా కొనసాగుతున్న స్కూళ్లు

- అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన డీఎంఎస్‌ఏ



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని అనుమతి రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లా డీఈఓ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. చాలా పాఠశాలలకు ఆటస్థలం లేదని పేర్కొన్నారు. రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో పాఠశాలలు నడుపుతున్నారని ఆరోపించారు. అనుమతులు లేకపోయినా పాఠశాలలు నడుపుతున్నారని, అలాంటి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎమ్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునీల్, వంశీ పాల్గొన్నారు.

తగ్గిన ఉల్లి ధరలు

చాదర్‌ఘాట్: కొత్త పంట రావడంతో ఒక్కసారిగా ఉల్లి ధరలు క్వింటాకు రూ.1,500 తగ్గుముఖం పట్టిందని మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. వారం రోజుల క్రితం క్వింటాకు రూ.5,200 ఉన్న ఉల్లి ధర శుక్రవారం క్వింటాకు రూ.3,300 ధర పలికింది. కర్నూల్ నుంచి 52 లారీల ఉల్లిగడ్డ మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు రావడంతో ఒక్కసారిగా ఉల్లి ధరలు తగ్గాయని ఆయన తెలిపారు. ఇప్పటి నుంచి ఉల్లిగడ్డ(కొత్తగడ్డ) రావడం మొదలవుతుందని, క్రమంగా ఇక ఉల్లి ధరలు తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. మార్కెట్‌లో ఉల్లి హోల్‌సేల్‌గా కిలో రూ.30, మార్కెట్ బయట రూ.35కు విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

16, 17న సాలార్జంగ్ మ్యూజియం బంద్

చార్మినార్: వినాయక నిమజ్జనం ఉత్సవాలతో పాటు మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని రెండు రోజుల పాటు సాలార్జంగ్ మ్యూజియంకు సెలవు ఉంటుందని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో సాలార్జంగ్ మ్యూజియం సందర్శనను అనుమతించడం లేదన్నారు. ఈ విషయాన్ని సందర్శకులు గమనించాలని కోరారు.

ఇద్దరు ఎమ్మెల్యేలు భాష మార్చుకోవాలి

- సైబరాబాద్‌లో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదు
- ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకులదే..
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్ రెడ్డిల మాటల యుద్ధం నేపథ్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డిల వివాదంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక ఎమ్మెల్యే కార్యకర్తలు, నాయకులతో కలిసి మరో ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లే వరకు పోలీసులు చూస్తూ ఉండటం తప్పని ఆయన పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ అంటూ ప్రాంతీయ వివాదాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని అన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు తమ భాషను మార్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం దారుణమన్నారు. వ్యక్తిగత విమర్శలు మంచిది కాదు, కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే గాంధీ దాడి చేయడం సరికాదన్నారు. హైదరాబాద్ ప్రజలందరినీ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి కూడా భాష మార్చుకోవాలని అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే గాంధీ కూడా సంయమనం పాటించాలన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ ఏర్పడిన నాటి నుంచి ఇటువంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీపీ వద్దకు వెళ్తే ఎమ్మెల్యేను అరెస్టు చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి చూడాలన్నారు.


మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మెక్సికోలో ప్రదర్శనకు సామల వేణు



నాంపల్లి: మెక్సికోలో ఈనెల 18 నుంచి 21 వరకు జరిగే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 19వ నోబెల్ శాంతి గ్లోబల్ సమ్మిట్‌లో ప్రదర్శన ఇవ్వడానికి భారతీయ మెజీషియన్‌గా నగరానికి చెందిన సామల వేణుకు అరుదైన అవకాశం లభించింది. నగరం నుంచి శుక్రవారం ఆయన మెక్సికోకు బయలుదేరి వెళ్లారు. అక్కడ జరిగే సమ్మిట్‌లో భారతీయ మెజీషియన్‌గా మ్యాజిక్ చేస్తారు. మ్యాజిక్ రంగంలో 42 ఏళ్ల అనుభవం కలిగిన సామల వేణు ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల్లో ఏడు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించారు. విశిష్టమైన రాష్ట్రపతి అవార్డుతో సత్కారం పొందారు. ఆయన చేసిన విశేషమైన కృషికి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుతం నోబెల్ శాంతి గ్లోబల్ సమ్మిట్‌లో మ్యాజిక్‌ను ప్రదర్శించే అవకాశం రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇది నాకెంతో గర్వకారణమని సామల వేణు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మనదేశం కళలకు పెట్టింది పేరు

- జస్టిస్ చంద్రకుమార్
- ఇంటర్నేషనల్ ఆర్ట్ షో షురూ..
- 150 మందికి పైగా కళాకారుల చిత్రాలు
- ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగింపు


చిత్రాలను తిలకిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్



మాదాపూర్: ఎంతోమంది గొప్ప కళాకారులను ప్రపంచానికి పరిచయం చేసిన దేశం మనదని హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఆర్ట్ షోను ఆయన కళాకారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ మనుషులతో పోలిస్తే ఆర్టిస్టుల దృష్టి భిన్నంగా ఉంటుందని తెలిపారు. వాళ్లు ప్రపంచాన్ని ఎంతో కళాత్మకంగా చూపిస్తారని కొనియాడారు. మన దేశం కళలకు పెట్టింది పేరని అన్నారు. నిర్వాహకులు క్యూరేటర్ స్టాలిన్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు ఈ ఆర్ట్ షో కొనసాగుతుందన్నారు. వివిధ దేశాలకు చెందిన కళాకారులు 150 మందికి పైగా పాల్గొన్నారన్నారు. విభిన్న రకాల పెయింటింగ్స్‌ను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సౌత్ ఇండియాలోనే తొలిసారిగా పికాసో ఒరిజినల్ ఆర్ట్ ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డాక్టర్ అమిత్‌సాధుఖాన్, క్యూరేటర్లు శంకర్, అశోక్ మచ్చ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాలకు మేలు

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి


కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

ముషీరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా పాలన కొనసాగిస్తున్నారని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం బి–బ్లాక్ కమిటీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కోదండరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.అంజిరెడ్డి, ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు జీఎస్.చారి, సీనియర్ నాయకులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావుకు భారతరత్న ఇవ్వాలి


డాక్టర్ సుమన్ తల్వార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి, చిత్రంలో సారిపల్లి కొండలరావు, కేవీ కృష్ణకుమారి, ఓలేటి పార్వతీశం, లంక లక్ష్మీ నారాయణ, మహ్మద్ రఫీ

నాంపల్లి: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహిని సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా నిర్వహించిన 30వ ఉభయ తెలుగు రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు–2024 ముగిశాయి. శుక్రవారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఈ ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ కథా నాయకులు డాక్టర్ సుమన్ తల్వార్‌కు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు అభినయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి హాజరయ్యారు. సినీ కథా నాయకులు డాక్టర్ సుమన్ తల్వార్‌ను సత్కరించి ప్రసంగించారు. తెలుగు వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావుకు భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని పురస్కార గ్రహీత డాక్టర్ సుమన్ తల్వార్ పేర్కొన్నారు. అనంతరం నాటిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ప్రముఖ రచయిత్రి కేవీ కృష్ణమూర్తి, కళాపత్రిక సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ, యువ కళావాహిని సంస్థ అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జున రావు, ఉపాధ్యక్షులు బొప్పన నరసింహారావు, ఎం.ఏ.హమీద్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టర్ వంశీకి అభినందనలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి వారి ప్రతిభకు ప్రోత్సాహం కల్పించే విధంగా సమగ్రమైన నూతన క్రీడా విధానాన్ని రూపొందిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎల్బీస్టేడియంలో అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించి, త్వరలో జరగబోతున్న కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు ఎం.వంశీని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒలింపిక్ క్రీడా అంశాలతో పాటు ఇతర క్రీడా అంశాలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చేవిధంగా మార్గదర్శకాలు రూపొందిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, స్పోర్ట్స్ ఎండీ సోనిబాలాదేవి పాల్గొన్నారు.


వంశీని అభినందిస్తున్న శివసేనారెడ్డి

హైటెక్స్‌లో ప్రారంభమైన ఇండెక్స్‌పో

- 3 రోజుల పాటు కొనసాగనున్న ప్రదర్శనలో 100కి పైగా స్టాల్స్
- విద్యార్థుల సందర్శనకు మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు..
- సందర్శకులకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు..


ఇండెక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్ తదితరులు

మాదాపూర్: తయారీరంగంలో వస్తున్న నూతన సాంకేతిక ప్రక్రియలను తెలుసుకుని తమ ఉత్పాదకతను మెరుగు పర్చుకోవచ్చని, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ ఎక్స్‌పో(ఇండెక్స్‌పో)ను ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్, ఇండోర్ ఇన్ఫోలైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఆర్‌కె. అగర్వాల్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ పారిశ్రామిక ప్రదర్శనల సంస్థ ఇండోర్ ఇన్ఫోలైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సందర్శించి తయారీ రంగంలో వస్తున్న తాజా సాంకేతిక ప్రక్రియలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రదర్శన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, తయారీదారులు తమ నెట్‌వర్కింగ్ వ్యాపార విస్తరణకు గొప్ప అవకాశాలు కలిగిస్తుందన్నారు.

ఆకట్టుకుంటున్న పారిశ్రామిక ఉత్పత్తులు..

పారిశ్రామిక ఎక్స్‌పోలో లేజర్ కటింగ్ మిషన్లు, చేతి పనిముట్లు, మిషన్‌టూల్స్, స్టీల్ ఉత్పత్తులు, ఆటోమెషన్, ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఎక్స్‌పోలో ప్రత్యేకంగా రూఫ్‌టాప్ ఎనర్జీ(పైకప్పు పైన ఇంధనం) ప్లాంట్లపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ ఎనర్జీకి సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ప్రయోజనాల గురించి ఈ ప్రదర్శనలో వివరిస్తున్నట్లు తెలిపారు.

100కి పైగా ఎగ్జిబిటర్లు..

దేశంలోని నలుమూలల నుంచి హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, బెంగళూరు, చెన్నై, ముంబై వంటి నగరాల నుంచి 100కి పైగా ఎగ్జిబిటర్లు ఎక్స్‌పోలో పాల్గొని తమ ఉత్పత్తులు, అందిస్తున్న సేవలను సందర్శకులకు వివరిస్తున్నారు. ఇండెక్స్‌పో హైదరాబాద్ ప్రదర్శనకు ఎంఎస్ఎంఈ, మంత్రిత్వశాఖ మద్దతు అందించడమే కాకుండా ప్రదర్శనలో పాల్గొనే వారికి సబ్సిడీ అందిస్తోంది.

విద్యార్థులకు సందర్శన..

విద్యార్థులు ప్రతిరోజు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య ఈ ఎక్స్‌పోను సందర్శించి తాజాప్లాంట్స్, వివిధ రకాల పారిశ్రామిక యంత్ర పరికరాల గురించి స్టాల్స్ నిర్వాహకుల వద్ద అడిగి తెలుసుకోవచ్చు. ఉదయం 11 నుంచి సాయంత్రం 6గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శనివారం, 14, సెప్టెంబర్, 2024



ఒకప్పుడు ఆదివారం వస్తే చాలు ఉదయం చాయ్ తాగి ఇంట్లో నుంచి బయటకు వెళ్తే సాయంత్రం ఆరు గంటల వరకూ కూడా ఇంటికి రాకుండా క్రికెట్ ఆడిన రోజులు పాత తరం యువతకు చాలామందికి అనుభవమే. అలాగే క్రికెట్ చూడాలంటే కనీసం 5 నుంచి 7 కి.మీ. ప్రయాణించి టీవీ చూసి వచ్చిన రోజులూ ఉన్నాయి.. క్రికెట్ అంటే అంత పిచ్చి.. అంత అభిమానం ఉండేది. ఇప్పుడు కూడా ఆ అభిమానం అస్సలు మారలేదు. కానీ రూపు మార్చుకుంది. గల్లీ క్రికెట్ కాస్త పోష్ క్రికెట్ అయ్యింది. అకాడమీల్లో గంటకు కొంత డబ్బులు చెల్లించి ప్రొఫెషనల్ క్రికెట్ ఆడుతున్నారు. అంతేనా లోకల్ మ్యాచ్‌ల నుంచి జాతీయ స్థాయి మ్యాచ్‌ల స్థాయికి చేరుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ వైబ్స్

లోకల్ హిట్టర్స్..

కొట్టాలి సిక్స్.. అది ఫిక్స్..!

నగరంలో క్రికెట్ ట్రైనింగ్‌పై పెరుగుతున్న క్రేజ్

చిన్నతనం నుంచే అకాడమీల్లో చేరుతున్న పిల్లలు

- రోజుకు కనీసం 8 గంటల పాటు ప్రాక్టీస్
- మెళకువలతో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి
- బౌండరీలు దాటుతున్న లోకల్ టాలెంట్
- ఐపీఎల్ వరకూ ఎదిగేందుకు అడుగులు

క్రికెట్.. భారతదేశంలో ఒక మతం. దేశంలో క్రికెట్‌ను ఆరాధించని వారు లేరంటే అతిశయోక్తి కాదు. క్రికెట్ మ్యాచ్ వస్తుందంటే చాలు చిన్నా పెద్దా, ఆడా మగ తేడా లేకుండా టీవీలకు అతుక్కుపోతుంటారు. క్రికెట్ ఆడటం అంటే చిన్నప్పటి నుంచే క్రేజ్. గల్లీ క్రికెట్‌లో ఆడుతూ మంచి షాట్ కొడుతూ తమను తామే సచిన్ టెండుల్కర్, విరాట్‌కోహ్లి అనుకుంటూ సంబరపడిపోతుంటారు. అయితే ఒకప్పుడు క్రికెట్ అంటే కేవలం వినోదం కోసం చూడటమో.. ఆడటమో చేస్తుండేవారు. కానీ నేటి తరం క్రికెట్‌ను కూడా తమ కెరీర్‌గా మార్చుకుంటున్నారు. క్రికెట్ కాస్త ఖరీదైన వ్యవహారమే అయినా.. ఎలాగైనా కష్టపడి రంజీ లేదా ఐపీఎల్ ఆడి తమ సత్తా చూపాలని తాపత్రయపడుతున్నారు. అందుకోసం చిన్నతనం నుంచే గ్రౌండ్‌లో చెమటలు చిందిస్తున్నారు.



ఎప్పటికైనా జాతీయ స్థాయిలో ఆడకపోతామా అనే ధీమాతో ముందుకు వెళ్తున్నారు. క్రికెట్‌ను కెరీర్‌గా చేసుకునే వారికి చాలా నిబద్ధతతో శిక్షణ ఇచ్చే కోచింగ్ సెంటర్లు నగరంలో భారీగా వెలిశాయి. అసలు కోచింగ్ సెంటర్లు పిల్లలను క్రికెటర్లుగా ఎలా మలుస్తున్నాయి.. ఎన్ని గంటల పాటు వారికి శిక్షణ ఇస్తున్నాయి.. ఎలా కష్టపడితే ఐపీఎల్ లేదా జాతీయ స్థాయిలో ఆడేందుకు అవకాశం వస్తుంది.. అనే విషయాలను తెలుసుకుందాం..!

ఏడో యేటనుంచే..

సాధారణంగా క్రికెట్ అకాడమీల్లో పిల్లలు ఏడేళ్ల వయసు నుంచే చేరుతుంటారు. అందరూ క్రికెట్‌ను కెరీర్‌గా మలచుకునేందుకు చేరరు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు ఫిట్‌గా ఉండాలనే ఉద్దేశంతో చిన్నతనంలోనే క్రికెట్ అకాడమీల్లో చేర్పిస్తుంటారు. మిగిలిన వారంతా క్రికెటర్లుగా చూడాలనే ఉద్దేశంతోనే అకాడమీల్లో చేర్పిస్తుంటారు. మొదటి రెండేళ్ల వరకూ టెన్నిస్ బాల్, ప్లాస్టిక్ బాల్‌తో ఆడిస్తారు. 12 ఏళ్లు దాటిన తర్వాత లెదర్ బాల్‌తో నెట్స్‌లో ఆడిస్తుంటారు. ఈ సమయంలోనే బ్యాచ్‌లుగా వేరు చేసి, వారి ఆట తీరునుబట్టి తర్ఫీదు ఇస్తుంటారు.



ఒక్కో రోజు ఒక్కో సెషన్..

సాధారణంగా క్రికెట్ ఆడాలంటే బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని అంశాల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందాల్సి ఉంటుంది. రోజుకో అంశంలో పిల్లలకు కోచ్ శిక్షణ ఇస్తుంటారు. ఒక రోజు బ్యాటింగ్ అయితే మరో రోజు బౌలింగ్, ఇంకో రోజు నాకింగ్, ఫీల్డింగ్‌లో ప్రాక్టీస్ చేయిస్తుంటారు. క్యాచ్‌లు పట్టే విధానంలో కూడా మెళకువలు నేర్పిస్తుంటారు. దీంతో పాటు క్రికెట్ ఫిట్‌నెస్ కూడా ముఖ్యం. ఇందులో భాగంగా జంపింగ్స్, ఫాస్ట్ రన్నింగ్, డ్రిల్స్ చేయిస్తుంటారు.

కష్టపడితే ఎన్నో అవకాశాలు..

క్రికెట్‌లో రాణించడం ఒకప్పుడు డబ్బులపైనే ఆధారపడి ఉండేది. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారాయి. కష్టపడి మంచి ఆటతీరు కనబరిస్తే ఎంతో ఎత్తుకు వెళ్లే అవకాశాలు ఉంటాయని పలువురు కోచ్‌లు చెబుతున్నారు. టాలెంట్ ఉన్న వారికి అవకాశాలు ఎదురుచూస్తూనే ఉంటాయని, ఎట్టి పరిస్థితుల్లో కుంగిపోకుండా ముందుకు వెళ్లాలని చెబుతున్నారు.



క్వాలిఫైడ్ ట్రైనర్స్‌తో..

క్రికెట్ కోసం చాలా మంది అకాడమీకి వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ శిక్షణ ఇస్తుంటాం. దాదాపు 15 మంది మా అకాడమీ నుంచి రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అయ్యారు. వారికి ఎప్పటికప్పుడు ఆటలో మెళకువలు నేర్పించేందుకు క్వాలిఫైడ్ ట్రైనర్స్ ఉంటారు. మానసికంగా కూడా వారికి కావాల్సిన మద్దతు ఇస్తుంటాం.
– కల్యాణ్, క్రికెట్ కోచ్, కూకట్‌పల్లి

అకాడమీ ఎంచుకునే ముందు..

చాలా అకాడమీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ ట్రెండ్‌ను క్యాష్ చేసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారి వద్ద చేరితే సమయంతో పాటు డబ్బు కూడా వృథా అవుతుంది. కమర్షియల్‌గా, బాక్స్ క్రికెట్ మాదిరిగా ఉండే అకాడమీలు కూడా ఉన్నాయి. అందుకే అకాడమీల్లో చేరేముందు అది ఎలాంటి అకాడమీ.. వాళ్లు ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు.. ఎంత సమయం ప్రాక్టీస్ చేయిస్తారు అనే విషయాలు ముందే చూసుకుని చేర్పిస్తే మంచిదని పలువురు శిక్షకులు సూచిస్తున్నారు.

భారత్ తరపున ఆడించాలనే లక్ష్యంతో..

ప్రతి అకాడమీ కూడా తమ పిల్లలను భారత జట్టులో చూసుకోవాలన్నదే లక్ష్యంగా పెట్టుకుంటాయి. అందుకోసం వారు మెళకువలు నేర్చుకోవడంతో పాటు వాటిని పిల్లలకు నేర్పిస్తుంటారు. ప్రతి వారం మ్యాచ్‌లు పెట్టి వారి ఆటతీరును పరిశీలిస్తుంటారు. సీజనల్ మ్యాచ్‌లు అంటే జూన్-జులైలో జరిగే వన్ డే, టూడే, త్రీడే లీగ్ మ్యాచ్‌లకు కూడా వెళ్లి పాల్గొంటారు. హెచ్‌సీఏ నుంచి జరిగే లీగ్ మ్యాచ్‌లలో బాగా ఆడితే అండర్-14, -16, -19 స్టేట్ టీమ్స్‌కు ఆడే అవకాశం వస్తుంది. అక్కడ ఎవరైనా మంచి పెర్ఫార్మెన్స్ చేస్తే రంజీ ఆడే అవకాశం ఉంటుంది.



ఆసక్తి చూపుతున్న అమ్మాయిలు..

ఇటీవల కాలంలో అమ్మాయిలు కూడా క్రికెట్‌పై ఎంతో ఆసక్తి చూపుతున్నారు. వారికి కూడా అబ్బాయిలతో పాటు సమానంగా అకాడమీ నుంచి శిక్షణ ఇస్తుంటాం. కావ్యశ్రీ అనే అమ్మాయి ఇటీవల సీనియర్ వుమెన్స్ రంజీ ట్రోఫీలో ఆడుతున్నారు. ఆమెతో పాటు మరో నలుగురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలు స్టేట్ లెవల్ టీమ్స్‌లో ఆడే అవకాశం దక్కించుకున్నారు. వారిలో ఒకరినైనా ఇండియా జట్టులో చూడాలనేదే మా ఆశ.
– తలకంటి సతీశ్‌రెడ్డి, ఎంఎస్‌డీ క్రికెట్ అకాడమీ, మేడిపల్లి



రోజుకు ఎనిమిది గంటల ప్రాక్టీస్

క్రికెట్ అకాడమీల్లో చాలావరకూ ఉదయం 5– 5.30 గంటల నుంచే దినచర్య ప్రారంభం అవుతుంది. రెండు గంటల పాటు ప్రాక్టీస్ చేస్తుంటారు. ఆ తర్వాత కాసేపు బ్రేక్ ఫాస్ట్ చేసిన తర్వాత మళ్లీ ప్రాక్టీస్ చేస్తుంటారు. మళ్లీ మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్లీ రాత్రి 7 గంటల వరకూ ప్రాక్టీస్ చేస్తుంటారు. బౌలింగ్ మెషీన్స్, నెట్ సెషన్స్, సైడ్ ఆర్మ్ ప్రాక్టీస్ చేస్తుంటారు. వీరి వెన్నంటే ఉండే కోచ్‌లు ఎప్పటికప్పుడు వారికి ఆటలో తప్పులు అర్థం చేసుకుని ఆటగాళ్లు ఆడే విధానంలో మార్పులు చేస్తుంటారు. ఎక్కడైనా టోర్నమెంట్స్‌కు వెళ్లినప్పుడు వేరే అకాడమీ లేదా వేరే జట్టు ఆటగాళ్లు ఆడే తీరును కూడా పరిశీలించి.. తమ అకాడమీ పిల్లల ఆటలో ఎలాంటి మార్పులు చేస్తే బాగుంటుందనే విషయాలను వారికి చెబుతుంటారు. ఇలా రోజులో కనీసం 8 నుంచి 9 గంటల పాటు గ్రౌండ్‌లోనే ప్రాక్టీస్ చేస్తూ ఎప్పటికప్పుడు తమ ఆటతీరును అప్‌డేట్ చేసుకుంటారు.



మేడ్చల్‌లో సీఎంఆర్ మాల్

ప్రారంభించిన సినీనటుడు | విశ్వక్‌సేన్

మేడ్చల్: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినీనటుడు విశ్వక్‌సేన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలు ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాల్లో సీఎంఆర్ నాలుగు దశాబ్దాలుగా వస్త్ర వ్యాపారంలో క్వాలిటీకి, డిజైన్స్‌కు ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అగ్రగామిగా కొనసాగుతూ కొనుగోలుదారుల మన్ననలు పొందుతున్నారని అన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా మాల్‌లో ఆయన పలు వస్త్రాలను కొనుగోలు చేసి అభిమానులకు ఉచితంగా అందజేశారు. అభిమానులతో సెల్ఫీలు దిగి వారిలో ఉత్సాహాన్ని నింపారు. సీఎంఆర్ మాల్ చైర్మన్ మావూరి వెంకట రమణ మాట్లాడుతూ మేడ్చల్‌లో సీఎంఆర్ 34వ షోరూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. మేడ్చల్ ప్రాంత ప్రజలకు సీఎంఆర్ అత్యున్నత అనుభూతి కలిగేలా చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



నో స్ట్రింగ్స్ కాఫీ ఫెస్టివల్..

నగరంలో తొలిసారిగా 'ది ఇండియన్ కాఫీ'

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన నో స్ట్రింగ్స్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో కాఫీ ప్రియుల కోసం నగరంలో తొలిసారిగా ది ఇండియన్ కాఫీ ఫెస్టివల్ కొలువుదీరింది. జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటైన ఈ ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆసియాలోనే తొలి కాఫీ మహిళగా పేరొందిన సునాలిని మీనన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఫెస్టివల్‌లో భాగంగా కాఫీ ఆర్ట్ సెషన్స్, బరిస్తా డిస్‌ప్లే, నిపుణుల చర్చలు.. తదితర విశేషాంశాలకు చోటు కల్పించారు. అదే విధంగా కుటుంబాలు, చిన్నారులు, పెట్స్ కోసం విభిన్న రకాల ఈవెంట్స్ కూడా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కరాఫా కాఫీ, ట్రూ బ్లాక్ కాఫీ, బిగ్ స్టార్ కేఫ్, అరకు కాఫీ, ఎంఎస్‌పీ హిల్ రోస్టర్స్.. తదితర ప్రముఖ బ్రాండ్లన్నీ కొలువుదీరాయి. ఈ ఫెస్టివల్ ఈ నెల 15 వరకూ కొనసాగుతుంది.



50 ప్రముఖ కంపెనీల ఆభరణాల ప్రదర్శన





ఆసియా జ్యువెల్స్ షో

సాక్షి, సిటీబ్యూరో: సౌత్ ఇండియాలోనే ఎంతో ఆదరణ పొందిన ఆసియా జ్యువెల్స్ షో 52వ ఎడిషన్ శుక్రవారం గ్రాండ్‌గా ప్రారంభమైంది. బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ కృష్ణ ఈ వేడుకకు వేదికైంది. ఈ ప్రారంభ వేడుకకు ప్రముఖ నటి వర్షిణి సౌందరాజన్, సిరిపాప, ఆభరణాల ప్రియులు హాజరయ్యారు. ఈ షో సెప్టెంబర్ 14, 15వ తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది. దేశంలోని ప్రఖ్యాతిగాంచిన డిజైనర్లు రూపొందించిన ఎక్స్‌క్లూజివ్ డిజైన్ ఆభరణాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. బంగారు ఆభరణాలతో పాటు వజ్రాలు, సంప్రదాయ ఆభరణాలతో పాటు లేటెస్ట్ జ్యువెల్లరీ కూడా అందుబాటులో ఉంచారు. దేశంలోని 50 ప్రముఖ కంపెనీలకు చెందిన ఆభరణాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచామని, రానున్న పెళ్లిళ్ల సీజన్ కోసం ప్రత్యేకంగా వధువుల కోసం రూపొందించిన స్పెషల్ కలెక్షన్ అందుబాటులో ఉంచామని షో నిర్వాహకుడు హరీశ్ సచ్‌దేవ్ వివరించారు.

వైద్య విద్య సీట్లపై 'ప్రైవేటు' కన్ను!

సీట్లన్నీ మేనేజ్‌మెంట్ కోటాగా మార్చుకునేందుకు వ్యూహాలు

- ఇందుకోసం డీమ్డ్ యూనివర్సిటీలుగా మారేందుకు యత్నాలు
- ఇలాగైతే పేదలకు అందే 50 శాతం కన్వీనర్ సీట్లకు మంగళం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లూ వర్తించని పరిస్థితి
- ఇప్పటికే రాష్ట్రంలో రెండు కాలేజీలు డీమ్డ్ వర్సిటీలుగా మారిన తీరు
- అదే దారిలో యూజీసీకి దరఖాస్తు చేసుకున్న మరో రెండు మెడికల్ కాలేజీలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు పేదలకు అందే కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లను కొల్లగొట్టేందుకు వ్యూహం పన్నుతున్నాయి. డీమ్డ్ యూనివర్సిటీలుగా హోదా తెచ్చుకుని.. ప్రభుత్వ నియంత్రణ లేకుండా తమదైన నిబంధనలు అమలు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. కన్వీనర్ కోటా సీట్లను మేనేజ్‌మెంట్ సీట్లుగా మార్చుకోవడమేకాదు.. ఫీజులను ఇష్టారీతిన పెంచుకోవడం, రిజర్వేషన్లు ఎత్తేయడం, సొంతంగానే పరీక్షలు పెట్టుకోవడం వంటి చర్యల ద్వారా అంతా సొంత రాజ్యాలుగా మార్చుకునేందుకు ఈ మార్గం ఎంచుకుంటున్నాయి. 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)'నుంచి డీమ్డ్ వర్సిటీలుగా అనుమతులు తెచ్చుకుంటాయి. ప్రతిభ ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులు డాక్టర్ కావాలన్న కలలకు ఈ తీరు దెబ్బకొట్టనుంది.

ఇప్పటికే రెండు కాలేజీలకు..

ఇటీవలే మల్లారెడ్డి మెడికల్, డెంటల్ కాలేజీలకు యూజీసీ డీమ్డ్ యూనివర్సిటీ హోదాను మంజూరు చేసింది. అపోలో, సీఎంఆర్ మెడికల్ కాలేజీలు కూడా డీమ్డ్ యూనివర్సిటీ హోదా కోసం యూజీసీకి దరఖాస్తు చేసుకున్నాయని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు వెల్లడించాయి. ముందు ముందు మరికొన్ని కాలేజీలు ఇదే బాటన నడిచేందుకు సిద్ధమవుతున్నట్టు కూడా తెలిసింది. ఈ పరిణామాలపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా నేరుగా యూజీసీకే దరఖాస్తు చేసుకుంటూ పోతే ఎలాగని.. దీనిపై తనకు నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

ఇష్టారాజ్యంగా సీట్ల భర్తీ కోసం..

రాష్ట్రంలో మొత్తం 64 మెడికల్ కాలేజీలున్నాయి. అందులో 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు కాగా.. 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,090 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రభుత్వంలోని ఎంబీబీఎస్ సీట్లన్నీ కూడా కన్వీనర్ కోటాలోనే భర్తీ చేస్తారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని సీట్లలో సగం కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. వాటి ఫీజు ఏడాదికి రూ.60 వేలు మాత్రమే. డీమ్డ్ వర్సిటీలుగా మారిన మెడికల్ కాలేజీల్లో ఈ కన్వీనర్ కోటా సీట్లన్నీ మేనేజ్‌మెంట్ కోటాలోకి మారిపోతాయి. మొత్తం సీట్లన్నీ కాలేజీల చేతిలోకే వెళ్లిపోతాయి. మల్లారెడ్డి మెడికల్ కాలేజీల్లో 400 ఎంబీబీఎస్ సీట్లుండగా... అందులో 200 సీట్లు కన్వీనర్ కోటాలోకి రావాలి. కానీ వాటికి డీమ్డ్ వర్సిటీ హోదా రావడంతో.. అవన్నీ మేనేజ్‌మెంట్ కోటాలోకే వెళ్లిపోయాయి. ఇక డీమ్డ్ వర్సిటీ కాలేజీల్లో స్థానిక అభ్యర్థులకు కోటా ఉండదు. దేశంలోని ఏ రాష్ట్ర విద్యార్థులైనా వచ్చి చేరవచ్చు. అంతేకాదు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఉండవు. ఫీజులు నిర్ణయించుకునే అధికారం కూడా యాజమాన్యాలకే ఉంటుంది. పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల మూల్యాంకనం కూడా యాజమాన్యాలే నిర్వహించుకుంటాయి. అంటే ఆ మెడికల్ కాలేజీలు పూర్తిగా యాజమాన్యాల సొంత రాజ్యాలుగా మారిపోతాయి. కన్వీనర్ కోటా సీట్లలో చాలా వరకు ప్రతిభ ఉన్న పేద విద్యార్థులే దక్కించుకుంటారు. ఇప్పుడు వాటి సంఖ్య తగ్గిపోతుండటంతో వారికి అన్యాయం జరుగుతుంది. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకూ నష్టదాయకమేకావడం ఆందోళనకరం.

సీఎం కనుసన్నల్లోనే దాడులు!

- కాంగ్రెస్ గూండాలను వదిలి బీఆర్ఎస్ నేతల అరెస్టులా?: కేటీఆర్
- ఇది ప్రభుత్వ దిగజారుడుతనం.. ఈ జులుంను సహించేది లేదు
- ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ప్రజాపాలనలో ప్రతిపక్షాలు సమావేశం పెట్టుకునేందుకు కూడా అనుమతులు లేవా అనిప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం దారుణమని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ పార్టీ సమావేశం పెట్టుకుంటే ముఖ్యమంత్రి వెన్నులో వణుకు వస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంపై దాడి చేసిన అరికెపూడి గాంధీ అనుచరులు, గూండాలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వ జులుంను సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ అప్రజాస్వామిక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని.. ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులపై సీఎం కనుసన్నల్లోనే గూండాలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూ లేని రీతిలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని రేవంత్ తీసుకొచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని వ్యాఖ్యానించారు.

ఎమర్జెన్సీకన్నా దారుణం

ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా నేతల అరెస్టులు అన్యాయం: హరీశ్‌రావు

అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి మరీ కౌశిక్‌రెడ్డిపై దాడి చేయించారు

- సీఎం బజారు భాష వల్లే రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం.. మీడియా లీకులు, చిట్ చాట్‌లతో శాంతిభద్రతలు సాధ్యం కావు
- ఫిర్యాదు చేయడానికి వెళ్తే అరెస్టు చేసి అటవీ ప్రాంతాల్లో తిప్పారని మండిపాటు



మాట్లాడుతున్న హరీశ్ రావు. చిత్రంలో దేవీ ప్రసాద్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎమర్జెన్సీ కన్నా దారుణ పరిస్థితులు నెలకొన్నాయని.. సీఎం రేవంత్ చేస్తున్న రాజకీయ డ్రామాలతో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు బీఆర్ఎస్ నేతల అరెస్టులు దుర్మార్గమని విమర్శించారు. బీఆర్ఎస్‌పై, కేసీఆర్‌పై ఉన్న కక్షను తెలంగాణ మీద చూపుతున్నారని.. నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని నియంతృత్వ పోకడలతో నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ వైఖరి వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. గురువారం కోకాపేటలోని తన నివాసంలో ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పార్టీ నేతలు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ''శాంతి భద్రతలను అదుపు చేయకుండా హైదరాబాద్, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ గురించి రేవంత్ మాట్లాడటం సిగ్గు చేటు. రేవంత్, డీజీపీ ఎమ్మెల్యే గాంధీకి బందోబస్తు ఇచ్చి ఎమ్మెల్యే కౌశిక్ నివాసంపై దాడులు చేయించారు. కౌశిక్ నివాసంపై దాడి చేసింది గాంధీ కాదు సీఎం రేవంత్. బీఆర్ఎస్ నేతలను గృహ నిర్బంధం చేసిన పోలీసులు గాంధీని ఎందుకు నిర్బంధించలేదు?''అని ప్రశ్నించారు. హత్యాయత్నం చేసిన అరికెపూడి, ఆయన అనుచరులను బందోబస్తు మధ్య ఇంటికి పంపి.. తమను మాత్రం అరెస్టు చేసి అర్ధరాత్రి అటవీ ప్రాంతాల్లో తిప్పారని విమర్శించారు.

భాషను మార్చుకోకుండా నీతులా?

సీఎం రేవంత్ తన అసభ్య, సంస్కారహీనమైన భాషను మార్చుకోకుండా యూట్యూబ్ చానళ్లకు నీతులు చెబుతున్నారని.. తొమ్మిది నెలలుగా పాలనపై కాకుండా పైసలపై దృష్టి పెట్టడంతో శాంతి భద్రతలు పాతాళానికి పడిపోయాయని హరీశ్‌రావు ఆరోపించారు. ''మీడియాకు లీకులు, చిట్‌చాట్‌లతో శాంతి భద్రతలు అదుపులోకి రావు. సీఎం వాడుతున్న బజారు భాషతో రాష్ట్రంలో విద్వేషాలు చెలరేగి ప్రశాంతత మంటగలుస్తోంది. పార్టీ ఫిరాయింపులపై సీఎం ఢిల్లీలో ఒకలా, గల్లీలో మరోలా మాట్లాడుతున్నారు. పీఏసీ చైర్మన్ నియామకంలో రేవంత్ వ్యాఖ్యలు దుర్మార్గం. డీజీపీ రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడటం దారుణం''అని విమర్శించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు, పీఏసీ చైర్మన్ నియామకాన్ని వ్యక్తుల మధ్య కొట్లాటగా చిత్రీకరించి పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

క్లుప్తంగా...

కౌశిక్‌రెడ్డిపై అనర్హత వేటు వేయండి

స్పీకర్‌కు మహిళా కాంగ్రెస్ నేతల వినతి

సాక్షి, హైదరాబాద్: చట్ట సభకు ఎన్నికై మహిళల పట్ల అసభ్యంగా వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ నేతలు శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌ను కోరారు. కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు వేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల సముదాయంలో తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ బి.శోభారాణి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భవానీరెడ్డి, సంధ్యారెడ్డి, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ పారిజాత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వరలక్ష్మి తదితరులు స్పీకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు అరికెపూడి ఆంధ్ర అని తెలీదా?

కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాశోభన్



సాక్షి, హైదరాబాద్: బతకడానికి వచ్చావంటూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాశోభన్ ఖండించారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు అరికెపూడి గాంధీ ఆంధ్ర నుంచి వచ్చారనే విషయం తెలియదా? అని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇన్నాళ్లు ఓట్ల కోసం ఆంధ్ర సెంటిమెంట్‌తో రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకున్నారని, ఆంధ్రవారికి ముళ్లు గుచ్చితే కేసీఆర్ తన పంటితో తీస్తానని ఓట్లు వేయించుకున్నారని ఇందిరా ఆరోపించారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్‌రెడ్డిపై డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు పరిపాలన కొత్త కాదు


వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వానికి పరిపాలన ఎలా చేయాలో తెలుసని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం, సంక్షేమ పథకాలను అమలు చేయడం కాంగ్రెస్‌కు కొత్తకాదన్నారు. శుక్రవారం సీఎల్పీలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో కేసీఆర్ హైదరాబాద్‌కు చేసిందేమీ లేదని, తీగల వంతెన, సెల్ఫీ పాయింట్లతో ప్రజలను మభ్య పెట్టారని విమర్శించారు. గత కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌కు వేసిన అభివృద్ధి పునాదులే ఇప్పుడు ముందుకు తీసుకెళ్తున్నాయని మేఘారెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోతుందని హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి వీధిగూండాల్లా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

దాడుల సంస్కృతిని కాంగ్రెస్ ఆహ్వానిస్తోందా?

దేశపతి శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: దాడుల సంస్కృతి రాష్ట్రానికి మంచిది కాదని, పోరాడి తెచ్చుకున్న తెలంగాణను నాశనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలపై దాడులు పెరుగుతున్నాయని, దాడుల సంస్కృతిని కాంగ్రెస్ ఆహ్వానిస్తోందా? అని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి వివాదంలో ఆంధ్ర, తెలంగాణ వివాదం లేదని, సీఎం కావాలనే దాన్ని వివాదంగా చేయాలని చూస్తున్నారని శ్రీనివాస్ ఆరోపించారు.

బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధం

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్తామన్న బీఆర్ఎస్ ప్రకటనతో అలర్ట్ ● రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు

సాక్షి, హైదరాబాద్/ దుండిగల్/ గచ్చిబౌలి: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంపై దాడి, తదనంతర పరిణామాల నేపథ్యంలో.. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గురువారం అర్ధరాత్రి నుంచే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మాజీ మంత్రి హరీశ్‌రావును, ఎమ్మెల్యేలను హౌజ్ అరెస్టు చేసి, నివాసం నుంచి బయటికి రాకుండా అడ్డుకున్నారు. నేతలతోపాటు క్షేత్రస్థాయి క్రియాశీల నాయకులు, కార్యకర్తలను కూడా పోలీస్ స్టేషన్లకు రావాలంటూ ఆదేశించడం గమనార్హం.

ఎక్కడికక్కడ బలగాల మోహరింపుతో..

ఫిరాయింపుల అంశంపై వివాదం, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంపై దాడి నేపథ్యంలో.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ గురువారం రాత్రి ప్రకటించింది. దీనితో అప్రమత్తమైన పోలీసులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ఇతర ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద శుక్రవారం తెల్లవారుజాము నుంచే భారీగా మోహరించారు. జిల్లాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను హౌస్ అరెస్టు చేశారు. పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేసేందుకు ప్రయత్నించగా.. అడ్డుకుని అరెస్టులు చేశారు.



గృహనిర్బంధంలో శంభీపూర్‌రాజు, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

ఆస్పత్రికి వెళ్లకుండా అడ్డుకుని..

మంత్రి హరీశ్‌రావు కేశంపేట పోలీసు స్టేషన్ నుంచి విడుదలయ్యాక శుక్రవారం తెల్లవారుజామున కోకాపేటలోని తన నివాసానికి చేరుకున్నారు. అప్పట్నుంచే అక్కడ పోలీసులు మోహరించారు. పార్టీ నేతలెవరూ హరీశ్‌రావు ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. గురువారం నాటి తోపులాటలో భుజానికి గాయమై నొప్పితో బాధపడుతున్న హరీశ్‌రావు.. ఆస్పత్రికి వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. దీంతో హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు భుజానికి గాయమైన హరీశ్‌రావును పరామర్శించేందుకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి,, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, పార్టీ నేతలు జైపాల్‌రెడ్డి తదితరులు ఆయన ఇంటి వద్దకు రాగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు పోలీసుల తీరును నిరసిస్తూ అక్కడే బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం తర్వాత పోలీసులు హరీశ్‌రావును ఆస్పత్రికి వెళ్లేందుకు అనుమతించారు. దీంతో ఆయన గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఎడమ భుజానికి స్కానింగ్‌తోపాటు ఇతర వైద్య పరీక్షలు చేశారు. పదిహేను రోజుల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాలని హరీశ్‌కు వైద్యులు సూచించారు.

శంభీపూర్ రాజు నివాసం వద్ద ఉద్రిక్తత

మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు నివాసం నుంచి అరికెపూడి ఇంటికి వెళతామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించిన నేపథ్యంలో.. శుక్రవారం తెల్లవారుజాము నుంచే అక్కడ పోలీసులు భారీగా మోహరించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అప్పటికే శంభీపూర్ రాజు ఇంటికి చేరుకున్నారు. ఈ ఇద్దరినీ పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. ఆ ఇంటి పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో శంభీపూర్ రాజు నివాసం వద్ద పాడి కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తనను హత్య చేయించేందుకు ప్రయత్నించారని, తన ఇంటిపై దాడికి ఉసిగొల్పాడని ఆరోపించారు. హైడ్రా పేరిట ఇష్టానుసారం బిల్డింగులను కూల్చివేస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లో హైదరాబాద్ అభివృద్ధిని అమరావతికి తరలించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. తనకు దూకుడు ఎక్కువని అంటున్న దానం నాగేందర్‌కు గోకుడు ఎక్కువని వ్యాఖ్యానించారు. అరికెపూడి గాంధీకి నీతి, నిజాయతీ ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, బెదిరింపులకు పాల్పడ్డారని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వద్ద గురువారం బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో తన విధులకు కౌశిక్‌రెడ్డి ఆటంకం కలిగించారని, బెదిరింపులకు పాల్పడ్డారని సైబరాబాద్ అడ్మిన్ ఏడీసీపీ రవి చందన్‌రెడ్డి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో కౌశిక్‌రెడ్డిపై బీఎన్ఎస్ 132, 351(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ప్రాంతీయ విభేదాలు రేపుతున్నారు

- కౌశిక్‌రెడ్డి గతంలో మహిళలనూ కించపర్చారు: అరికెపూడి గాంధీ
- ఆయన నివాసంపై నా అనుచరులు దాడి చేశారనడం అవాస్తవం
- వారి మనుషులే ఆ పని చేశారని ఆరోపణ
- అరికెపూడి నివాసం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



కూకట్‌పల్లి (హైదరాబాద్): ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో అరికెపూడి గాంధీ వివాదం, బీఆర్ఎస్ నేతలు ఆయన ఇంటికి వస్తామని చేసిన ప్రకటన నేపథ్యంలో.. శుక్రవారం వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వందలాది మంది పోలీసులను మోహరించారు. ఉదయం 11 గంటల సమయంలో కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు అరికెపూడి నివాసం వద్దకు రాగా.. అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో అరికెపూడి గాంధీ మీడియాతో మాట్లాడారు. పాడి కౌశిక్‌రెడ్డి ప్రాంతీయ విభేదాలు రేపుతున్నారని ఆరోపించారు. ''కౌశిక్‌రెడ్డి గతంలో కూడా రెచ్చగొట్టే విధంగా మాట్లాడి బీఆర్ఎస్ పార్టీకి అపవాదు తెచ్చారు. మహిళలను కించపరుస్తూ మాట్లాడారు. రాష్ట్రాన్ని, వ్యవస్థల్ని భ్రష్టు పట్టించారు. కౌశిక్‌రెడ్డీ.. నీ తీరు మార్చుకో..''అని హెచ్చరించారు.

కౌశిక్‌రెడ్డి మనుషులే దాడి చేసుకున్నారు

ఎవరు వచ్చినా అతిథులుగా ఆహ్వానించి, భోజనం పెట్టి పంపిస్తానని.. అయితే వారు ఏ పద్ధతిలో వస్తే వారికి ఆ విధంగానే స్వాగతం చెబుతామని అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ''గురువారం మా ఇంటికి 11 గంటలకు వస్తానని కౌశిక్‌రెడ్డి చెప్పారు. రాకపోతే నేను వస్తానని చెప్పాను. ఆ విధంగా ఆయన నివాసానికి నేను వెళ్లాను. నా మనుషులు దాడి చేశారని, పగలగొట్టారని అంటున్నారు. అక్కడ మా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ దాడి చేయలేదు. వారి మనుషులే దాడి చేసి మేం దాడి చేశామని ఆరోపిస్తున్నారు''అని చెప్పారు. పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు ఉండగా జూనియర్ అయిన కౌశిక్‌రెడ్డి పార్టీ తరఫున ఏ విధంగా మాట్లాడుతారని, పార్టీ ఏమైనా ఆయనకు బాధ్యతలు అప్పగించిందా? అని ప్రశ్నించారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు

- డీజీపీ జితేందర్ హెచ్చరిక
- తాజా పరిస్థితులపై ముగ్గురు సీపీలతో సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని డీజీపీ జితేందర్ హెచ్చరించారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలీసులకు సహకరించాలని, తెలంగాణ పోలీసుల ప్రతిష్టను, హైదరాబాద్ నగర ఖ్యాతిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడాలని కోరారు. తాజా శాంతిభద్రతల పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, అవినాశ్ మహంతి, సుధీర్ బాబులతో డీజీపీ శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ సహా మూడు పోలీస్ కమిషనరేట్‌లలో శాంతిభద్రతల విషయంలో రాజీ ఉండకూడదని డీజీపీ స్పష్టం చేశారు.

హరీశ్ నీచ రాజకీయాలతో బీఆర్ఎస్ ఖతం

- కౌశిక్‌రెడ్డిని అడ్డం పెట్టుకుని శిఖండి రాజకీయాలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలవి చిల్లర వ్యవహారాలు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం, చిక్కుడు, మేడిపల్లి ధ్వజం



మేడిపల్లి సత్యం



యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు హరీశ్‌రావు చేస్తున్న నీచ రాజకీయాలతో ఖతం అవుతుందని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హరీశ్‌రావు.. కౌశిక్‌రెడ్డిని అడ్డం పెట్టుకుని శిఖండి రాజకీయాలకు తెరలేపారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేస్తున్న చిల్లర వ్యవహారాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలు దారుణంగా దెబ్బతిన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్ష నేత పత్తా లేకుండా పోయారని విమర్శించారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో తన సోదరి కవితకు బెయిల్ రాగానే కేటీఆర్ అమెరికాకు చెక్కేశారని, ఇక్కడ వరదలతో ప్రజలు కష్టాల్లో ఉంటే ఏమాత్రం సోయి లేకుండా అమెరికాలో ఎంజాయ్ చేయడానికి వెళ్లడం సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ఆ కుటుంబం చేసిన క్షుద్ర ఆలోచనలతో ఎంతో మంది యువకులు బలి అయ్యారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఉన్మాదిలా తయారయ్యారని అన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వైఖరి ఉందని విమర్శించారు. ఆ పార్టీలో ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉంటే కౌశిక్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ సభ్యుడే అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలన అంతా కమీషన్ల కోసమే సాగిందని, కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాతో కేసీఆర్ కుటుంబం ఆందోళన చెందుతోందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక రాజకీయ డ్రామాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. కౌశిక్‌రెడ్డివి పిల్ల చేష్టలని, ఆయన బీఆర్ఎస్ పార్టీ పరువు తీస్తుంటే హరీశ్‌రావు ప్రోత్సహిస్తున్నట్లు ఉందని అన్నారు. గతంలో గవర్నర్ తమిళిసై మీద ఇష్టానుసారంగా మాట్లాడి కౌశిక్‌రెడ్డి మహిళలను అగౌరవపర్చాడన్నారు. కౌశిక్‌రెడ్డి తన ప్రవర్తన మార్చుకోకపోతే బడిత పూజ ఖాయమని హెచ్చరించారు.

హైడ్రాపై స్టే ఇవ్వలేం: హైకోర్టు

- పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వానికి నోటీసులు
- జీహెచ్ఎంసీ చట్టప్రకారం అధికారాలెలా కట్టబెడతారని ప్రశ్న
- హైడ్రా ఏర్పాటులో చట్టబద్ధత లోపించినట్లు కనబడుతోందని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఏర్పాటును నిలిపివేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 99పై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) చట్ట ప్రకారం హైడ్రాకు అధికారాలను ఎలా కట్టబెడతారని సర్కార్‌ను ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉత్తర్వులు జారీ చేసేటప్పుడు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి తప్ప ఇష్టారాజ్యంగా జీవోలు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. హైడ్రా ఏర్పాటులో చట్టబద్ధత లోపించినట్లు కనబడుతోందని పేర్కొంది. ప్రత్యేక చట్టం లేకుండా ఏర్పాటైన హైడ్రా పని తీరు ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపడుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా ఏర్పాటు, విధులు, చట్టబద్ధతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం అలియాపూర్ గ్రామంలోని తమ నిర్మాణాలను కూలగొట్టడాన్ని సవాల్ చేస్తూ డి.లక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైడ్రా ఏర్పాటు చట్ట విరుద్ధమని, ఈ మేరకు జారీ చేసిన జీవో 99ను కొట్టేయాలని కోర్టును కోరారు. చట్టబద్ధతలేని, నోడల్ ఏజెన్సీగా ఉన్న హైడ్రాకు విపరీత అధికారాలు కట్టబెట్టడం చెల్లదని, నోటీసులు కూడా జారీ చేయకుండా నిర్మాణాలను కూల్చడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కూల్చివేతల విషయంలో ఆస్తుల టైటిల్, విద్యుత్ బిల్లుల రసీదులు తదితరాలు పరిశీలించాలని హైడ్రాకు స్పష్టం చేశారు. తర్వాత నోటీసులు జారీ చేసి, చట్టప్రకారం ముందుకు పోవాలని మరోసారి తేల్చిచెప్పారు. తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేశారు.

హృద్రోగ చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు

- వారం పాటు పీడియాట్రిక్ డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలో నిర్వహణ
- నిమ్స్‌లో 22 నుంచి 28 వరకు చికిత్సలు.. యూకే వైద్య బృందం రాక

లక్డీకాపూల్ (హైదరాబాద్): పుట్టుకతోనే హృద్రోగ సమస్యలతో బాధపడే చిన్నారులకు నిమ్స్ గుండె ధైర్యాన్నిస్తోంది. గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిమ్స్‌లో ఉచితంగా వైద్య సేవలందించేందుకు మళ్లీ యూకే బృందం రానుందని ఆస్పత్రి సంచాలకుడు ప్రొఫెసర్ నగరి బీరప్ప వెల్లడించారు. యూకేలో స్థిరపడిన డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలో ఏటా వారం పాటు నిమ్స్ భాగస్వామ్యంతో గుండె సమస్యలున్న చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి 28 వరకు చికిత్సలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గుండెకు రంధ్రం, ఇతర గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఎవరైనా నిమ్స్‌లో ఉచితంగా చికిత్స పొందేందుకు ఆస్కారం ఉంది. రమణ దన్నపనేని సారథ్యంలో వైద్యులు ఫిల్ ఆర్నోల్డ్, గీతా హాలిఘెరి, ఆనంద్ వాఘ్, నాగకిశోర్ పుప్పాల, బ్రాన్ అటాండి ఓగొటో, పెర్ఫ్యూజనిస్టు చెల్లప్పన్, నర్సులు లారా బ్లాక్‌బార్న్, సలోమా సాండర్, కేటీ కరోలన్, డేవిడ్ ఉంగరి, వైద్య సిబ్బంది శస్త్ర చికిత్సల్లో పాల్గొననున్నారు. నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమరేశ్వరరావు, సీనియర్ వైద్యులు గోపాల్, వైద్య సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం కొనసాగనుంది. గుండె సమస్యలున్న చిన్నారులుంటే నిమ్స్ కార్డియో థొరాసిక్ వైద్యుల్ని సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు. 'హీలింగ్ లిటిల్ హార్ట్స్.. చార్లీస్ హార్ట్ హీరోస్ క్యాంప్'లో భాగంగా ఈ శస్త్రచికిత్సలు జరుగుతాయని తెలిపారు. వివరాలకోసం 040-23489025 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అదుపుతప్పి బస్సును ఢీ కొట్టిన కంటెయినర్

ఏడుగురు దుర్మరణం

- అదే సమయంలో బస్సును ఢీ కొట్టిన మరో లారీ
- చిత్తూరు జిల్లా మొగిలి ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- మృతుల్లో తెలంగాణవాసి
- 31 మందికి గాయాలు, 9 మంది పరిస్థితి విషయం



ప్రమాద ధాటికి నుజ్జునుజ్జు అయిన బస్సు, లారీ

పలమనేరు: ఘాట్ రోడ్‌లో అదుపు తప్పిన కంటెయినర్ మృత్యువాహనమైంది. డీజిల్ ఆదా కోసం ఆ కంటెయినర్ డ్రైవర్ చేసిన పని నడి రోడ్డుపై రక్తాన్ని ఏరులై పారించింది. శుక్రవారం చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని మొగిలి ఘాట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృత్యు ఒడికి చేరుకున్నారు. మరో 31 మంది గాయపడగా.. వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. బెంగళూరు నుంచి ఓ కంటెయినర్ సుమారు 100 టన్నుల ఇనుప కమ్మీలతో చెన్నైకి బయలుదేరింది. మొగిలి ఘాట్ పల్లంగా ఉండటంతో డీజిల్ ఆదా కోసం డ్రైవర్ వాహనాన్ని న్యూట్రల్ చేశాడు. లారీ 100 కి.మీ. పైగా వేగంగా వెళుతుండగా బ్రేక్ ఫెయిల్ అయ్యింది. దీంతో లారీ అదుపుతప్పి డివైడర్‌ని దాటి చిత్తూరు–బెంగుళూరు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో తిరుమల నుంచి బెంగళూరుకు 52 మంది ప్రయాణికులతో వెళుతున్న అలిపిరి డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సును వేగంగా ఢీ కొట్టింది. ఆ వేగానికి బస్సు వెనక్కి తిరిగిపోయింది. అదే సమయంలో బస్సు వెనుక వస్తున్న మరో లారీ ఆ బస్సును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. కొందరు బస్సులోనే నుజ్జు నుజ్జయి ప్రాణాలు విడిచారు. మరి కొందరు కంటెయినర్‌లోని ఇనుప కమ్మీలు కిందపడి ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ముగ్గురి శరీర భాగాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమయ్యాయి. ప్రమాద సమయంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. మరణించిన వారిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బల్లరాజు(55) ఉన్నారు.



పిఠాపురంలో భారీగా హాజరైన జనసందోహానికి వైఎస్ జగన్ అభివాదం

నిన్న బుడమేరు.. నేడు ఏలేరు

నిర్లక్ష్యమే ముంచేసింది

ఇది ఏమాత్రం బాధ్యత లేని ప్రభుత్వం ● ఏలేరు వరద ప్రాంతాల పర్యటనలో వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వరదల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని.. వరద హెచ్చరికలను పెడచెవిన పెట్టి విజయవాడను ముంచేసిన మాదిరిగానే ఏలేరు వరద విషయంలో అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతుల నోట్లో మట్టి కొట్టిందని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఒక బాధ్యత లేని ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఏలేరు రిజర్వాయర్‌కు వరద వస్తుందని, అది ప్రమాదకర స్థాయిలో ఉంటుందని ప్రభుత్వానికి ముందే సమాచారం అందినా కాలువ ద్వారా నీటిని వదలకుండా తాత్సారం చేసి చివరకు సామర్థ్యానికి మించి వదిలి ముంచేశారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్, రెవెన్యూ, హోంశాఖలతో కనీసం సమీక్షించకుండా సీఎం చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. విజయవాడ ఎలా అతలాకుతలమైందో అలాంటి నిర్లక్ష్యమే ఏలేరు విషయంలోనూ కనిపిస్తోందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ శుక్రవారం పర్యటించారు. మాధవాపురం, పాత ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం రమణక్కపేటలో మీడియాతో మాట్లాడారు. ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమాను గాలికొదిలేసి రైతులను ప్రభుత్వం నట్టేట ముంచేసిందని దుయ్యబట్టారు. ఈ క్రాప్ నమోదు చేయడం లేదని, ఆర్బీకేలను అడ్రస్ లేకుండా చేశారని, సచివాలయాలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రన్న వస్తాడు.. రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తాడన్న హామీ ఏమైందని నిలదీశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మనుషుల విలువ తెలిసి ఉంటే..

ఏలేరు రిజర్వాయర్ దగ్గర పరిస్థితిని చూస్తే విజయవాడ గుర్తుకొస్తోంది. అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆగస్టు 31నే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఐఎండీ (భారత వాతావరణ విభాగం) అప్రమత్తం చేసింది. అలాంటి హెచ్చరిక అందగానే ప్రభుత్వం సమీక్ష నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. రెవెన్యూ, హోం, ఇరిగేషన్ కార్యదర్శులతో సమీక్ష చేయాలి. కానీ ముందే సమాచారం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కలెక్టర్లతో మాట్లాడలేదు. సీఎస్ కూడా ఏమాత్రం పట్టించుకోలేదు. సీఎం చంద్రబాబుకు మానవత్వం ఉంటే, మనుషుల విలువ తెలిసి ఉంటే స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకుని ముందు జాగ్రత్తలు చేపట్టే వారు. కానీ అవేమీ చేయలేదు. అన్నీ గాలి కొదిలేశారు.

సామర్థ్యానికి మించి ఒకేసారి నీటి విడుదలతో..

ఏలేరు రిజర్వాయర్ సామర్థ్యం దాదాపు 24 టీఎంసీలు కాగా 31వతేదీ నాటికే సుమారు 18 టీఎంసీలు ఉన్నాయి. సెప్టెంబర్ 1న ఏలేరు రిజర్వాయర్‌కు 9,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రభుత్వం జాగ్రత్త పడి ఉంటే, ఫ్లడ్ కుషన్ నిబంధన పాటించి ఉంటే ఆ మొత్తం వెంటనే కిందకు వదలాలి. ఎందుకంటే దిగువన కాలువ సామర్థ్యం 14 వేల క్యూసెక్కులు మాత్రమే. అలా అప్పుడే నీళ్ల దిగువకు వదిలి ఉంటే ఆ కాలువ పొంగకుండా ఉండేది. కానీ ప్రభుత్వం కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే వదిలిపెట్టింది. సెప్టెంబరు 4న 5,400 క్యూసెక్కులు వస్తే బయటకు పంపింది కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే. ఏమాత్రం ఫ్లడ్ మేనేజ్‌మెంట్ చేపట్టలేదు. ఫ్లడ్ ఫ్లో కుషన్ ఏర్పాటు చేయలేదు. పైనుంచి నీళ్లొస్తున్నా తీవ్ర నిర్లక్ష్యం వహించారు. కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే వదులుతూ వచ్చారు. దీంతో 9వతేదీ నాటికి ఏలేరు రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీంతో గత్యంతరం లేక కిందకు 21,500 క్యూసెక్స్ వదిలారు. 10వ తేదీన 26,134 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే ఏకంగా 27,275 క్యూసెక్స్ విడిచిపెట్టారు. అంటే కాలువ సామర్థ్యాన్ని మించి నీళ్ల వదలడంతో లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. మరి ఇది కచ్చితంగా "మేన్ మేడ్ ఫ్లడ్" కాకపోతే మరేమిటయ్యా! అని అడుగుతున్నా. ప్రజలు పట్ల మానవత్వం చూపని, ఏమాత్రం బాధ్యత లేని ప్రభుత్వం ఇది. వరదలు వస్తే ఎలా హ్యాండిల్ చేయాలో కనీసం ఇంగితం లేని ప్రభుత్వం ఇది!

ఏలేరు ఆధునీకరణపై అబద్ధాలు..

అబద్ధాలు చెప్పడంలో సీఎం చంద్రబాబు గోబెల్స్‌కు తమ్ముడే. పచ్చి అబద్ధాలాడతారు. అబద్ధాలను సృష్టించడం, వాటిని అమ్మగలగడంలో చంద్రబాబును మించిన వారు ప్రపంచంలోనే లేరు. ఆయనకు వంత పాడే మీడియా నిత్యం అవే అబద్ధాలను ప్రచారం చేస్తోంది. ఏలేరు ఆధునికీకరణపైనా చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు. తొలుత ఏలేరు కాలువ ఆధునికీకరణను 2008లో దివంగత వైఎస్సార్ రూ.138 కోట్లతో చేపట్టారు. ఆ తర్వాత ఎవరూ ఆ పనులను పట్టించుకోలేదు. వర్షాలు, నీళ్ల లేనప్పుడు మాత్రమే కెనాల్ ఆధునికీకరణ చేయగలం. లేదంటే క్రాప్ హాలిడే ప్రకటిస్తే కానీ సాధ్యం కాదు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక అంచనాలు రూ.295 కోట్లకు పెంచడం మినహా పనులు చేయలేదు. నిజానికి అప్పుడు రిజర్వాయర్‌లో నీళ్ల కూడా పెద్దగా లేవు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏటా కరువే. చంద్రబాబు – కరువు ఇద్దరూ కవలలే. అప్పుడు వర్షాలు కూడా లేవు. అయినా పనులు ఎందుకు చేయలేదు? 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వరుసగా వర్షాలు కురవడంతో క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కాలువ ఆధునికీకరణ పనులు వేగంగా చేయలేకపోయాం.

ఏం జరిగినా జగనే కారణం అంటాడు

ఏలేరు వరదలపై ప్రభుత్వానికి ముందే ఇంత సమాచారం ఉన్నా తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. ఫ్లడ్ కుషన్ మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబు విఫలమై రైతులందర్నీ ఇబ్బంది పెట్టారు. వరదలు వస్తే రిజర్వాయర్లను ఎలా నిర్వహించాలో ఈ ప్రభుత్వానికి తెలియడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి దాదాపు నాలుగు నెలలు అయింది. ఎక్కడ ఏం జరిగినా దానికి కారణం జగనే కారణం అంటాడు. విజయవాడలో వరదలు వచ్చినా జగనే కారణం.. ! ఏలేరు రిజర్వాయర్ కింద వరదలు వచ్చినా జగనే కారణం..! కోవిడ్ వచ్చినా జగనే కారణం.. అంటాడు! చంద్రబాబు చేయాల్సింది జగన్నామస్మరణ కాదు. ప్రతి దానికి జగన్‌పై అరవకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇప్పటికైనా నా మమ్మల్ని నిందించడం మానుకుని ప్రజలకు క్షమాపణ చెప్పి నిజాయితీగా పాలన అందించాలి.

సకాలంలో మెడికల్ కౌన్సెలింగ్ పూర్తి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కౌన్సెలింగ్ కోసం ఎదురు చూ స్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందనక్కర్లేదని, వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ఇచ్చిన గడువులోగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌ను పూర్తి చేసి, తరగతులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకే సీట్లు దక్కాలన్నది తమ ఆలోచన అని, ఈ విషయంలో రాజీ పడేది లేదని పేర్కొన్నారు. వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, ఈలోగా వెబ్ ఆప్షన్ల నమోదు కోసం విద్యార్థులు సిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల వివరాలు, సీట్ల వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో (https://www.knruhs.telangana.gov.in/) అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. గతేడాది ఏయే ర్యాంకు విద్యార్థులకు ఏయే కాలేజీల్లో సీట్లు వచ్చాయన్న వివరాలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఆయా వివరాలను పరిశీలించి, తమ ర్యాంకులకు అనుగుణంగా వెబ్ ఆప్షన్ల కోసం జాబితాను సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచించారు.

ట్రాన్స్‌జెండర్ల కోసం జిల్లాకో క్లినిక్

వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రతి జిల్లాకో క్లినిక్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న జిల్లా ఆస్పత్రులు లేదా బోధన ఆస్పత్రుల్లోనే వీటిని ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి వారానికి రెండు లేదా మూడు రోజుల పాటు క్లినిక్స్ నిర్వహించనున్నారు. ప్రతి క్లినిక్‌లో జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్ అందుబాటులో ఉంటారు. అవసరాన్ని బట్టి గైనకాలజిస్ట్, యూరాలజిస్ట్, ఇతర స్పెషలిస్ట్ డాక్టర్లను డిప్యూట్ చేస్తారు. వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా ఈ క్లినిక్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే ఉత్తర్వులు కూడా జారీ చేశారు. తాము అనారోగ్యం బారిన పడ్డప్పుడు ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నామని, ఒకవేళ ధైర్యం చేసి వెళ్లినా అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఆస్పత్రుల్లో తమకోసం ప్రత్యేకంగా ఓ రూమ్ కేటాయించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతేకాదు, అవసరమైన వారికి జెండర్ మార్పిడి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయించనున్నారు. ఇందు కోసం కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవలే ఓ ప్రొసీజర్‌ను విడుదల చేసింది. తొలుత హార్మోనల్ బ్యాలన్స్ కోసం చికిత్స అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటివి చేసి, అప్పటికీ సెట్ అవ్వకపోతేనే జెండర్ మార్పిడి సర్జరీలు చేయాలని పేర్కొంది. ఇప్పటికే ఉస్మానియా ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాల నుంచి రోగులను ఇక్కడికే రిఫర్ చేయనున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ విధులు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వలంటీర్లుగా పనిచేసే ట్రాన్స్‌జెండర్లకు ప్రతినెలా కొంత స్టైఫండ్ ఇవ్వాలని, దీంతో వారికి ఆర్థికంగా భరోసా కల్పించడంతో పాటు సమాజంలో గౌరవస్థానం కల్పించవచ్చునని సీఎం పేర్కొన్నారు. ఆసక్తిగా ఉన్న ట్రాన్స్‌జెండర్ల వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వారం, పది రోజుల పాటు వారికి అవసరమైన ప్రత్యేక శిక్షణను కూడా అందించాలని, విధుల్లో ఉండే ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక యూనిఫామ్ కూడా ఉండాలని అధికారులకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఇతర అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్షా సమావేశం సందర్భంగా సీఎం ఈ విషయం వెల్లడించారు. సీఎం నిర్ణయంతో ఈ కార్యక్రమం విజయవంతమైతే దేశంలో ఇతర నగరాలు కూడా దీనిని ఆదర్శంగా తీసుకునే అవకాశం ఉంది.

సాక్షి రియల్టీ



- నలువైపులా నగరాభివృద్ధికి ప్రణాళికలు
- ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ ట్రిపుల్ ఆర్ వంటి కీలక ప్రాజెక్టులు
- దీంతో కొనుగోలుదారుల్లో నూతనోత్సాహం

అభివృద్ధి పథంలో..

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అభివృద్ధి మరొక్క అడుగు ముందుకు వేసే విధంగా ప్రభుత్వం పక్కా ప్రణాళికలు రూపొందిస్తుంది. ముచ్చర్లలో ఫోర్త్ సిటీ, స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులను ప్రకటించింది. దీంతో ప్రధాన నగరంతో పాటు, శివారుల్లో స్థిరాస్తి రంగంలో నూతనోత్తేజం నెలకొంది. ఆయా ప్రాంతాల్లోని ప్రాపర్టీలు, భూముల లావాదేవీలు పెరిగాయి. నగరాభివృద్ధిని ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకూ పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

మూసీతో ప్రధాన నగరంలో..

థేమ్స్ నదిలాగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌ను చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌తో కలుషిత మూసీ నదికి పునరుజ్జీవం చెందడంతో పాటు ప్రధాన నగరంలో అదనంగా భూమి అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో చేపట్టే మూసీ సుందరీకరణతో నది చుట్టూ సుమారు 25 వేల ఎకరాల భూమి అందుబాటులోకి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఆయా స్థలాన్ని రియల్ ఎస్టేట్ అవసరాలకు కేటాయించనున్నారు. నది వెంట ఉన్న ఆర్థిక, సాంస్కృతిక సామర్థ్యానికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు, నది వెంట 55 కి.మీ. మేర అభివృద్ధి పనులకు ప్రణాళికలు చేస్తోంది. వినోద కేంద్రాలు, ఉద్యానవనాలు, వాటర్ స్పోర్ట్స్, జలపాతాలు, స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు, వ్యాపార ప్రాంతాలు, షాపింగ్ మాళ్లతో అభివృద్ధి చేయాలని ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో పాటు చార్మినార్, కుతుబ్ షాహీ టూంబ్స్ వంటి వారసత్వ ప్రదేశాలను అనుసంధానం చేసి పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి పర్చాలని నిర్ణయించారు.

15 లక్షల ఉద్యోగాల సృష్టి..

హైదరాబాద్ దేశీయ సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు ప్రధాన ఎగుమతి కేంద్రంగా నిలుస్తుంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఐటీ ఎగుమతులు రూ.2,41,275 కోట్లు. జాతీయ వృద్ధి రేటుతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. తెలంగాణ ఐటీ ఎగుమతులు 31.44 శాతం వృద్ధి చెందాయి. జాతీయ సగటు 9.36 శాతం కంటే ఇది చాలా రెట్లు ఎక్కువ. రాష్ట్ర ఐటీ రంగంలో ఉపాధి 2021–22లో 7,78,121 నుంచి 2022–23 నాటికి 9,05,715కు పెరిగాయి. హైదరాబాద్ గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఎదిగింది. 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాలు, 2032 నాటికి 15 లక్షల ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలకు ప్రణాళిక తయారు చేస్తుంది.

కొత్త ప్రాంతాల్లో మెట్రో..

ఇప్పటికే 69 కిలోమీటర్ల మేర పరుగులు పెడుతున్న మెట్రో రైలును కొత్త ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించింది. సెకండ్ ఫేజ్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో అనుసంధానంతో పాటు కొత్తగా ఐదు కారిడార్లలో మెట్రోను విస్తరించి, అదనంగా 73 కి.మీ. విస్తరించాలని నిర్ణయించారు. దీంతో నగరం నలువైపులా సమాంతర అభివృద్ధికి ఆస్కారం ఉండటంతో పాటు ప్రజా రవాణా మరింత మెరుగవుతుంది. సంగారెడ్డి, తూప్రాన్, చౌటుప్పల్, ఆమన్‌గల్, శంకర్‌పల్లిలను కలుపుతూ 17 జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు నాలుగు లైన్ల నియంత్రణ రహదారిని 340 కి.మీ. ట్రిపుల్ ఆర్‌ను నిర్మించనున్నారు.



నెలకు అద్దె రూ.2 కోట్లు!

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆఫీసు స్పేస్ లీజును గూగుల్ పునరుద్ధరించింది. నానక్‌రాంగూడలోని సలార్పూరియా సత్వా నాలెడ్జ్ క్యాపిటల్ బ్లాక్–1లో ఆరు అంతస్తుల్లోని 3.7 లక్షల చ.అ. స్థలాన్ని ఐదేళ్ల పాటు లీజుకు తీసుకుంది. ఈమేరకు గూగుల్ కనెక్ట్ సర్వీసెస్ ఇండియా సంస్థ నెలకు రూ.2.02 కోట్ల అద్దె చొప్పున భూ యజమాని మెగాసాఫ్ట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుందని ప్రాపర్టీ టెక్నాలజీ సంస్థ ప్రాప్‌టెక్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. చ.అ. ధర రూ.55.2 చొప్పున రూ.10.6 కోట్లు డిపాజిట్‌గా చెల్లించిందని తెలిపింది. ఈమేరకు 36 నెలల పాటు లీజు ఒప్పందంపై ఇరు పక్షాలు గత నెలలో సంతకాలు చేశాయి. ఆ తర్వాత అద్దెలో 15 శాతం పెరుగుదల ఉంటుందని ఒప్పందంలో పేర్కొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం

సాక్షి, హైదరాబాద్: నేటి యువతరం ఇల్లు కొనేటప్పుడు చుట్టుపక్కల ఆరోగ్య సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది ప్రధానంగా చూస్తున్నారు. అత్యవసరంలో ఎంత సమయంలో ఆసుపత్రికి చేరుకోవచ్చు? ఎంత సమీపంలో వైద్య సదుపాయాలు ఉన్నాయనేది ఆరా తీస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్దల ఆరోగ్య అవసరాల రీత్యా వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇల్లు విశాలంగా ఉండటమే కాదు కమ్యూనిటీలో సకల సౌకర్యాలు ఉండాలనేది నేటి గృహ కొనుగోలుదారుల మాట. పిల్లల కోసం క్రీడా సదుపాయాలు, పెద్దలకు క్లబ్ హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు ఉండాలని భావిస్తున్నారు. ఎక్కువ ఖాళీ స్థలం వదిలి, పచ్చదనం అధికంగా ఉంటే ఇష్టపడుతున్నారు.



- చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనాపాలనా చూసే డే కేర్ సౌకర్యాలు ఉండాలని గృహ కొనుగోలుదారులు చూస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కార్యాలయాలకు వెళితే పిల్లలను చూసుకోవడం కష్టం అవుతుంది. వర్క్ ఫ్రం హోమ్ ఉన్నా పిల్లలపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. కాబట్టి కమ్యూనిటీలో డే కేర్ సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు. అలాగే ఇల్లు కొనేటప్పుడు ఆఫీసుకు ఎంత దూరంలో ఉందనేది కస్టమర్ల ప్రాధామ్యాలలో ఒకటి. నగరంలో ట్రాఫిక్‌లోనే అధిక సమయం వృథా అవుతుంది కాబట్టి దూరం, సమయం అనేది ప్రధానంగా మారాయి. ప్రజా రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటున్నారు.
- వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు షాపింగ్ మాల్స్, థియేటర్లు ఎంత దూరంలో ఉన్నాయనేవి కూడా కొనుగోలు ఎంపికలో భాగమైపోయాయి. పచ్చని ప్రకృతిని ఆస్వాదించాలని కోరుకునే నివాసితులు శివారు ప్రాంతాలలో ఫామ్ హౌస్‌లు, విల్లాల కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు.

24.5 ఎకరాల భూమి రూ.537 కోట్లు

సాక్షి, హైదరాబాద్: 24.5 ఎకరాల భూమి రూ.537 కోట్లకు అమ్ముడుపోయింది. ముంబైలోని కల్వా ప్రాంతంలో హిండాల్కో ఇండస్ట్రీస్‌కు చెందిన ఈ స్థలాన్ని బిర్లా ఎస్టేట్ అనుబంధ సంస్థ ఏకమయా ప్రాపర్టీ ప్రై.లి. కొనుగోలు చేసిందని స్క్వైర్ యార్డ్స్ ఒక ప్రకటనలో తెలిపింది. థానే–బేలాపూర్ రహదారి వెంట ఉన్న కల్వా ప్రాంతం నివాస సముదాయాలకు కేంద్రంగా అభివృద్ధి చెందిందని సంస్థ తెలిపింది. బిర్లా ఎస్టేట్స్ ముంబై, పుణే, బెంగళూరు, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాల్లో నివాస, వాణిజ్య సముదాయాలను అభివృద్ధి చేస్తోంది.

స్కిల్‌ఫుల్‌గా పెంచుదాం..

మొక్కై వంగనిది మ్రానై వంగునా..



మన గుండెల మీద ఆడుకున్న పాపాయిలు పెరిగి పెద్దయి, బాధ్యతాయుతమైన వ్యక్తులుగా సమాజంలోకి అడుగు పెట్టడంలో తల్లిదండ్రులదే కీలకపాత్ర. అందు కోసం తల్లిదండ్రులు పిల్లలకు కొన్ని తప్పనిసరి జీవన నైపుణ్యాలను నేర్పించాలి. అవేంటో తెలుసుకుందాం..

తల్లిదండ్రులు మొదటగా చేయాల్సిన పని పిల్లలలో సానుకూల భావాలను పెంపొందించటం. చదువులో గాని, ఆటల్లో గాని వారికి కావాల్సిన ప్రేరణను మనం వారికి అందించాలి. తద్వారా వారిలో ఏదైనా సాధించగలం అనే పాజిటివిటీ పెరుగుతుంది. ఇది వారు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరేందుకు చాలా అవసరం. లేదు, కాదు, తెలియదు, చేతకాదు అనే పదాల స్థానంలో అవును, ఉంది, ప్రయత్నిస్తాను వంటి పదాలను ప్రయోగించే అలవాటు చేయాలి. అంతేకాదు, ఎందులో అయినా వైఫల్యం ఎదురయినప్పుడు కుంగిపోకుండా ఓటమి నుంచి నేర్చుకుని తిరిగి విజయం సాధించడం ఎలాగో నేర్పించాలి.

వంట చేయడంలో మెలకువలు, ప్రాథమిక సూత్రాలు నేర్పించడం

పిల్లలకు బడిలో పాఠాలు టీచర్లు ఎలాగూ చెబుతారు. అయితే కడుపు నింపుకోవడానికి కావలసిన ఆహారం ఎలా తయారు చేయాలో నేర్పాల్సింది మాత్రం తల్లిదండ్రులే. పట్టుమని పదేళ్లలేవు, ఇప్పటినుంచే వీళ్లకు వంట చేయడం నేర్పించటం ఏమిటి.. అనో, మగపిల్లలకు వంట ఏంటి... అనో అనుకోకుండా అన్నం, పప్పు, కూర, సలాడ్లు వంటివి తయారు చేసుకోవడం నేర్పిస్తే పై చదువుల కోసం తల్లిదండ్రులకు దూరంగా వెళ్లాక వారు తిండికోసం తడుముకోవాల్సిన అవసరం ఉండదు.

సహాయపడే గుణం..



పిల్లలకు చిన్నప్పటి నుంచి తమకు చేతనైనంతలో ఇతరులకు సాయం చేసే గుణాన్ని అలవాటు చేయాలి. అవసరం అయితే తమ స్వార్థాన్ని మానుకుని మరీ ఇతరుల అవసరాలకు స్పందించేలా వారిని ప్రోత్సహించాలి. పిల్లలు ఇతరులకు సహాయపడే కార్యక్రమాల్లో పాల్గొనేలా వారిని అలవాటు చేయాలి. వారిలో ఏదో సాధించాలనే ఆశయంతో పాటు ఇతరులకు సహాయపడాలనే తపన కూడా ఉండేలా వారిని ప్రోత్సహించాలి. దీనివలన వారిలో నాయకత్వ లక్షణాలు కూడా పెరుగుతాయి. వీటితోపాటు తమకు ఏదైనా అవసరం అయినప్పుడు ఇతరుల నుంచి సహాయం తీసుకోవడానికి మొహమాట పడకుండా ఉండటాన్ని కూడా నేర్పించాలి.

తమ వస్తువులు తాము సర్దుకోవడం

బుక్స్, పెన్నులు, జామెంటరీ బాక్స్... ఇలాంటి వాటన్నింటినీ వాటితో పని అయిపోగానే ఎక్కడ నుంచి తీసిన వాటిని తిరిగి అక్కడే సర్దడం అలవాటు చేస్తే మంచిది. అదేవిధంగా బట్టల షెల్ఫ్ లేదా బీరువా నుంచి పిల్లలు తమ రోజువారీ దుస్తులు తామే తీసుకోవడం, తిరిగి వాటిని నీట్‌గా సర్దుకోవడం చిన్నప్పుడే అలవాటు చేయాలి.

గార్డెనింగ్ నేర్పించడం



మొక్కలను పెంచడంలోని మెళకువలను పిల్లలకు నేర్పించాలి. ఆకుకూరలు, పండ్లు, పూల మొక్కల విత్తనాలను నాటడం, అవి మొలకెత్తి, పెరిగి పెద్దయే వరకు వాటికి నీళ్లు పోయడం, పాదులు తవ్వి, మడులు తీసి, తీగలు పాకించీ.. ఇలా వాటి లక్షణాలను బట్టి వాటి తెగుళ్లు సోకకుండా చూసుకుంటూ వాటిని జాగ్రత్తగా సంరక్షించడం వంటి వాటిని పిల్లలకు నేర్పించడం చాలా మంచిది. దీనివల్ల వారికి వ్యాయామం అవుతుంది. మొక్కల పెరుగుదల వల్ల వారికి సంతోషం కూడా కలుగుతుంది. చిన్నప్పటినుంచి సంరక్షణ, కేరింగ్ అనేవి అలవాటవుతాయి.

ఇంట్లో చిన్న చిన్న బాధ్యతలు అప్పగించడం

పిల్లలకు చదువుతోపాటు ఇంట్లో చిన్న చిన్న బాధ్యతలను కూడా అప్పజెప్పాలి. దీనివలన వారిలో కృషి, పట్టుదల పెరిగి సంఘంలో ఎలా నడుచుకోవాలో చిన్నప్పటి నుండే తెలుస్తుంది. రోజూ మన ఇంటిలో ఉండే కొన్ని బాధ్యతలను వారు క్రమం తప్పకుండా నిర్వర్తించేలా వారికి అలవాటు చేయాలి.

సమస్యలు, సవాళ్లను అధిగమించే గుణాన్ని అలవాటు చేయడం

పిల్లలు ఏదైనా సాధించాలనే గుణాన్ని వారికి చిన్నప్పటి నుండి నేర్పించాలి. వారు ఎప్పుడు ఏదైనా ఒక లక్ష్యాన్ని పెట్టకొని దాని మీదనే తమ దృష్టి కేంద్రీకరించేలా వారికి తర్ఫీదు ఇవ్వాలి. ఎటువంటి సవాళ్లైనా వారు భయపడకుండా ధైర్యంగా స్వీకరించేలా వారిని ప్రోత్సహించాలి. ఏ పనినైనా కష్టంతో కాకుండా ఇష్టంగా చేయడం నేర్పాలి. ఇది వారిలో పోరాట పటిమను పెంపొందించి జీవితంలో ఏదైనా సాధించాలనే తపనను వారిలో బాల్యం నుంచి బలంగా నాటుతుంది.

అత్యవసర పరిస్థితులలో స్పందించడం



పిల్లలకు ఏదైనా అత్యవసరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు అంటే రోడ్డు ప్రమాదాలలో గాయపడినప్పుడు లేదా ఇతర ప్రమాదాలు ఏవైనా ఎదురైనప్పుడు భయపడకుండా తమకు తామే ధైర్యం చెప్పుకుని ప్రథమ చికిత్స చేసుకోవడం లేదా ఇతరులకు అటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు వారికి ప్రథమ చికిత్స చేయడం కూడా తప్పనిసరిగా అలవాటు చేయాల్సిన జీవన కళ.

గౌరవాన్ని ఇచ్చి పుచ్చుకోవడం

చివరగా చెప్పుకుంటున్నప్పటికీ ఇది పిల్లలకు తప్పనిసరిగా నేర్పించవలసిన మంచి లక్షణం. గౌరవం అనేది ఇచ్చి పుచ్చుకోవలసిన లక్షణం అని వారికి స్పష్టంగా తెలియజేయాలి. మనం ఇతరులను గౌరవించినప్పుడే వారు మనల్ని గౌరవిస్తారని, తోటివారితోనూ, పెద్దలతోనూ మంచిగా, మర్యాదగా మెలిగినప్పుడే వారు కూడా మనకు గౌరవం ఇస్తారని తెలియజేయాలి.

ఈ ఆహారానికి ఓట్లు వేద్దాం



ఓట్స్, అధిక నీటి నిల్వలను నియంత్రించే తక్కువ పిండి పదార్థాలను కలిగి ఉంటాయి. ఓట్స్ మన నడుము చుట్టుకొలతను తగ్గించడంలో సహాయం చేస్తుంది, అంతే కాకుండా జీవక్రియల రేటును పెంచడం ద్వారా శరీరానికి ఊబకాయం వలన కలిగే రోగాలను సైతం దరిచేరనీయకుండా చూడగలదు.

- ఒక కప్పు ఓట్స్ 4–5 గ్రాముల ఫైబర్ కంటెంట్ కలిగి ఉంటుందని అధ్యయనాలు చెప్తున్నాయి. ఈ ఫైబర్ చెడు కొవ్వులను నిల్వ చేసుకున్న చెడుకొవ్వును కరిగించడమే కాకుండా, కణజాల పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది.
- ఓట్స్ నెమ్మదిగా జీర్ణమవుతుంది, అందువల్ల ఇవి రక్తపోటుపై ఎక్కువ ప్రభావం చూపదు.
- ఫైబర్, పోషకాలతో, తక్కువ పిండి పదార్థాలు కలిగిన ఓట్స్‌ను తీసుకోవడం మూలంగా అనేక సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

నెలకో ఉపవాసం నూరేళ్ల ఆరోగ్యం



ఛావీ మిట్టల్ హిందీ టెలివిజన్ నటి. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్టు ఒకటి బాగా వైరల్ అయింది. అందులో ఆమె తన తాతగారి ఆరోగ్య రహస్యం అంటూ ఉపవాసాన్ని మించిన ఔషధం లేదని చెప్పింది. 'మా తాత ఆరోగ్యం గురించి అమ్మ చెప్తుండేది. ఆయనకు 101 ఏళ్లు జీవించారు. ఆయన అనారోగ్యం వచ్చినప్పుడు ఆహారం తీసుకోవడం మానేసేవారట. 'ఆహారం మానేస్తే గట్ హెల్త్ కుదుటపడుతుంది' రెండు రోజుల పాటు ఫాస్టింగ్ ఉన్న తర్వాత ఆయన ఆరోగ్యం బాగయిందని అమ్మ అనేక సందర్భాల్లో గుర్తు చేసుకుంటూ ఉండేది. నిజంగా ఆహారం తీసుకోకుండా పస్తు ఉండడం లేదా తేలిగ్గా జీర్ణమయ్యే పరిమిత ఆహారం తీసుకోవడం వల్ల గట్ ఆరోగ్యం కుదుటపడడం ద్వారా దేహం తనంతట తానుగా అనారోగ్యం నుంచి బయటపడగలుగుతుందా? అనే సందేహాలు కలిగే మాట నిజమే. ఇది సాధ్యమేనంటున్నారు వైద్య నిపుణులు, ఆయుష్ అదనపు సంచాలకులు, ప్రిన్సిపల్ (రిటైర్డ్) డాక్టర్ వీఎల్ఎన్ శాస్త్రి. లంఘనం పరమౌషధం. ఉపవాసం జీర్ణకోశానికి ఆరోగ్యప్రదం అనీ, ఇది ప్రాచీన కాలం నుంచి ఉన్న ఆచారమే అన్నారు.

గట్ అంటే...

నోటి నుంచి మలద్వారం వరకు విస్తరించి ఉన్న జీర్ణకోశ సంస్థానాన్ని ఆయుర్వేద పరిభాషలో 'మహాకోష్ఠం (గట్)' అంటారు. దీని పటిష్ఠత, ఆరోగ్యం మీదనే ఇతర సంస్థానాల (శ్వాసవహ, నాడీ, మూత్ర, హృదయ, జననేంద్రియ... మొదలైనవి) ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. జీర్ణక్రియ శోషణక్రియ, ధాతు పరిణామం, మలవిసర్జన... ఈ నాలుగు తేలికగా జరిగినప్పుడే గట్ దృఢంగా ఉన్నట్లు. అప్పుడే దేహానికి శక్తి, మనసుకు శాంతి. ఇవే దీర్ఘాయువుకు మూలాధారం. మహాకోష్ఠం పదిలంగా ఉండడానికి 'లంఘనం' పరమౌషధం. లంఘనం అంటే తేలికగా ఉండడం అని అర్థం. దీనినే వాడుక భాషలో లంఖణం అంటారు. కొన్ని గంటల పాటు ఆహారం తీసుకోకుండా మహాకోష్ఠానికి విశ్రాంతినివ్వడం మంచిదే. ఉద్దేశపూర్వకంగా ఆహారం తీసుకోకపోవడాన్ని ఉపవాసం లేదా ఫాస్టింగ్ అంటాం. ఫాస్టింగ్ తర్వాత తీసుకునే ఆహారం కూడా ప్రధానమే. తేలికగా జీర్ణమయ్యే పానీయాలు, నీరు, కొబ్బరి నీరు, చెరకురసం వంటి సహజ ఆహారాలతో ఉపవాసాన్ని విరమించాలి. మన దైనందిన జీవనంలో ఉపవాసం కూడా ఒక భాగమే. పండుగలు, పర్వదినాలతోపాటు పౌర్ణమి, ఏకాదశి ఉపవాసాలు అలా వచ్చినవే. అలా జీవించిన పూర్వీకులు శారీరక, మానసిక ఆరోగ్యాలతో శతాయుష్కులై జీవించారు'' అని వివరించారు డాక్టర్ శాస్త్రి. క్యాలెండర్‌లు లేని రోజుల్లో చంద్రుడే ఆధారం. ప్రకృతి ఇచ్చిన గడియారం సూర్యుడైతే, క్యాలెండర్ చంద్రుడు. అందుకే ఉపవాసం చేయాల్సిన రోజు తెలియడానికి ఏకాదశి, పౌర్ణమిని నిర్ణయించారు.

– వి.ఎం.ఆర్

మనలాగే జపాన్ పొదుపు కకీబో

ఈ ఉరుకు పరుగుల జీవితంలో పొదుపుపై దృష్టి పెట్టే టైమే దొరకడం లేదు. అయితే మనసు పెడితే 'టైమ్' ఉంటుంది. ఆ టైమ్ ఆర్థికపరంగా మన టైమ్‌ను మారుస్తుంది. 'మైండ్‌ఫుల్ బడ్జెట్' రూపంలో బెటర్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌కు దారి చూపుతుంది. సంప్రదాయ పొదుపు పద్ధతులలో భాగంగా ఇప్పుడు జపనీస్ టెక్నిక్ 'కకీబో'పై ఆసక్తి పెరిగింది...



'కకీబో' అంటే 'హౌజ్‌హోల్డ్ ఫైనాన్షియల్ లెడ్జర్' అని అర్థం. ఈ సింపుల్ బడ్జెటింగ్ మెథడ్ నిన్నా మొన్నటిది కాదు. 20వ శతాబ్దం ప్రారంభం నుండి అమలులో ఉన్న జపనీస్ బడ్జెట్ ప్లానింగ్. ఇది మన దేశంలో ఉన్నదే. జపాన్ తొలి మహిళా పాత్రికేయురాలు హనీ మోటోకో రూపకల్పన చేసిన 'కకీబో' ప్రపంచవ్యాప్తంగా ఎంతో పాపులర్ అయింది. ఒక వుమెన్స్ మ్యాగజైన్‌లో 'కకీబో' గురించి తొలిసారిగా రాసింది హనీ మోటోకో.

ఖర్చులను నియంత్రించుకోవడానికి, పొదుపు లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి 'కకీబో' ఉపకరిస్తుంది. 'కకీబో' లక్ష్యం కేవలం ఖర్చులను రికార్డ్ చేయడం కాదు. ఆర్థిక విషయాల్లో ఆలోచనాత్మక విధానాన్ని రూపొందించడం. ఖర్చులను అవసరాలు, అవసరం లేనివి, తప్పనిసరి అవసరాలు, పొదుపుగా వర్గీకరిస్తుంది కకీబో. దీనివల్ల ఖర్చులపై అవగాహన పెరుగుతుంది. ప్రతి నెల నిర్దిష్ట మొత్తాన్ని ఆదా చేసే అలవాటు పెరుగుతుంది. మెరుగైన ఆర్థిక నిర్వహణకు ఉపకరిస్తుంది.

సినిమా

ఆఫీసర్ అర్జున్ ఆన్ డ్యూటీ



● నాని

నాని హీరోగా నటిస్తున్న 'హిట్: ది థర్డ్ కేస్' సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. 'హిట్: ది ఫస్ట్ కేస్', 'హిట్: ది సెకండ్ కేస్' వంటి చిత్రాల తర్వాత ఆ ఫ్రాంచైజీలో రూపొందుతున్న మూడో చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. 'హిట్' ఫ్రాంచైజీలో తొలి రెండు చిత్రాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలను 'హిట్: ది థర్డ్ కేస్'ని తెరకెక్కిస్తున్నారు. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ షూటింగ్‌లో ఆఫీసర్ అర్జున్‌గా డ్యూటీ అరంభించారు నాని. ''ఈ సినిమాలో ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా ఫెరోషియస్ క్యారెక్టర్‌లో నాని కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం నాని కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. 2025 మే 1న ఈ సినిమాని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్.

పద్దెనిమిదో శతాబ్దం నేపథ్యంలో...



● మహేశ్‌బాబు

గుబురు గడ్డం, లాంగ్ హెయిర్ స్టయిల్‌తో మహేశ్‌బాబు కొత్త లుక్‌లోకి మారిన విషయం ఈ మధ్య కాలంలో ఆయన ఫొటోలు స్పష్టం చేశాయి. ఈ లుక్ రాజమౌళి దర్శకత్వంలో హీరోగా నటించనున్న సినిమా కోసమేనని తెలిసిందే. ఇక ఈ సినిమా ఎప్పుడు ఆరంభమవుతుంది? అంటే డిసెంబర్‌లో అని సమాచారం. తాజాగా ఈ చిత్రం నేపథ్యం గురించి ఓ వార్త ప్రచారంలోకి వచ్చింది. 18వ శతాబ్దం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని, ఆ కాలానికి తగ్గట్టుగా హైదరాబాద్‌లో ప్రత్యేక సెట్లు వేయిస్తున్నారని భోగట్టా. ఈ చిత్రంలో దాదాపు రెండువందల మంది జూనియర్ ఆర్టిస్టులు ఉంటారని, వారంతా ఓ గిరిజన తెగకు సంబంధించినవారనీ టాక్. ఇప్పటికే ఈ పాత్రలకు సంబంధించిన నటీనటులను ఎంపిక చేసి, శిక్షణ ఇస్తున్నారట. ఈ నెలాఖరుకి ప్రధాన తారాగణంతో వర్క్ షాప్స్ మొదలుపెట్టి డిసెంబర్‌లో షూటింగ్ ఆరంభించాలని అనుకుంటున్నారని సమాచారం.

దేవర రికార్డ్



● ఎన్టీఆర్

– బియాండ్ ఫెస్ట్‌లో ప్రదర్శితం కానున్న తొలి భారతీయ చిత్రం

ఎన్టీఆర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'దేవర: పార్ట్ 1' అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. లాస్ ఏంజెల్స్‌లోని ఈజిప్షియన్ థియేటర్‌లో ప్రీమియర్ కానున్న తొలి భారతీయ సినిమాగా అరుదైన ఘనత సాధించింది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దేవర'. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మించారు. రెండు భాగాలుగా రానున్న 'దేవర: పార్ట్ 1' ఈ నెల 27న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ చిత్రం గ్రాండ్ ప్రీమియర్ షోను ఈ నెల 26న సాయంత్రం ఆరు గంటలకు హాలీవుడ్‌లో ప్రదర్శించనున్నారు. ''హాలీవుడ్‌లో బియాండ్ ఫెస్ట్ అనేది ఘనమైన చరిత్ర కలిగిన ప్రతిష్ఠాత్మకమైన సినిమా వేదిక. లాస్ ఏంజెల్స్‌లోని ఐకానిక్ ఈజిప్షియన్ థియేటర్‌లో ప్రీమియర్ కానున్న తొలి ఇండియన్ సినిమాగా 'దేవర: పార్ట్ 1' అరుదైన ఘనతను సొంతం చేసుకోవడం సంతోషంగా ఉంది. ఈ రెడ్ కార్పెట్ ఈవెంట్‌కు హాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు హాజరు కానున్నారు'' అని యూనిట్ పేర్కొంది.

పాటతో పండగ



● సల్మాన్ ఖాన్
● రష్మిక
● కాజల్

ముంబైలోని ధారావిలో గల మురికివాడలో జరిగిన ఓ పండగకు హాజరయ్యారు సల్మాన్ ఖాన్, రష్మికా మందన్నా. ఆ పండగలో భాగంగా అక్కడి రెండు వందల మందితో కలిసి డ్యాన్స్ చేశారు. సల్మాన్ ఖాన్, రష్మికా మందన్నా జంటగా నటిస్తున్న 'సికందర్'కి సంబంధించి ప్రచారంలో ఉన్న వార్త ఇది. కథలో భాగంగా ధారావిలో జరిగే పండగకి ఈ ఇద్దరూ వెళతారట. అప్పుడు వచ్చే పాటను చిత్రదర్శకుడు మురుగదాస్ భారీగా చిత్రీకరించారని సమాచారం. జోష్‌గా సాగే ఈ పాటకు సల్మాన్, రష్మికా అదిరిపోయే లెవల్లో స్టెప్పులు వేశారట. మురికివాడలకు సంబంధించిన సెట్‌ని ముంబైలోని ఓ ప్రముఖ స్టూడియోలో వేయించి, ఈ పాటను చిత్రీకరించారని భోగట్టా. ఇక ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్న కాజల్ అగర్వాల్ 'సికందర్' సెట్స్‌లో అడుగుపెట్టారు. 'సికందర్ డే 1' అంటూ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం ద్వారా స్పష్టం చేశారు కాజల్. వచ్చే ఏడాది ఈద్ సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

ఎవరో కనుక్కోండి చూద్దాం!



● అరవింద్ స్వామి, కార్తీ

'ఏయ్.. ఎవరు' (అరవింద్ స్వామి), 'ఎవరో కనుక్కోండి చూద్దాం' (కార్తీ) వంటి డైలాగ్స్‌తో 'సత్యం సుందరం' సినిమా టీజర్ ఆరంభమైంది. కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'సత్యం సుందరం'. సి. ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో శ్రీ దివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ముఖ్య పాత్రలు పోషించారు. హీరో సూర్య, జ్యోతిక నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ 'సత్యం సుందరం'ని తెలుగులో రిలీజ్ చేస్తోంది. ''పూర్తి వినోదాత్మకంగా రాబోతున్న చిత్రం 'సత్యం సుందరం'. ఈ చిత్రంలో అమాయకత్వంతో కూడిన రస్టిక్ క్యారెక్టర్‌ను కార్తీ చేయగా, రిజర్వ్‌డ్ అర్బన్ పర్సనాలిటీగా అరవింద్ స్వామి కనిపిస్తారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఈ ప్రపంచం మనుగడ సాగించలేదు!



● 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్' పోస్టర్

'మ్యాడ్ మ్యాక్స్, ది రెవినాంట్, ఇన్సెప్షన్' వంటి సినిమాల్లో నటించిన టామ్ హార్డీ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'వెనమ్: ది లాస్ట్ డాన్స్'. కెల్లీ మార్సెల్ దర్శకత్వం వహించారు. సోనీ పిక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మార్వెల్ సంయుక్తంగా నిర్మించాయి. సోనీ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని ఇండియాలో ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేయనుంది. 3డితో పాటు ఐమాక్స్ 3డి వెర్షన్‌లో అక్టోబర్ 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ఫైనల్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ''ఇది నీకు నచ్చకపోవచ్చు... నచ్చదు... నాకు కచ్చితంగా నచ్చదని గ్యారెంటీ ఇస్తున్నాను', 'ఆ గ్రహవాసులు మనల్ని కనిపెట్టారు', 'దాన్ని ఎవరు పంపించారు... ఆ సృష్టికర్త', 'మీరు కలిసుంటే ఈ ప్రపంచం మనుగడ సాగించలేదు' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''టామ్ హార్డీ నటనతో పాటు వెనమ్ క్యారెక్ట్ చేసే యాక్షన్ సీన్స్ హైలెట్‌గా నిలుస్తాయి. ఇప్పటికే విడుదలైన 'వెనమ్' మొదటి భాగం, రెండవ భాగం ప్రపంచవ్యాప్తంగా మూవీ లవర్స్‌ని బాగా ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో రాబోతున్న 'వెనమ్: ది లాస్ట్ డాన్స్' పై భారీ అంచనాలున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

మన్యం ధీరుడు వస్తున్నాడు



● ఆర్‌వీవీ సత్యనారాయణ

మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు పాత్రలో ఆర్‌వీవీ సత్యనారాయణ నటించి, నిర్మించిన చిత్రం 'మన్యం ధీరుడు'. ఆర్ పార్వతీదేవి సమర్పణలో నరేష్ డెక్కల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 20న రిలీజ్ కానుంది. ''అల్లూరి సీతారామరాజు నిజ చరిత్రను వెండితెరపై ఆవిష్కరించాలన్న సంకల్పంతో ఆర్‌వీవీ సత్యనారాయణ 'మన్యం ధీరుడు'ని నిర్మించారు. అల్లూరి పాత్రలో ఒదిగిపోవడానికి గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం, విలు విద్యలో ఆయన శిక్షణ తీసుకున్నారు. బానిస సంకెళ్లు తెంచుకుని బ్రిటిష్ తెల్ల దొరల పాలనకు చరమగీతం పాడే సన్నివేశాలు ఈ చిత్రంలో ఒళ్లు గగుర్పొడిచే విధంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

నేను సీరియల్ డేటర్



● రెజీనా

''నేను ఓ సీరియల్ డేటర్‌ని అని చెప్పొచ్చు'' అంటున్నారు హీరోయిన్ రెజీనా. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'నిజ జీవితంలో మీకిప్పటివరకూ చాలా ప్రపోజల్స్ వచ్చి ఉంటాయి. మీ మనసుకు ఒకటి కూడా కనెక్ట్ కాలేదా? అనే ప్రశ్న రెజీనాకి ఎదురైంది. ఇందుకు ఆమె సమాధానం ఇస్తూ... ''చాలా ప్రపోజల్స్ వచ్చాయి.. వాటిలో కొన్ని నాకు కనెక్ట్ అయ్యాయి. నా లైఫ్‌లో చాలా రిలేషన్‌షిప్స్ ఉన్నాయి. ఈ విషయంలో నేను ఒక సీరియల్ డేటర్‌ని అని చెప్పొచ్చు. అయితే ప్రస్తుతం వీటన్నింటికీ దూరంగా ఉన్నాను'' అని తెలిపారు రెజీనా. ఇదిలా ఉంటే.. రెజీనా ప్రస్తుతం హిందీలో 'సెక్షన్ 108, జట్, ఫ్లాష్‌బ్యాక్' సినిమాలతో పాటు సన్నీ డియోల్ హీరోగా డైరెక్టర్ గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. అలాగే అజిత్ నటిస్తున్న తమిళ చిత్రం 'విడాముయర్చి'లో నటిస్తున్నారామె.

మనసున్న తల్లి కథ



● సాత్విక్, రఘుబాబు

ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో రూపొందుతోన్న చిత్రం 'తల్లి మనసు'. రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకత్వంలో ముత్యాల అనంత కిశోర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ 80 శాతం పూర్తయింది. ''మా నాన్న (ముత్యాల సుబ్బయ్య) చిత్రాల స్థాయికి తగ్గట్టు చక్కటి కథ, కథనాలతో తీస్తున్న చిత్రం ఇది. ఇప్పటికి 80 శాతం షూటింగ్ పూర్తయింది. ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం పూర్తి చేస్తాం'' అన్నారు అనంత కిశోర్. ''కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతని ఆకట్టుకునేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ''ఓ మధ్య తరగతి మనసున్న తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథతో ఈ సినిమా రూపొందుతోంది'' అని వి. శ్రీనివాస్ తెలిపారు.

సాక్షి బిజినెస్
శనివారం
14-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	72	82,891
నిఫ్టీ ▽	32	25,357

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,710	△	141
డోజోన్స్	41,474	△	378
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,273	△	32
డాక్స్	18,699	△	181
షాంఘై	2,704	▽	13
నికాయ్	36,582	▽	252

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	72,610	△ 1,260
బంగారం (22 క్యారట్)	69,150	△ 1,200
వెండి (కిలో)	95,000	△ 3,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	82.05	85.73
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	107.85	112.79
€	యూరో	భారతీయ	90.84	95.34
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	48.00	70.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	53.96	58.83
S$	సింగపూర్ డాలర్	భారతీయ	62.31	67.01
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.47	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.95	23.73
¥	చైనా యువాన్	భారతీయ	10.95	12.79

మాపై ఆరోపణలన్నీ అవాస్తవాలు

- కాంగ్రెస్ కావాలనే రోజుకొకటి తెరపైకి తెస్తోంది...
- సెబీ చీఫ్ మాధవి దంపతుల ప్రకటన




న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ తమపై చేస్తున్న ఆరోపణలను సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి బుచ్, ఆమె భర్త ధవళ్ బుచ్ ఖండించారు. అవన్నీ అవాస్తవాలు, అభాండాలేనని స్పష్టం చేశారు. వివాదం సద్దుమణగ కూడదనే కాంగ్రెస్ దురుద్దేశపూర్వకంగా రోజుకో ఆరోపణను తెరపైకి తెస్తూ, పదే పదే దుష్ప్రచారాన్ని కొనసాగిస్తోందని పేర్కొన్నారు. సెబీ చీఫ్‌గా కీలక హోదాలో ఉన్న మాధవి, కొన్ని సంస్థల నుంచి అనుచిత లబ్ధి పొందారంటూ కాంగ్రెస్ కొద్ది రోజులుగా ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే.

ఐసీఐసీఐ బ్యాంకులో రిటైరయిన ఉద్యోగులకు నిబంధనల ప్రకారం ఎసాప్స్‌ను ఉపయోగించుకునేందుకు పదేళ్ల సమయం ఉంటుందని, దానికి అనుగుణంగానే తాను వినియోగించుకున్నానే తప్ప బ్యాంకు నుంచి తనకే ఆదాయం లేదని మాధవి స్పష్టం చేశారు. భర్తకు చెందిన అగోరా అడ్వైజరీ తదితర సంస్థల్లో తనకున్న షేర్‌హోల్డింగ్ గురించి 2017లో సెబీలో చేరినప్పుడే వెల్లడించినట్లు తెలిపారు. సెబీలో చేరిన తర్వాత నుంచి అగోరా అడ్వైజరీ సహా ఐసీఐసీఐ బ్యాంకు, డాక్టర్ రెడ్డీస్, అల్వారెజ్ తదితర సంస్థల ఫైల్స్‌ను తాను ఎన్నడూ పరిశీలనకు తీసుకోలేదని చెప్పారు. లిస్టెడ్ సంస్థ వోకార్డ్‌కి ప్రాపర్టీని లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ ఇది యాదృచ్ఛికమే తప్ప దీని వెనుక ఇతర కారణాలేమీ లేవని బుచ్ దంపతులు పేర్కొన్నారు. ఇక మహీంద్రా గ్రూప్‌నకు సేవలు అందించడం ద్వారా ధవళ్ ఆదాయం పొందారన్న ఆరోపణలకు సంబంధించి తాను సెబీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకోవడానికి ముందు నుంచే మహీంద్రా గ్రూప్‌తో ఆయనకు లావాదేవీలు ఉన్నాయని మాధవి వివరించారు. ప్రొఫెషనల్స్‌గా అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తామని వారు స్పష్టం చేశారు.

గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

సూచీలకు స్వల్ప నష్టాలు



ముంబై: గరిష్టాల వద్ద లాభాల స్వీకరణతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 72 పాయింట్లు నష్టపోయి 82,891 వద్ద నిలిచింది. నిఫ్టీ 32 పాయింట్లు కోల్పోయి 25,357 వద్ద స్థిరపడింది. ఆయిల్‌అండ్‌గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ, యుటిలిటీ, సర్వీసెస్, పవర్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 309 పాయింట్లు పతనమై 82,653 వద్ద, నిఫ్టీ 97 పాయింట్లు క్షీణించి 25292 వద్ద ఇంట్రాడే కనిష్టాలు నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అదానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న 311 మిలియన్ డాలర్ల స్విస్ ఖాతాలను అక్కడి ప్రభుత్వం జప్తు చేసిందన్న వార్తలతో అదానీ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అదానీ పవర్ 3%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 2.50%, అదానీ పోర్ట్స్ 1.50% క్షీణించాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఒకశాతం పతనమయ్యాయి.


'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మ్యాక్స్ హెల్త్ చేతికి జేపీ హెల్త్‌కేర్	రేటు తగ్గింపునకు తొందరలేదు: శక్తికాంత దాస్

'డిపాజిట్' వార్!

- స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై 8% పైగా వడ్డీ రేటు
- రేసులో ఎన్‌బీఎఫ్‌సీలు కూడా..
- బ్యాంకుల కంటే 1% పైగా అధికం

బ్యాంకింగ్ వ్యవస్థలో ఇప్పుడు డిపాజిట్ల పోరు మొదలైంది. రుణాలు ఇస్తున్నంత జోరుగా డిపాజిట్ల సమీకరణ జరగడం లేదంటూ ఆర్‌బీఐ పదేపదే హెచ్చరికల నేపథ్యంలో ఫిక్సిడ్ డిపాజిట్ రేట్ల మోత మోగుతోంది. అధిక వడ్డీ రేట్ల రేసులో స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ముందుండటం గమనార్హం!



డిపాజిట్ల సమీకరణలో స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు (ఎస్‌ఎఫ్‌బీలు) దూసుకెళ్తున్నాయి. దాదాపు అరడజను ఎస్‌ఎఫ్‌బీలు ఫిక్సిడ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై 8% శాతం పైగా వడ్డీరేటును ఆఫర్ చేస్తూ డిపాజిటర్లను ఆకర్షిస్తున్నాయి. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి బడా బ్యాంకులు, ఇతర వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే అవి ఏకంగా 1 శాతం పైగానే అధికంగా వడ్డీరేటును ఆఫర్ చేస్తుండటం గమనార్హం. గత కొన్నేళ్లుగా డిపాజిట్ రేట్లు నేలచూపులు చూడటంతో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లు, బాండ్లు ఇతరత్రా ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాలు ఆకర్షించడంతో ఇన్వెస్టర్లు తమ పొదుపు నిధులను చాలా వరకు అటువైపు మళ్లిస్తున్నారు. దీంతో కొంతకాలంగా బ్యాంకుల్లో డిపాజిట్లు వెలవెలబోతున్న పరిస్థితి నెలకొంది. దీనిపై ఆర్‌బీఐ తీవ్రంగా దృష్టి పెట్టడంతో బ్యాంకులు మళ్లీ రేట్ల పెంపు, ప్రత్యేక డిపాజిట్ స్కీమ్‌ల ద్వారా డిపాజిట్ల సమీకరణ వేట మొదలు పెట్టాయి.

జూలై నుంచి జోరు...

ఈ ఏడాది జూన్‌లో డిపాజిట్లు, రుణ వృద్ధి మధ్య అంతరం ఆల్ టైమ్ గరిష్టానికి ఎగబాకడంతో రేట్ల పెంపు మొదలైంది. బ్యాంకులన్నీ వరుస కట్టడంతో జూలై నుంచి ఇది వేగం పుంజుకుంది. ఈ రేసులో ఎస్‌ఎఫ్‌బీలు బ్యాంకులతో పోటాపోటీగా వడ్డీరేట్లను ఆఫర్ చేస్తున్నాయి. ఉత్కర్ష్, సూర్యోదయ ఎస్‌ఎఫ్‌బీలు 2–3 ఏళ్ల వ్యవధి ఫిక్సిడ్ డిపాజిట్లపై 8.5% వడ్డీని ఇస్తున్నాయి. ఈక్విటాస్ కూడా రెండేళ్ల నుంచి మూడేళ్లలోపు ఎఫ్‌డీలపై 8.5% వడ్డీరేటును అందిస్తోంది. యూనిటీ ఎస్‌ఎఫ్‌బీ అయితే 1,001 రోజుల ఎఫ్‌డీపై ఏకంగా 9% వడ్డీ ఇస్తుండటం విశేషం. ఈ విషయంలో వాణిజ్య బ్యాంకులు వెనుకబడుతున్నాయి. ఎస్‌బీఐ 444 రోజుల ప్రత్యేక డిపాజిట్ స్కీమ్‌పై అత్యధికంగా 7.25% వడ్డీ ఆఫర్ చేస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గరిష్ట డిపాజిట్ రేటు 7.4%. అయితే, ఈ బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు అదనంగా అర శాతం వడ్డీ ఇస్తున్నాయి. కాగా, బ్యాంకింగేతర ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) కూడా 8% పైగా వడ్డీ ఆఫర్ చేస్తూ బ్యాంకులతో పోటీ పడుతున్నాయి. మణిపాల్ హౌసింగ్ ఫైనాన్స్ 1–3 ఏళ్ల ఎఫ్‌డీలపై 8.25% వడ్డీ ఇస్తుండగా.. బజాజ్ ఫైనాన్స్ 42 నెలల డిపాజిట్‌కు 8.65% వడ్డీ రేటు అందిస్తోంది.

తాజా డిపాజిట్ రేట్లు ఇలా...

బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ	వార్షిక వడ్డీ రేటు(%) ఏడాది	మూడేళ్లు
ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్	8.2	8.0
ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్	8.0	8.5
సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్	6.85	8.6
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్*	6.6	7.0
ఎస్‌బీఐ*	6.8	6.75
మహీంద్రా ఫైనాన్స్	7.4	8.05
బజాజ్ ఫైనాన్స్	7.4	8.05
మణిపాల్ హౌసింగ్	8.25	8.25

స్పెషల్ స్కీమ్‌లు

ఎస్‌బీఐ అమృత్ కలశ్	400 రోజులు	7.1%
ఎస్‌బీఐ అమృత్ వృష్టి	444 రోజులు	7.25%
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	55 నెలలు	7.4%
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	35 నెలలు	7.35%
యూనియన్ సమృద్ధి	333 రోజులు	7.4%

* రూ. 3 కోట్ల లోపు. బ్యాంక్ వెబ్‌సైట్ల ప్రకారం

ఊరిస్తున్న స్టాక్ మార్కెట్...

గత కొన్నేళ్లుగా స్టాక్ మార్కెట్లు రికార్డుల మీద రికార్డులతో దూసుకుపోతుండటంతో షేర్లలో పెట్టుబడి పెట్టేవారి సంఖ్య (ఈక్విటీ కల్చర్) అంతకంతకూ పెరుగుతోంది. దీనికి తోడు మ్యూచువల్ ఫండ్స్, ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు), సావరీన్ గోల్డ్ బాండ్స్, ఇన్‌ఫ్రా బాండ్లు ఇతరత్రా పెట్టుబడి సాధనాలు భారీ లాభాలను పంచుతుండటంతో ఇన్వెస్టర్లు వాటి వెంట పడుతున్నారు. సంప్రదాయ బ్యాంక్ డిపాజిట్ల నుంచి నిధులు అటుగా మళ్లుతుండటంతో పొదుపు రేటు కూడా పడిపోతోంది. 'డిపాజిట్ల సమీకరణ ఇప్పటికీ మందకొడిగానే ఉండటం ఆందోళనకరం.అయితే, జూలై నుంచి రేట్ల పెంపు ప్రభావంతో ఇప్పుడిప్పుడే కాస్త పుంజుకుంటున్నాయి. మరోపక్క, ఇన్‌ఫ్రా బాండ్ల వంటి వాటికి డిమాండ్ పెరిగింది' అని యూనియన్ బ్యాంక్ చీఫ్ ఎకనమిక్ అడ్వయిజర్ కనిక పస్రీచా పేర్కొన్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



బంగారం ధరధగ!

అంతర్జాతీయ మార్కెట్లో కొత్త గరిష్ట స్థాయి

న్యూఢిల్లీ/న్యూయార్క్: బంగారం అంతర్జాతీయంగా కొత్త రికార్డు ధరలను చూసింది. కమోడిటీ ఫ్యూచర్స్– నైమెక్స్‌లో చురుగ్గా ట్రేడయ్యే డిసెంబర్ కాంట్రాక్ట్ ఔన్స్ (31.1 గ్రాములు) ధర శుక్రవారం ఆల్ టైమ్ రికార్డు స్థాయిలో 2,611.6 డాలర్లను తాకింది. క్రితం ముగింపుతో పోల్చితే 25 డాలర్లకు పైగా ఎగసి ట్రేడవుతోంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ రేట్ల కోత అంచనాలు పసిడి పరుగులకు దోహదం చేస్తున్నాయి.

దేశంలోనూ అదే తీరు...: దేశీయంగా చూస్తే ఢిల్లీలో పసిడి 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత ధర రూ.1,200 పెరిగి రూ.75,500కు చేరింది. ఒక్క జూలైలో దేశీయంగా పసిడి ధర రూ.5,000 ఎగసి రూ.71,050కి చేరింది. మరోవైపు వెండి ధరలు వరుసగా నాల్గవ రోజూ పెరిగాయి. కిలోకు శుక్రవారం రూ.2,000 ఎగసి రూ.89,000కు చేరింది. ముంబైలో 24 క్యారెట్లు, 22 క్యారెట్ల ధరలు క్రితం ముగింపుతో పోల్చితే రూ. 1,260, రూ.1,200 చొప్పున ఎగసి వరుసగా రూ.72,610, రూ.69,150కి చేరాయి. వెండి ధర కేజీకి ఏకంగా రూ.3,500 పెరిగి రూ.95,000కు ఎగసింది. మరోవైపు దేశీయ ఫ్యూచర్స్ ఎంసీఎక్స్‌లో పసిడి డిసెంబర్ కాంట్రాక్ట్ ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.700 లాభంతో రూ. 74,000పైన ట్రేడవుతోంది. వెండి ధర రూ. 2,400 పెరిగి రూ. 89,500 వద్ద ట్రేడవుతోంది.

ఎన్‌ఎస్‌ఈకి సెబీ ఊరట

కోలొకేషన్ కేసు కొట్టివేత
- లిస్టింగ్‌కు మార్గం సుగమం!



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్చేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈపై గతంలో నమోదైన నిబంధనల ఉల్లంఘన కేసును తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కొట్టివేసింది. దీనితో ఎన్‌ఎస్‌ఈ లిస్టింగ్‌కు మార్గం దాదాపు సుగమం అయ్యింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ (ఎన్‌ఎస్‌ఈ) సహా ఏడుగురు మాజీ ఉన్నతోద్యోగులపై 2019లో నమోదు చేసిన కోలొకేషన్ కేసును కొట్టివేస్తున్నట్లు సెబీ పేర్కొంది. ఓపీజీ సెక్యూరిటీస్, ఎన్‌ఎస్‌ఈ, ఏడుగురు ఉద్యోగుల మధ్య కుమ్మక్కుకావడం లేదా రహస్య ఒప్పందం కుదిరిందనడానికి స్పష్టమైన దాఖలాలులేవని 83 పేజీల ఆదేశాలలో సెబీ తెలియజేసింది. వెరసి ఎన్‌ఎస్‌ఈ.. మాజీ ఎండీ, సీఈవోలు చిత్రా రామకృష్ణ, రవి నారాయణ్‌తో పాటు ఆనంద్ సుబ్రమణ్యన్, రవీంద్ర ఆప్టే, ఉమేష్ జైన్, మహేష్ సోపర్కర్, దేవీప్రసాద్ సింగ్‌లపై అభియోగాలను కొట్టివేసింది. దీంతో పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు ఎన్‌ఎస్‌ఈకి లైన్‌క్లియర్ అయినట్లు పరిశ్రమవర్గాలు అభిప్రాయపడ్డాయి. కొన్ని బ్రోకింగ్ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అక్రమ యాక్సెస్‌ను ఇచ్చిన అభియోగాలతో ఎన్‌ఎస్‌ఈసహా ఎక్స్చేంజీ మాజీ ఉద్యోగులపై సెబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. డార్క్‌ఫైబర్ రూపంలో ఇతర సభ్యులకంటే ముందుగానే కొలొకేషన్ సౌకర్యాల వినియోగానికి కొన్ని బ్రోకింగ్ సంస్థలను అనుమతించినట్లు అభియోగాలు వెలువడిన నేపథ్యంలో సెబీ ఎన్‌ఎస్‌ఈ, ఎక్స్చేంజీ ఉద్యోగులపై కేసు నమోదు చేసింది. అయితే.. నాలుగు నెలల్లోగా కేసును సమీక్షించాల్సిందిగా సెబీని 2023 జనవరిలో సెక్యూరిటీస్ అపిలేట్ ట్రిబ్యునల్ (శాట్) ఆదేశించిన నేపథ్యంలో తాజా తీర్పు వెలువడటం గమనార్హం! మరోవైపు సెబీ విడిగా జారీ చేసిన ఆదేశాల్లో ఉమ్మడిగా మొత్తం రూ. 85.25 కోట్లు చెల్లించవలసిందిగా ఓపీజీ సెక్యూరిటీస్, సంజయ్ గుప్తా, సంగీత గుప్తా, ప్రకాష్ గుప్తాలను ఆదేశించింది.

సాక్షి స్పోర్ట్స్



'డ్రా'తో మొదలైన ఐఎస్‌ఎల్

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) 11వ సీజన్ 'డ్రా'తో ప్రారంభమైంది. గత ఏడాది ఫైనలిస్ట్‌లు ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్, మోహన్ బగాన్ సూపర్ జెయింట్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ 2–2 గోల్స్‌తో సమంగా ముగిసింది. ముంబై సిటీ తరఫున థేర్ క్రూమ్ 90వ నిమిషంలో గోల్ సాధించాడు. మోహన్ బగాన్ తరఫున తిరి 70వ నిమిషంలో, ఆల్బర్టో రోడ్రిగ్జెజ్ 28వ నిమిషంలో గోల్స్ కొట్టారు. అయితే మ్యాచ్ ఆరంభంలోనే 9వ నిమిషంలో తిరి సెల్ఫ్ గోల్ చేయడం తుది ఫలితం సమంగా ముగిసేందుకు కారణమైంది. సొంత మైదానంలో భారీ సంఖ్యలో ప్రేక్షకుల మధ్య మోహన్ బగాన్ మ్యాచ్ ఆద్యంతం దూకుడు ప్రదర్శించినా... ఈ టీమ్‌ను నిలువరించడంలో ముంబై సఫలమైంది. ఐఎస్‌ఎల్‌లో భాగంగా నేడు రెండు వేర్వేరు వేదికల్లో రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. భువనేశ్వర్‌లో ఒడిశా ఎఫ్‌సీతో చెన్నైయిన్ ఎఫ్‌సీ... బెంగళూరులో ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీతో బెంగళూరు ఎఫ్‌సీ తలపడతాయి.

వృత్తి అగర్వాల్‌కు ఐదో పతకం

సామదేవ్‌కు రజతం, వర్షిత్‌కు కాంస్యం



పతకాలతో వృత్తి అగర్వాల్, వర్షిత్, సామదేవ్

మంగళూరు: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను తెలంగాణ మహిళా స్విమ్మర్ వృత్తి అగర్వాల్ ఐదో పతకంతో ముగించింది. శుక్రవారం ముగిసిన ఈ పోటీల్లో వృత్తి అగర్వాల్ 200 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. వృత్తి 2ని:09.25 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ పోటీల్లో వృత్తి అగర్వాల్ 1500, 800 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగాల్లో స్వర్ణ పతకాలు, 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో రజతం, 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగంలో రజతం సాధించింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ మోంగం తీర్థు సామదేవ్ పురుషుల 400 మీటర్ల మెడ్లే ఈవెంట్‌లో రజత పతకం, తెలంగాణ స్విమ్మర్ ధూళిపుడి వర్షిత్ కాంస్య పతకం గెల్చుకున్నారు. సామదేవ్ 4 నిమిషాల 36.44 సెకన్లలో... వర్షిత్ 4 నిమిషాల 37.68 సెకన్లలో గమ్యానికి చేరి వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఓవరాల్‌గా ఈ పోటీల్లో తెలంగాణ ఆరు పతకాలతో ఏడో స్థానంలో, ఆంధ్రప్రదేశ్ మూడు పతకాలతో 12వ స్థానంలో నిలిచాయి. కర్ణాటక 33 పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది.

భారత జట్ల 'హ్యాట్రిక్'

చెస్ ఒలింపియాడ్‌లో వరుసగా మూడో విజయం



అర్జున్



వైశాలి

బుడాపెస్ట్ (హంగేరి): చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు వరుసగా మూడో విజయం నమోదు చేశాయి. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 3–1తో స్విట్జర్లాండ్ జట్టును ఓడించగా... భారత పురుషుల జట్టు 3.5–0.5తో హంగేరి 'బి' జట్టుపై గెలిచింది. స్విట్జర్లాండ్‌తో జరిగిన గేముల్లో భారత స్టార్ ద్రోణవల్లి హారిక 46 ఎత్తుల్లో ప్రపంచ మాజీ చాంపియన్ అలెగ్జాండ్రా కొస్టెనిక్ చేతిలో ఓడిపోగా... వైశాలి 38 ఎత్తుల్లో ఘజల్ హాకిమ్‌ఫర్డ్‌పై, దివ్య దేశ్‌ముఖ్ 32 ఎత్తుల్లో సోఫియా హ్రిజ్లోవాపై, వంతిక అగర్వాల్ 48 ఎత్తుల్లో మరియా మాంకోపై విజయం సాధించారు. తానియా సచ్‌దేవ్‌కు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు. హంగేరి 'బి' జట్టుతో జరిగిన గేముల్లో భారత నంబర్‌వన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్ 34 ఎత్తుల్లో పీటర్ ప్రొజాస్కాపై, దొమ్మరాజు గుకేశ్ 54 ఎత్తుల్లో ఆడమ్ కొజాక్‌పై, ప్రజ్ఞానంద 63 ఎత్తుల్లో తామస్ బానుస్‌పై గెలిచారు. గాబోర్ పాప్‌తో జరిగిన గేమ్‌ను విదిత్ సంతోష్ గుజరాతి 26 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పెంటేల హరికృష్ణకు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు.

అఫ్గానిస్తాన్, న్యూజిలాండ్ ఏకైక టెస్టు రద్దు

గ్రేటర్ నోయిడా: ప్రతికూల వాతావరణ పరిస్థితులతో అఫ్గానిస్తాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగాల్సిన ఏకైక టెస్టు మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యింది. తాజా మ్యాచ్‌ను కలుపుకుంటే అంతర్జాతీయ క్రికెట్‌లో ఇలా ఎనిమిది టెస్టులు టాస్‌కు నోచుకోకుండానే రద్దయ్యాయి. భారత్‌లో మాత్రం ఇదే మొదటిది. యాదృచ్ఛికమో ఏమో గానీ ఈ జాబితాలో ఆఖరి టెస్టు న్యూజిలాండ్ గడ్డపై 1998లో ఉంటే... అప్పుడు ప్రత్యర్థి భారత్! కానీ ఇప్పుడు భారత్ సొంతగడ్డపై జరుగుతున్న ఈ టెస్టులో అఫ్గాన్ ప్రత్యర్థిగా న్యూజిలాండ్ ఉంది. ఇక ఈ రద్దయిన టెస్టుల జాబితాను పరిశీలిస్తే... మాంచెస్టర్‌లో ఇంగ్లండ్–ఆస్ట్రేలియా జట్ల మధ్య 1890లో, 1938లో రెండు టెస్టులు రద్దయ్యాయి. మళ్లీ ఈ ఇరు జట్ల మధ్యే మెల్‌బోర్న్ (1970)లో మూడో మ్యాచ్ కూడా రద్దయ్యింది. అనంతరం న్యూజిలాండ్–పాకిస్తాన్ (1989; డ్యూనెడిన్‌లో), వెస్టిండీస్–ఇంగ్లండ్ (1990; గయానాలో), పాకిస్తాన్–జింబాబ్వే (1998; ఫైసలాబాద్‌లో), న్యూజిలాండ్–భారత్ (1998; డ్యూనెడిన్‌లో)ల మధ్య మ్యాచ్‌లు కనీసం టాస్ పడకుండానే రద్దయ్యాయి.

నేటి నుంచి స్వీడన్‌తో భారత్ డేవిస్‌కప్ పోరు

స్టాక్‌హోమ్: అగ్రశ్రేణి క్రీడాకారులు సుమిత్ నగాల్, యూకీ బాంబ్రీ గైర్హాజరీలో... స్వీడన్‌తో నేడు మొదలయ్యే డేవిస్ కప్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్–1 మ్యాచ్‌లో భారత్ పోటీపడనుంది. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలో తొలి రోజు రెండు సింగిల్స్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. రెండో రోజు డబుల్స్ మ్యాచ్‌తో పాటు రెండు రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌లుంటాయి. తొలి సింగిల్స్‌లో 238వ ర్యాంకర్ ఇలియాస్ యామెర్‌తో శ్రీరామ్ బాలాజీ... రెండో సింగిల్స్‌లో లియో బోర్గ్‌తో రామ్‌కుమార్ ఆడతారు.



రోహిత్ శర్మ



కోహ్లి, బుమ్రా



అక్షర్ పటేల్, రిషభ్ పంత్

కౌంట్‌డౌన్ షురూ

భారత క్రికెట్ కొత్త సీజన్‌కు రంగం సిద్ధం ● తొలి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్న ఆటగాళ్లు

చెన్నై: సొంతగడ్డపై కొత్త సీజన్ కోసం భారత క్రికెట్ జట్టు సన్నాహాలు మొదలయ్యాయి. నెల రోజుల విరామం తర్వాత టీమిండియా ఆటగాళ్లంతా మళ్లీ ఒక్క చోట చేరారు. ఈ నెల 19 నుంచి బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రోహిత్ శర్మ నాయకత్వంలో జట్టు మొత్తం సాధనలో మునిగింది. తొలి రోజు శుక్రవారం చిదంబరం స్టేడియంలో భారత జట్టు పూర్తి స్థాయిలో ప్రాక్టీస్‌లో పాల్గొంది. గత నెల 7న భారత జట్టు తమ ఆఖరి మ్యాచ్ ఆడింది. శ్రీలంకతో చివరి వన్డేలో ఓడి సిరీస్‌ను కోల్పోయింది. ఆ తర్వాత ఇప్పుడు మళ్లీ కొత్తగా హోం సీజన్‌ను మొదలు పెట్టేందుకు సిద్ధమైంది.

లండన్ నుంచి నేరుగా...

బంగ్లాదేశ్‌తో చెన్నైలో జరిగే తొలి టెస్టు కోసం సెలక్టర్లు 16 మంది సభ్యులతో జట్టును ప్రకటించారు. వీరిలో దులీప్ ట్రోఫీలో ఆడుతున్న సర్ఫరాజ్ ఖాన్ మినహా మిగతా వారంతా శిక్షణా శిబిరానికి హాజరయ్యారు. గురువారమే కెప్టెన్ రోహిత్ శర్మ చెన్నై చేరుకోగా... శ్రీలంకతో సిరీస్ ముగిసిన తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లిన విరాట్ కోహ్లి లండన్ నుంచి నేరుగా ఇక్కడికి వచ్చాడు. సుమారు 45 నిమిషాల పాటు కోహ్లి బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా, ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా నెట్స్‌లో సుదీర్ఘ సమయం పాటు బౌలింగ్ చేశాడు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ భారత జట్టు ప్రాక్టీస్‌ను పర్యవేక్షించగా... కొత్తగా బౌలింగ్ కోచ్‌గా నియమితుడైన మోర్నీ మోర్కెల్, అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ కూడా ఆటగాళ్లకు తగిన సూచనలిచ్చారు. భారత ఆటగాళ్ల ప్రాక్టీస్ ఫోటోలకు 'కౌంట్‌డౌన్ మొదలైంది' అనే వ్యాఖ్యను జోడించి బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. బంగ్లాదేశ్ తర్వాత స్వదేశంలోనే న్యూజిలాండ్‌తో భారత్ సిరీస్ ఆడుతుంది. బంగ్లాదేశ్‌తో జరిగే రెండు, కివీస్‌లో జరిగే మూడు టెస్టులు కూడా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా ఉన్నాయి.

భారత్ X పాక్

- నేడు దాయాదుల సమరం
- ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీ
- మధ్యాహ్నం గం. 1:15 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నేడు చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ తలపడనున్నాయి. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత భారత్ ఈ టోర్నీలో నాలుగు వరుస విజయాలతో ఇప్పటికే సెమీఫైనల్ బెర్తు సాధించింది. టీమిండియా 12 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉండగా... నాలుగింట రెండు మ్యాచ్‌లు గెలిచిన పాకిస్తాన్ 8 పాయింట్లతో సెమీఫైనల్‌కు అర్హత సంపాదించింది. ఈ నేపథ్యంలో ఇరుజట్లకు ఇది నామమాత్రమైన పోరే అయినప్పటికీ మైదానంలో జరిగే సమరం మాత్రం హైవోల్టేజీతో ఉంటుంది. భారత కెప్టెన్ సహా ఆటగాళ్లంతా సూపర్ ఫామ్‌లో ఉన్నారు. పారిస్ పతకం ఇచ్చిన ఉత్సాహంతో ఇప్పటివరకు ఎదురైన అన్ని జట్లను మట్టికరిపించారు. ఆతిథ్య చైనాను 3–0తో చిత్తు చేసిన భారత్ 5–1తో జపాన్‌పై, 8–1తో మలేసియాపై తిరుగులేని విజయాలు సాధించింది. 3–1తో కొరియాను ఓడించిన భారత్ ఇప్పుడు ఇదే జోరుతో దాయాది జట్టును కంగుతినిపించాలని తహతహలాడుతోంది. గతేడాది చైనాలోనే జరిగే హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత్ 10–2తో పాకిస్తాన్‌పై ఏకపక్ష విజయాన్ని సాధించింది. గత ఏడాది చెన్నైలో జరిగిన పోరులోనూ భారత్ 4–0తో ఘనవిజయం సాధించింది. టోర్నీ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన దుర్భేద్యమైన టీమిండియాను ఓడించడం పాకిస్తాన్‌కు అంత సులభం కాదు. ప్రపంచంలోనే ఉత్తమ డ్రాగ్‌ఫ్లికర్‌లలో ఒకడైన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ చిరకాల ప్రత్యర్థితో మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పాడు. ఇప్పుడున్న పాక్ జట్టులోని ఆటగాళ్లను జూనియర్ స్థాయి నుంచే ఎదుర్కొన్న అనుభవం తనకుందని చెప్పాడు. దీంతో వారితో చక్కని అనుబంధం ఏర్పడిందని, సోదరభావంతో మెలుగుతామని అన్నాడు. అయితే మైదానంలోకి దిగగానే ప్రత్యర్థులపై చెలరేగేందుకు సై అంటామని చెప్పుకొచ్చాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పరిపక్వత కల్పించి.. పాఠాలు చెప్పండి



విద్యార్థుల్లో మానసిక స్థైర్యం కల్పించండి

ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వండి

ఇంజనీరింగ్ కాలేజీలకు ఏఐసీటీఈ మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ, రాష్ట్ర ఇంజనీరింగ్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. తెలంగాణలో స్పాట్ అడ్మిషన్లు చేపట్టారు. చాలా చోట్ల బోధనకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) దేశంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీలకు కీలకమైన సూచన చేసింది. సీట్లు పొందిన విద్యార్థులకు స్వాగతం పలికే (ఇండక్షన్) కార్యక్రమం నుంచే ప్రత్యేక కౌన్సెలింగ్ చేపట్టాలని, మానసికంగా సన్నద్ధం చేయించాలని సూచి ంచింది. నెల రోజులపాటు ప్రతీ బ్రాంచీలో ఆందోళనకు గురయ్యే విద్యార్థులను గుర్తించాలని, దీనికి గల కారణాలను అన్వేషించాలని చెప్పింది. అవసరమైతే వారి తల్లిదండ్రులనూ పిలిపించి, విద్యార్థి మానసిక స్థితిని తెలుసుకోవాలంది. ప్రతీ కాలేజీలోనూ ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, మానసిక నిపుణుల తోడ్పాటు తీసుకోవాలని సలహా ఇచ్చింది. ఏఐసీటీఈ మార్గదర్శకాలను విధిగా అమలు చేసేందుకు యూనివర్సిటీలు, ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తున్నాయి.

ఫస్టియర్‌లో 50 శాతం మంది..

ఇంజనీరింగ్ కాలేజీల్లో పరిస్థితిపై గత ఏడాది ఏఐసీటీఈ అధ్యయనం చేసింది. గడచిన ఐదేళ్లుగా ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థుల్లో 50 శాతం మొదటి సంవత్సరంలో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ద్వితీయ సంవత్సరంలో ఇది 30 శాతంగా, మూడో ఏడాది 20 శాతంగా ఉంటోంది. తొలి ఏడాదిలో 4 శాతం మంది తీవ్ర నిర్ణయాలు తీసుకునే స్థాయికి వెళ్తున్నారు. మూడో ఏడాదిలో కొన్ని సబ్జెక్టులు మిగిలిపోవడంతో ఇంతే తీవ్రస్థాయిలోకి వెళ్తున్నారు. దీనికి ప్రధాన కారణం సిలబస్‌పై అవగాహన లేకపోవడం. ఇంటర్మీడియెట్ వరకూ విద్యార్థులు బట్టీ విధానంలో చదువుతున్నారు. మార్కులే లక్ష్యంగా బోధన సాగుతోంది. సబ్జెక్టును లోతుగా అధ్యయనం చేసే విధానం ఉండటం లేదు. ఈ క్రమంలో బోధన అర్థం కాని పరిస్థితి ఉంటోందన్నది ఏఐసీటీఈ పరిశీలన. దీన్ని ముందుగా దూరం చేయాలని మండలి సూచించింది.

ఏఐ డామినేషన్..

కంప్యూటర్ కోర్సులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డామినేట్ చేస్తోంది. రాష్ట్రంలో 86,943 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, కంప్యూటర్ కోర్సుకు సంబంధించినవే 61,587 ఉన్నాయి. కంప్యూటర్ కోడింగ్ కేవలం ఇంజనీరింగ్‌లోనే ఎదురవుతుంది. దీనిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని మండలి పరిశీలనలో తేలింది. ఏఐ, ఎంఎల్ వంటి కోర్సులు బోధించే ఫ్యాకల్టీలో నిపుణులు లేకపోవడమూ సమస్యకు కారణమవుతోంది. మెకానికల్, సివిల్ బ్రాంచీల్లో అకడమిక్‌గా విద్యార్థులకు ఇబ్బంది ఎదురవడం లేదు. కానీ ప్రాక్టికల్ నాలెడ్జ్ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించడంపై అన్ని కాలేజీలు దృష్టి పెట్టాలని సాంకేతిక విద్యామండలి సూచించింది.



బతికి బయటపడితే అదే పదివేల్..

ఫొటో భలేగా ఉంది కదూ.. చిన్నచేపల సమూహాన్ని ఓ భారీ తిమింగలం మింగేయదానికి వస్తున్న ఈ చిత్రం 'ఓషన్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్'పోటీలో విజేతగా నిలిచింది. వివిధ దేశాల నుంచి 15 వేల ఎంట్రీలు రాగా.. మెక్సికోకు చెందిన రఫేల్ ఫెర్నాండెజ్ తీసిన ఈ ఫొటో మొదటి స్థానాన్ని గెలుచుకుంది. ఇది బ్రైడీస్ వేల్.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఇవి 100 లోపే ఉన్నాయట.

20 వరకు పీజీ సీట్ల రిపోర్టింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం మొదటి విడత కౌన్సెలింగ్‌లో పీజీ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్టు చేయాల్సిన తేదీని ఈ నెల 20 వరకు పొడిగించినట్లు టీజీసీపీజీఈటీ–2024 అధికారులు శుక్రవారం తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు ఈ నెల 21 నుంచి పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

ఇంటర్ బోర్డ్ కార్యదర్శిగా దేవసేన



సాక్షి, హైదరాబాద్: సాంకేతిక విద్య కమిషనర్ దేవసేనకు.. ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ మేరకు ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వులు శుక్రవారం వెలుగులోకి వచ్చా యి. ఇంటర్ బోర్డ్ కార్యదర్శిగా ఉన్న శృతి ఓజా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఈ నిర్ణ యం తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

ఐసెట్ ద్వారా 87 శాతం సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: ఐసెట్ కౌన్సెలింగ్‌లో 87.2 శాతం సీట్లు భర్తీ చేసినట్టు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన వెల్లడించారు. ఈ మేరకు సీట్ల కేటాయింపు వివరాలను ఆమె శుక్రవారం ప్రకటించారు. ఎంబీఏలో 27,951 సీట్లు అందుబాటులో ఉంటే, 24,457 సీట్లు భర్తీ చేశారు. ఎంసీఏలో 6,797 సీట్లు అందుబాటులో ఉంటే, 5,843 సీట్లు భర్తీ చేశారు. ఎంబీఏలో ఇంకా 3,494, ఎంసీఏలో 954 సీట్లు ఖాళీగా ఉన్నాయి. 91 కళాశాలల్లో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఐసెట్‌కు ఈ ఏడాది 71,647 మంది అర్హత సాధించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

● గంగ ఉప్పొంగె..



ఇటీవలి భారీ వర్షాలకు భూగర్భ జలాలు భారీగా పెరిగిపోయాయి. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం శివారులోని ఒక వ్యవసాయ బావిలోనుంచి జలం ఉబికి వస్తోంది. దీంతో రైతు ఏర్పుల వీరమల్లు.. విద్యుత్ మోటార్ లేకుండానే బావి నీటిని తన వరి పొలానికి నీరు పెడుతున్నాడు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఈ వ్యవసాయ బావిని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.


- మరిపెడ రూరల్

'ఎల్లంపల్లి'కి ఎన్నేళ్లు?

ప్రాజెక్టు పూర్తయినా ప్రారంభానికి మీనమేషాలు ● కాంగ్రెస్ సర్కారు రాకతో మళ్లీ కదలిక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర సాగునీటి వనరుల్లో.. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. 2004లో కాంగ్రెస్ సర్కారు జలయజ్ఞంలో భాగంగా.. నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు మాజీ స్పీకర్ శ్రీపాదరావు పేరుతో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల మధ్యనున్న గోదావరిపై చేపట్టిన ఈ ప్రాజెక్టుతో ప్రస్తుత పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి, ముర్మూర్‌తో సహా 11 గ్రామాలు పూర్తిగా, మరో 10 గ్రామాలు పాక్షికంగా, మంచిర్యాల జిల్లా హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల పరిధిలో 10 గ్రామాలు పూర్తిగా, మరో 9 గ్రామాలు పాక్షికంగా మొత్తంగా 40 గ్రామాలు ప్రభావితమయ్యాయి. కోటిలింగాల వంటి చారిత్రక గ్రామం ముంపునకు గురైంది.

గ్రామాల నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించారు. అయితే కాంగ్రెస్ హయాంలోనే అట్టహాసంగా ప్రాజెక్టును ప్రారంభించాలని యోచించినా కుదరలేదు. మహానేత వైఎస్సార్ అకాల మరణం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో ప్రాజెక్టుపై పట్టింపు కరువైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 'కాళేశ్వరం'చేపట్టి, ఎత్తిపోతలు మొదలైనా కూడా ప్రారంభానికి నోచుకోలేదు. ఎనిమిదేళ్లుగా పూర్తిస్థాయిలో ఈ బరాజ్‌లో 20 టీఎంసీల నీటిని నిల్వ చేసుకుంటూ తాగు, సాగు, పారిశ్రామిక రంగాల నీటి అవసరాలను తీరుస్తోంది.



ఎల్లంపల్లి ప్రాజెక్టు

భాగ్యనగరానికి తాగునీరు

భాగ్యనగర వాసులకు ఏటా పది టీఎంసీల గోదావరి జలాలను అందిస్తూ దాహార్తి తీర్చుతోంది. ఇందుకు ప్రతి రోజూ గరిష్టంగా 330 క్యూసెక్కుల వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. స్టేజ్–2లో ఉమ్మడి కరీంనగర్ రాజన్న సిరిసిల్ల, జగిత్యాలలో 27 మండలాలకు సాగునీరు, వేమునూరు పంపుహౌస్‌తో 12టీఎంసీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో గూడెం ఎత్తిపోతలతో దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో 30 వేల ఎకరాలకు 3 టీఎంసీలు, మంథని నియోజకవర్గానికి 2 టీఎంసీలు, రామగుండం ఎన్టీపీసీకి 6.5 టీఎంసీలను వినియోగిస్తున్నారు. తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నంది పంపుహౌస్ నుంచి రెండు టీఎంసీలను మిడ్‌మానేరుకు, అటు నుంచి ఎగువ మానేరు, మల్లన్నసాగర్ దాకా నీటి తరలింపులో ఈ ప్రాజెక్టు కీలకమైంది. మంచిర్యాల జిల్లాతో పాటు సమీప ప్రాంతాలకు తాగునీటికి ఆధారంగా ఉంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ సాగునీటి వనరును అధికారికంగా ప్రారంభించలేదు. బీఆర్ఎస్ సర్కారు సైతం ప్రారంభించేందుకు కసరత్తు చేసినా, ముందుకు సాగలేదు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. తాజాగా మంత్రి శ్రీధర్‌బాబు ప్రాజెక్టు ఈ అధికారికంగా ప్రారంభిస్తామని ప్రకటించారు.

నిర్మిత ప్రాంతం:	గోదావరి నది
శంకుస్థాపన:	2004
పూర్తయింది:	2016
పూర్తి సామర్థ్యం:	20.175 టీఎంసీలు
ప్రాజెక్టు పూర్తి మట్టం:	148 మీటర్లు
వరద గేట్లు :	62
పంపుహౌస్‌లు:	వేమునూరు, నంది,
నీటి సరఫరా:	హైదరాబాద్ నగరం, ఎన్టీపీసీ,
గూడెం ఎత్తిపోతలు	
మొదట ప్రతిపాదిత ఆయకట్టు:	1.51 లక్షల ఎకరాలు
కాళేశ్వరం ఎత్తిపోతల:	6 లక్షల ఎకరాలు
ఖర్చు చేసిన మొత్తం (సుమారు):	రూ.5,400 కోట్లు

అన్ని కులాల వివరాలు సేకరించాలి: దాసు సురేశ్

సాక్షి, హైదరాబాద్: కులగణనను కేవలం బీసీలకే పరిమితం చేయకుండా.. అన్ని కులాలు, వర్గాల వివరాలను సమగ్రంగా సేకరించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర హైకోర్టు సూచించిన విధంగా నిర్దీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తప్పక కల్పించేలా ముఖ్యమంత్రి తన బాధ్యతను నిర్వర్తించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను పూర్తిగా అమలు చేయకపోతే, ప్రభుత్వం బీసీల నుండి తీవ్రమైన ప్రతిస్పందనను ఎదుర్కొనాల్సి వస్తుందని దాసు సురేశ్ హెచ్చరించారు.




చూడగానే ఇదేదో మైదానంలా అనిపిస్తోంది కదూ? కానీ కాదు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న కొలనులో విపరీతంగా నాచు పెరిగిపోయి ఇలా కనిపిస్తోంది

బాలగణపతి భళా

● ఇన్‌స్టాగామ్‌లో నిజామాబాద్ మట్టి బాలగణపతికి లక్షల్లో వ్యూస్
● ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యేకంగా తయారీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ పంచముఖాంజనేయ స్వామి ఆలయం వద్ద హైందవసేన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలగణపతి విగ్రహం ఆకట్టుకుంటోంది. మట్టితో తయారు చేసి, పర్యావరణహిత రంగులు పూసిన ఈ 15 అడుగుల విగ్రహాన్ని చూసేందుకు చుట్టుపక్కల జిల్లాల వారు సైతం భారీగా వస్తున్నారు. ఇక్కడ ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పెడుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన పలు ఉత్సవ సమితులు సైతం ఈ విగ్రహం గురించి అడిగి తెలుసుకుంటున్నాయి.




ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వద్ద గడ్డి, మట్టితో విగ్రహం తయారీ(ఫైల్)

ఛత్తీస్‌గఢ్‌లో తయారీ..

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు సమీపంలో మిలాన్ చక్రవర్తి అనే విగ్రహాల తయారీదారు ఈ బాలగణపతి విగ్రహాలను తయారు చేస్తున్నాడు. నిజామాబాద్‌కు చెందిన హైందవ సేన ఉత్సవ సమితి సభ్యులు ఇన్‌స్టాగామ్‌లో ఈ విగ్రహాన్ని చూసి జనవరిలో ఆర్డర్ ఇచ్చారు. పూర్తిగా ఎండు గడ్డి, బంక మట్టితో తయారు చేసిన ఈ విగ్రహం లంబోదర ఆకృతిలో ఉంది. రాయ్‌పూర్ నుంచి 600 కిలోమీటర్ల దూరంలోని నిజామాబాద్‌కు ఈ విగ్రహాన్ని తరలించేందుకు 5 రోజుల సమయం పట్టింది. ఈ విగ్రహానికి ఇన్‌స్టాగామ్‌లో 22 లక్షల వ్యూస్ వచ్చినట్లు హైందవ సేన ఉత్సవ సమితి సభ్యులు చెబుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే..

ఇప్పటివరకు కొందరు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను పంచిపెడుతూ వస్తున్నాయి. కానీ అవి చిన్న విగ్రహాలే. భారీ విగ్రహాలు మాత్రం 95 శాతం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసినవే. ఈ క్రమంలో మట్టి విగ్రహాల తయారీని ప్రభుత్వం ప్రోత్సహించాలని పర్యావరణ ప్రేమికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మట్టి విగ్రహాల తయారీ కష్టంతో కూడుకున్నది కావడంతో.. ఆ మేరకు తయారీదారులు, ఉత్సవాలు నిర్వహించేవారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినట్లుగా ఉంటుందని పేర్కొంటున్నారు.



పర్యావరణహిత రంగులు అద్దాక.. నిజామాబాద్‌లో హైందవ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట

కేసీఆర్‌తో బీసీ కమిషన్ మాజీ సభ్యుల భేటీ

పార్టీలో సముచిత స్థానం ఉంటుందని భరోసా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులుగా ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న బీఆర్ఎస్ యువ నాయకులు శుక్రవారం పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రశేఖర్‌రావుతో భేటీ అయ్యారు. బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, ఉపేంద్ర, కిశోర్ గౌడ్ ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిశారు. తమకు బీసీ కమిషన్ సభ్యులుగా అవకాశం ఇచ్చినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. బీసీ కమిషన్ సభ్యులుగా తమ పదవీకాలంలో చేసిన పనులను వివరించారు. అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించారని కేసీఆర్ వారిని అభినందించారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు, బీసీ జనగణన వంటి అంశాలు ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చాయి. పార్టీ బలోపేతానికి తిరిగి ప్రజాక్షేత్రంలో పనిచేస్తామని ముగ్గురు నాయకులు కేసీఆర్‌కు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని కేసీఆర్ వారికి భరోసా ఇచ్చారు.

నేటి నుంచి జనవిజ్ఞాన వేదిక

తెలంగాణ మహాసభలు

మూఢవిశ్వాసాలు, ఛాందసభావాలు అరికట్టడంపై చర్చ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ వేదికగా కాప్రా మున్సిపల్ సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావునగర్‌లో శనివారం నుంచి జరగనున్న జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర 5వ మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్ అభివృద్ధి లక్ష్యంగా ఆదివారం వరకు కొనసాగనున్న ఈ మహాసభల్లో తెలంగాణ నలుమూలల నుంచి హాజరుకానున్న ప్రతినిధులు పలు తీర్మానాలు చేయనున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 400 మంది ప్రతినిధులు మహాసభల్లో పాల్గొంటారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు పి.నాగరాజు తెలిపారు. మహాసభల సందర్భంగా శనివారం ఏఎస్ రావునగర్‌లోని అణుపురం కమ్యూనిటీ హాల్‌లో విద్యావిధానం–వక్రీకరణ అంశంపై ప్రొఫెసర్ జి.హరగోపాల్ ప్రసంగిస్తారు. అలాగే 'ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న' అంశంపై సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్,' ప్రజా ఆరోగ్యం–ప్రభుత్వాల బాధ్యత' అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్, పర్యావరణం–అభివృద్ధి అంశంపై పర్యావరణ కార్యకర్త లుబ్నా సార్వత్ ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. దీనికి ముందు ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు జతిన్‌కుమార్ స్వాగతోపన్యాసం చేస్తారు. ప్రతినిధుల ముగింపు సభలో భాగంగా ప్రజా సైన్స్ దశ–దిశ అంశంపై ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత జేవీవీ తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని మహాసభ ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు.



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ ప్రభాకర్

ఎస్సీ వర్గీకరణ కమిటీలో అగ్రకులానికి చైర్మన్ ఇస్తారా?

ఎస్సీ, ఎస్టీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ మీద ప్రభుత్వం వేసిన కమిటీలో అగ్రకులానికి చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని చైర్మన్‌ను చేయడం అంటే ముమ్మాటికీ మాదిగలను దగా చేయడమేనని ఎస్సీ, ఎస్టీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీని వెంటనే రద్దు చేసి కొత్త కమిటీ వేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. మాదిగలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ఎందరో మాదిగల చావులకు కారణమైన కాంగ్రెస్.. మరోసారి మాదిగ జాతిని మోసం చేస్తోందని ఆరోపించారు. అగ్రకులానికి చెందిన వారిని చైర్మన్‌గా నియమిస్తే మాదిగలకు ఏం ప్రయోజనం జరుగుతుంది? ఎస్సీ వర్గాల ఆకాంక్షలు ఎలా నెరవేరుతాయని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణపై ఆరుగురు సభ్యులతో కమిటీ వేస్తే, ఆ కమిటీలో ఎస్సీ నాయకులను నియమించకపోవడం దారుణమన్నారు. మోసం చేసే ప్రవృత్తి ఉన్న కాంగ్రెస్ పార్టీకి మాదిగలు తొందరలోనే బుద్ధి చెబుతారని శ్రీనివాస్ హెచ్చరించారు.



ధన గణపతి

గుంటూరులోని ఆర్ అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వినాయకచవితి వేడుకల్లో భాగంగా శుక్రవారం కోటీ యాభై ఒక లక్షల రూపాయలతో లక్ష్మీ గణపతి అలంకారము

విశాఖ పెదజాలారిపేటవద్ద వేట ముగించుకుని తీరానికి చేరుకుంటున్న మత్స్యకారులు



విశాఖలోని కైలాసగిరి కొండపైన పిడుగు పడుతున్న దృశ్యం



ఆశలపై అశనిపాతం

శుక్రవారం ఉదయం వాతావరణం అనుకూలించడంతో విశాఖ తీరంలో మత్స్యకారులు ఆశగా సముద్రంలోకి వెళ్లారు. అయితే ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వాతావరణం మారిపోవడంతో వేట సాగించలేక ఆదరాబాదరాగా ఒడ్డుకు చేరుకున్నారు.

చిరుద్యోగులపై సర్కార్ పగ

- మంచినీటి ల్యాబ్‌లలో ఉద్యోగుల తొలగింపునకు ఎమ్మెల్యేల ఒత్తిళ్లు
- తాము చెప్పిన వారికి కొత్తగా ఉద్యోగాలు ఇవ్వాలంటూ అధికారులకు ఆదేశాలు
- 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమను ఎలా తొలగిస్తారంటూ ఉద్యోగుల ఆందోళన
- ఉప ముఖ్యమంత్రి ఇంటి వద్ద నిరసన ప్రదర్శన
- ఆ ఉద్యోగులకు తొలిసారి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించిన జగన్ ప్రభుత్వం



నిరసన ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడుతున్న జనసేన ఎమ్మెల్యే ధర్మరాజు

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో మంచి నీటి వనరుల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌ల్లో పనిచేసే చిరుద్యోగులపై పలు జిల్లాల్లో కూటమి పార్టీ ఎమ్మెల్యేలు జులుం చూపిస్తున్నారు. 15–20 ఏళ్లగా పనిచేస్తున్న వారిని తొలగించి ఆ స్థానంలో తాము చెప్పిన వారికి కొత్తగా ఉద్యోగాలు ఇవ్వాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ప్రభుత్వ లాగిన్స్ కలిగి ఉండటంతో పాటు ల్యాబ్ ట్రైనింగ్ పొంది ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పనిచేస్తున్న తమను తొలగించడానికి వీలు లేదని ఆ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈమేరకు గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఉన్నతాధికారులు జిల్లాల అధికారులకు మెమో ఆదేశాలు జారీ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేక కొంత మంది అధికారులు కొన్ని జిల్లాల్లో సిబ్బందిని తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు.

ఆందోళన బాట పట్టిన ఉద్యోగులు

రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో 111 వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీస్ ఉండగా.. వాటిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో వందల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేసే వారికి ఉండే కనీస ప్రభుత్వ సౌకర్యాలు కూడా మొదట్లో ఆయా ల్యాబొరేటరీస్‌లో పనిచేసే వారికి వర్తించేవి కావు. అయితే గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తొలిసారి వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రతను కూడా కల్పించారు. ఔట్ సోర్సింగ్‌లో పనిచేసే ఆయా ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పిడి చేసే ప్రక్రియ కూడా అప్పటి ప్రభుత్వంలో మొదలవగా, ఆ ప్రతిపాదనలు ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 15–20 ఏళ్లుగా ఉన్న తమ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడడంపై రాష్ట్రవ్యాప్తంగా వారు ఆందోళన బాట పట్టారు.

పవన్ ఇంటి ముందు ప్రదర్శన..

ఉద్యోగుల తొలగింపునకు అధికార కూటమి పార్టీల ఎమ్మెల్యేల రాజకీయ బెదిరింపుల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీస్ ఉద్యోగులు శుక్రవారం మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ నివాసం వద్ద ప్రదర్శన నిర్వహించారు. అన్ని జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీస్ పనిచేసే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి, మినిమం టైం స్కేలు వర్తింపజేయాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. తమ సమస్యను ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. పవన్‌కళ్యాణ్ తన నివాసంలో అందుబాటులో లేకపోవడంతో అక్కడే ఉన్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు.. సమస్యను పవన్, అధికారుల దృష్టికి తీసుకొస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగులు అక్కడ నుంచి వెనుతిరిగారు.

గత ఐదేళ్లూ నీటి శుద్ధి పరీక్షల్లో ఏపీనే టాప్..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి అవసరాలకు ఉపయోగించే నీటికి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించడం, ఆ పరీక్షల్లో కలుషితాలు గుర్తిస్తే తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో మన రాష్ట్రం గత ఐదేళ్ల కాలంలో దేశంలోనే టాప్‌గా నిలిచింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలం ముందు, తర్వాత స్థానిక పంచాయతీ సిబ్బంది లేదంటే శిక్షణ పొందిన పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో నీటి నమూనాలు సేకరించి వాటిని క్రమం తప్పకుండా వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ల్యాబొరేటరీల్లో పరీక్షించారు. గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో కూడా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలో ఉండే తాగునీటి వనరులకు సైతం 97 శాతం పైబడి నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించినట్టు కేంద్రం పేర్కొంది. నీటి నాణ్యత పరీక్షల్లో గత ఆర్థిక ఏడాదిలో మన రాష్ట్రంలో 25,546 చోట్ల కలుషిత నీటిని గుర్తించగా, ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది.


డిస్కంలు చెప్పాయి..

ఈఆర్‌సీ నిర్ణయించింది



- పునరుత్పాదక ఇంధన రంగం పరిశ్రమలకు టారిఫ్ నిర్ణయించిన ఈఆర్‌సీ
- బయోమాస్, పారిశ్రామిక వ్యర్థాలు, బగాస్సే విద్యుత్ సంస్థల ఖర్చుల సమీక్ష
- ఐదేళ్ల కాలానికి ఇంధన ధరలను నిర్ణయించిన ఏపీఈఆర్‌సీ
- యూనిట్‌కు కనీసం రూ. 8 నుంచి రూ. 15 వరకూ వసూలుకు అనుమతించాలన్న నిర్వాహకులు

సాక్షి, అమరావతి: ఐదేళ్ల కాలానికి టారిఫ్ నిర్ణయంలో పునరుత్పాదక ఇంధన రంగంలోని పరిశ్రమలకు ఊరట లభించలేదు. విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు చెప్పిన దాని ప్రకారమే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆ టారిఫ్‌ని నిర్ణయించింది. 2024–25 ఆర్థిక సంవత్సరం నుంచి 2028–29 ఆర్థిక సంవత్సరం వరకు బయోమాస్, పారిశ్రామిక వ్యర్థాలు, బగాస్సే(చెరకు పిప్పి) విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమల ఖర్చుల ఆధారంగా ఏపీఈఆర్‌సీ ధరలను సమీక్షించింది. రాష్ట్రంలో ఇలాంటి పరిశ్రమలు 26 ఉన్నాయి. వీటిలో పారిశ్రామిక వ్యర్థాల నుంచి 40.965 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. బయోమాస్ బేస్డ్ పరిశ్రమల నుంచి 171.25 మెగావాట్లు, బగాస్సే పరిశ్రమల నుంచి 206.95 మెగావాట్లు చొప్పున విద్యుత్ వస్తోంది. వీటికి గతంలో 2019–20 నుంచి 2023–24 వరకు నిర్ణయించిన టారిఫ్ ప్రస్తుతం అమలులో ఉంది. టారిఫ్‌ను నిర్ణయించినప్పుడే వార్షిక ఇంధన ధర 5 శాతం పెరుగుదలతో లెక్కిస్తారు. ఈ లెక్కన 2023–24కి ఇంధన ధరలు బయోమాస్, పారిశ్రామిక వ్యర్థాల యూనిట్‌కు రూ. 5.80, బగాస్సేకి యూనిట్ రూ. 3.82 చొప్పున అమలు చేస్తున్నారు. తాము ప్రతిపాదించిన ధరలను ఆమోదించాలని లేదా 2023–24కి ఆమోదించిన అదే ధరలను కొనసాగించాలని డిస్కంలు మండలిని కోరాయి. పరిశ్రమల నిర్వాహకులు ఇంకా ఏవైనా సూచనలు, సలహాలు, అభ్యంతరాలను వెల్లడించాలనుకుంటే దానికి కూడా కమిషన్ అవకాశం కల్పించింది. కరోనా వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని, దానికి తోడు డీజిల్ ధరలు భారీగా పెరిగినందున ఖర్చులు విపరీతంగా ఉన్నాయని పరిశ్రమల నిర్వాహకులు ఏపీఈఆర్‌సీకి మొరపెట్టుకున్నారు. తాము కోలుకోవాలంటే యూనిట్ విద్యుత్‌ను కనీసం రూ. 8 నుంచి రూ. 15కు విక్రయించేలా అనుమతించాలని కోరారు. కానీ దానికి డిస్కంలు అంగీకరించలేదు. దీంతో దాదాపుగా డిస్కంలు చేసిన ప్రతిపాదనలకే 2024–29 నియంత్రణ కాలానికి ఏపీఈఆర్‌సీ అంగీకారం తెలిపింది.



పది రోజులుగా నీటి కటకట

- శ్రీకాకుళం జిల్లా డొంకూరు ఉన్నత పాఠశాల విద్యార్థుల అవస్థలు
- ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడంతో స్కూలుకు నిలిచిపోయిన కరెంట్ సరఫరా
- టీచర్లు, పేరెంట్స్ కమిటీ ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని సమస్య
- కిలోమీటర్ దూరం మంచినీటిని తెచ్చుకుంటున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ఇచ్ఛాపురం రూరల్: పాఠశాల విద్యపై టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది మరో ఉదాహరణ. అనకాపల్లి జిల్లాలో విద్యార్థులకు నాసిరకం మధ్యాహ్న భోజనం ఘటన గురువారం వెలుగుచూడగా తాజాగా.. శ్రీకాకుళం జిల్లాలో మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు అవస్థలు పడుతున్న ఉదంతం బయటకొచ్చింది. వివరాలివీ..

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం డొంకూరు ఉన్నత పాఠశాలకు 10 రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు తాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల వర్షాల కారణంగా వీచిన ఈదురుగాలులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడంతో పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో.. 320 మంది విద్యార్థులు, పదిహేను మంది ఉపాధ్యాయులతో పాటు వంట నిర్వాహకులు, మరుగుదొడ్లు శుభ్రం చేసే ఆయమ్మలు నరకయాతన అనుభవిస్తున్నారు. మధ్యాహ్న భోజనాలు అయ్యాక విద్యార్థులు పాఠశాలకు దగ్గరలోనున్న ఉప్పుటేరు గుమ్మిలో ప్రమాదకర పరిస్థితుల్లో ప్లేట్లు కడుగుతుండడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి పాఠశాలకు త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వంట చేసేందుకు నరకయాతన..




పాఠశాలకు మంచినీరు రాకపోవడంతో 320 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో కిలో మీటరు దూరంలో ఉన్న గ్రామం నుంచి నిత్యం మంచినీటిని తెచ్చుకుని వంట చేస్తున్నాం. కుండలు శుభ్రం చేసేందుకు ఉప్పుటేరు గుమ్మే మాకు దిక్కయ్యింది.

– హేమలత, వంట నిర్వాహకురాలు, డొంకూరు



బాటిల్స్ ద్వారా ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకున్న విద్యార్థులు



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 09 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 63,544 మంది స్వామివారిని దర్శించుకోగా 22,942 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.



శ్రీ యోగశాస్త్ర గణపతిగా సంపత్ వినాయగర్



సీతమ్మధార: విశాఖనగరంలోని ఆశీలమెట్ట శ్రీ సంపత్ వినాయక స్వామి శుక్రవారం భక్తులకు శ్రీ యోగశాస్త్ర గణపతి అవతారంలో దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

సింహగిరిపై పవిత్రోత్సవాలకు అంకురార్పణ



సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నుంచి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాత్రి అంకురార్పణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత రుత్విక్ వరణం, ఉత్సవాంగీకారంని నిర్వహించారు. పుట్టమన్నుని స్వామి వద్ద ఉంచి పూజలు నిర్వహించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



అన్నవరం: రత్నగిరిపై వనదుర అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ




శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.


మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో బయో కార్బన్‌పై వర్క్‌షాపు



తిరుపతి సిటీ: ఎస్వీయూ జువాలజీ విభాగం ఆధ్వర్యంలో "బయో ఈ3 -బయో సర్క్యులర్ ఎకానమీ" పై నిపుణులతో శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. బయో ఇంజినీరింగ్, బయో ఎకానమీ, పర్యావరణ సుస్థిరతతో కూడిన బయో ఈ3 ప్రాముఖ్యత, ప్రపంచం ఎదుర్కొనే సవాళ్లపై చర్చించారు. వ్యర్థాలను తగ్గించడానికి, కార్బన్ పాదముద్రలను తగ్గించడానికి ,పునరుత్పాదక జీవ వనరులను ప్రోత్సహించడానికి , బయో ఈ3 అధునాతన జీవ సాంకేతికతలతో కూడిన స్థిరమైన పద్ధతులను ఎలా అవలంబిస్తారో తెలిపారు.



ఏపీఎండీసీలో ఏయూ విద్యార్థులకు ఉద్యోగాలు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎండీసీ)లో ఉద్యోగ్యాలకు ఎంపికయ్యారు. ఏయూలో ఇటీవల జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎమ్మెస్సీ(ఎన్విరాన్‌మెంటల్ సైన్స్)లో కుంచె అపూర్వ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎంహెచ్‌ఆర్‌ఎం) నుంచి రవిశ్రీ కిరణ్ మనవ, మిండి అచ్యుతనూకరాజు ఏపీఎండీసీలో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు చేతుల మీదుగా ఆఫర్ లెటర్లు అందజేశారు.

సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని జిల్లా వైఎస్సార్ జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 11 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తి చేసి ప్రభుత్వ రంగంలో ఉపాధిని కోరుకునే వారికి ఇది మంచి అవకాశమని వివరించారు. అక్టోబరు 5 నుంచి 14వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఎస్ఎస్‌సి.ఎన్ఐసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ లిటరసీ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీ 30 రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ రెగ్యులర్ పాఠాలతో పాటు విద్యార్థులకు అదనంగా ఉపయోగపడేలా డిజిటల్ లిటరసీ సర్టిఫికెట్ కోర్సు తీసుకురావడం అభినందనీయమన్నారు.

ఏకేయూలో గెస్ట్ అధ్యాపకుల నియామకం

ఒంగోలు సెంట్రల్: 2024–25 విద్యా సంవత్సరంలో వివిధ బోధనాంశాల్లో అతిథి (గెస్ట్) అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రకేసరి యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ రాజమోహన్ తెలిపారు. ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్), ఎం.కాం, ఎంబీఏ, బీపీఎడ్, ఎంపీఎడ్ తదితర కోర్సుల్లో బోధించేందుకు అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థుల నుంచి తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాను అటెస్ట్ చేయించి ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ది ప్రిన్సిపాల్, ఏకే యూనివర్సిటీ కాలేజ్, ఒంగోలు, 523001 చిరునామాకు పంపాలని చెప్పారు.









హాలీవుడ్ సినిమాల్లో కొన్ని బాలీవుడ్ సినిమాల్లో స్కీయింగ్ చూస్తాం. మంచు మీద స్కేస్ బిగించుకుని చాలా వేగంగా దూకుతూ ముందుకెళతారు. స్కీయింగ్‌లో మాగ్జిమమ్ ఎంత స్పీడ్‌గా వెళ్లవచ్చో తెలుసా? గంటకు 250 కిలోమీటర్లు. అవును. పారిస్‌లో సిమోన్ బిల్లీ అనే స్కియర్ ఈ ఘనత సాధించాడు. మన దేశంలో జనవరి నుంచి మార్చి మధ్యలో కశ్మీర్‌లో, హిమాచల్ ప్రదేశ్‌లో, ఉత్తరాఖండ్‌లో స్కీయింగ్ చేసేంత మంచు ఉంటుంది. ఆ సీజన్‌లో టూరిస్టులు వెళ్లి స్కీయింగ్ చేస్తారు. ఆ సీజన్ తర్వాత ఊరికే కూచోవాల్సిందే. అయితే చైనా వాళ్లు సంవత్సరం పొడుగునా స్కీయింగ్ చేయొచ్చు కదా అనుకున్నారు. అందుకే ప్రపంచంలోనే అతి పెద్ద ఇండోర్ స్కీయింగ్ పార్క్‌లో ఇటీవల షాంఘైలో ప్రారంభించారు. దీని పేరు 'ఎల్ స్నో స్కీయింగ్ థీమ్ రిసార్ట్'.

ప్రపంచంలో అతి పెద్ద ఇన్‌డోర్ స్కీయింగ్ పార్క్



90 వేల చదరపు మీటర్లలో

స్కీయింగ్ చాలా దూరం వరకూ చేయాల్సిన స్పోర్ట్. ఔట్‌డోర్ అయితే మంచు మైదానం ఉంటుంది. కాని ఇండోర్‌లో అంటే కష్టమే. అయినా సరే చైనావాళ్లు 90 వేల చదరపు మీటర్ల పార్క్‌లో కృత్రిమ మంచు మైదానం సృష్టించారు. ఇందుకోసం 72 కూలింగ్ మిషీన్లు 33 స్నోమేకింగ్ మెషిన్లు ఉపయోగిస్తారు. అంటే ఎప్పుడూ లోపలి ఉష్ణోగ్రత 0 డిగ్రీల కంటే తక్కువే ఉంటుంది.

సహజమైన మంచు లేక

చైనాలోని ఉత్తర ప్రాంతంలో మంచు కొండలు ఉన్నాయి. చైనీయులు అక్కడ స్కీయింగ్ చేయడానికి వెళతారు. అయితే సహజమైన మంచు మైదానాల్లో ప్రమాదాలు ఎక్కువ. పైగా గ్లోబల్ వార్మింగ్ వల్ల మంచు పలుచబడుతోంది. అందువల్ల చైనీయులు తమకో స్కీయింగ్ పార్క్ కావాలని కోరుకున్నారు. వారి ఆలోచనలకు తగినట్టుగా ఇప్పుడు పార్క్ తయారైంది. ఇక్కడ వాటర్ స్పోర్ట్స్ ఉండటానికి గదులు షాపింగ్ మాల్స్ అన్నీ ఉంటాయి. నగరంలో ఉంటూనే మంచు ప్రాంతానికి వెళ్లివచ్చిన అనుభూతిని పొందవచ్చు. పిల్లలు ఈ పార్క్ గురించి విన్న వెంటనే వెళ్దామని అంటున్నారట. మనం వెళ్లలేం. ఇక్కడ ఫొటోలు చూడటమే.

● అవార్డ్ విన్నర్

శ్రేయోవి కేరాఫ్ అడవి



అందరి చేతుల్లో ఫోన్లు ఉంటాయి. 'కాస్త ఫొటో తీయరా' అనంటే బుడుంగుమని వచ్చి క్లిక్ చేస్తాం. అంతమాత్రం చేత మనం ఫొటోగ్రాఫర్లం అవము. ఫొటోగ్రఫీ పెద్ద ఆర్ట్. ఫ్యాషన్ ఫొటోగ్రఫీ, ఔట్‌డోర్ ఫొటోగ్రఫీ, స్టిల్ ఫొటోగ్రఫీ... ఇలా చాలా విభాగాలున్నాయి. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ కూడా ఒకటి. అంటే వన్యజీవితాన్ని ఫొటోలు తీయడం. దీనికి అభిరుచి, ధైర్యం, నైపుణ్యం కావాలి. అడవుల్లోకి వెళ్లి రోజుల తరబడి ఎదురు చూస్తేనే ఒక మంచి ఫొటో దొరుకుతుంది. అలాంటి ఫొటో తీసి అంతర్జాతీయ గుర్తింపు పొందింది శ్రేయోవి మెహతా.

ఫరిదాబాద్‌లో నాల్గవ తరగతి చదువుతున్న ఈ 9 సంవత్సరాల చిన్నారి చిన్నప్పటి నుంచి ఫొటోలు తీయడం నేర్చుకుంది. కారణం ఆమె తండ్రి శివాంగ్ మెహతా మంచి ఫొటోగ్రాఫర్. తల్లి కహాని మెహతా పర్యాటకులను అభయారణ్యాలకు తీసుకెళుతుంటుంది. శ్రేయోవి తన తల్లిదండ్రులతో రాజస్థాన్‌లోని భరత్‌పూర్ నేషనల్‌పార్క్‌లో ఉన్నప్పుడు ఒక తెల్లవారుజామున వాకింగ్ చేస్తుంటే హటాత్తుగా దూరంగా రెండు నెమళ్లు కనిపించాయి. పక్కనే ఒక లేడి కూన. వెంటనే శ్రేయోవి తన కెమెరా తీసి మోకాళ్ల మీద కూచుని క్లిక్ చేసింది. ఆ తెల్లవారుజామున మంచుకురుస్తున్న వేళ చీకటి వెలుతురుల్లో ఆ ఫొటో అద్భుతంగా కుదిరింది.



60 వేల ఎంట్రీల్లో ఒకటి

లండన్‌లోని 'నేచురల్ హిస్టరీ మ్యూజియం' ప్రతి ఏటా 'వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు కోసం ఎంట్రీలు పిలుస్తుంది. ఇందులో వయసును బట్టి విభాగాలుంటాయి. 10 ఏళ్ల లోపు విభాగంలో 117 దేశాల నుంచి 60 వేలమంది బాలలు తాము తీసిన వైల్డ్‌లైఫ్ ఫొటోలు పంపితే శ్రేయోవి ఈ ఫొటో పంపింది. ఇంతమందిని దాటి శ్రేయోవి ఈ పోటీలో రన్నర్ అప్‌గా నిలిచింది. అంటే సెకండ్ ప్లేస్ అన్నమాట. అయినా సరే ఇది పెద్ద విజయం. 'మా అమ్మా నాన్నా నన్ను ప్రోత్సహించడం వల్ల నేను ఇలా గుర్తింపు పొందాను' అంటోంది శ్రేయోవి. పెద్దయ్యి ఇంకా గొప్ప ఫొటోలు తీస్తానంటోంది.

● కథ

పులి-గిలి

ఒక ఊర్లో ఒక అవ్వ వుండేది. ఆమె దగ్గర చాలా గొర్రెలుండేవి. వాటిని ఆ అవ్వ చాలా జాగ్రత్తగా కాపాడతా వుండేది. ఎందుకంటే ఆ వూరి పక్కనే ఒక పెద్ద అడివి ఉంది. అందులో పులి ఉంది. ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా వచ్చి గొర్రెల్ని ఎత్తుకుపోయేది.

ఒకరోజు అవ్వ ఊరెళుతూ గొర్రెలకు కాపలాగా మన వణ్ణి కూచోబెట్టి 'రేయ్! నిద్రపోకుండా బాగా కాపలా కాయి. రాత్రి గొర్రెల కోసం ఏదైనా పులిగానీ, గిలిగానీ రావచ్చు. జాగ్రత్త' అని చెప్పిపోయింది.

అప్పటికే పులి ఎవరి కంటా పడకుండా ఆ మందలోనికి వచ్చేసింది.

అవ్వ మాటలు వింది. పులిగాని గిలిగాని అంటోందేంటి అవ్వ.... పులి అంటే నేను... గిలి ఎవరు... కొంపదీసి ఆ గిలి నా కంటే ప్రమాదకరమైన జంతువా' అనుకుంది.

అప్పుడే ఒక దొంగ ఏదైనా గొర్రెను ఎత్తుకుపోదామని దభీమని మంద లోపలికి దుంకినాడు. ఆ చప్పుడుకి పులి అదిరిపడింది. చీకట్లో ఏమీ కనబడక 'కొంపదీసి గిలిగాని రాలేదు గదా?' అని భయపడసాగింది.

దొంగకి చీకట్లో ఏ గొర్రె ఎంత లావుందో అర్థంకాక ఒక్కొక్క గొర్రెనే పట్టుకొని ఎత్తి చూస్తున్నాడు. బాగా బలిసిన గొర్రెను ఎత్తుకుపోవాలని వాడి పథకం.

వాడు ఒక్కో గొర్రెను చూస్తూ పులి దగ్గర కొచ్చి తడిమి చూశాడు. పులి భయంతో వణికిపోతా నోరు మూసుకొని కూచోనింది.

పులి పెద్దగా లావుగా వుంటాది గదా. దాంతో దొంగ 'ఈ గొర్రేదో బాగా బలిసినట్టుంది. దీనిని ఎత్తుకొని పోతే డబ్బులే డబ్బులు' అనుకోని దాని కాళ్ళు పట్టుకోని ఎత్తి భుజం పైన వేసుకున్నాడు. అంతే పులికి పై ప్రాణాలు పైన్నే పోయినాయి. భయంతో బిక్క చచ్చిపోయింది. 'ఒరి నాయనోయ్.. గిలి వచ్చి నన్ను ఎత్తుకు పోతోందిరోయ్' అని మనసులోనే మూల్గింది.

దొంగ మంద నుంచి బయటికొచ్చి కొంత దూరం నడిచేసరికి భుజం పట్టేసింది. చీకట్లోనే పులిని కిందకు దించి దాని మీద కూచుని 'థాయ్. పా... పా' అంటూ వీపు మీద ఒక్కటి పెరికినాడు. ఆ దెబ్బకు పులి 'ఈ గిలిగాడెవడో నా మీదే ఎక్కి కూచోని నన్నే తంతా వున్నాడు' అనుకొని మరింత భయంతో నడవడం మొదలు పెట్టింది.

అట్లా చీకట్లో చానా సేపు నడిచినాక నెమ్మదిగా ఆకాశంలో చంద్రుడు మాయమై పొద్దు పొడవడం మొదలుపెట్టింది. కొంచెం కొంచెం వెలుతురు రాసాగింది. దొంగోడు తాను ఎత్తుకోనొచ్చిన గొర్రె ఎంత లావుందో ఏమో చూద్దామని వంగి చూసినాడు. గొర్రె బదులు పులి కనబడేసరికి గుండె గుభేలుమంది. 'ఓరినీ! అప్పట్నించి నేను పులి మీద వస్తా వున్నానా' అని భయంతో వణికిపోయినాడు. 'ఎట్లాగబ్బా దీన్నుంచి తప్పించుకోవడం' అని ఆలోచించసాగినాడు.



కొంత దూరం పోయేసరికి దారిలో ఒక పెద్ద చెట్టుకొమ్మ బాగా కిందికి వంగి కనబడింది. దాంతో వాడు ఆ చెట్టు దగ్గరికి రాగానే లటుక్కున పట్టుకోని టకటక చెట్టు పైకి ఎక్కేసినాడు. వాడట్లా ఎక్కినాడో లేదో పులి ఈ గిలిగాడు మళ్ళా కిందికి దిగకముందే తప్పించుకోవాల అని అటూ యిటూ చూడకుండా రయ్యిన పారిపోయింది. అప్పన్నించి గిలిగాని భయంతో పులి, పులి భయంతో దొంగోడు మళ్ళా ఎప్పుడూ ఆ ముసల్దాని గొర్రెల దగ్గరికి పోలేదు.

– డా.ఎం.హరికిషన్–కర్నూలు

గమనిక: పిల్లలూ... తెలుగు భాషలో వ్యవహారికంలో జంట పదాలు ఉంటాయి. భయం లేదు గియం లేదు... అన్నం లేదు గిన్నం లేదు.. ఇలా అన్నమాట. ఈ కథలో కూడా పులి లేదు గిలి లేదు అలాంటిదే. గిలి అనే మాటకు అర్థం లేదు.

మన పాడుపు కథలు

● యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్

చిన్న వయసులోనే

సీయీవో అయ్యారు!



ఫ్రెండ్స్ ఈరోజు మనం చెన్నైకి చెందిన శ్రావణ్, సంజయ్ బ్రదర్స్ గురించి తెలుసుకుందాం. పది, పన్నెండేళ్ల వయసులోనే ఈ బ్రదర్స్ ఒక యాప్‌ను డెవలప్ చేసి బోలెడు పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు...'గో డైమన్షన్స్' పేరుతో ఒక కంపెనీని మొదలు పెట్టారు.

యంగెస్ట్ సీయీవోలుగా దేశం దృష్టిని ఆకర్షించారు.

వారి తండ్రి కుమరన్ సురేంద్రన్ వల్ల శ్రావణ్, సంజయ్‌లకు సాంకేతిక విషయాలపై ఆసక్తి పెరిగింది.

'కంప్యూటర్‌లు ఎలా పని చేస్తాయి?' నుంచి లేటెస్ట్ టెక్నాలజీ వరకు తండ్రి ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకునేవారు.

టెక్నాలజీకి సంబంధించిన విషయాలను చందమామ కథల్లాగా ఆసక్తిగా వినేవారు.

ఏ మాత్రం సమయం దొరికిన కంప్యూటర్‌లో రకరకాల కొత్త విషయాల గురించి తెలుసుకునే వారు.

అలా ఎన్నో యాప్‌ల గురించి తెలుసుకున్నారు. కొత్త కొత్త యాప్‌ల గురించి తెలుసుకునేటప్పుడు తమకు కూడా యాప్ తయారు చేయాలనిపించింది.

'క్యాచ్ మీ కాప్' పేరుతో ఈ బ్రదర్స్ రూపొందించిన యాప్‌కు మంచి పేరు వచ్చింది. ఇది పిల్లల ఆటలకు సంబంధించిన యాప్. దీంతో పాటు రూపొందించిన ఎడ్యుకేషన్ యాప్ 'అల్ఫా బెట్'. ఎమర్జెన్సీ సర్వీస్ యాప్ 'ఎమర్జెన్సీ' గేమింగ్ యాప్ 'సూపర్ హీరో అండ్ కార్ రేసింగ్ ఒకటి కాదు రెండు కాదు 150 యాప్స్ క్రియేట్ చేశారు.

ఫ్రెండ్స్, శ్రావణ్, సంజయ్ గురించి మీరు చదివారు కదా... మరి మీ గురించి కూడా గొప్పగా రాయాలంటే.... మీరు కూడా ఏదైనా సాధించాలి. మరి ఒకేనా!

> ఎడ్యుకేషన్ యాప్ 'అల్ఫా బెట్'. ఎమర్జెన్సీ సర్వీస్ యాప్ 'ఎమర్జెన్సీ' గేమింగ్ యాప్ 'సూపర్ హీరో అండ్ కార్ రేసింగ్ ఒకటి కాదు రెండు కాదు 150 యాప్స్ క్రియేట్ చేశారు ఈ బ్రదర్స్.

మన సామెతలు



- ఎంత చెట్టుకు అంతే గాలి
- ఏ పుట్టలో ఏ పామున్నదో
- కథకు కాళ్లు లేవు, ముంతకు చెవులు లేవు
- కడుపు నిండిన వాడికి గారెలు చేదు
- తాతకు దగ్గులు నేర్పినట్లు
- కాలికి దూరమైతే కంటికి దూరమా

బ్రెయిన్ జిమ్



1) కాళ్లు లేవుగానీ పరుగెడుతుంది. కళ్లు లేవుగానీ ఏడుస్తుంది.
జవాబు: మేఘం

2) నల్ల కుక్కకు నాలుగు చెవులు
జవాబు: లవంగం

3) చూస్తే చిన్నోడు...ఒంటి నిండా నార బట్టలు
జవాబు: టెంకాయ

4) పతి కాని పతి
జవాబు: పరపతి





● కామెడీ క్లాస్

మా నాయినే!

టింకు: బస్‌స్టాండ్‌కు, సైకిల్‌స్టాండ్‌కు తేడా ఏమిటి?
బింకు: బస్‌స్టాండ్ బస్‌తో పాటు వెళ్లదు. సైకిల్ స్టాండ్ మాత్రం సైకిల్‌తో పాటు వెళుతుంది.

టింకు: 20 ఏనుగులు ఒకే గొడుగు కింద నిల్చున్నా తడవలేదు. కారణం ఏమిటి?
బింకు: సింపుల్...వర్షం రాలేదు!

టీచర్: భూమి కి చంద్రుడికి మధ్య ఏముంది?
బింకు: 'కి'



ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...

మేదిని	భూమి	ఉదకము	నీరు
మేళకము	కూడిక	ఉదాత్తుడు	గొప్పవాడు
మెయిలు	మేఘము	ఉదర్చి	అగ్ని
మోసు	మొలక	ఉదరము	కడుపు

బిజినెస్ రీల్

జియో నుంచి జియోఫోన్ ప్రైమా 2



ధర రూ. 2,799

ముంబై: రిలయన్స్ జియో తాజాగా జియో ఫోన్ ప్రైమా 2 ఫీచర్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. దీని ధర రూ. 2,799. క్వాల్‌కామ్ ప్రాసెసర్, 512 ఎంబీ ర్యామ్, 4జీబీ ఇంటర్నల్ మెమరీ, 2.4 అంగుళాల ఎల్‌సీడీ స్క్రీన్, 2000 ఎంఏహెచ్ బ్యాటరీ తదితర ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఇది యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ వాయిస్ అసిస్టెంట్ మొదలైన యాప్‌లను, జియోపే ద్వారా యూపీఐ చెల్లింపులను సపోర్ట్ చేస్తుంది. కస్టమర్లకు జియోటీవీ, జియోసావన్, జియోన్యూస్, జియోసినిమా యాప్‌లకు యాక్సెస్ లభిస్తుంది.

ఐఆర్‌సీటీసీలో వాటా పెంచుకున్న ఎల్ఐసీ





న్యూఢిల్లీ: ప్రభుత్వ రైల్వే టికెటింగ్, క్యాటరింగ్ సేవల సంస్థ ఐఆర్‌సీటీసీలో ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ తన వాటాను పెంచుకుంది. రైల్వే మినీరత్న కంపెనీలో 2022 డిసెంబర్ 16 నుంచి 2024 సెప్టెంబర్ 11 మధ్య 2.02 శాతం వాటాకు సమానమైన షేర్లను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా కొనుగోలు చేసినట్టు ఎల్ఐసీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం ఇచ్చింది. దీంతో ఐఆర్‌సీటీసీలో ఎల్ఐసీకి ఉన్న వాటా 7.278 శాతం (5,82,22,948 షేర్లు) నుంచి 9.298 శాతానికి (7,43,79,924 షేర్లు) పెరిగింది. బీఎస్ఈలో ఎల్ఐసీ షేరు గురువారం 2 శాతం వరకు లాభపడి రూ.1031 వద్ద ముగిసింది. అటు ఐఆర్‌సీటీసీ షేరు కూడా ఒక శాతం పెరిగి రూ.931 వద్ద క్లోజయింది.

మెడ్‌టెక్ సొసైటీతో ప్రణామ్ హాస్పిటల్స్ జట్టు



ముంబై: మేకిన్ ఇండియా హాస్పిటల్స్‌కు సంబంధించి మెడ్‌టెక్ సొసైటీతో ప్రణామ్ హాస్పిటల్స్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం హైదరాబాద్, వైజాగ్‌లో ఈ ఆస్పత్రులను ఏర్పాటు చేయనున్నారు. తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు ఇది తోడ్పడుతుందని ప్రణామ్ హాస్పిటల్స్ గ్రూప్ సీఈవో ఆనీ ఠాకూర్ తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలను చౌకగా మరింత మందికి అందుబాటులో తెచ్చేందుకు ఉపయోగపడుతుందని ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-9-2024	
విశాఖ	535-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	550.1	3.78
BAJAJFINSV	1,898.00	2.33
BAJFINANCE	7,596.00	2.26
GRASIM	2,794.00	1.34
INDUSINDBK	1,462.50	1.33

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,845.00	-1.65
ADANIPORTS	1,451.55	-1.43
HDFCLIFE	705	-1.34
ITC	513.65	-1.13
COALINDIA	490.3	-1.08

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,043
ఎన్ఎస్ఈ	1,10,709
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,76,693
ఎఫ్ఐఐ	+2,365
డీఐఐ	+2,532

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.66	$ 68.97
బ్రెంట్	71.65	$ 71.97

మ్యాక్స్ హెల్త్ చేతికి జేపీ హెల్త్‌కేర్

64 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందం • రూ. 1,660 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో డీల్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ తాజాగా జేపీ హెల్త్‌కేర్ లిమిటెడ్(జేహెచ్‌ఎల్)లో మెజారిటీ వాటాను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. రూ. 1,660 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో 64 శాతం వాటాను చేజిక్కించుకోనున్నట్లు వెల్లడించింది. ఇందుకు అనుగుణంగా జేపీ హెల్త్‌కేర్ ప్రమోటర్ లక్షదీప్ గ్రూప్‌తో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. లక్షదీప్ గ్రూప్ ప్రస్తుతం కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్నట్లు ప్రస్తావించింది. కాగా.. జేపీ హెల్త్‌కేర్‌లో మెజారిటీ వాటా కొనుగోలు నేపథ్యంలో సంస్థకుగల ప్రధాన అసెట్ నోయిడాలోని 500 పడకల ఆసుపత్రి తమ సొంతంకానున్నట్లు మ్యాక్స్ హెల్త్‌కేర్ పేర్కొంది. ఒప్పందం ప్రకారం జేహెచ్‌ఎల్ రుణ చెల్లింపులు, ఇతర రుణ సంబంధ క్లెయిములను మ్యాక్స్ చేపట్టనుంది. తద్వారా 64 శాతం వాటాను పొందడంతోపాటు.. మిగిలిన వాటా కొనుగోలు అవకాశాలను(పుట్, కాల్ ఆప్షన్) సైతం అందిపుచ్చుకోనున్నట్లు తెలియజేసింది. జేహెచ్‌ఎల్ నిర్వహణలో నోయిడాసహా.. బులంద్‌షార్‌లో 200 పడకల ఆసుపత్రి ఉన్నట్లు వెల్లడించింది. వీటితోపాటు.. ప్రస్తుతం నిర్వహణలోలేని 100 పడకల అనూప్‌షాహర్ ఆసుపత్రి సైతం జేహెచ్‌ఎల్ సొంతమని పేర్కొంది. గతేడాది(2023-24) జేహెచ్‌ఎల్ రూ. 421 కోట్ల ఆదాయం, రూ. 70 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించింది.

మ్యాక్స్ హెల్త్‌కేర్ షేరు బీఎస్ఈలో 0.4 శాతం క్షీణించి రూ. 909 వద్ద ముగిసింది.

ఫారెక్స్ ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి..



- 689.35 బిలియన్ డాలర్లకు అప్
- వరుసగా రెండవ వారం రికార్డుల పయనం

ముంబై: భారత్ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) రికార్డులు కొనసాగుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 6వ తేదీతో ముగిసిన వారంలో 5.248 బిలియన్ డాలర్లు పెరిగి 689.35 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫారెక్స్ కొత్త గరిష్టాలకు చేరడం ఇది వరుసగా రెండవ వారం. అంతక్రితం ఆగస్టు 30వతేదీతో ముగిసిన వారంలో ఫారెక్స్ అంతక్రితం వారంతో పోల్చితే 2.299 బిలియన్ డాలర్లు పెరిగి 683.987 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరిన సంగతి తెలిసిందే.

అన్ని విభాగాల్లోనూ పురోగతి..

- డాలర్ల రూపంలో పేర్కొనే ఫారిన్ కరెన్సీ అసెట్స్ సమీక్షా వారంలో 5.107 బిలియన్ డాలర్లు పెరిగి 604.144 బిలయిన్ డాలర్లకు ఎగసింది.
- పసిడి నిల్వలు 129 మిలియన్ డాలర్లు పెరిగి 61.988 బిలియన్ డాలర్లకు చేరాయి.
- ఐఎంఎఫ్ వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) విలువ 4 మిలియన్ డాలర్లు పెరిగి 18.472 బిలియన్ డాలర్లకు ఎగసింది.
- ఐఎంఎఫ్ వద్ద నిల్వల పరిమాణం 8 మిలియన్ డాలర్లు పెరిగి 4.631 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

రేటు తగ్గింపునకు తొందరలేదు..!

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ సంకేతాలు
- రెండు నెలలు ద్రవ్యోల్బణం కట్టడి నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు
- ఈ సమస్యపై అప్రమత్తత అవసరమని ఉద్ఘాటన



సింగపూర్: రిటైల్ ద్రవ్యోల్బణం రెండు నెలలుగా పూర్తిగా అదుపులోనికి వచ్చినప్పటికీ, రేటు తగ్గింపునకు తొందరపడబోమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు. ఈ దిశలో (రేటు తగ్గింపు) నిర్ణయానికి ఇంకా చాలా దూరం ఉందని ఆయన అన్నారు. సింగపూర్‌లో బ్రెట్టన్ వుడ్స్ కమిటీ నిర్వహించిన 'ఫ్యూచర్ ఆఫ్ ఫైనాన్స్ ఫోరమ్ 2024'లో దాస్ కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

- 2022లో గరిష్ట స్థాయి 7.8% వద్ద ఉన్న ద్రవ్యోల్బణం ఇప్పుడు 4% లక్ష్యం దిగువకు చేరింది. అయితే ఇందుకు అనుగుణంగా నిర్ణయాలు (రేటు తగ్గింపు) తీసుకోడానికి ఇంకా చాలా దూరం ఉంది. మరోవైపు (సరళతర ద్రవ్య విధానాల వైపు) చూసే ప్రయత్నం చేయలేము.
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం చాలా వరకు కష్ట నష్టాలను తట్టుకుని నిలబడుతున్నప్పటికీ, ద్రవ్యో ల్బణం చివరి మైలు లక్ష్య సాధన సవాలుగానే ఉందని పలుసార్లు నిరూపణ అయ్యింది. ద్రవ్యోల్బణం సవాళ్లు ఆర్థిక స్థిరత్వ ప్రమాదాలకు దారితీస్తాయి.
- ద్రవ్యోల్బణం కావచ్చు... ప్రతి ద్రవ్యోల్బణం కావచ్చు. సమస్య తీవ్రమైనది. ఈ పరిస్థితుల్లో ద్రవ్య విధానాన్ని సడలించడంలో జాగ్రత్త అవసరం. కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధాన నిర్వహణలో వివేకం ఉండాలి. మరోవైపు సరఫరా వైపు ప్రభుత్వం చర్యలు చురుకుగా ఉండాలి.
- అమెరికన్ సెంట్రల్ బ్యాంక్- ఫెడ్ నుండి సరళతర పాలసీ సంకేతాల నేపథ్యంలో రేటు తగ్గింపులకు సంబంధించి మార్కెట్ అంచనాలు ఇప్పుడు మళ్లీ ఊపందుకుంటున్నాయి. అయితే పాలసీల మార్పు విషయంలో అన్ని విషయాలను విస్తృత స్థాయిలో పరిగణనలోని తీసుకుంటూ, ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రపంచంలోని పలు సెంట్రల్ బ్యాంకులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. దీనిని అనుసరించని సెంట్రల్ బ్యాంకులు- తమ దేశీయ ద్రవ్యోల్బణం-వృద్ధి సమతుల్యత అంశాలపై నిఘా ఉంచి తగిన పాలసీ ఎంపిక చేసుకోవాలి.

భారత్ వృద్ధిలో వినియోగం, పెట్టుబడుల కీలక పాత్ర

భారత్ ఆర్థిక వ్యవస్థపై ఆయన వ్యాఖ్యానిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థ ద్రవ్యోల్బణం, ద్రవ్యోలోటు, కరెంటు అకౌంట్ లోటు వంటి అంతర్లీన పటిష్టతను ప్రతిబింబిస్తుందని గవర్నర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశ పురోగతిలో - ప్రైవేట్ వినియోగం, పెట్టుబడులు ప్రధాన పాత్ర పోషిస్తాయని దాస్ విశ్లేషించారు. కోవిడ్-19 మహమ్మారి సవాళ్ల నుంచి భారత ఆర్థిక వ్యవస్థ బయటకు వచ్చిందని, 2021-24 మధ్య సగటు వాస్తవ జీడీపీ వృద్ధి 8 శాతం కంటే అధికంగా నమోదైందని గవర్నర్ పేర్కొన్నారు. ద్రవ్య పటిష్టతతో పాటు ప్రభుత్వ భారాలు తగ్గుతుండడం సానుకూల పరిణామమన్నారు. కార్పొరేట్ పనితీరు పటిష్టంగా కొనసాగుతున్నట్లు వివరించారు. ఆర్‌బీఐ నియంత్రించే బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థల బ్యాలెన్స్ షీట్లు కూడా బలపడ్డాయని గవర్నర్ తెలిపారు. అన్ని స్థాయిల్లో ప్రపంచ దేశాల పరస్పర సహకారం ప్రపంచ పురోగతికి కీలకమని భారత్ భావిస్తున్నట్లు తెలిపారు. 2023లో భారత జీ20 ప్రెసిడెన్సీ, దాని తర్వాత ప్రపంచ దేశాలతో నిరంతర సహకార విధానాలను పరిశీలిస్తే, ఆయా అంశాలు 'ప్రపంచం ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే న్యూ ఢిల్లీ దృష్టిని ప్రతిబింబిస్తాయని దాస్ వివరించారు.

పరస్పర సహకారంతోనే ప్రపంచ పురోగతి

21వ శతాబ్దపు ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి బహుళజాతి అభివృద్ధి బ్యాంకులను (ఎండీబీ) బలోపేతం చేయడం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా అందరికీ ఆర్థిక సేవలను అందుబాటులోకి తేవడం, ఉత్పాదకత లాభాలను సాధించడం, మధ్య-ఆదాయ దేశాలకు రుణ పరిష్కారం వంటివి భారత్ ప్రాధాన్యతలలో కొన్నని గవర్నర్ ఈ సందర్భంగా వివరించారు. ప్రపంచ అభివృద్ధి మెరుగుదల కోసం రాబోయే దశాబ్దాలలో ప్రపంచ క్రమాన్ని పునర్నిర్మించడానికి భారత్ కట్టుబడి ఉందన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ మొత్తం మానవజాతి కోసం ఇందుకు సంబంధించి 'ఒక భవిష్యత్తు' కోసం పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. అంతర్జాతీయ ఫైనాన్షియల్ మార్కెట్లు ఇటీవలి నెలల్లో సవాళ్లను తట్టుకుని నిలబడగలుగుతోందని అన్నారు. ఈక్విటీ, బాండ్ ఈల్డ్ వంటి అంశాల్లో ఒడిదుడుకులు చాలా తక్కువగా ఉంటున్నాయని వివరించారు. అయితే స్టాక్ మార్కెట్లలో ధరల అసాధారణ పెరుగుదల ఒక అనూహ్య పరిణామమన్నారు. గ్లోబల్ ఫైనాన్షియల్ గవర్నెన్స్‌లో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలను అనుసంధానానికి, ఈ విషయంలో అసమతుల్యత పరిష్కారానికి సంస్కరణలు అవసరమని అన్నారు. ప్రపంచ ఆర్థిక భద్రతా వలయాన్ని (జీఎఫ్ఎస్ఎన్) బలోపేతం చేయడంపై కూడా సంస్కరణలు దృష్టి సారించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

బేస్ మాయతోనే ద్రవ్యోల్బణం తగ్గిందా?

2023 జూలై, ఆగస్టుల్లో రిటైల్ ద్రవ్యోల్బణం బేస్ భారీగా (వరుసగా 7.44 శాతం, 6.83 శాతం) ఉన్నందునే 2024 జూలై, ఆగస్టులో ద్రవ్యోల్బణ గణాంకాలు ఐదేళ్ల కనిష్ట స్థాయిలో (వరుసగా 3.6 శాతం, 3.65 శాతం) కనబడుతున్నాయని కొందరు నిపుణుల చేస్తున్న వాదనను గవర్నర్ శక్తికాంతదాస్ శక్తికాంతదాస్ తాజా వ్యాఖ్యలు (రేటు తగ్గింపుపై) సమర్థించినట్లయ్యింది. రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం అటు ఇటుగా (మైనస్ లేదా ప్లస్) 4 శాతం వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తోంది. ఆర్‌బీఐ కీలక ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధానానికి ఈ సూచీనే ప్రాతిపదికగా ఉండడం గమనార్హం. రిటైల్ ద్రవ్యోల్బణం కట్టడే లక్ష్యంగా గడచిన తొమ్మిది ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాల నుంచి ఆర్‌బీఐ బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలుచేసే రుణ రేటు- రెపో రేటును (ప్రస్తుతం 6.5 శాతం) యథాతథంగా కొనసాగిస్తోంది. ద్రవ్యోల్బణం కట్టడికి ఆహార ద్రవ్యోల్బణమే అడ్డంకని కూడా గవర్నర్ శక్తికాంతదాస్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. వృద్ధి లక్ష్యంగా రేటు తగ్గింపును (సరళతర వడ్డీరేట్ల విధానం) కోరుతున్న ప్రభుత్వం- రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాల్లో ఆహార ధరలను మినహాయించాలని కూడా సూచిస్తోంది. అవసరమైతే పేదలకు ఫుడ్ కూపన్ల జారీ ప్రతిపాదనను సైతం ఆర్థిక సర్వే ప్రస్తావిస్తోంది. అక్టోబర్ 7 నుంచి 9 వరకూ తదుపరి పాలసీ సమీక్షా సమావేశం జరగనుంది. తాజా పరిణామాల నేపథ్యంలో రానున్న ఆర్‌బీఐ పాలసీ విధానంపై ఆసక్తి నెలకొంది.



పతంజలి ఫుడ్స్‌లో వాటా పెంచుకున్న జీక్యూజీ పార్ట్‌నర్స్

ముంబై: అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్.. పతంజలి ఫుడ్స్‌లో వాటాను పెంచుకుంది. ఇందుకోసం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 45.03 లక్షల షేర్లను(1.24 శాతం వాటాకు సమానం) జీక్యూజీ పాట్నర్స్ రూ.834.99 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో పతంజలి ఫుడ్స్‌లో జీక్యూజీ పార్ట్‌నర్స్ వాటా 3.19% నుంచి 4.43 శాతానికి పెరిగింది. మరోవైపు ఇదే సంస్థలో ప్రమోటర్ పతంజలి ఆయుర్వేద్ 2.71% వాటాకు సమానమైన 97.92 లక్షల షేర్లను రూ.1,815 కోట్లకు విక్రయించింది. దీంతో మొత్తం వాటా 72.81% నుంచి 70.1 శాతానికి దిగివచ్చింది.

లావాదేవీల క్రయ, విక్రయాల నేపథ్యంలో పతంజలి ఫుడ్స్ షేరు 4% నష్టపోయి రూ.1,859 వద్ద స్థిరపడింది.

■ తక్కువ ధరల వద్ద క్రూడ్ స్థిరపడాలి

అలా అయితేనే పెట్రోల్, డీజిల్ రేట్ల తగ్గింపు

పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్ జైన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మూడేళ్ల కనిష్టానికి పడిపోవడంతో పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై అంచనాలు పెరిగిపోయాయి. ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రేట్లను తగ్గించొచ్చన్న అంచనాల నేపథ్యంలో దీనిపై పెట్రోలియం శాఖ సెక్రటరీ పంకజ్ జైన్ స్పష్టతనిచ్చారు.ముడి చమురు ధర కనిష్ట స్థాయి వద్ద స్థిరంగా కొనసాగితేనే పెట్రోల్, డీజిల్ రేట్ల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. బ్రెంట్ చమురు బ్యారెల్ ధర మంగళవారం 70డాలర్ల దిగువకు పడిపోవడం గమనార్హం. 2021 డిసెంబర్ తర్వాత ఇంత కనిష్టానికి రావడం ఇదే మొదటిసారి. గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో చమురు సరఫరాపై హరికేన్ ఫ్రాన్సిన్ ప్రభావం చూపించడంతో చమురు ధర గురువారం మళ్లీ 71 డాలర్లకు ఎగిసింది. ఈ ఏడాది కీలకమైన సార్వత్రిక ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్ ధరలను స్వల్పంగా తగ్గించడం తెలిసిందే. అంతకుముందు రెండేళ్లుగా ధరల్లో ఎలాంటి సవరణ చేయలేదు. ఢిల్లీలో ఓ కార్యక్రమం సందర్భంగా మీడియా ప్రతినిధులతో పంకజ్ జైన్ ఈ అంశంపై మాట్లాడారు. అంతర్జాతీయ చమురు ధరలు కనిష్టాల వద్ద స్థిరపడితే అప్పుడు ఆయిల్ కంపెనీలు ధరల తగ్గింపుపై తగిన నిర్ణయం తీసుకుంటాయని స్పష్టం చేశారు. మరోవైపు చమురు కంపెనీలు పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై మెరుగైన లాభాలు ఆర్జిస్తున్నాయని.. రేట్లపై నిర్ణయానికి ముందు మరికొంత కాలం పాటు ఇదే విధానం కొనసాగాలని కోరుకుంటున్నట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇప్పుడే రేట్లను తగ్గిస్తే.. మళ్లీ అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగిపోతే నష్టపోవాల్సి వస్తుందన్న అభిప్రాయంతో ఆయిల్ కంపెనీలు కొంత కాలం పాటు వేచి చూసే ధోరణిని అనుసరించాలనుకుంటున్నట్టు చెప్పాయి.

మహారాష్ట్ర ఎన్నికల ముందు?

ప్రభుత్వరంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు రేట్లను తగ్గించొచ్చని బ్రోకరేజ్ సంస్థ ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఓ నివేదికలో తెలిపింది. ''రాష్ట్రాల ఎన్నికల ముందు పెట్రోలియం రేట్లను తగ్గిస్తారన్న అంచనాలు ఉన్నాయి. మేము కూడా దీన్ని తోసిపుచ్చడం లేదు. జమ్మూ కశ్మీర్, హర్యానాకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి మరో నెల రోజుల పాటు అమల్లో ఉంటుంది. దీంతో దీపావళి లేదా మహారాష్ట్ర ఎన్నికల ప్రవర్తా నియమావళి అమల్లోకి రావడానికి ముందు రేట్లను తగ్గించొచ్చు. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.2 వరకు తగ్గించొచ్చు. వచ్చే నెల రోజుల పాటు ఆయిల్ కంపెనీలు అసాధారణ మార్కెటింగ్ మార్జిన్లను సంపాదిస్తాయి. ఎల్‌పీజీపై నష్టాలను కూడా భర్తీ చేసుకోగలుగుతాయి. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మార్కెటింగ్ మార్జిన్ లీటర్ పెట్రోల్/డీజిల్‌పై రూ.4.7/3.8 గా ఉంటే, జూలై-సెప్టెంబర్ కాలంలో మార్కెటింగ్ మార్జిన్లు లీటర్ పెట్రోల్/డీజిల్‌పై రూ.9.7/8గా ఉండొచ్చు''అని ఎమ్‌కే గ్లోబల్ వివరించింది. దేశ చమురు అవసరాల్లో 85 % దిగుమతులపైనే ఆధారపడడం తెలిసిందే.



కార్వీ స్టాక్ బ్రోకింగ్ బ్యాంక్ అకౌంట్ల అటాచ్‌మెంట్‌కు సెబీ ఆదేశం

న్యూఢిల్లీ: క్లయింట్ల నిధుల దుర్వినియోగం కేసులో రూ. 25 కోట్ల పెనాల్టీ బాకీల రికవరీకి సంబంధించి కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్), దాని సీఎండీ సి. పార్థసారథి బ్యాంక్ అకౌంట్లు, షేర్లు, మ్యుచువల్ ఫండ్ హోల్డింగ్స్‌ను అటాచ్ చేయాల్సిందిగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. ఈ కేసులో కేఎస్‌బీఎల్, పార్థసారథిలను సెక్యూరిటీల మార్కెట్ నుంచి నిషేధిస్తూ 2023 ఏప్రిల్‌లో సెబీ ఆదేశించింది. సంస్థకు రూ. 13 కోట్లు, పార్థసారథికి రూ. 8 కోట్లు మేర మొత్తం రూ. 21 కోట్ల జరిమానా విధించింది. వడ్డీ, రికవరీ వ్యయాలు కలిసి అది సుమారు రూ. 25 కోట్లు అయ్యింది. దీంతో ఆ మొత్తాన్ని 15 రోజుల్లోగా చెల్లించాలంటూ ఆగస్టు 7న సెబీ నోటీసులు జారీ చేసింది. కానీ, కేఎస్‌బీఎల్, పార్థసారథి చెల్లించడంలో విఫలం కావడంతో అసెట్స్‌ను అటాచ్ చేయాల్సిందిగా బ్యాంకులు, డిపాజిటరీలు, ఫండ్స్‌ను ఆదేశించింది.

నైపుణ్య శిక్షణ, రుణ లభ్యత కీలకం



ఎంఎస్‌ఎంఈలపై డబ్ల్యూఆర్ఐ ఇండియా సూచనలు

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, ప్రోత్సాహకాలు అందివ్వడంతోపాటు, ముద్రాయోజన తదితర పథకాల ద్వారా రుణాలు అందే విధంగా చూడాలని డబ్ల్యూఆర్ఐ ఇండియా సీఈవో మాధవ్ పాయ్ సూచించారు. ఈ రంగం పర్యావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ చర్యలు సాయపడతాయన్నారు. ఎంఎస్‌ఎంఈలు వాతావరణ సంబంధిత ఉత్పాతాలను ఎదుర్కొంటున్నాయని, ఇవి నిలదొక్కుకోవాలంటే పర్యావరణ అనుకూలంగా మారాల్సిన అవసరాన్ని పాయ్ ప్రస్తావించారు. ఈ దిశగా ప్రోత్సాహక కార్యక్రమాలు అవసరమన్నారు. ఉదాహరణకు టెక్స్‌టైల్ ఫ్యాక్టరీలను పెట్‌కోక్ ఆధారితంగా ఎక్కువ కాలం నిర్వహించలేమంటూ.. ప్రపంచంలో 20 అధిక కాలుష్య పట్టణాల్లో 13 మన దేశంలోనే ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. కాలుష్యాన్ని నివారించేందుకు కఠిన నిబంధనల అవసరాన్ని ప్రస్తావించారు. డబ్ల్యూఆర్ఐ ఇండియా కనెక్ట్ కరో పేరుతో ఢిల్లీలో నిర్వహిస్తున్న కార్యక్రమం సందర్భంగా పాయ్ మాట్లాడారు. ''చాలా ఎంఎస్‌ఎంఈలు రుణాలు పొందడానికి ఇబ్బందులు పడుతున్నాయి. ముద్రా యోజన తరహా పథకాలను ప్రభుత్వం రూపొందించాలి. తద్వారా ఎంఎస్‌ఎంఈల రుణ సమీకరణ సామర్థ్యాన్ని పెంచాలి. మధ్య కాలానికి ఎంఎస్‌ఎంఈలు నిలదొక్కుకోవాలంటే పర్యావరణ అనుకూలంగా మారడం తప్పనిసరి. వాతావరణ విపత్తుల్లో అవి బలంగా నిలబడడమే కాకుండా, వాటి ఉత్పత్తులకు మార్కెట్లో ఆదరణ ఉండాలి''అని పాయ్ వివరించారు.

వినియోగ రుణాలు రూ.90 లక్షల కోట్లు

- 2023-24లో 15 శాతం వృద్ధి
- గృహ రుణ విభాగంలో మందగమనం
- క్రిఫ్ హైమార్క్ నివేదిక వెల్లడి

కోల్‌కతా: వినియోగ రుణాలు గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2023-24) 15 శాతం వృద్ధి చెంది రూ.90 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2022-23లో నమోదైన 17.4 శాతం వృద్ధితో పోలిస్తే కొంత క్షీణత కనిపించింది. వినియోగ రుణాల్లో 40 శాతం వాటా కలిగిన గృహ రుణ విభాగంలో మందగమనం ఇందుకు కారణమని క్రిఫ్ హైమార్క్ నివేదిక వెల్లడించింది. 2023-24లో గృహ రుణాల విభాగంలో వృద్ధి 7.9 శాతానికి పరిమితమైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇదే విభాగం 23 శాతం మేర వృద్ధి చెందడం గమనార్హం. రూ.35 లక్షలకు మించిన గృహ రుణాలకు డిమాండ్ పెరిగింది. సగటు రుణ సైజ్ 2019-20లో ఉన్న రూ.20లక్షల నుంచి 32 శాతం వృద్ధితో 2023-24లో రూ.26.5 లక్షలకు పెరిగింది.

వ్యక్తిగత రుణాలకు డిమాండ్

ఇక వ్యక్తిగత రుణాల (పర్సనల్ లోన్)కు డిమాండ్ బలంగా కొనసాగింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 2023-24లో వ్యక్తిగత రుణాల విభాగంలో 26 శాతం వృద్ధి నమోదైంది. రూ.10లక్షలకు మించిన వ్యక్తిగత రుణాల వాటా పెరగ్గా.. అదే సమయంలో రూ.లక్షలోపు రుణాలు తీసుకునే వారి సంఖ్య అధికంగా ఉంది. బ్యాంకులు మంజూరు చేసిన రుణాల విలువ అధికంగా ఉండగా, ఎన్‌బీఎఫ్‌సీలు సంఖ్యా పరంగా ఎక్కువ రుణాలు జారీ చేశాయి.

టూవీలర్ రుణాల జోరు

ద్విచక్ర వాహన రుణ విభాగం సైతం బలమైన పనితీరు చూపించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 34 శాతం వృద్ధి నమోదైంది. 2022-23లో 30 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఆటోమొబైల్ రుణాల విభాగంలో 20 శాతం వృద్ధి నమోదైంది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో 22 శాతంగా ఉంది. కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రుణాలు గత ఆర్థిక సంవత్సరంలో 34 శాతం వృద్ధిని చూపించాయి. రుణాల సగటు విలువ కూడా పెరిగింది. ఎంఎస్‌ఎంఈ విభాగంలో వ్యక్తిగత రుణాల కంటే సంస్థాగత రుణాలు ఎక్కువగా వృద్ధి చెందాయి. వ్యక్తిగత ఎంఎస్‌ఎంఈ రుణాలు 29 శాతం, సంస్థలకు సంబంధించి ఎంఎస్‌ఎంఈ రుణాలు 6.6 శాతం చొప్పున పెరిగాయి. సూక్ష్మ రుణాలు సైతం బలమైన వృద్ధిని చూపించాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాల్లో 27 శాతం వృద్ధి నమోదైంది.



పడిక్కల్ పోరాటం

భారత 'డి' బ్యాటర్ సెంచరీ మిస్

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 'డి' 183 ఆలౌట్

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 115/1


పడిక్కల్

సాక్షి అనంతపురం: ఓపెనర్లు ప్రథమ్ సింగ్ (82 బంతుల్లో 59 బ్యాటింగ్), కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (87 బంతుల్లో 56; 8 ఫోర్లు) అర్ధ శతకాలు బాదడంతో భారత్ 'డి'తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 'ఎ' 28.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. ఆరంభం నుంచి సాధికారికంగా ఆడిన ఈ జంట తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించింది. శుక్రవారం రెండో రోజు ఆట ముగియడానికి ముందు భారత్ 'డి' కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్‌లో మయాంక్ ఔటయ్యాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 288/8తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' మరో రెండు పరుగులు జోడించి 290 వద్ద ఆలౌటైంది. షమ్స్ ములానీ (187 బంతుల్లో 89; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) క్రితం రోజు స్కోరుకు ఒక పరుగు మాత్రమే జత చేయగలిగాడు. భారత్ 'డి' బౌలర్లలో హర్షిత్ రాణా 4... విద్వత్ కావేరప్ప, అర్ష్‌దీప్ సింగ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 'డి' 52.1 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌటైంది. దేవదత్ పడిక్కల్ (124 బంతుల్లో 92; 15 ఫోర్లు) ఒంటరి పోరాటం చేశాడు. భారత్ 'ఎ' జట్టు బౌలర్లలో ఖలీల్ అహ్మద్, అఖీబ్ ఖాన్ చెరో మూడు వికెట్లు తీశారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 107 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్ 'ఎ'... రెండో ఇన్నింగ్స్ స్కోరుతో కలుపుకొని ఓవరాల్‌గా 222 పరుగుల ఆధిక్యంలో ఉంది. చేతిలో 9 వికెట్లు ఉన్న భారత్ 'ఎ' మూడో రోజు మరెన్ని పరుగులు జోడిస్తుందో చూడాలి.

పడిక్కల్ ఒక్కడే...

భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్‌లో మిడిలార్డర్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ ఒక్కడే ఆకట్టుకున్నాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (0) డకౌట్ కాగా.. వికెట్ కీపర్ సంజూ సామ్సన్ (5), అథర్వ (4), యశ్ దూబే (14), రికీ భుయ్ (23), సారాంశ్ జైన్ (8), విఫలమయ్యారు. ఒక ఎండ్‌లో పడిక్కల్ క్రీజులో పాతుకుపోగా... మరో ఎండ్ నుంచి అతడికి సహకారం అందించేవారే కరువయ్యారు. సహచరులతో ఒక్కొక్కరుగా వెనుదిరుగుతున్నా... పడిక్కల్ మాత్రం జోరు తగ్గించలేదు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. సామ్సన్ మరోసారి అంచనాలు అందుకోలేకపోగా... మెరుగైన ఆరంభం దక్కించుకున్న ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్... ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. చివర్లో హర్షిత్ రాణా (29 బంతుల్లో 31; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులు మెరిపించడంతో భారత్ 'డి' 183 పరుగులు చేయగలిగింది.

స్కోరు వివరాలు

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: 288 ఆలౌట్;
భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్: అథర్వ (ఎల్బీ డబ్ల్యూ) ఖలీల్ 4; యశ్ దూబే (సి) కుశాగ్ర (బి) అఖీబ్ 14; శ్రేయస్ (సి) అఖీబ్ (బి) ఖలీల్ 0; పడిక్కల్ (సి) కుశాగ్ర (బి) ప్రసిద్ కృష్ణ 92; సంజూ సామ్సన్ (సి) ప్రసిద్ కృష్ణ (బి) అఖీబ్ 5; రికీ భుయ్ (ఎల్బీడబ్ల్యూ) ఖలీల్ 23; సారాంశ్ (ఎల్బీ) తనుశ్ 8; సౌరభ్ (సి) శాశ్వత్ (బి) అఖీబ్ 1; హర్షిత్ రాణా (బి) ములానీ 31; అర్ష్‌దీప్ (రనౌట్) 0; విద్వత్ కావేరప్ప (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు: 3, **మొత్తం: (52.1 ఓవర్లలో ఆలౌట్) 183. వికెట్ల పతనం:** 1–4, 2–6, 3–44, 4–52, 5–96, 6–122, 7–141, 8–154, 9–170, 10–183. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 8–0–39–3; ప్రసిద్ కృష్ణ 11–4–30–1; అఖీబ్ ఖాన్ 12–2–41–3; తనుశ్ కొటియాన్ 12–5–22–1; షమ్స్ ములానీ 9.1–1–50–1.

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్: ప్రథమ్ సింగ్ (బ్యాటింగ్) 59; మయాంక్ అగర్వాల్ (సి అండ్ బి) శ్రేయస్ అయ్యర్ 56; **మొత్తం: (28.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి) 115. వికెట్ల పతనం:** 1–115. **బౌలింగ్:** హర్షిత్ రాణా 3–0–12–0; విద్వత్ కావేరప్ప 3–0–18–0; సౌరభ్ కుమార్ 11–1–46–0; అర్ష్‌దీప్ సింగ్ 4–0–21–0; సారాంశ్ జైన్ 7–1–18–0; శ్రేయస్ అయ్యర్ 0.1–0–0–1.

భారత్ 'బి' దీటైన జవాబు

- తొలి ఇన్నింగ్స్‌లో 124/0
- భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్‌లో 525 ఆలౌట్
- రాణించిన రుతురాజ్, మానవ్


అభిమన్యు

సాక్షి, అనంతపురం: టాపార్డర్, లోయర్ ఆర్డర్ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బ్యాట్‌కు పని చెప్పడంతో... అనంతపురంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో పరుగుల వరద పారుతోంది. భారత్ 'సి'తో జరుగుతున్న మ్యాచ్‌లో శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 'బి' 36 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 124 పరుగులు సాధించింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (91 బంతుల్లో 51 బ్యాటింగ్; 4 ఫోర్లు, ఒక సిక్సర్), జగదీశన్ (126 బంతుల్లో 67 బ్యాటింగ్) హాఫ్ సెంచరీలతో క్రీజులో ఉన్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న భారత్ 'బి' ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 401 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 357/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'సి' 124.1 ఓవర్లలో 525 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (74 బంతుల్లో 58; 9 ఫోర్లు, 2 సిక్సర్లు), స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ (156 బంతుల్లో 82; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ శతకాలతో రాణించారు. ఆఖర్లో అన్షుల్ కంబోజ్ (27 బంతుల్లో 38; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడాడు. భారత్ 'బి' బౌలర్లలో ముకేశ్ కుమార్, రాహుల్ చాహర్ చెరో 4 వికెట్లు పడగొట్టారు.

స్కోరు వివరాలు

భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్: రుతురాజ్ (బి) ముకేశ్ 58; సాయి సుదర్శన్ (సి) నవ్‌దీప్ సైనీ (బి) ముకేశ్ 43; రజత్ పాటిదార్ (బి) నవ్‌దీప్ సైనీ 40; ఇషాన్ కిషన్ (బి) ముకేశ్ 111; బాబా ఇంద్రజిత్ (బి) రాహుల్ చహర్ 78; అభిషేక్ పొరేల్ (ఎల్బీడబ్ల్యూ) ముకేశ్ 12; మానవ్ సుతార్ (బి) రాహుల్ చహర్ 82; మయాంక్ మార్కండే (బి) నితీశ్ కుమార్ రెడ్డి 17; అన్షుల్ (బి) రాహుల్ చహర్ 38; విజయ్ కుమార్ వైశాఖ్ (సి) ఈశ్వరన్ (బి) రాహుల్ చహర్ 12; సందీప్ వారియర్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు: 23; **మొత్తం (124.1 ఓవర్లలో ఆలౌట్) 525. వికెట్ల పతనం:** 1–96, 2–97, 3–286, 4–311, 5–345, 6–382, 7–406, 8–461, 9–489, 10–525, **బౌలింగ్:** ముకేశ్ కుమార్ 32–4–126–4; సైనీ 23–3–101–1; వాషింగ్టన్ సుందర్ 18–1–67–0; నితీశ్ కుమార్ రెడ్డి 17–2–69–1; సాయికిశోర్ 18–2–78–0; రాహుల్ చహర్ 16.1–2–73–4.

భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: అభిమన్యు ఈశ్వరన్ (బ్యాటింగ్) 51; జగదీశన్ (బ్యాటింగ్) 67; ఎక్స్‌ట్రాలు: 6, **మొత్తం: (36 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 124. బౌలింగ్:** సందీప్ వారియర్ 1.1–0–8–0; విజయ్ వైశాఖ్ 10–2–29–0; అన్షుల్ 8.5–2–30–0; మయాంక్ మార్కండే 5–0–18–0; మానవ్ సుతార్ 10–0–34–0.

'మనోళ్లు ఒత్తిడిని అధిగమించాలి'

భారత మహిళా క్రికెటర్లకు ఎడుల్జీ సూచన




ముంబై: నాలుగేళ్ల క్రితం జరిగిన టి20 వరల్డ్ కప్‌లో భారత మహిళల జట్టు ఫైనల్ వరకు వచ్చినా... ఆస్ట్రేలియా చేతిలో ఓడి టైటిల్ చేజార్చుకుంది. 2023 ఫిబ్రవరిలో జరిగిన గత టి20 వరల్డ్ కప్‌లో భారత ప్రస్థానం సెమీఫైనల్‌కే పరిమితమైంది. ఈసారి కూడా మన జట్టు ఆస్ట్రేలియా చేతిలోనే ఓడింది. అయితే ఈసారి అలాంటి అవకాశాన్ని వదలరాదని, మన ప్లేయర్లు ఒత్తిడిని అధిగమించాలని భారత మాజీ ప్లేయర్ డయానా ఎడుల్జీ సూచించింది. అక్టోబర్ 3 నుంచి యూఏఈలో జరిగే టి20 వరల్డ్ కప్ ప్రచార కార్యక్రమంలో ఎడుల్జీ పాల్గొంది. 'ఆస్ట్రేలియాలాంటి ప్రొఫెషనల్ టీమ్‌ను ఓడించాలంటే మనం అన్ని రకాలుగా ఆధిపత్యం ప్రదర్శించాలి. మన అత్యుత్తమ ప్రదర్శన ఇస్తే ప్రత్యర్థి కూడా తడబడుతుంది. అయితే టి20ల్లో మనదైన రోజు ఏదైనా సాధ్యమే. ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంక చేతిలో మనం ఓడిపోతామని అనుకున్నామా? ప్లేయర్లు ఎలాంటి స్థితిలోనూ ఒత్తిడికి తలవంచవద్దు. వరల్డ్ కప్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తన భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం అవసరం. ఒంటి చేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఆమెకు ఉంది. బ్యాటింగ్‌తో పాటు ఆమె కెప్టెన్సీకి కూడా ఈ టోర్నీ సవాల్' అని ఎడుల్జీ అభిప్రాయపడింది. భారత పురుషుల జట్టు తరహాలోనే మహిళల టీమ్ కూడా టి20 వరల్డ్ కప్ గెలిచి ఒకే ఏడాది అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది.

రష్మిక పరాజయం



పెర్త్ (ఆస్ట్రేలియా): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 టోర్నీలో భారత మూడో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 374వ ర్యాంకర్ రష్మిక 3–6, 5–7తో టాప్ సీడ్, ప్రపంచ 165వ ర్యాంకర్ తాలియా గిబ్సన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయింది.



ఔరా... రొనాల్డో

100 కోట్ల ఫాలోవర్లతో సోషల్ మీడియాలో చరిత్ర

మాడ్రిడ్: 'నేను ఒక్కసారి చెబితే... వంద సార్లు చెప్పినట్లే' ఇది తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ పాపులర్ డైలాగ్. మరి ఒకే ఒక్కడికి 100 కోట్ల ఫాలోవర్లు ఉంటే ఔరా అనాల్సిందే కదా! అవును పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో 'సోషల్ మీడియా కింగ్'గా ఆవిర్భవించాడు. లక్ష కాదు... పది లక్షలు (మిలియన్) కాదు, పది మిలియన్లు (కోటి) కాదు... ఏకంగా వంద కోట్ల (బిలియన్) మంది అభిమానుల్ని సోషల్ మీడియాలో సంపాదించిన స్ట్రయికర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్, మరో రెండు నెట్‌వర్క్‌లలో కలిపి అతని ఫాలోవర్ల సంఖ్య ఒక బిలియన్ (100 కోట్లు) మైలురాయిని చేరుకోవడంతో పోర్చుగల్ స్ట్రయికర్ సోషల్ మీడియా రారాజు అయ్యాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో 64 కోట్లు, ఫేస్‌బుక్‌లో 17 కోట్లు, 'ఎక్స్' (ఒకప్పటి ట్విట్టర్)లో 11 కోట్ల 30 లక్షల మంది, యూట్యూబ్ సహా ఇతరత్ర సోషల్ నెట్‌వర్క్‌లలో ఫాలోవర్లను కలుపుకొని బిలియన్ మైలురాయిని (వందకోట్ల ఫాలోవర్లు) దాటేశాడు. దీనిపై తన అభిమానులను ఉద్దేశించి రొనాల్డో మాట్లాడుతూ 'మనం చరిత్ర సృష్టించాం. 100 కోట్ల ఫాలోవర్లు కేవలం సంఖ్య కానే కాదు. అంతకుమించిన భాగస్వామ్యం మనది. మీ ప్రేమ, ఆదరాభిమానాలతోనే ఇదంతా సాధ్యమైంది. నేనెప్పుడు నా కుటుంబం కోసం, మీ కోసం ఆడతాను. ఇప్పుడు మనతో 100 కోట్ల మంది జత కట్టారు. నా ప్రతి అడుగులోనూ మీరు తోడవుతున్నారు. ఆటుపోట్లు ఎదురైనపుడూ ఉన్నారు. ఇది నా ప్రయాణం కాదు... మన ప్రయాణం. దీనికి తిరుగులేదని మీరు చాటారు. హద్దుల్లేని ఆనందంలో ముంచారు. నాపై మీ విశ్వాసానికి కృతజ్ఞతలు. మీ సహకారం వల్లే.. మీరంతా నా జీవితంలో భాగం కావడం వల్లే ఇదంతా సాధ్యమైంది' అని భావోద్వేగంతో పోస్ట్ చేశాడు. అతని ఫొటోల కలబోతతో '1బి' అనే లోగోను వంద కోట్ల కలలు ఒక ప్రయాణంలో అని షేర్ చేశాడు.

పురోగతి కోసం ప్రక్షాళన!

ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్యను సమూలంగా మార్చేయాలి


కొత్త నియామావళి, ఎన్నికలు అవసరం ● మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా వ్యాఖ్య

న్యూఢిల్లీ: అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అన్ని రకాలుగా అథమ స్థితికి చేరిందని, దీనిలో సమూల మార్పులు అవసరమని భారత మాజీ ఆటగాడు, మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా వ్యాఖ్యానించాడు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో మన టీమ్ పరిస్థితి మరింత దిగజారడానికి ఏఐఎఫ్ఎఫ్ కారణమని అతను తీవ్రంగా విమర్శించాడు. జట్టు ప్రణాళికల విషయంలో ఎలాంటి ముందు చూపు లేకపోవడం వల్లే ఇటీవల కాంటినెంటల్ కప్‌లో సిరియా చేతిలో ఓటమి ఎదురైందని... బలహీనమైన మారిషస్‌తో కూడా మ్యాచ్ గెలవలేకపోయామని భూటియా అన్నాడు. 'భారత ఫుట్‌బాల్‌కు సంబంధించి గత కొంత కాలంగా ఎలాంటి మంచి పరిణామాలు జరగడం లేదు. నిలకడగా 100వ ర్యాంక్‌లో ఉంటూ వచ్చిన జట్టు ఇప్పుడు 125కు పడిపోయింది. ఏఐఎఫ్ఎఫ్‌లో ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. లేదంటే పరిస్థితి మరింతగా దిగజారుతుంది. మన టీమ్‌కు సంబంధించి చర్చ అవసరం. ఏఐఎఫ్ఎఫ్ నియమావళిలోనే సమస్య ఉంది. దానిని మార్చాల్సిందే. సుప్రీం కోర్టులో ప్రస్తుతం ఉన్న కేసుకు సంబంధించి అడ్డంకులు తొలగిపోతే కొత్త కార్యవర్గాన్ని వెంటనే ఎంచుకోవాలి' అని భూటియా చెప్పాడు. ఏదో విజన్ 2046 అని కాగితాల్లో రాసుకుంటే కుదరదని, దాని కోసం పని చేయాల్సి ఉంటుందని అతను సూచించాడు. 'గత రెండేళ్లుగా ఏఐఎఫ్ఎఫ్‌లో ఎన్నో ఆరోపణలు, వివాదాలు వచ్చి ఆటపై ప్రతికూల ప్రభావం చూపించాయి. నేను ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నప్పుడు ఫుట్‌బాల్‌కంటే కూడా సామాజిక అంశాలపై అంతా మాట్లాడటం చూసి ఆశ్చర్యమేసింది. ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఒక స్వచ్ఛంద సంస్థలాగా పని చేస్తే కుదరదు. ఫుట్‌బాల్ అభివృద్ధి, జట్టు విజయం అనేదే ప్రధాన బాధ్యత. నేను పదవుల కోసం పోరాడదల్చుకోలేదు. ఆటను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా అంతా పని చేయాలి' అని భూటియా వివరించాడు.


బైచుంగ్ భూటియా

హెలికాప్టర్లలో స్టేడియానికి...

ట్రాఫిక్ ఇబ్బందులను తప్పించుకునేందుకు మెక్సికో టెన్నిస్ టోర్నీ నిర్వాహకుల వినూత్న ప్రయత్నం



గ్వాడలహారా (మెక్సికో): ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు టోర్నీ నిర్వాహకులు ఏకంగా హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. మెక్సికోలోని గ్వాడలహారా నగరంలో ప్రస్తుతం డబ్ల్యూటీఏ–500 టెన్నిస్ టోర్నమెంట్ జరుగుతోంది. ఇక్కడ తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. హోటల్స్ నుంచి ప్లేయర్లను నిర్ణీత సమయంలోగా స్టేడియానికి తీసుకొచ్చేందుకు రోడ్డు మార్గంలో కుదరదని భావించిన గ్వాడలహారా టోర్నీ ఆర్గనైజర్లు హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు. దీనిపై టోర్నీ డైరెక్టర్ గుస్తావో శాంటోస్‌కాయ్ మాట్లాడుతూ ప్లేయర్లకు మరింత సౌకర్యం కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. క్రీడాకారిణులు కూడా ఈ తరహా రవాణా అనుభవాన్ని చక్కగా ఆస్వాదిస్తున్నారని చెప్పారు. 'ప్రపంచ వ్యాప్తంగా కొన్ని టోర్నీల్లో అప్పుడప్పుడు ప్లేయర్లను ఇలా హెలికాప్టర్లలో వేదిక వద్దకు తీసుకొస్తారు. కానీ రెగ్యులర్‌గా మాత్రం ఈ సదుపాయం ఉండదు. కానీ ఇక్కడ మాత్రం ప్రతిసారి ప్లేయర్లను చాపర్లలోనే హోటల్ గదుల నుంచి టెన్నిస్ కోర్టులకు తీసుకొస్తున్నారు' అని డబ్ల్యూటీఏ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అలెక్స్ ప్రియర్ తెలిపారు. ఆకాశ మార్గాన త్వరితగతిన వేదికకు చేరుకోవడం ద్వారా ప్లేయర్లంతా ఎలాంటి ప్రయాణ బడలిక లేకుండా మ్యాచ్‌ల బరిలోకి దిగుతున్నారు. గ్వాడలహారా సబర్బన్ సిటీలో రోడ్డు మార్గాలన్నీ రద్దీగా ఉంటాయి. ప్లేయర్లు బస చేసే హోటల్స్ నుంచి టోర్నీ వేదికకు మధ్య దూరం 11 కిలో మీటర్లు ఉంటుంది. అయితే ఈ మాత్రం దూరానికి 30 నుంచి 40 నిమిషాల సమయం పట్టడంతో నిర్వాహకులు చాపర్లను అందుబాటులోకి తెచ్చారు. దీని వల్ల నాలుగైదు నిమిషాల్లోనే క్రీడాకారిణులు స్టేడియానికి చేరుకుంటున్నారు.

లేవర్ కప్ నుంచి వైదొలిగిన నాదల్



బెర్లిన్: స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ లేవర్ కప్ టెన్నిస్ టోర్నీ నుంచి వైదొలిగాడు. బెర్లిన్ వేదికగా వచ్చే వారం ఈ టీమ్ టోర్నీ జరగనుంది. గత కొంతకాలంగా గాయాలతో సతమతమవుతున్న నాదల్ ఈ ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో మూడింట పాల్గొనలేదు. చివరగా పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన 38 ఏళ్ల నాదల్... పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో జొకోవిచ్ (సెర్బియా) చేతిలో ఓడి ఇంటిదారి పట్టాడు. 'వచ్చే వారం జరగనున్న లేవర్ కప్‌లో ఆడలేకపోతున్నా. ఇది టీమ్ ఈవెంట్. జట్టుకు ఏది మంచో అదే చేయాలి. టీమ్‌ను విజయ తీరాలకు చేర్చగల ఆటగాళ్లు ఉండటం ముఖ్యం అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా' అని నాదల్ పేర్కొన్నాడు.

సాక్షి ప్లస్
శనివారం । 14-9-2024

ఇంకొన్ని రోజులు పని చేయండి

చైనాలో ఉద్యోగులకు బంపర్ ఆఫర్

వృద్ధుల జనాభా పెరుగుతుండడం, యువశక్తి తగ్గిపోతుండడంతో కీలక నిర్ణయం

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా దశాబ్దాలపాటు రికార్డు నిలబెట్టుకున్న డ్రాగన్ దేశం చైనాలో జననాల రేటు నానాటికీ పడిపోతోంది. రాబోయే రోజుల్లో జనాభా మరింత తగ్గిపోవడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయి. పనిచేసే శక్తి కలిగిన యువత సంఖ్య తగ్గిపోతుండడం, మరోవైపు వృద్ధుల సంఖ్య పెరిగిపోతుండడం ఆర్థిక వ్యవస్థకు పెనుసవాలుగా మారింది. పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం భారీ సంస్కరణలకు తెరతీసింది. ఇందుకోసం దశాబ్దాల నాటి చట్టాల్లో సవరణలు చేస్తోంది. పదవీ విరమణ వయసుకు సంబంధించి చైనా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల పదవీ విరమణ వయసును మరో మూడేళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



హఠాత్తుగా ఎందుకీ పెంపు?

- చైనాలో మనుషుల సగటు జీవితకాలం క్రమేణా పెరుగుతోంది. 1960లో సగటు జీవిత కాలం 44 ఏళ్లుగా ఉండేది. 2021 నాటికి అది 78 ఏళ్లకు చేరుకుంది. మరో 26 ఏళ్లకు.. అంటే 2050 నాటికి సగటు జీవిత కాలం 80 ఏళ్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.
- డ్రాగన్ దేశంలో ప్రస్తుతం 28 కోట్ల మంది వృద్ధులు ఉన్నారు. 2035 నాటికి వీరి సంఖ్య 40 కోట్లకు చేరనుంది. అంటే ఇది అమెరికా, బ్రిటన్ దేశాల సంయుక్త జనాభాతో సమానం.
- చైనాలో వృద్ధుల జనాభా శరవేగంగా పెరుగుతోంది. అదే స్థాయిలో జననాలు నమోదు కావడం లేదు.
- ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పదవీ విరమణ చేసే వారి సంఖ్య పైకి ఎగబాకుతుండగా, కొత్తగా చేరేవారు కనిపించడం లేదు.
- కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యం కలిగిన మానవ వనరులు లభించడం కష్టసాధ్యంగా మారింది. కొత్తగా ఉద్యోగులను నియమించుకొని, వారికి శిక్షణ ఇవ్వడం యాజమాన్యాలు భారంగా భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగులను పదవీ విరమణ పేరుతో బయటకు పంపించడం కంటే మరికొన్నేళ్లు వారి సేవలు ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నాయి.
- ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచాలంటూ వివిధ వర్గాల నుంచి వస్తున్న ఒత్తిళ్లకు చైనా ప్రభుత్వం తలొగ్గింది. ఈ పెంపుతో లాభమే తప్ప నష్టం ఉండదని నిపుణులు చెబుతున్నారు.

తగ్గనున్న పెన్షన్ల భారం

- రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన పెన్షన్లు ప్రభుత్వానికి మోయలేని భారంగా మారుతున్నాయి. చైనాలో చాలా ప్రావిన్స్‌ల్లో లోటు బడ్జెట్ కలవరపెడుతోంది.
- పెన్షన్ల విషయంలో సంస్కరణలు చేపట్టకుంటే 2035 నాటి పెన్షన్ బడ్జెట్ పూర్తిగా అడుగంటిపోతుందని చైనా ప్రభుత్వ రంగంలోని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ గతంలోనే హెచ్చరించింది.
- ఉద్యోగుల పదవీ విరమణ వయసును పెంచితే పెన్షన్ చెల్లించాల్సిన వ్యవధి కొంత తగ్గినట్లే. దాంతో పెన్షన్ బడ్జెట్‌పై ఒత్తిడి తగ్గుతుందని ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది.
- ఇదంతా బాగానే ఉన్నప్పటికీ రిటైర్‌మెంట్ వయసు పెంపును కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సోషల్ మీడియాలో తమ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి అడుగుపెడుతున్న వారికి అవకాశాలు అందకుండా పోతాయని అంటున్నారు.
- మరోవైపు జపాన్, దక్షిణ కొరియాలోనూ వృద్ధుల జనాభా పెరుగుతోంది. జపాన్‌లో 65 ఏళ్లు దాటిన వారికి, దక్షిణ కొరియాలో 63 ఏళ్లు దాటినవారికి మాత్రమే పెన్షన్లు అందించేలా అక్కడి ప్రభుత్వాలు సంస్కరణలు ప్రారంభించాయి.

దీర్ఘకాలంలో లాభమే

పెరుగుతున్న వృద్ధ జనాభా వల్ల తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి రిటైర్‌మెంట్ వయసు పెంపు అనేది ఒక చక్కటి పరిష్కార మార్గం అవుతుందని ఆస్ట్రేలియాలోని విక్టోరియా యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఆఫ్ పాలసీ స్టడీస్ రీసెర్చ్ ఫెలో షియూజింగ్ పెంగ్ చెప్పారు. జనాభా తగ్గిపోతున్నప్పుడు లేబర్ ఫోర్స్ భాగస్వామ్య రేటును పెంచాలని ఆయన సూచించారు. లేకపోతే ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని స్పష్టంచేశారు. పదవీ విరమణ వయసు పెంపు నిర్ణయం స్వల్పకాలం కొంత వ్యతిరేక ప్రభావం చూపినప్పటికీ దీర్ఘకాలంలో మేలు జరుగుతుందని చైనా నిపుణుడు షింగ్ జియావోపెంగ్ వెల్లడించారు. ఉత్పాదకత స్థిరంగా కొనసాగాలంటే కార్మిక శక్తి తగ్గకూడదని చెప్పారు.

అబ్బో.. క్యాబేజీ..!



ఈ మహిళ ఆశ్చర్యంగా చూస్తున్న క్యాబేజీ బరువు ఏకంగా 27.4 కిలోలు. క్రెయిగ్ పియర్సన్ అనే రైతు పొలంలో పండింది. బ్రిటన్‌లోని హర్రోగేట్ న్యూబీ హాల్ అండ్ గార్డెన్స్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించిన ఆటమ్ ఫ్లవర్ షోలో జెయింట్ వెజిటబుల్ కాంపిటిషన్‌లో అత్యంత బరువైన క్యాబేజీగా మొదటి స్థానంలో నిలిచింది.

మురిపాల ఉల్లి..!



బ్రిటన్‌కు చెందిన ఈ రైతు పేరు స్టీఫెన్ పుర్విస్. తన పొలంలో 7.6 కిలోల బరువున్న భారీ ఉల్లిగడ్డను పండించారు. హర్రోగేట్‌లోని న్యూబీ హాల్ అండ్ గార్డెన్స్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించిన ఆటమ్ ఫ్లవర్ షోలో అత్యంత బరువైన ఉల్లిగడ్డల విభాగంలో ఈ ఉల్లిగడ్డ మొదటి స్థానంలో నిలిచింది.

పేద్ద.. గుమ్మడి..!



భారీ గుమ్మడి కాయను రెండు చేతులతో చుట్టేసుకున్న ఈ రైతు అలెగ్జాండర్ చుసోవ్. ఈ గుమ్మడి బరువు ఒకటీ రెండూ కాదు ఏకంగా 817 కిలోలు. రష్యా రాజధాని మాస్కోలో మాస్కో స్టేట్ యూనివర్సిటీ గార్డెన్‌లో ఈ నెల 13న నిర్వహించిన జెయింట్ వెజిటబుల్స్ పోటీల్లో ఈ పంప్‌కిన్ జాతీయ రికార్డు నెలకొల్పింది.

రెండు రోజుల్లో రెండుసార్లు సక్సెస్

స్వల్పశ్రేణి క్షిపణులను ప్రయోగించిన డీఆర్‌డీవో, నేవీ

బాలాసోర్(ఒడిశా): ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే స్వల్పశ్రేణి క్షిపణి వ్యవస్థను రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), నౌకాదళం వరసగా రెండోరోజూ విజయవంతంగా పరీక్షించాయి. ఒడిశా తీరంలో చాందీపుర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ ప్రాంతం ఇందుకు వేదికైంది. ఇక్కడి నుంచి శుక్రవారం ఈ ప్రయోగాన్ని చేపట్టారు. భూమిపై ఉంచిన నిట్టనిలువు లాంచర్ నుంచి స్వల్పశ్రేణి క్షిపణిని ప్రయోగించగా అది తక్కువ ఎత్తులో అధిక వేగంతో దూసుకెళ్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించిందని డీఆర్‌డీవో అధికారులు వెల్లడించారు. వర్టికల్ లాంచ్ షార్ట్‌రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్(వీఎల్‌ఎస్ఆర్ఎస్ఏఎం) తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించకుందని నేవీ అధికారులు పేర్కొన్నారు. ప్రయోగం విజయవంతం అవడంతో డీఆర్‌డీవో, భారత నావికాదళాలను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పొగిడారు. ప్రయోగంలో ఒకవేళ పొరపాటు జరిగిన క్షిపణి వేరేచోట పడితే ప్రాణనష్టం జరగకుండా చూసేందుకు ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ సమీపంలోని ఆరు గ్రామాల్లో 3,100 మంది స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తక్కువ ఎత్తులోని లక్ష్యాన్ని క్షిపణి అత్యంత ఖచ్చితత్వంతో ఛేధించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ క్షిపణ పరీక్షను విజయవంతంగా పూర్తిచేసిన బృందాలకు రక్షణశాఖలో పరిశోధనాభివృద్ధి విభాగ కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ అయిన డాక్టర్ సమీర్ వి.కామత్ అభినందనలు తెలిపారు.

బ్రిటన్ దౌత్యాధికారులపై రష్యా వేటు

గూఢచర్యానికి పాల్పడ్డారని ఆరోపణ

మాస్కో: తమ దేశంలో పనిచేస్తున్న ఆరుగురు బ్రిటిష్ దౌత్యాధికారులను రష్యా బహిష్కరించింది. బ్రిటన్ విదేశాంగ విభాగం తరపున రష్యాకు వచ్చిన ఈ ఆరుగురు గూఢచర్యానికి పాల్పడ్డారని, అందుకే వారిని బహిష్కరించినట్లు రష్యా ప్రకటించింది. ఆ దౌత్యాధికారులకు ఇచ్చిన అక్రిడేషన్లను గత నెలలో రద్దుచేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ''ఐరాస దౌత్య సంబంధాలపై వియన్నా ఒప్పందాన్ని బ్రిటన్ అతిక్రమించింది. రష్యాలో నిఘాకు తెగబడింది. ఇందుకు సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించాం'అని రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్(ఎఫ్ఎస్‌బీ) తెలిపింది. ఉక్రెయిన్‌కు అదనంగా 1.5 బిలియన్ డాలర్ల అదనపు సాయం చేసేందుకు అమెరికా, బ్రిటన్ సిద్ధమై అమెరికాలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పర్యటిస్తున్న వేళ రష్యా బహిష్కరణ చర్యలకు దిగడం గమనార్హం. తమ దౌత్యాధికారులపై బహిష్కరణ వేటు వేయడాన్ని బ్రిటన్ తీవ్రంగా తప్పుబట్టింది. రష్యా చేసిన 'నిఘా'ఆరోపణలను బ్రిటన్ కొట్టిపారేసింది.

అనధికార మసీదు నిర్మాణంపై హిందువుల ఆందోళన

హిమాచల్ మండీలో ఉద్రిక్త పరిస్థితి

మండీ/సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలోని సంజౌలీ ప్రాంతంలో మసీదు అక్రమ నిర్మాణంపై హిందువుల ఆందోళనలు, ఉద్రిక్తతలు నెలకొన్న రెండ్రోజులకే అదే రాష్ట్రంలో మరోచోట మసీదు అక్రమ నిర్మాణం వివాదాస్పదమైంది. మండీ పట్టణంలో మసీదులో అనధికార నిర్మాణాన్ని కూల్చేయాలన్న డిమాండ్‌తో హిందువులు శుక్రవారం చేపట్టిన నిరసన ప్రదర్శన ఉద్రిక్తతలకు దారితీసింది. తొలుత మండీ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' నినాదాలతో పాదయాత్రగా బయల్దేరిన వందలాది మంది హిందువులు తర్వాత సెరీ మంచ్ వద్ద ధర్నాకు దిగారు. తర్వాత హఠాత్తుగా మసీదు వైపు దూసుకెళ్లారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు జలఫిరంగులను ప్రయోగించారు. అయితే మసీదు అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని జైల్ రోడ్ మసీదు మేనేజ్‌మెంట్ కమిటీకి మండీ మున్సిపల్ కార్పొరేషన్ శుక్రవారం నోటీసిచ్చింది. అయితే అంతకుముందే అనధికార నిర్మాణాన్ని ముస్లింలే కూల్చేయడం విశేషం. గతంలో ఇదే స్థలంలో 45 చదరపు మీటర్ల మేరకు మసీదు నిర్మాణానికి అనుమతులు ఇవ్వగా ఏకంగా 232 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మసీదును నిర్మించారు. పక్కనే ఉన్న ప్రజాపనుల శాఖ భూమిలోనూ మసీదును నిర్మించడంతో ఈ వివాదం మొదలైంది.

కాన్పూర్‌లో నక్కల స్వైర విహారం

బాలుడు సహా ముగ్గురికి గాయాలు • అప్రమత్తమైన అటవీ అధికారులు

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లోని పల్లెలను అడవి జంతువుల భయం వదిలేలా లేదు. మొన్నమొన్నటి వరకు బహ్రెయిచ్ జిల్లాలోని గ్రామాల వారిని కొన్ని నెలలపాటు తోడేళ్లు కంటిమీద కునుకులేకుండా చేశాయి. తాజాగా, కాన్పూర్ సమీపంలోని గ్రామాల్లో నక్కల బెడద దాపురించింది. తాజాగా జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో పదేళ్ల బాలుడు సహా పలువురు గాయపడ్డారు. ఓ గ్రామంలో మంగళవారం సాయంత్రం పొలంలో పని చేస్తున్న షాను అనే పదేళ్ల బాలుడితోపాటు, రామ్ బహదూర్ అనే వ్యక్తిపై నక్క దాడి చేసి గాయపరిచింది. మరో ఘటనలో బెహత్ సకత్‌కు చెందిన రామ్ కిశోర్ (50) నక్క దాడిలో గాయపడ్డాడు. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. నక్కలు పొలాల్లో సంచరిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. నక్కల దాడుల ఘటనలు తమ దృష్టికి వస్తున్నాయని, అయితే, ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్డీఎం) తెలిపారు. నక్కలను పట్టుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అధిక వర్షాల వల్ల వన్యప్రాణులు వాటి సహజ ఆవాసాలకు దూరమై గ్రామాల సమీపంలోకి వస్తున్నాయని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారికి సాయమందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎస్డీఎం చెప్పారు.

బహ్రెయిచ్ జిల్లాలో మళ్లీ కలకలం

బహ్రెయిచ్ జిల్లాలో తోడేళ్ల దాడుల్లో 9 మంది చిన్నారులు సహా మొత్తం 10 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 36 మంది గాయపడిన విషయం తెలిసిందే. దాడులు చేస్తున్నట్లుగా గుర్తించిన ఆరు తోడేళ్లలో ఐదింటిని అటవీ సిబ్బంది పట్టుకున్నారు. తప్పించుకు తిరుగుతు న్న ఆరో తోడేలు భయం స్థానికులను వెంటాడుతూనే ఉంది. అయితే, ఇదే జిల్లా మహ్సి తహశీల్ పరిధిలో గురు, శుక్రవారాల్లో గుర్తు తెలియని జంతువు దాడిలో ఆరేళ్ల బాలుడు సహా ముగ్గురు గాయపడ్డారు. ఇది తోడేలు పనేనని గ్రామస్తులు అంటున్నారు. బాధిత ప్రాంతాల్లో పరిశీలన జరిపిన అధికారులు మాత్రం తోడేళ్లు సంచరించిన ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదని తెలిపారు. పాదాల గుర్తులను బట్టి కుక్క లేదా నక్క దాడికి పాల్పడి ఉంటుందని భావిస్తున్నామన్నారు. గుర్తు తెలియని జంతువు దాడిలో గాయపడిన సింగియా నసీర్‌పూర్ గ్రామానికి చెందిన మహిళ గుడియా(26), నర్‌కొట్వా గ్రామానికి చెందిన ననకా(6), సమ్మన్‌పూర్వకు చెందిన ముకీమున్నిసా(45) వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

మణిపూర్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం ఎత్తివేత

ఇంఫాల్: మణిపూర్‌లోని ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్‌పై ఉన్న నిషేధాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఎత్తివేసింది. అయితే, షరతులకు లోబడే ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉంటాయని కమిషనర్(హోం) ఎన్. అశోక్ కుమార్ ఒక నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 'ఇంటర్నెట్ కనెక్షన్ ఐపీ ద్వారా మాత్రమే ఉంటుంది. అనధికార సబ్‌స్క్రైబర్లను అనుమతించరు. రూటర్స్ ద్వారా వైఫై/హాట్‌స్పాట్‌లకు అనుమతి లేదు'అని అందులో తెలిపారు. అదేసమయంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలపై నిషేధం కొనసాగుతుందని నోటిఫికేషన్ స్పష్టం చేసింది. వదంతులు, తప్పుడు వార్తలతో, ఆందోళనకారులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించే ప్రమాదమున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ వివరించారు. మిలిటెంట్ల దాడులను అడ్డుకోలేకపోయినందున రాష్ట్ర డీజీపీ, ప్రత్యేక సలహాదారులను తొలగించాలంటూ ఈ నెల 10వ తేదీన విద్యార్థులు భారీ ఆందోళనకు దిగారు. ఘర్షణల్లో పోలీసులు, విద్యార్థులు సహా 80 మంది గాయపడ్డారు. దీంతో ప్రభుత్వం ఇంటర్నెట్‌పై నిషేధం ప్రకటించింది. ఇలా ఉండగా, చురాచంద్‌పూర్‌లో గాలింపు చర్యలు చేపట్టిన భద్రతాబలగాలు షెజంగ్ అటవీ ప్రాంతంలో 7.5 మీటర్ల దేశవాళీ రాకెట్‌ను కనుగొన్నాయి. అత్యాధునిక ఎం–16 రైఫిల్, ఒక భారీ మోర్టార్, ఒక మధ్యశ్రేణి మోర్టార్‌తోపాటు ఏడు బాంబ్ లాంచర్లు, మూడు బాంబులు కూడా బయటపడ్డాయి.

బీజేపీ దురహంకారానికి దర్పణం


రెస్టారెంట్ల యజమానితో బలవంతంగా క్షమాపణ చెప్పించారన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ: చిన్న వ్యాపారుల జీఎస్టీ కష్టాలను వెల్లడించిన వ్యక్తితో బలవంతంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు క్షమాపణ చెప్పించి బీజేపీ సర్కార్ తన దురహంకారాన్ని బయటపెట్టుకుందని కాంగ్రెస్ ఆరోపించింది. వ్యాపారుల కష్టాలను స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా ఎదుట ఏకరవు పెట్టిన తమిళనాడు హోటల్ ఓనర్ల సంఘం చైర్మన్, ప్రముఖ శ్రీ అన్నపూర్ణ రెస్టారెంట్ల అధిపతి శ్రీనివాసన్.. తర్వాత నిర్మలను విడిగా కలిసి క్షమించాలని వేడుకున్న వీడియోను తమిళనాడు బీజేపీ నేతలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం తెల్సిందే. ముక్కుసూటిగా ప్రశ్నించిన పాపానికి ఇలా ఒక ప్రముఖునికి అవమానిస్తారా?, క్షమాపణ వీడియోను షేర్ చేసి పరువు తీస్తారా?. బీజేపీ అహంకారం బయటపడిన ప్రతిసారీ ఇలా ప్రజలు అవమానాలు పడాల్సిందేనా?'' అంటూ కాంగ్రెస్ విరుచుకుపడింది. కోయంబత్తూర్‌లో ఒక కార్యక్రమంలో నిర్మల పాల్గొనగా సభికుల్లో ఒకరైన శ్రీనివాసన్ మంత్రిని నిలదీశారు. ''క్రీమ్‌తో ఉన్న బన్‌కు 18 శాతం జీఎస్టీ ఉంది. ఉత్తి బన్‌కు జీఎస్టీ లేదు. కస్టమర్లు 'కేవలం బన్ ఇవ్వండి. క్రీమ్ మేమే పూసుకుంటాం' అని అడుగుతున్నారు. మిఠాయిలపై 5 శాతం జీఎస్టీ. బియ్యపు పిండి, శెనగపిండి చిరుతిళ్లపై 12 శాతం జీఎస్టీ వేస్తున్నారు. అధిక జీఎస్టీలతో మేం ఇబ్బందులు పడుతున్నాం'' అని వ్యాఖ్యానించడం తెల్సిందే. క్షమాపణ వీడియో బహిర్గతం కావడం, విమర్శలు వెల్లువెత్తడంతో తమిళనాడు బీజేపీ చీఫ్ కె.అన్నామలై క్షమాపణ చెప్పారు.

హరియాణాలో ప్రచారానికి కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్లు వీరే..

చండీగఢ్: హరియాణా అసెంబ్లీకి అక్టోబర్ 5వ తేదీన జరిగే ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ 40 మందితో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా తదితరులున్నారు. జాబితాలో వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియాలకు కూడా స్థానం కల్పించారు. భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్, మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ తీవ్ర ఆరోపణలు చేయడంతోపాటు ఆందోళనలకు సారథ్యం వహించారు. వీరిద్దరూ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరగా, వినేశ్‌కు కాంగ్రెస్ టిక్కెట్, పునియాకు పార్టీ పదవి ఇవ్వడం తెలిసిందే.

ఆ విమానంలో నా తండ్రి కూడా ఉన్నారు



ఎస్.జైశంకర్

- ఆసక్తికర విషయాన్ని బయటపెట్టిన విదేశాంగ మంత్రి జైశంకర్
- 'కాందహార్ హైజాక్' ఘటనను గుర్తుచేసుకున్న మంత్రి

జెనీవా: ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ఇటీవల విడుదలై వివాదాలకు కేంద్ర బిందువుగా నిలిచిన 'ఐసీ 814: ది కాందహార్ హైజాక్'వెబ్‌సిరీస్‌పై ఇంకా చర్చ జరుగుతున్న వేళ అలాంటి హైజాక్ ఉదంతంలో తన తండ్రి, మాజీ ఐఏఎస్ అధికారి కృష్ణస్వామి సుబ్రహ్మణ్యం కూడా బాధితుడిగా ఉన్నారని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రకటించారు. 1984 ఏడాదిలో జరిగిన విమాన హైజాక్ ఉదంతంలో తన కుటుంబం సైతం తీవ్ర ఉత్కంఠను ఎదుర్కొందని ఆయన వ్యాఖ్యానించారు. జెనీవాలో ఒక భారతీయసంతతి వ్యక్తులతో భేటీ సందర్భంగా జైశంకర్ తన కుటుంబం గతంలో పడిన వేదనను అందరితో పంచుకున్నారు.

ఏడుగురు హైజాకర్లు చొరబడి..

'1984 జులై ఐదో తేదీన ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఐసీ 421 విమానం శ్రీనగర్ వెళ్లేందుకు ఢిల్లీ నుంచి టేకాఫ్ అయి మధ్యలో చండీగఢ్ సమీపంలోని పఠాన్‌కోట్‌లో ఆగింది. అప్పుడు ఏడుగురు హైజాకర్లు కాక్‌పిట్‌లోకి చొరబడి విమానాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. విమానాన్ని హైజాక్ చేసిన వారంతా ఆలిండియా సిఖ్ స్టూడెంట్స్ ఫెడరేషన్‌కు చెందిన వాళ్లు. సిక్కు వేర్పాటువాది జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలేతోపాటు ఇతర నేతలను విడుదల చేయాలని డిమాండ్ విధించారు. విమానాన్ని లాహోర్‌కు, తర్వాత కరాచీకి, చిట్టచివరకు దుబాయ్‌కు తీసుకెళ్లారు. విమానం విదేశీ గడ్డపైకి వెళ్లడంతో భారత విదేశాంగ శాఖ సైతం రాయబారం నడిపేందుకు రంగంలోకి దిగింది.

ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో చేరిన తొలినాళ్లలో..

అప్పుడు నేను ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) యువ అధికారిగా పనిచేస్తున్నా. ప్రయాణికులన విడిపించేందుకు హైజాకర్లతో చర్చలు జరపాల్సిన బృందంలో నేను కూడా సభ్యునిగా ఉన్నా. అత్యంత కీలకమైన పనిలో నిమగ్నంకావాల్సి ఉన్నందున ఇంటికి రాలేనని చెప్పేందుకు మా అమ్మకు ఫోన్ చేశా. అప్పుడు నా భార్య ఉద్యోగానికి వెళ్లింది. ఇంట్లో పసిబిడ్డగా ఉన్న నా కుమారుడిని మా అమ్మ ఒక్కరే చూసుకుంటోంది. ''ఇంటికి రావడం కుదరదు. ఇక్కడ విమానాన్ని హైజాక్ చేశారు''అని చెప్పా. అయితే పనిలో సీరియస్‌గా మునిగిపోయాక నాలుగు గంటల తర్వాత నాకో విషయం తెల్సింది. అదేంటంటే నా తండ్రి కృష్ణస్వామి కూడా అదే విమానంలో బందీగా ఉన్నారు. ఓవైపు హైజాక్ విషయం తెల్సి ప్రయాణికుల కుటుంబసభ్యులు భారత ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. బాధిత కుటుంబసభ్యుల్లో నేను ఉన్నా. మరోవైపు ప్రభుత్వం తరఫున మాట్లాడాల్సిన వ్యక్తిని కూడా నేను. ఇలాంటి విచిత్రమైన పరిస్థితి నాది. ఏదేమైనా 36 గంటల ఉత్కంఠ తర్వాత ఖలిస్తాన్ మద్దతుదారులు అధికారుల ఎదుట లొంగిపోవడంతో కథ సుఖాంతమైంది. విమానంలోని 68 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. హైజాక్ ఉదంతం విషాదాంతంగా ముగియకుండా ఒక సమస్యకు పరిష్కారంగా మలుపు తీసుకుంది''అని అన్నారు. ''నేనింకా కాందహార్ వెబ్ సిరీస్ చూడలేదు. అయితే హైజాకర్లతో ప్రభుత్వం, మధ్యవర్తులు కాస్తంత వెనక్కి తగ్గి మాట్లాడినట్లుగా అందులో చూపించారట కదా. సినిమాల్లో హీరోను మాత్రమే అందంగా చూపిస్తారు. ప్రభుత్వం సరిగా పనిచేసినా చూపించరు''అని అన్నారు.



సుబ్రహ్మణ్యం

అణ్వస్త్ర విధానాల్లో సుబ్రహ్మణ్యం కీలకపాత్ర

మాజీ ఐఏఎస్ అధికారి అయిన కృష్ణస్వామి హైజాక్ జరిగిన ఏడాది ఢిల్లీలోని డిఫెన్స్ స్టడీస్, అనాలసిస్‌కు డైరెక్టర్‌గా ఉన్నారు. ఆ తర్వాత భారత 'అణ్వస్త్ర'విధాన రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ప్రముఖ అంతర్జాతీయ వ్యూహాత్మక వ్యవహారాల నిపుణుడిగా పేరొందారు. ''అణ్వాయుధాలను తొలుత భారత్ తనంతట తానుగా ఏ దేశం మీదా ప్రయోగించకూడదు. ఒక వేళ భారత్ మీద ఎవరైనా అణ్వాయుధం ప్రయోగిస్తే దీటైన సమాధానం చెప్పే స్థాయికి మనం ఎదగాలి''అనే ప్రాథమిక సిద్ధాంతాల్లో రూపకల్పనలో ఈయన పాత్ర ఉందని చెబుతారు. జాతీయ భద్రతా మండలి సలహా బోర్డుకు తొలి కన్వీనర్‌గా వ్యవహరించారు. హైజాకర్లతో చర్చల వేళ ''కావాలంటే మొదట నన్ను చంపండి. ప్రయాణికులను ఏమీ చేయకండి''అని హైజాకర్లతో కృష్ణస్వామి అన్నారని నాటి పాత్రికేయులు రాజు సంతానం, దిలీప్ బాబ్‌లు చెప్పారు.

సాక్షి ప్లస్
శనివారం, 14-9-2024

ఎడారీకరణ సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

భారత శీతోష్ణస్థితి ఎంతో వైవిధ్యభరితమైంది. ప్రతి రెండు నెలలకోసారి వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి! దేశంలో వాతావరణ పరిస్థితులు.. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా, ఒక్కో సమయంలో ఒక్కో రకంగా ఉంటాయి. దక్షిణ హిందూ మహాసముద్రంలో ఏర్పడే రుతుపవన ప్రక్రియ..దేశ శీతోష్ణస్థితిని ఎక్కువగా ప్రభావితం చేస్తుంది!!



ఒక ప్రాంతంలోని సగటు వాతావరణ పరిస్థితులనే శీతోష్ణస్థితిగా వ్యవహరిస్తారు. భారతదేశం శీతోష్ణస్థితి ఎంతో వైవిధ్యభరితంగా ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారత్‌లో ఆరు రుతువులను గుర్తించవచ్చు. అంటే.. ప్రతి రెండు నెలలకు వాతావరణ మార్పులు సంభవిస్తాయి. భారతదేశ శీతోష్ణస్థితిని 'రుతుపవన శీతోష్ణస్థితి' అంటారు. శాస్త్రీయంగా పరిశీలిస్తే భారతదేశం 'ఉష్ణ-ఆర్ద్ర శీతోష్ణస్థితి మండలం' కిందకు వస్తుంది. కానీ సువిశాల భారతదేశంలో వాతావరణ పరిస్థితులు ఒక్కో ప్రాంతంలో, ఒక్కో సమయంలో ఒక్కోలా ఉంటాయి. సువిశాల విస్తీర్ణం, నైసర్గిక స్వరూపం, రుతుపవనాలు, భౌగోళిక ఉనికి లాంటి అంశాలు వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తాయి. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అత్యధిక(ఉదా.చిరపుంజి,మాసిన్‌రామ్), మరికొన్ని ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం నమోదవుతుంది (ఉదా: థార్ ఎడారి). వేసవిలో దక్కన్ పీఠభూమి, పశ్చిమ రాజస్థాన్ ప్రాంతాలు 45 సెంటీగ్రేడ్‌కు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి భిన్నంగా అదే సమయంలో ఉత్తరాన హిమాలయ పర్వత సానువుల్లో వాతావరణం చల్లగా ఉంటుంది.

వాతావరణ శాస్త్రజ్ఞులు భారత శీతోష్ణస్థితిని 4 భాగాలుగా విభజించారు. 1. రుతు పవన పూర్వకాలం(మార్చి15–జూన్ 15) 2. నైరుతి రుతు పవన కాలం (జూన్ 15 –సెప్టెంబర్ 15) 3. ఈశాన్య రుతు పవన కాలం (సెప్టెంబర్ 15 –డిసెంబర్ 15) 4. రుతుపవన అనంతర కాలం (డిసెంబర్ 15–మార్చి 15).

రుతుపవన పూర్వ కాలం

రుతుపవన పూర్వ కాలం (మార్చి 15 –జూన్15)లో దేశమంతటా ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా ఉంటాయి. ఇది మండు వేసవి. ఈ సమయంలో సంవహన గాలులు వీస్తాయి. ఈ పవనాలను ఆంధీ, లూ, కాల్‌బైశాఖీ, మామిడి జల్లులు లాంటి స్థానిక పేర్లతో పిలుస్తారు. ఈ వేడిగాలులకు అప్పుడప్పుడూ చిరుజల్లులు, గాలిదుమ్ము కూడా తోడవుతాయి. ఈ కాలంలో ద్వీపకల్ప పీఠభూములు, వాయవ్య భారతదేశం బాగా వేడెక్కడంతో అల్పపీడనం ఏర్పడుతుంది. ఈ అల్పపీడనం నైరుతి రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించటానికి ఉపకరిస్తుంది.

నైరుతి రుతుపవన కాలం

నైరుతి రుతుపవన కాలం(జూన్15– సెప్టెంబర్15)లో అరేబియా సముద్రం, హిందూమహాసముద్రాల నుంచి నైరుతి రుతు పవనాలు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. వీటి ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు కాస్త తగ్గి, దేశమంతా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. వార్షిక వర్షపాతంలో సుమారు 2/3 వంతు ఈ మూడు నెలల కాలంలోనే సంభవిస్తుంది. భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతు పవనాలు మొదటగా జూన్ మొదటి వారంలో మలబార్ తీరాన్ని తాకుతాయి. క్రమంగా ఇవి జూలై 15 కల్లా దేశమంతా వ్యాపిస్తాయి. నైరుతి రుతుపవనాలు రెండు శాఖలుగా(అరేబియా సముద్రం, బంగాళాఖాతం) దేశంలోకి ప్రవేశిస్తాయి. నైరుతి రుతు పవనాలు ఎత్తయిన పర్వతాలు, పీఠభూములను దాటే సమయంలో పవనాభిముఖదిశలో ఉండే ప్రాంతాల్లో అధిక వర్షపాతం ఉంటుంది. కానీ అదే సమయంలో పవనపరాన్ముఖదిశలో ఉండే ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం ఉండటంతో అవి పాక్షిక శుష్కమండలాలుగా రూపొందాయి. ఉదాహరణకు అరేబియా సముద్రం నుంచి ప్రవేశించే నైరుతి రుతుపవనాలను పశ్చిమ కనుమలు అడ్డుకుంటాయి. దీనివల్ల మలబార్, కొంకణ్ తీరాల్లో విస్తారంగా వర్షం కురుస్తుంది. ఇవి అతి ఆర్ద్ర మండలాలు. కానీ సహ్యాద్రి కొండలకు వెనుక ఉన్న దక్కన్ పీఠభూమికి చెందిన ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ, రాయలసీమ, మరాట్వాడా, విదర్భ ప్రాంతాల్లో వర్షపాతం చాలా తక్కువ. అందువల్ల ఇవి పాక్షిక శుష్కమండలాలుగా రూపొందాయి. ఈ ప్రాంతాలు ఎడారీకరణ సమస్యను ఎదుర్కొంటున్నాయి. మహబూబ్‌నగర్, అనంతపురం జిల్లాలు ఈ మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో వర్షపాత పరిమాణంలో అనిశ్చితి కూడా అధికంగా ఉంది. ఈ మండలం తరచూ తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటోంది.

విస్తారంగా వర్షాలు

బంగాళాఖాతం నుంచి ప్రవేశించే నైరుతి రుతు పవనాలు తూర్పు, ఈశాన్య భారతదేశం, గంగా మైదానాల్లో వర్షాన్నిస్తాయి. ఈ పవనాలను పూర్వాంచల్ కొండలు, శివాలిక్ పర్వతాలు అడ్డుకుంటున్నాయి. దాంతో పవనాభిముఖదిశలోని తెరాయి మండలం, మేఘాలయలోని షిల్లాంగ్ పీఠభూమి, నాగాలాండ్ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గారో, ఖాసీ కొండల పవనాభిముఖదిశలో ఉన్న మాసిన్‌రామ్, చిరపుంజి ప్రాంతాల్లో ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. రాజస్థాన్‌లోని ఆరావళి పర్వతాలు నైరుతి రుతు పవనాలకు సమాంతరంగా ఉండటంతో ఇవి నైరుతి రుతుపవనాలను అడ్డగించలేవు. అదే సమయంలో పశ్చిమ రాజస్థాన్ ప్రాంత ఊర్ధ్వ ట్రోపో ఆవరణంలో ఉన్న చల్లని స్థిర వాయురాశి నైరుతి రుతు పవనాలను పైకి లేవనీయకుండా అదిమిపెడతాయి. ఈ కారణాల వల్ల పశ్చిమ రాజస్థాన్‌లో వర్షపాతం అత్యల్పంగా ఉండి, శుష్క మండలం ఏర్పడింది. థార్ ఎడారి ఏర్పడటానికి ప్రధాన కారణం.

దక్షిణార్ధగోళంలోకి సూర్యుడు

సెప్టెంబర్ మధ్య నుంచి సూర్యుడు దక్షిణార్ధగోళంలోకి ప్రవేశిస్తాడు. దీంతో భారత్‌లో క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయి. భారత భూభాగంపై విస్తరించి ఉన్న అల్ప పీడనం క్రమంగా క్షీణించి, ఆ స్థానంలో అధిక పీడనం బలపడుతుంది. ఈ రకంగా నైరుతి రుతు పవనాల తిరోగమనం ప్రారంభమవుతుంది. తిరోగమించే రుతుపవనాలు శుష్కంగా ఉంటాయి. అయితే ఇవి బంగాళాఖాతంలోకి ప్రవేశించినప్పుడు అక్కడి తేమను పీల్చుకొని, ఆర్ద్రగా మారుతాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో వీస్తున్న ఈశాన్య వ్యాపారపవనాలు.. తిరోగమన రుతు పవనాలను ఈశాన్య రుతు పవనాలుగా రూపాంతరం చెందిస్తాయి. ఈశాన్య రుతుపవనాల వల్ల తమిళనాడు, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌ల్లో వర్షం కురుస్తుంది. ఈ సందర్భంగా గమనించాల్సిందేమిటంటే.. తమిళనాడు ప్రాంతంలోకి నైరుతి రుతుపవనాలు రాకుండా.. నీలగిరి, అన్నామలై, ఏలకుల కొండలు అడ్డగిస్తాయి. అందువల్ల నైరుతి రుతుపవన కాలంలో తమిళనాడులో వర్షం అంతగా కురవదు.

ఈశాన్య రుతుపవనాలతో ఈ ప్రాంతం విస్తారంగా వర్షాన్ని పొందుతుంది. డిసెంబర్ 15కల్లా దేశమంతటా శీతాకాలం ప్రారంభమవుతుంది. సైబీరియా నుంచి వచ్చే అతిశీతల పవనాలు.. గంగా–సింధూ మైదానంలోకి రాకుండా హిమాలయ పర్వతాలు అడ్డుకుంటాయి. లేకపోతే వీటి ప్రభావం వల్ల గంగా– సింధూ మైదానంలో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు చేరుకొని, నదులు గడ్డకట్టి రబీ సాగు సాధ్యమయ్యేది కాదు. డిసెంబర్, జనవరిల్లో హిమాలయాల నుంచి వీచే శీతల పవనాల వల్ల గంగా–సింధూ మైదానంలో ఎముకలు కొరికే చలి ఉంటుంది. డిసెంబర్–ఫిబ్రవరి కాలం సాధారణంగా దేశమంతా శుష్కంగా ఉంటుంది. కానీ ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం నుంచి వాయవ్య భారతదేశంలోకి కవోష్ణ చక్రవాతాలు ప్రవేశిస్తాయి. వీటిని పశ్చిమ అలజడులుగా పిలుస్తారు. వీటి ప్రభావం వల్ల దేశ వాయవ్య ప్రాంతంలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయి. ఈ వర్షాలు రబీలో సాగయ్యే గోధుమ దిగుబడి పెరగటానికి దోహదపడతాయి.

బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడన ద్రోణులు కొన్ని బలపడి ఆయనరేఖా చక్రవాతాలుగా మారి తూర్పు తీరాన్ని తాకుతాయి. వీటి ప్రభావం వల్ల తూర్పు తీరంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి.

గోదావరి నది జన్మస్థానం?

భారత్ వ్యవసాయ ప్రధాన దేశం. వ్యవసాయానికి మూలాధారం సాగునీరు. ఈ నీటిని అందించడంలో నదులది కీలక పాత్ర. ప్రధాన నదులైన గంగ, సింధూ, గోదావరి, కృష్ణా లాంటి నదుల జన్మస్థానాలు, ప్రవాహ గతికి సంబంధించిన సమాచారం గ్రూప్స్ పరీక్షల్లో అత్యంత కీలకం!!

సింధూ లేదా ఇండస్

దీని జన్మస్థానం టిబెట్‌లోని కైలాస పర్వతాల్లో ఉన్న 'చాండుయాంగ్' హిమానీనదం. ఈ నది డామ్‌ఛోక్ వద్ద దేశంలోకి ప్రవేశించి షిగార్, గిల్గిత్, డ్రాస్ తదితర ఉపనదులను కలుపుకొని పాకిస్తాన్‌లోకి ప్రవహిస్తుంది. సట్లెజ్, రావి, బియాస్, జీలం, చీనాబ్ నదులు సింధూ ముఖ్య ఉపనదులు. సట్లెజ్ నది కూడా కైలాస పర్వతాల్లోని 'రాకాస్ తాల్'గా పిలిచే హిమానీనద సరస్సు నుంచి ఉద్భవిస్తుంది. ఈ నదిని ప్రాచీన కాలంలో 'సుతుద్రి' అని పిలిచేవారు. సట్లెజ్ నది హిమాచల్ ప్రదేశ్‌లోని 'షిప్కిలా' కనుమ ద్వారా భారత్‌లోకి ప్రవేశిస్తుంది.

సట్లెజ్‌పై భాక్రా నంగల్

సట్లెజ్ నదిపై హిమాచల్‌ప్రదేశ్‌లోని భాక్రా, పంజాబ్‌లోని నంగల్ వద్ద భారీ ఆనకట్టలు నిర్మించారు. భాక్రా నంగల్ భారత్‌లో అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టుల్లో ఒకటి. భాక్రా నంగల్ రిజర్వాయర్‌ను 'గోవింద సాగర్'గా పిలుస్తారు. జీలం నది కశ్మీర్‌లోని వెరినాగ్ కొండల్లో ఆవిర్భవిస్తుంది. చంద్ర–భాగా నదుల కలయికతో చీనాబ్ నది ఏర్పడింది. ఇవి హిమాచల్ ప్రదేశ్‌లోని రోహతాంగ్ కనుమ వద్ద ఆవిర్భవిస్తాయి.

కాలాబాగ్

రావి నది కులూ కొండల్లో, బియాస్ నది బియాస్‌కుండ్ వద్ద ఆవిర్భవించాయి. సింధూ నదీ వ్యవస్థలో రావి–బియాస్‌ల సంగమం మాత్రమే భారతదేశంలో ఉంది. మిగిలిన నదులన్నీ పాకిస్తాన్ భూభాగంలో ఒక దానితో మరొకటి కలుస్తాయి. ఈ నదులన్నీ పాకిస్తాన్‌లోని 'కాలాబాగ్' వద్ద కలిసి, ఒకే ప్రవాహంగా సింధ్ రాష్ట్రం ద్వారా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తాయి. రావి–బియాస్ నదులు పంజాబ్ (భారత్)లోని హరికే వద్ద కలుస్తాయి. ఇందిరాగాంధీ కాలువ హరికే వద్ద నిర్మించిన ఆనకట్ట నుంచి ప్రారంభమవుతుంది.

గోదావరి -త్ర్యయంబకం

ద్వీపకల్ప నదీ వ్యవస్థలన్నింటి కంటే గోదావరి పెద్దది. ఇది సహ్యాద్రి పర్వతాల్లో నాసిక్ సమీపంలోని 'త్ర్యయంబకం' వద్ద ఆవిర్భవించింది. ఈ నది మహారాష్ట్రకు చెందిన వార్ధా, పేన్‌గంగ, ప్రాణహిత, ఇంద్రావతి, కోయనా, మధ్యప్రదేశ్‌కు చెందిన వైన్‌గంగను కలుపుకొని తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. మానేరు, శబరి, మంజీరా నదులు గోదావరి ముఖ్య ఉపనదులు.

మంజీరాపై నిజాంసాగర్

మంజీరా నది మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ పర్వతశ్రేణుల్లో ఆవిర్భవించింది. ఈ నది తెలంగాణలోని నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. మంజీరాపై నిజాంసాగర్, సింగూరు ఆనకట్టలు నిర్మించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఉద్భవించిన శబరి నది, ఖమ్మం జిల్లాలోని కూనవరం వద్ద గోదావరిలో కలుస్తుంది. గోదావరిపై నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద శ్రీరాంసాగర్ ఆనకట్ట నిర్మించారు. గోదావరి రాజమండ్రికి దిగువన గౌతమీ గోదావరి, వశిష్ఠ గోదావరి, వైనతేయి గోదావరి అనే మూడు పాయలుగా చీలిపోతుంది. అనంతరం అంతర్వేది, యానాం, కొమరగిరి పట్నాల వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

కృష్ణానది

సహ్యాద్రి కొండల్లోని మహాబలేశ్వర్ వద్ద కృష్ణానది ఆవిర్భవించింది. ఇది కర్ణాటక ద్వారా ప్రవహిస్తూ మహబూబ్‌నగర్ జిల్లాలో మక్తల్ వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఘటప్రభ, మల్లప్రభ, భీమా, తుంగభద్ర, దిండి, మూసీ నదులు కృష్ణా నదికి ముఖ్య ఉపనదులు. తుంగభద్ర కర్ణాటకలోని వరాహ పర్వతాల్లో ఆవిర్భవించి.. కర్నూలులోని సంగమేశ్వర్ వద్ద కృష్ణలో కలుస్తోంది. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డకు దిగువన కృష్ణానది పాయలుగా చీలి హంసలదీవి వద్ద బంగాళాఖాతాన్ని చేరుతుంది.

జనరల్ స్టడీస్

ఫిజికల్ సైన్స్

భూ ఆత్మభ్రమణ వేగం ప్రస్తుత వేగానికి 17 రెట్లు పెరిగితే భూమధ్యరేఖ వద్ద వస్తువు భారం శూన్యం అవుతుంది.

రోగుల భారాన్ని కనుగొనడానికి ఉపయోగించే పరికరం - సంపీడన స్ప్రింగ్ త్రాసు.

ఒక వ్యక్తి గాలిలో ఎగిరినప్పుడు లేదా ఎత్తు నుంచి కిందకు దూకినప్పుడు అతడు భార రహిత స్థితిలో ఉంటాడు.



యాంత్రిక శాస్త్రం

వస్తువు స్థితి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'యాంత్రిక శాస్త్రం' అంటారు. వస్తువు గమనం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డైనమిక్స్' అంటారు.

అదిశ రాశి: పరిమాణం మాత్రమే ఉండి, దిశతో సంబంధం లేని భౌతికరాశిని 'అదిశరాశి' అంటారు.

ఉదా: దూరం, వడి, పని, శక్తి.

సదిశ రాశి: పరిమాణం, దిశ ఉన్న భౌతిక రాశిని 'సదిశ రాశి' అంటారు.

ఉదా: స్థానభ్రంశం, వేగం, త్వరణం, బలం.

దూరం: వస్తువు ప్రయాణించిన మొత్తం పొడవును 'దూరం' అంటారు.

ప్రమాణాలు: సెం.మీ., మీ.

- వాహనాలు ప్రయాణించే దూరాన్ని కొలవడానికి 'ఓడోమీటర్' ఉపయోగిస్తారు.

స్థానభ్రంశం: స్థానంలో కలిగే మార్పును 'స్థానభ్రంశం' అంటారు. రెండు బిందువుల మధ్య ఉండే అతి స్వల్ప పొడవే స్థానభ్రంశం.

ప్రమాణాలు: సెం.మీ., మీ.

వడి: నిర్దిష్ట సమయంలో వస్తువు ప్రయాణించిన దూరాన్ని 'వడి' అంటారు.

వడి = దూరం/ కాలం

ప్రమాణాలు: సెం.మీ./సె. (సీజీఎస్ ప్రమాణం), మీ./సె. (ఎస్ఐ ప్రమాణం).

వడిని కొలిచే పరికరం: స్పీడోమీటర్

వేగం: వస్తువు స్థానభ్రంశంలో కలిగే మార్పురేటునే 'వేగం' అంటారు.

వేగం = స్థానభ్రంశం/ కాలం

ప్రమాణాలు: సెం.మీ./సె. (సీజీఎస్ ప్రమాణం), మీ./సె. (ఎస్ఐ ప్రమాణం).

- వాన చినుకు వేగం 7- 18 mile/hour
- భూమిపై వేగంగా పరుగెత్తే జీవి – చిరుతపులి (97 kmph)
- నెమ్మదిగా కదిలే జీవి – నత్త (0.013 - 0.028 m/s)

త్వరణం: వేగంలో కలిగే మార్పు రేటునే త్వరణం అంటారు.

త్వరణం (a) =వేగంలోని మార్పు/ కాలం

ప్రమాణాలు: సెం.మీ./$సె^2$. (సీజీఎస్), మీ./$సె^2$. (ఎస్ఐ ప్రమాణం).

వస్తువు త్వరణం కాలానుగుణంగా పెరిగితే దాన్ని 'ధన త్వరణం' అంటారు.

ఉదా: రైల్వేస్టేషన్ నుంచి దూరంగా వెళుతున్న రైలు త్వరణం.

వస్తువు త్వరణం కాలానుగుణంగా తగ్గితే దాన్ని 'రుణ త్వరణం' అంటారు.

ఉదా: బస్‌స్టేషన్ సమీపిస్తున్న బస్సు త్వరణం.

- వాహనాల వేగాన్ని తగ్గించడానికి లేదా పెంచడానికి వాడే పరికరం 'యాక్సిలరేటర్'.
- గమనంలో ఉన్న వస్తువు సమవేగంతో చలించినా లేదా విరామ స్థితిలో ఉన్నా దాని త్వరణం 'శూన్యం'.

గురుత్వ త్వరణం: భూ గురుత్వాకర్షణ బలం ప్రభావం వల్ల వస్తువులో కలిగే త్వరణాన్ని 'గురుత్వ త్వరణం' అంటారు. దీన్ని g తో సూచిస్తారు.

- భూమిపై గురుత్వ త్వరణం = $9.8\ m/s^2$
- చంద్రుడిపై గురుత్వ త్వరణం = $1.6\ m/s^2$
- సూర్యుడిపై గురుత్వ త్వరణం = $27.4\ m/s^2$
- గురుత్వ మాపకాన్ని ఉపయోగించి గురుత్వ త్వరణం విలువ కనుగొంటారు.

ఐసోగ్రామ్‌లు: g విలువ సమానంగా ఉన్న ప్రదేశాలను కలుపుతూ గీసిన రేఖలను ఐసోగ్రామ్‌లు అంటారు. వీటిని ఉపయోగించి ఖనిజసంపదను గుర్తిస్తారు.

- g విలువ భూమి భౌతికస్థితిపై ఆధారపడి ఉంటుంది.

$$g = Gm/R^2$$

R విలువ ధ్రువాల వద్ద కనిష్ఠం కాబట్టి g విలువ గరిష్ఠంగా ఉంటుంది. R విలువ భూ మధ్యరేఖ వద్ద గరిష్ఠం కాబట్టి g విలువ కనిష్ఠంగా ఉంటుంది.

- కణంపై గురుత్వ బలం పనిచేయదు.

ద్రవ్యరాశి: పదార్థ పరిమాణాన్ని ద్రవ్యరాశి అంటారు.

ప్రమాణాలు: గ్రాము (సీజీఎస్ ప్రమాణం), కిలోగ్రాము (ఎస్ఐ ప్రమాణం).

భారం: వస్తువుపై పని చేసే భూమ్యాకర్షణ బలాన్నే భారం అంటారు.

ప్రమాణాలు: గ్రాము, వాట్, కిలోగ్రాము–వాట్, న్యూటన్.

- వస్తువు ద్రవ్యరాశి స్థిరం. ఇది ప్రదేశాన్ని బట్టి మారదు. వస్తువు భారం gపై ఆధారపడి ఉంటుంది కాబట్టి ఇది ప్రదేశాన్ని బట్టి మారుతుంది.
- వస్తువు భారాన్ని కొలవడానికి ఉపయోగించే పరికరం 'స్ప్రింగ్ త్రాసు'. ఇది హుక్ సూత్రం ఆధారంగా పని చేస్తుంది.
- రబ్బర్ కంటే స్టీల్ స్థితిస్థాపకత అధికం.
- పరిపూర్ణ స్థితిస్థాపక వస్తువు సృష్టిలో లేదు. కానీ పరిపూర్ణ స్థితిస్థాపక వస్తువులా ప్రవర్తించే వస్తువు క్వార్ట్జ్.

గరిమనాభి: వస్తువు మొత్తం భారం కేంద్రీకృతం అయ్యేట్లుగా ప్రవర్తించే బిందువును 'గరిమనాభి' అంటారు. ఇది వస్తువు స్థిరత్వాన్ని వివరిస్తుంది.

- సమరీతి గురుత్వకేంద్రంలో వస్తువు ద్రవ్యరాశి కేంద్రం, గరిమనాభి ఏకీభవిస్తాయి.
- ద్రవ్యరాశి కేంద్రం వస్తు చలనాన్ని వివరిస్తుంది.
- నిలబెట్టిన స్తూపానికి గరిమనాభి స్థానం సగం ఎత్తు వద్ద ఉంటుంది.
- వంపు మార్గం వద్ద సైకిలిస్ట్ లోపలి వైపు వంగి ప్రయాణించడం వల్ల స్థిరత్వం పెరుగుతుంది.

లిఫ్ట్‌లో దృశ్య భారం: లిఫ్ట్‌ను 1852లో ఇ.జి. ఓటిస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు. లిఫ్ట్ పైకి వెళుతున్నప్పుడు త్వరణం ధనాత్మకంగా, కిందికి వెళుతున్నప్పుడు త్వరణాన్ని రుణాత్మకంగా తీసుకోవాలి.

case i): లిఫ్ట్ నిశ్చలస్థితిలో ఉన్నప్పుడు దృశ్యభారం స్థిరం. భారం (w) = mg

case ii): లిఫ్ట్ a అనే త్వరణంతో పై దిశలో చలిస్తున్నప్పుడు దృశ్య భారం పెరుగుతుంది.

$$w = m(g+a).$$

case iii): లిఫ్ట్ a అనే త్వరణంతో కింది దిశలో చలిస్తున్నప్పుడు దృశ్య భారం తగ్గుతుంది.

$$w = m(g–a)$$

case iv): లిఫ్ట్ స్వేచ్ఛగా కిందకు పడుతుంటే దాని దృశ్య భారం శూన్యం.

$$w = m(g–g) \quad (a = g \text{ కాబట్టి})$$
$$w = 0$$

బలం: వస్తువు స్థితిని మార్చేది లేదా మార్చడానికి ప్రయత్నించేదాన్ని 'బలం' అంటారు.

$$F = ma$$

ప్రమాణాలు: గ్రామ్–సెం.మీ./$సె^2$. లేదా డైన్ (సీజీఎస్), కిలోగ్రామ్–మీ./$సె^2$. లేదా న్యూటన్ (ఎస్ఐ ప్రమాణం).

$$1\ N = 10^5\ dyne$$

బలాలను న్యూటన్ అంతర్గత బలాలు, బాహ్య బలాలు అని రెండు రకాలుగా వర్గీకరించారు.

- ప్రకృతిలో ప్రాథమిక బలాలు ప్రధానంగా 4 రకాలు. అవి:
  1. గురుత్వాకర్షణ బలాలు
  2. విద్యుదయస్కాంత బలాలు
  3. బలమైన కేంద్రక బలాలు
  4. బలహీన కేంద్రక బలాలు
- ప్రకృతిలోని ప్రాథమిక బలాల్లో 'బలమైన కేంద్రక బలం' అత్యంత బలమైంది. గురుత్వాకర్షణ బలం అత్యంత బలహీనమైంది.
- విశ్వంలోని ఏవైనా రెండు వస్తువుల మధ్య పనిచేసే బలాన్ని గురుత్వాకర్షణ బలం అంటారు. దీని గురించి న్యూటన్ వివరించారు. గురుత్వాకర్షణ బలం వస్తువుల ద్రవ్యరాశుల లబ్ధానికి అనులోమానుపాతంలో, వాటి మధ్య దూర వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది.
- విశ్వ గురుత్వాకర్షణ బలం సమీకరణం

$$F = Gm_1m_2/r^2$$

G → విశ్వగురుత్వాకర్షణ స్థిరాంకం

$$G = 6.67\times10^{-11}\ Nm^2\ kg^{-2}$$

- G విలువను ప్రయోగాత్మకంగా కనుగొన్నవారు హెన్రీ కావెండిష్ (ఈయన హైడ్రోజన్‌ను కూడా కనుగొన్నారు).

భూ గురుత్వాకర్షణ బలాలు అన్ని వస్తువులపై ఒకేరకంగా పనిచేస్తాయని ప్రయోగాత్మకంగా నిరూపించినవారు గెలీలియో. గోపురం పై నుంచి రూపాయి నాణెం, ఈకను ఒకేసారి కిందకు పడేసినప్పుడు అవి దాదాపుగా ఒకేసారి భూమిని చేరుతాయనీ, కొద్దిపాటి కాల వ్యత్యాసానికి కారణం.. గాలిలోని స్నిగ్ధతా బలాలు ఈకపై పనిచేయడమేనని ఆయన వివరించారు. గెలీలియో టెలిస్కోప్‌ను, తొలిసారిగా లోలక గడియారాన్ని తయారు చేశారు.

భూ కేంద్రక సిద్ధాంతం: సూర్యుడితోపాటు గ్రహాలన్నీ భూమి చుట్టూ పరిభ్రమిస్తాయని టాలెమీ (2వ శతాబ్దం) ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం సుమారుగా 1400 ఏళ్ల పాటు ఆమోదంలో ఉంది.

సూర్య కేంద్రక సిద్ధాంతం: భూమి సహా గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తాయని కోపర్నికస్ (1543లో) వివరించారు.

- సూర్యకేంద్రక సిద్ధాంతం సరైందేనని వివరించినవారు - టైకోబ్రాహి.

కెప్లర్ గ్రహగమన నియమాలు: సూర్యకేంద్రక సిద్ధాంతానికి అనుగుణంగా కెప్లర్ గ్రహగమన నియమాలు వివరించారు.

1) **మొదటి నియమం:** సూర్యుని చుట్టూ గ్రహాలన్నీ నిర్దిష్ట దీర్ఘవృత్తాకార కక్ష్యల్లో పరిభ్రమిస్తాయి. దీన్నే 'కక్ష్యా నియమం' అంటారు.

2) **రెండో నియమం:** సూర్యుడి చుట్టూ తిరిగే ప్రతి గ్రహం సమాన కాల వ్యవధుల్లో సమాన వైశాల్యాలు విరజిమ్ముతుంది. దీన్నే 'వైశాల్య నియమం' లేదా 'విస్తీర్ణ నియమం' అంటారు. 'కోణీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం' (L = mvr) ఆధారంగా దీన్ని వివరించారు.

3) **మూడో నియమం:** సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహం ఆవర్తన కాలం వర్గం.. సూర్యుడు, గ్రహానికి మధ్య ఉండే దూరం ఘనానికి అనులోమానుపాతంలో ఉంటుంది.

$$T^2 \propto R^3$$

T → ఆవర్తన కాలం,

R → సూర్యుడికి, గ్రహానికి మధ్య దూరం.

భూ స్థావర ఉపగ్రహం: భూ ఆత్మభ్రమణ దిశలో, భూ ఆత్మభ్రమణ వేగానికి సమానంగా భూమి చుట్టూ కక్ష్యలో పరిభ్రమణం చెందే ఉపగ్రహాన్ని 'భూస్థావర ఉపగ్రహం' అంటారు.

- భూ స్థావర ఉపగ్రహం పరిభ్రమణ కాలం 24 గంటలు.
- భూ ఉపరితలం నుంచి భూ స్థావర ఉపగ్రహం ఎత్తు 36,000 కి.మీ.
- భూ కేంద్రం నుంచి భూ స్థావర ఉపగ్రహం ఎత్తు 42,400 కి.మీ.
- భూమికి అత్యంత సమీపంగా పరిభ్రమణం చెందే ఉపగ్రహం ఆవర్తన కాలం 84.6 నిమిషాలు, 5000 సెకన్లు.
- భూ స్థావర ఉపగ్రహాన్ని సమాచార ప్రసారంలో, వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేయడానికి, గూఢచర్య వ్యవస్థలో, ఖనిజ లవణాలను కనుగొనడానికి ఉపయోగిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో వెక్టార్ క్వాంటిటీ ఏది? *(గ్రూప్-2, 2003)*
   ఎ) మాస్ బి) కాలం
   సి) పరిమాణం డి) వేగం
2. గురుత్వాకర్షణ శక్తి సూత్రం కనుగొన్నవారెవరు? *(ఏఈ-2009, టెక్నికల్ అసిస్టెంట్స్-2012)*
   ఎ) కెప్లర్ బి) గెలీలియో
   సి) న్యూటన్ డి) కోపర్నికస్
3. గురుత్వాకర్షణ సిద్ధాంతం..? *(జేఎల్-2007)*
   ఎ) విశ్వంలో ఎక్కడైనా వర్తిస్తుంది
   బి) సూర్యుడు, నక్షత్రాలకు మాత్రమే వర్తిస్తుంది
   సి) తెలిసిన అన్ని బలాలకు వర్తిస్తుంది
   డి) సౌర వ్యవస్థకు మాత్రం వర్తించదు
4. కిందివాటిలో ఏ బలం అధికంగా ఉంటుంది? *(గ్రూప్-1, 1999)*
   ఎ) పరమాణు బలం
   బి) గురుత్వాకర్షణ బలం
   సి) విద్యుదయస్కాంత బలం
   డి) కేంద్రక బలం
5. కొండను ఎక్కుతున్న వ్యక్తి కొంచెం ముందుకు వంగుతాడు. కారణం? *(ఎస్ఐ-2008, ఏఈ-2009)*
   ఎ) జారకుండా ఉండటానికి
   బి) వేగం పెరగడానికి
   సి) అలసట తగ్గించుకోవడానికి
   డి) స్థిరత్వం పెంచుకోవడానికి
6. సౌర వ్యవస్థ ఆవిష్కర్త ఎవరు? *(అసిస్టెంట్ డైరెక్టర్-2012)*
   ఎ) కెప్లర్ బి) కోపర్నికస్
   సి) మార్క్‌పోల్ డి) అముండసన్
7. కెప్లర్ సిద్ధాంతం ప్రకారం సూర్యుని చుట్టూ ఉపగ్రహ కక్ష్య మండలం ఏవిధంగా ఉంటుంది? *(డీఎల్-2012)*
   ఎ) వృత్తాకారం బి) దీర్ఘ వృత్తాకారం
   సి) చదరం డి) సరళ రేఖ
8. భూస్థిర కక్ష్య ఉపగ్రహానికి ఒక భ్రమణానికి పట్టే కాలం ఎంత? *(ఎఫ్ఆర్ఓ-2012)*
   ఎ) 24 గంటలు బి) 30 రోజులు
   సి) 365 రోజులు
   డి) నిరంతరం మారుతుంది
9. కిందివాటిలో సదిశ రాశి ఏది? *(ఎఫ్ఆర్ఓ-2012)*
   ఎ) ద్రవ్యవేగం బి) పీడనం
   సి) శక్తి డి) పని

సమాధానాలు

1) డి; 2) సి; 3) ఎ; 4) డి; 5) డి; 6) బి; 7) బి; 8) ఎ; 9) బి.

విద్యా ప్రణాళికలో విషయాన్ని బట్టి మారనిది?

TET & DSC

సోషల్ మెథడాలజీ



బోధన లక్ష్యాలు- స్పష్టీకరణాలు

అభిరుచి:

- ఒక నిర్దిష్టమైన కృత్యాలపై విద్యార్థి తదేకంగా దృష్టి నిలిపి, వాటిపై ఆసక్తి చూపించడాన్ని అభిరుచి అంటారు.

అభిరుచులు స్పష్టీకరణాలు:

- విద్యార్థి నాణేలు, తపాళా బిళ్లలు, మాతృకలు సేకరిస్తాడు.
- వార్తా పత్రికలు చదువుతాడు.
- వార్తాపత్రికలకు వ్యాసాలు రాస్తాడు.
- వస్తు ప్రదర్శనలు, వివిధ కళలు సాంఘిక శాస్త్ర సంబంధమైన కార్యకలాపాల్లో పాల్గొంటాడు.
- విద్యార్థి చారిత్రక, భౌగోళిక, పౌర, అర్థశాస్త్ర సంబంధ స్థలాలను సందర్శిస్తాడు.
- విద్యార్థి పాఠశాలలో వస్తు ప్రదర్శనలను నిర్వహిస్తాడు.

వైఖరులు:

- విద్యార్థికి దేశం, జాతులు, వ్యక్తులు, చట్టాలు, సమాజం పట్ల ఉండే నిర్దిష్ట అభిప్రాయాలే వైఖరులు.

వైఖరులు స్పష్టీకరణాలు:

- దేశభక్తి కలిగి ఉంటాడు.
- ఇతరుల అభిప్రాయాలను గౌరవిస్తాడు.
- నూతన విషయాలను... వాటి ప్రాముఖ్య తను బట్టి ఆమోదిస్తాడు.
- జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై న్యాయాన్యాయాలను విశ్లేషిస్తాడు.
- ప్రజల సమస్యలను సానుభూతితో పరిశీలిస్తాడు.
- చట్టాలను గౌరవిస్తాడు.
- వివిధ జాతులు, ప్రజల జీవనం పట్ల గౌరవం చూపుతాడు.
- సాంఘిక, పౌర సంబంధ పనుల్లో ఇతరులకు సహకరిస్తాడు.

ప్రశంస లేదా అభినందన:

- సంఘ సేవకులు, స్వాతంత్ర్య సమర యోధులు, గొప్ప వారి లక్షణాలను, దేశ సాంస్కృతిక వారసత్వ సంపదను విద్యార్థులు అభినందించేలా చేయడం సాంఘిక శాస్త్ర బోధన లక్ష్యం.

ప్రశంస స్పష్టీకరణాలు:

- మహనీయులు ఆచరించిన సిద్ధాంతాలను, సూత్రాలను ప్రశంసిస్తాడు.
- శాస్త్రజ్ఞులు, పరిశోధకుల గొప్పదనాన్ని ప్రశంసిస్తాడు.
- గొప్పవారి జీవిత చరిత్రలు చదివేటప్పుడు వారిలోని ఉన్నత వ్యక్తిత్వాన్ని అభినందిస్తాడు.
- దేశ, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రశంసిస్తాడు.
- వివిధ జాతుల ప్రజల మధ్య సంబంధాన్ని ప్రశంసిస్తాడు.

మాదిరి ప్రశ్నలు

1. ఓ విద్యార్థి గ్రామ జనాభాకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి గ్రాఫ్ రూపంలో ప్రదర్శించాడు. ఆ విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
   1) జ్ఞానం 2) అవగాహన
   3) వినియోగం 4) నైపుణ్యం
2. 'భారతదేశం- ఐక్యరాజ్యసమితి- ప్రపంచ సమస్యలు' పాఠ్యాంశం ద్వారా విద్యార్థిలో ఏ ఆశయాన్ని సాధించవచ్చు?
   1) జాతీయభావనా వికాసం
   2) నాది అనే భావన
   3) అంతర్జాతీయ అవగాహన
   4) ప్రజాస్వామ్య పౌరసత్వం
3. సాంఘిక శాస్త్రాన్ని సమైక్యతా రీతిలో బోధించడం వల్ల విద్యార్థి?
   1) ఒక విషయంతో సంబంధం ఉన్న ఇతర విషయాలను అవగాహన చేసుకుంటాడు.
   2) విషయం పట్ల స్థిరమైన అభిప్రా యం ఏర్పరచుకుంటాడు.
   3) వివిధ విషయాల మధ్య ఉన్న వైరుధ్యానికి సంబంధించిన జ్ఞానాన్ని పొందుతాడు
   4) అర్థరహిత సమాచారాన్ని గుర్తిస్తాడు
4. 'భారతదేశం - భిన్నత్వంలో ఏకత్వం' పాఠాన్ని బోధించిన తర్వాత విద్యార్థి జాతీయ సమైక్యతపై వ్యాసం రాశాడు. ఈ చర్య వల్ల ఆ విద్యార్థిలో ఏ లక్ష్యం నెరవేరిందని చెప్పవచ్చు?
   1) వైఖరి 2) విలువ
   3) జ్ఞానం 4) ఆసక్తి
5. విద్యార్థి అడవుల సంరక్షణకు సూచన లిస్తాడు. ఇది ఏ లక్ష్య స్పష్టీకరణ?
   1) అవగాహన 2) ఆసక్తి
   3) వినియోగం 4) జ్ఞానం
6. 'భారత రాజ్యాంగం - ఆదేశిక సూత్రాలు' విషయాన్ని బోధించడం ద్వారా కిందివాటిలో ఏ మౌలికాంశాన్ని సాధించవచ్చు?
   1) శాస్త్రీయ దృక్పథం
   2) మన సాంస్కృతిక వారసత్వం
   3) భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర
   4) స్త్రీ పురుషుల సమానత్వం
7. 'వినియోగం' అనే లక్ష్యానికి చెందని స్పష్టీకరణ?
   1) సాధారణీకరిస్తుంది
   2) పరిష్కారాన్ని సూచిస్తుంది
   3) సంబంధాలను గుర్తిస్తుంది
   4) ఫలితాలను ఊహిస్తుంది
8. పటంలో ఇచ్చిన ప్రదేశాన్ని గుర్తించడం ఏ లక్ష్యం?
   1) జ్ఞానం 2) అవగాహన
   3) వినియోగం 4) నైపుణ్యం
9. మానసిక చలనాత్మక రంగంలో ఉన్నత లక్ష్యం?
   1) స్వభావీకరణ 2) న్యాయ నిర్ణయం
   3) సమన్వయం 4) ప్రేరణ
10. 'అభిరుచులను పెంపొందించుకోవటం' అనే లక్ష్యానికి సంబంధించిన స్పష్టీకరణ?
    1) నిర్ధారించటం
    2) ఒక రూపం నుంచి మరో రూపానికి అనువదించటం
    3) సామాజిక సమస్యలకు సంబంధించిన చర్చల్లో పాల్గొని ఆనందించటం
    4) జాతీయ పతాకంపై గౌరవ భావాన్ని పెంపొందించుకోవటం
11. 'సౌరకుటుంబం' అనే పాఠాన్ని 8వ తరగతి విద్యార్థి అభ్యసించిన తర్వాత ఒక రోజు స్నేహితులతో కలిసి 'నక్షత్రశాల'ను దర్శించి వచ్చాడు. దీన్ని బట్టి అతనిలో ఏ లక్ష్యం నెరవేరిందని చెప్పొచ్చు?
    1) వైఖరి 2) అభిరుచి
    3) నైపుణ్యం 4) ప్రశంస
12. విద్యా ప్రణాళికలో విషయాన్ని బట్టి మారనిది?
    1) ఆశయం 2) లక్ష్యం
    3) బోధనా పద్ధతి
    4) స్పష్టీకరణాలు
13. 'మీకిచ్చిన ఆంధ్రప్రదేశ్ పటంలో థర్మల్ విద్యుచ్ఛక్తి కేంద్రాలను గుర్తించండి' అనేది ఏ లక్ష్య సాధనకు ఉద్దేశించింది?
    1) వైఖరి 2) జ్ఞానం
    3) వినియోగం 4) నైపుణ్యం
14. 'ప్రతి పౌరుడు నిర్వహించే ప్రాథమిక విధులను విద్యార్థి వివరించగలుగుతాడు అనేది ఏ లక్ష్య స్పష్టీకరణ?
    1) జ్ఞానం 2) వినియోగం
    3) అవగాహన 4) నైపుణ్యం
15. విద్యా విధానం విద్యాలక్ష్యాల వైపు పయనిస్తున్నప్పుడు ఆ మార్గంలో ఆచరణ ద్వారా సాధించగలిగే స్థాయిని సూచించే బిందువు?
    1) సామర్థ్యం
    2) కనీస అభ్యసన స్థాయి
    3) లక్ష్యం 4) ఉద్దేశం
16. 'గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల విధుల్లో పోలికలు, భేదాలను తెలపండి' అనే ప్రశ్న ఏ లక్ష్యానికి చెందింది?
    1) వినియోగం 2) జ్ఞానం
    3) వైఖరి 4) అవగాహన
17. రోడ్డు చిహ్నాలను అర్థం చేసుకున్న ఒక విద్యార్థి సైకిల్‌పై పాఠశాలకు, ఇతర ప్రదేశాలకు వెళుతున్నప్పుడు వాటిని పాటిస్తూ ఉంటాడు అనేది ఏ సామర్థ్యానికి సంబంధించింది?
    1) చట్టాలను గౌరవించడం
    2) సానుభూతి ప్రదర్శించడం
    3) దేశభక్తి కలిగి ఉండటం
    4) ఇతరులకు సహకరించడం
18. ఒక విద్యార్థి బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన తుఫాన్‌ను చక్రవాత వర్షానికి ఉదాహరణగా పేర్కొన్నాడు. ఇందులో సాధించిన లక్ష్యం?
    1) నైపుణ్యం 2) జ్ఞానం
    3) వినియోగం 4) అవగాహన
19. 'స్త్రీలను గౌరవించడం' అనేది ఏ లక్ష్య సాధనను సూచిస్తుంది?
    1) అవగాహన 2) వినియోగం
    3) వైఖరులు 4) అభిరుచులు
20. 'ఆంధ్రప్రదేశ్ నేలలు' అనే పాఠం అభ్యసించిన తర్వాత ఎర్రనేలల్లో పండించే పంటలకు ఉదాహరణలిచ్చిన విద్యార్థిలో పెంపొందిన లక్ష్యం?
    1) అవగాహన 2) జ్ఞానం
    3) నైపుణ్యం 4) వినియోగం
21. 5వ తరగతిలోని 'భూమధ్యరేఖా ప్రాం తం' అనే పాఠం విన్న విద్యార్థి ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రత, వర్షపాతం అధికంగా ఉండటం వల్ల చెట్లు దట్టంగా పెరుగుతాయని సూత్రీకరిస్తాడు. ఇది ఏ లక్ష్య సాధనకు సంబంధించింది?
    1) నైపుణ్యం 2) వినియోగం
    3) అవగాహన 4) జ్ఞానం
22. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో అతి పెద్ద రాష్ట్రాన్ని వేరు చేయండి. అనే ప్రశ్న ఏ లక్ష్యానికి చెందింది?
    1) అవగాహన 2) నైపుణ్యం
    3) జ్ఞానం 4) వినియోగం
23. 'ఉపాధ్యాయుని వల్ల ప్రేరణ పొందిన ఒక విద్యార్థి తన ప్రాంతంలోని చారిత్రక స్థలాల విషయాన్ని సేకరించి స్కూల్ బులెటిన్ బోర్డ్‌పై తరచుగా ప్రదర్శించాడు'. ఈ వాక్యం దేనికి సంబంధించింది?
    1) విలువ 2) ఆశయం
    3) లక్ష్యం 4) స్పష్టీకరణం
24. ఆశయం (గమ్యం) ఒక?
    1) మార్గం 2) చర్య
    3) మార్గదర్శక సూత్రం
    4) స్వల్పకాలిక గమ్యం
25. పబ్లిక్ నీటి కుళాయి నుంచి వృథాగా పోతున్న నీటిని ఆపడానికి ఒక విద్యార్థి చేసిన ప్రయత్నం ఏ లక్ష్య సాధనకు సంబంధించింది?
    1) అభిరుచి 2) నైపుణ్యం
    3) వైఖరి 4) అవగాహన
26. బడ్జెట్ పాఠం విన్న ఒక విద్యార్థి ప్రభు త్వం ప్రవేశపెట్టే లోటు బడ్జెట్ వల్ల కలిగే ఫలితాలను ఊహించగలిగితే ఏ లక్ష్యం నెరవేరినట్లు భావించవచ్చు?
    1) జ్ఞానం 2) వినియోగం
    3) అభిరుచి 4) అవగాహన
27. 'పట్టణ స్థానిక స్వపరిపాలనకు, గ్రామీణ స్థానిక స్వపరిపాలనకు ఉన్న తేడాలను తెలపండి' ప్రశ్న ఏ లక్ష్య సాధనకు ఉద్దేశించింది?
    1) నైపుణ్యం 2) అవగాహన
    3) వినియోగం 4) జ్ఞానం
28. గోడపై చిత్రీకరించిన ఒక పటాన్ని చూసిన విద్యార్థి... దానిలోని తప్పులను తన ఉపాధ్యాయుని దృష్టికి తీసుకువచ్చాడు. ఈ చర్య ఏ లక్ష్య సాధనకు ఉదాహరణ?
    1) అభిరుచి 2) వైఖరి
    3) నైపుణ్యం 4) అవగాహన
29. రోడ్డు నియమాలు పాటించకపోతే ఏం జరుగుతుందో ఊహిస్తాడు అనేది ఏ లక్ష్యానికి చెందిన స్పష్టీకరణ?
    1) వినియోగం 2) అవగాహన
    3) వైఖరి 4) నైపుణ్యం

సమాధానాలు

1) 4	2) 3	3) 1	4) 4
5) 3	6) 4	7) 3	8) 4
9) 1	10) 3	11) 2	12) 1
13) 4	14) 3	15) 3	16) 4
17) 1	18) 4	19) 3	20) 1
21) 2	22) 1	23) 4	24) 3
25) 3	26) 2	27) 2	28) 4
29) 1			

గతంలో అడిగిన ప్రశ్నలు

1. 'మీ నియోజక వర్గంలో పోలింగ్ శాతాన్ని మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన చర్య లను సూచించండి' అనే ప్రశ్న ఏ లక్ష్యాన్ని పరీక్షించడానికి ఉద్దేశించింది? (2012)
   1) వినియోగం - కారణాలు చెప్పడం
   2) నైపుణ్యం - అనువాదం చేయడం
   3) అవగాహన - వివరణ ఇవ్వడం
   4) వినియోగం -సంశ్లేషణ
2. 'వివిధ మతాలున్న భారతీయ సమాజంలో లౌకికత్వం ఒక నిర్బంధ జీవన విధానం అంగీకరిస్తారా? లేదా?' అనే ప్రశ్న ఏ లక్ష్య సాధనకు ఉద్దేశించింది? (2012)
   1) అవగాహన 2) వైఖరి
   3) జ్ఞానం 4) నైపుణ్యం
3. కిందివాటిలో అభిరుచి లక్ష్యం స్పష్టీ కరణ? (2012)
   1) భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అభినందించడం
   2) సెమినార్‌లలో పాల్గొనడం
   3) సరైన సమయంలో పన్నులు చెల్లించడం
   4) ఇతరుల అభిప్రాయాలను గౌర వించడం
4. 'ధర, డిమాండ్ మధ్య సంబంధాన్ని వివరించండి' అనే ప్రశ్న ఏ లక్ష్య సాధనను ఉద్దేశించింది? (2012)
   1) అవగాహన 2) వైఖరి
   3) నైపుణ్యం 4) జ్ఞానం
5. పబ్లిక్ నీటి కుళాయి నుంచి వృథాగా పోతున్న నీటిని ఆపడానికి విద్యార్థి చేసిన ప్రయత్నం ఏ లక్ష్య సాధనకు సంబంధించింది? (2008)
   1) నైపుణ్యం 2) అభిరుచి
   3) అవగాహన 4) వైఖరి
6. బడ్జెట్ పాఠం విన్న ఒక విద్యార్థి ప్రభుత్వం ప్రవేశపెట్టే లోటు బడ్జెట్ వల్ల కలిగే ఫలితాలను ఊహించగలిగితే ఏ లక్ష్యం నెరవేరినట్లు భావించవచ్చు? (2008)
   1) వినియోగం 2) జ్ఞానం
   3) అవగాహన 4) అభిరుచి
7. వినియోగం అనే లక్ష్యానికి చెందిన స్పష్టీకరణ? (డీఎస్సీ-2006)
   1) విచక్షణ చేయడం 2)ఉదాహరణలు ఇవ్వడం
   3) సాధారణీకరించడం
   4) నమూనాలను తయారుచేయడం
8. ప్రపంచ శాంతిని కాపాడటంలో ఐక్య రాజ్యసమితి పాత్రలో ప్రధానంగా అభినందించదగింది? (డీఎస్సీ-2006)
   1) నైపుణ్యానికి సంబంధించింది
   2) మానసిక, చలనాత్మక రంగానికి సంబంధించింది
   3) జ్ఞానాత్మక రంగానికి సంబంధించింది
   4) భావావేశ రంగానికి సంబంధించింది
9. విద్యార్థి బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన తుఫానును చక్రవాత వర్షపాతానికి ఉదాహరణగా పేర్కొన్నాడు. ఆ విద్యార్థి సాధించిన లక్ష్యం? (డీఎస్సీ-2006)
   1) అవగాహన 2) నైపుణ్యం
   3) జ్ఞానం 4) వినియోగం
10. సౌర కుటుంబం పాఠాన్ని 8వ తరగతి విద్యార్థి అభ్యసించిన తర్వాత ఓ రోజు స్నేహితులతో కలిసి నక్షత్రశాలను సందర్శించాడు. దీన్ని బట్టి అతడు ఏ లక్ష్యాన్ని సాధించాడని చెప్పొచ్చు? (డీఎస్సీ-2004)
    1) వైఖరి 2) అభిరుచి
    3) నైపుణ్యం 4) ప్రశంస
11. విద్యావిధానం విద్యా లక్ష్యాల వైపు పయనిస్తున్నపుడు ఆ మార్గంలో ఆచరణ ద్వారా సాధించగలిగే స్థాయిని సూచించే బిందువు?(డీఎస్సీ-2004)
    1) సామర్థ్యం 2) కనీస అభ్యసన స్థాయి
    3) లక్ష్యం 4) ఉద్దేశం

సమాధానాలు

1) 4	2) 2	3) 2	4) 1
5) 4	6) 1	7) 3	8) 4
9) 1	10) 2	11) 3	

I heard through the grapevine that..

BANK EXAMS

ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.1-5): *Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in* ***bold*** *to help you locate them while answering some of the questions.*

The original design of "**Oscar**" was by MGM art director Cedric Gibbons. He came up with a statuette of a knight standing on a reel of film gripping a crusader's sword. The Academy commissioned the Los Angeles sculptor George Stanley to create the design in three dimensions. It was presented for the first time at the initial awards banquet on May 16, 1929 to Emil Jannings, named Best Actor for his performances in "The Last Command" and "The Way of All Flesh". Since then, 2,701 statuettes have been presented. The new golden statuettes are cast, moulded, polished and buffed each January by RS Owens & Company, the Chicago based awards manufacturer retained by the Academy since 1982. Oscar stands 13½ inches tall and weighs 8½ lbs. The film reel features five spokes, signifying the five original branches of the Academy: actors, directors, producers, technicians and writers. Although the statuette remains true to its original design, the size of the base varied until 1945, when the current standard was adopted. Officially named the Academy Award of Merit, the statuette is better known by its nickname, Oscar. While the origins of the moniker are not clear, a popular story has it that upon seeing the trophy for the first time, Academy librarian (and eventual executive director) Margaret Herrick remarked that it resembled her Uncle Oscar. The Academy didn't adopt the nickname officially until 1939. The statuettes presented at the initial ceremonies were gold-plated solid bronze. Within a few years the bronze was abandoned in favour of Britannia metal, a pewter-like alloy which is then plated in copper, nickel silver, and finally, 24-carat gold. Due to a metal shortage during the Second World War, Oscars were made of painted plaster for three years. Following the war, the Academy invited recipients to redeem the plaster figures for gold-plated metal ones. The Academy is not certain know how many statuettes it will hand out until the envelopes are opened on the night of the ceremony. Although the number of categories are known in advance, the possibility of ties and of multiple recipients sharing the prize in some categories makes it impossible to predict the exact number of statuettes to be awarded. Any surplus awards are housed in the Academy's vault until the following year's event.

1. Which of the following is true according to the passage:
   1) The perfect number of awards is always erratic
   2) Oscars were made of painted plaster always
   3) The film reel features five spokes, signifying the four original branches of the Academy
   4) Oscar stands 13½ inches tall and weighs 8½ kgs
   5) The Academy adopted the nickname officially until 1939
2. Which of the following is false according to the passage
   1) The Academy commissioned the Los Angeles sculptor George Stanley to create the design in three dimensions
   2) The statuettes presented at the initial ceremonies were gold-plated solid bronze.
   3) Due to a metal shortage during the Second World War, the metal was changed.
   4) Actors, directors, producers, technicians and writers are not the only people who represent the five spokes
   5) The initial awards banquet was held on May 16, 1929
3. The meaning of Crusader used in second line is
   1) champion 2) jury 3) board
   4) committee 5) member
4. An alloy means
   1) A metal made by combining two or more metals
   2) A metal made by combining gold and bronze
   3) A metal made by combining plaster of paris and copper
   4) A metal made by combining silver and gold
   5) A metal made by compressing two or more metals
5. Vault is
   1) A burial chamber 2) tombstone
   3) cemetery 4) park 5) closet

Directions (Q.6-10): *Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.*

6. The seriousness of the situation is_____to appreciate in its ____.
   1) easy; complete
   2) different; wholesome
   3) difficult; totality
   4) hard; completeness
   5) tough; compliment
7. The new policy was adopted in the _______ of fierce _______.
   1) wake; opponent
   2) show; postponement
   3) teeth; criticism
   4) course; outcome
   5) reality; injustice
8. The computer is now an _______ tool for the family doctor.
   1) valuable 2) valid 3) price
   4) worth 5) invaluable
9. A nasty incident was prevented by the _______ arrival of the police.
   1) timid 2) rightly 3) timely
   4) correct 5) properly
10. The author ______ draws together the different _______ of the plot.
    1) nicely; theme 2) tactfully; lines
    3) cleverly; link 4) skillfully; threads
    5) truly; stories

Directions (Questions 11-15): *Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.*

11. Many people <u>are being crushed</u> when the building collapsed on top of them.
    1) was crushed 2) were crushed
    3) are crushed 4) is crushed
    5) No correction required
12. She was struck by the sudden thought that he might <u>leave already</u>.
    1) has leaving already
    2) already leaving
    3) already have left
    4) have left already
    5) No correction required
13. She was very upset at what to him was just a <u>throw-in</u> remark.
    1) throw out 2) throw down
    3) throw back 4) throw away
    5) No correction required
14. I heard <u>through the grapevine</u> that you are quitting.
    1) via grape vine
    2) via knitted channel
    3) reliable sources 4) media
    5) No correction required
15. Avoid smoking in danger zones. Fires <u>run out</u> easily in such areas.
    1) catch up 2) passed away
    3) do without 4) called off
    5) No correction required

Directions (Q. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Unfortunately the people (1)/ making the decisions (2)/ are out of touch (3)/ in the real world. (4)/ No error (5)
17. I'm still (1)/ not totally convinced (2)/ that he knows (3)/ what he's doing. (4)/ No error (5)
18. Many of the rebels (1)/ were captured (2)/ and torture (3)/ by police. (4)/ No error (5)
19. All this information (1)/ is readily available (2)/ at the touch (3)/ of button. (4)/ No error (5)
20. Years of living (1)/ in England (2)/ have eliminated all trace of (3)/ her American accent. (4)/ No error (5)
21. Bank statements (1)/ help you keep track (2)/ of where your money (3)/ was going. (4)/ No error (5)
22. Pollution is just (1)/ one of the disadvantage (2)/ of living (3)/ in the town. (4)/ No error (5)
23. The article was (1)/ moderate in tone (2)/ and presented (3)/ both side of the case. (4)/ No error (5)
24. The penalty for failure (1)/ will be high. (2)/ But, by the same token, (3)/ the reward for success will be great. (4)/ No error (5)
25. Rising unemployment (1)/ and reservation policies (2)/ is a political time bomb (3)/ for the government. (4)/ No error (5)

Directions (Q. 26-30): *Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.*

26. She **has been** (1) lauded by **various** (2) organizations for **breaking down** (3) the **bariers**. (4)
27. The **effort of a** (1) physically challenged person **whom** (2) overcomes the **odds** (3) and participates in the Games **is lauded**. (4)
28. The **success off** (1) Burj Al Arab's **offshore** (2) encouraged the Arabs to **formulate** (3) an even **grander** (4) plan.
29. 'Work **incessantly**, (1) but **not** (2) attached to it': this **is the** (3) central idea **of** (4) Geeta.
30. **Admitance** (1) was **refused** (2) to him **by** (3) the **security**. (4)

Directions (Q. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) As a scholarly discipline, it is closely related to subjects such as science and ethics.

B) As a professional, the engineer is expected to commit himself to high standards of conduct.

C) The field examines and sets the obligations by engineers to society, to their clients, and to the profession.

D) Engineering ethics is the field of applied ethics and system of moral principles that apply to the practice of engineering.

E) By transforming nature for the benefit of mankind, the engineer must increase his awareness of the world as the abode of man.

F) The engineer recognizes that the greatest merit is the work and exercises his profession committed to serving society, attending to the welfare and progress of the majority.

31. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) D 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F

Key

1) 3	2) 4	3) 1	4) 1	5) 5
6) 3	7) 3	8) 5	9) 3	10) 4
11) 2	12) 3	13) 4	14) 5	15) 1
16) 4	17) 5	18) 3	19) 4	20) 3
21) 4	22) 2	23) 4	24) 4	25) 3
26) 4	27) 2	28) 1	29) 2	30) 1
31) 4	32) 1	33) 5	34) 2	35) 3